
రామాయణం

# ఉత్తర రామాయణము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ఉత్తర రామాయణము

## కావ్య శిల్పము

గ్రంథకర్త:

శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి

ప్రచురణ:

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-500 004.

# వి జ్ఞ ప్తి

'ఉత్తర రామాయణ కావ్యశిల్పమనఁగా, దిక్కనసోమయాజి కృత నిర్వచనోత్తర రామాయణమును - పాపరాజకృత ఉత్తరరామాయణమును గుఱించిన కావ్యపరిశీలనము. దీనిలో సంస్కృతరామాయణములోని సప్తమ కాండ పరిశీలనముకూడ జరిగినది. ఆయాకవులు వారివారి కావ్యరచనా కాలములో మిగులఁ బ్రసిద్ధులు. వీరిలోఁ బాపరాజుగారికంటెఁ దిక్కన సోమయాజి గారును, వారికంటె రామాయణసప్తమకాండ కర్తయుఁ బ్రసిద్ధతములని వేఱుగఁ జెప్పఁబనిలేదు. ఇట్లున్నను, ఇరువదవ శతాబ్దిలోఁ బాతికకడచువఱకు "ఉత్తర రామాయణ"మన్న 'పాపరాజుగారి'దనియే ప్రతీతి. ఇట్లుండుటకుఁ గారణమేమని యొకప్రశ్న?

ఇరువదవ శతాబ్దిలో నగము కడచువఱకు నిట్టిప్రశ్న నాకు నెదురగుచు వచ్చినది. దీని యంతరాంతరములు తెలిసికొనుటకై రెండుకావ్యములను దెచ్చి బాగుగాఁ జదివితిని. రామాయణ సప్తమకాండనుగూడఁ దోడుచేసి చూచితిని. ఆయన్నింటి పరిశీలన సారాంశమే యీ ఉత్తరరామాయణ కావ్యశిల్పము.

ఉత్తరరామాయణ కావ్యశిల్పముపై నిప్పటి కెన్నియో విమర్శనములు వచ్చినవి. చారిత్రక నిర్ధారణలు వచ్చినవి. సమర్థములైన సాహితీ మార్గములు వచ్చినవి. ఉత్తరరామాయణ కథ యాధారముగా నూతనములైన సాహితీ నిర్మాణములుకూడ వచ్చినవి. వచ్చినవి కాని, యన్నియుఁ బైప్రశ్నమును స్పృశింపనట్లుగనే 'ఇదమిత్థ'మని తేల్చకుండఁగనే జారవిడిచినవి. ఇట్లుండుట బాగులేదని, నాయీరచన పై ప్రశ్నమునకు సమాధాన ప్రాయముగా నుండఁ గలదని, దీనినిఁ బ్రకటించుటావశ్యకమని తలఁచితిని. ఇది విద్వాంసుల వివేచనకుఁ దోడుపడుటయేగాక విద్యార్థుల జిజ్ఞాసకు నుపాదేయము కాఁగలదనియు విశ్వాసము.

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ కార్యవర్గమువారు దీనిని ముద్రించి ప్రకటింతుమని కోరిరి. ఇది మిక్కిలి ముదావహము. వారి యుదారభావమునకు గృతజ్ఞుఁడనై యీపుస్తకమును వారి కర్పించుచున్నాను. పుస్తకము మీయెదుట నున్నది. పరిశీలనము మీ హృదయమువెంట నున్నది. దీని నుపయోగించి యానందింపుఁడని యాంధ్ర రసజ్ఞులకు దోయిలి పట్టుచున్నాను.

ఇట్లు

గడియారము వేంకటశేషశాస్త్రి

## తిక్కన - పాపరాజుల

# ఉత్తర రామాయణ కావ్యశిల్పము

శ్రీమద్రామాయణము షట్కాండలు గలది. ఏడవకాండమున్నను ఆది
సకాండలలోఁ దేలని రచనాదుల స్పృశింపక రామాయణ పూర్వరంగమైన
వణ దౌర్జన్యాదులఁ దెలియఁజేయుటకు మాత్రమే యుపయోగపడునని యొక
దము. సప్తకాండ పరిమితమై శ్రీరామ చరిత్రను సమగ్రముగాఁ దెలుపు
ుయే రామాయణమనియు,నదిలేకున్న గ్రంథము సమగ్రముకాదనియు నింకొక
దము. ఈ విధముగా రామాయణ చర్చలతోఁ బెద్దలకు లేని పోని వ్యాసంగము
ుగుచున్నది. బాలకాండములోని చతుస్సర్గి లేకున్న, గ్రంథకర్తృత్వాదికముఁ
ర్చి చర్చించుట యవసరమై యుండును. అప్పటికిని మఱి కొంతభాగము
ువలసియుండును. ఏమైనను రామాయణమున కుత్తరకాండ ముండుట
ుప్పుడున్నట్టదిగానైన) యవసరమని యంద అంగీంకరింతురు. కాని, కవితా
ుధమును,కథానాయకోదాత్తాది గుణములను బరిశీలించినచో నీయుత్తరకాండము
ల్మీకి కృతము కాదేమో యనిపించును. అయినను, "ఏతావదేతదాఖ్యానం
త్తరం బ్రహ్మపూజితం రామాయణ మితిఖ్యాతం ముఖ్యం వాల్మీకినాకృతం"
నుశ్లోక మీ యుత్తర కాండాంతమునఁ జివరి సర్గయందును, ''కాండానీ షట్
్రతానీహ సోత్తరాణి మహాత్మనా కృతానిగురుణాస్మాక మృషిణాచరితంతవ"
నుశ్లోకము చతుర్ణవతితమ సర్గ యందుండుటఁ బట్టియు, రామాయణ మరువది
ల్గువేల శ్లోకములు గలదను ప్రతీతికి భంగము కలుగునేమోయని తలంచియు,
యేడవకాండమును 'రామాయణాంతర్గత మని ముద్రించియుండుటచేతను-
దియు రామాయణాంతర్గతమనియే వాల్మీకి కృతమనియే భావింపవలసి
యున్నది.

ఈ యుత్తరకాండము మూడువేల నాలుగునూర్ల ముప్పదిరెండు శ్లోక
ులును, అధికపాఠములతోఁ గలిసి నూటయిరువది సర్గలుగా విస్తృతమైనది.
నిని దెలుఁగున రచించిన వారు - మనకు దెలిసినంతవరకు నిద్దరు కవులు

చూడనట్లు నటించుటేమి? ఈ విషయమున నిరువురు కవులు సమానముగ బాధ్యులనియే చెప్పవలెను.

రచనలో నిర్వురి దృష్టి వేరుగా కనబడును. కథానుగతముగా వర్ణన వచ్చినచో గొండది పద్యములతో రెండుమూడు సాభిప్రాయ విశేషణములతోఁ గథాకథనభంగము కలుగకుండ నావర్ణన నతిక్రమించుట తిక్కనగారి దృష్టి. సమయము వచ్చినపుడు - లేక కల్పించుకొనియైనఁ - గొన్ని పద్యములతోఁ బాండిత్య ప్రభావము నెఱపుట పాపరాజుగారి ప్రౌఢిమ. యుద్ధము వచ్చినపుడు తిన్నగా నుచితాను బంధముగా మూడునాలుఁగు పద్యములతో మొగ్గరము కట్టి వేయుట తిక్కనగారి తీరువు. ఆ యుద్ధమందెవ్వరిల్గినను కొన్ని పద్యములతోఁ దన సంగ్రామ కళాకౌశలము ప్రదర్శించుట పాపరాజుగారి పాండిత్యము. శృంగార ప్రసక్తివచ్చినప్పుడు పాపరాజుగారు ప్రాబంధిక ధోరణితో శబ్దార్థాలంకారచమత్కారములతోఁ బద్యపంక్తుల రాశి పోయకమానడు. తిక్కనగారి కా యుద్రేకము లేదు. మడుగు వట్టి కూర్చుండఁడుగాని, ఒయ్యారముగా వంగ్యముగా, సహజముగా సరసోక్తిగాఁ దనదే యొక ముద్రగా వంతు చెల్లించు కొనును పాపరాజుగారి రచనలో మత్తేభశార్దూలములేగాక, విస్తారములైన వచనములు, చిత్రశాలలవంటి సీసములు, లెక్కకు మిక్కిలిగానుండును. తిక్కన గారి పద్ధతి యిదికాదు. బంగారము తూచినట్లైతున కెత్తేయుండును. చంపకోత్పలములున్నను, వానిలో కందగీతములు - వజ్ర వైదూర్యములు చెక్కినట్లు ప్రకాశించుచుండును. ఇవి వారి కవితా విలాసములు. తిక్కనగారి నాఁటి కింకను ప్రబంధములు పొడసూపలేదు కావున నందలి విచిత్ర విన్యాసము లిందుఁగనబడవు. ప్రబంధ ప్రాభవము రాజ్యమేలిన పాపరాజుగారి కాలమునాఁటి కా విన్యాసములన్నియు నిందు రక్షకభటులవలె దారిఁజూపినవి. కనుకనే యాతని కవితారీతి యింతగా విస్తరిల్లినది.

తిక్కనగారు ప్రబంధముల నెఱుఁగరు. ఇతిహాస పురాణాదుల యాంధ్రీ కరణమొక క్రొత్తదారికాదు. ఏదోయొక నూతన కవితా నిర్మాణమాయన యెన్నికలో నున్నది. కాళిదాసు రచించిన రఘువంశమువంటి సర్గబంధము, దానివలెనే నిర్వచనముగా, దాదాపు నూఱుపద్యములకొక యాశ్వాసముగా మలచిన బాగుండుననుకొన్నాడు. కృతిపతి ప్రశంస యుండవలసినదే - అది

మూలము నెత్తికోలేదు. "దుహితకు భర్తనారయు జనుంబలె యోజన చేయుచు" పండగా మదన గోపాలస్వామి కలలోఁ బ్రత్యక్షమై ఈ గ్రంథము తన మ్మని కోరెనట. ఇచ్చటఁ గూడ 'వాల్మీకి కృతంబయిన యుత్తర కాండమును నిఁగింతు'నని చెప్పలేదు. అది వారి వారి మనస్థితికి గుర్తు. తెనుఁగు కవులు పేరుపెట్టి చెప్పకున్నను రామాయణోత్తర కాండము మఱుగునఁ బడిపోదు. కదనుసృతములైన తెనుఁగు కావ్యములకది మాతృక యగుటయుఁ దప్పి పోదు. అధిక పాఠములతోఁ గూడ సంస్కృతమునందు వలెనే తెనుగున వ్రాసిన పాపరాజుగారికిది మిక్కిలిగా నన్వయించును.

మూలమున మూడువేల యయిదువందల శ్లోకములను తెనుఁగునఁ తిక్కనగారు పండ్రెండువందల యేబది పద్యములతోను, పాపరాజుగారు రెండు వేల యెనుబదివందల పద్యములతోనఁ బూర్తిచేసిరి. ఇవిగాక, కృత్యాది పద్య ములతో నాశ్వాసాంత పద్యములతోఁ బూర్వ రామాయణ గాథా పద్యములతోఁ బై సంఖ్య మరియుఁ బెరుగును. దీనినిఁ బట్టి చూడఁగా నాయకుని కథ యొక భాగ మైనఁ బ్రతినాయకుని కథ రెండింతలగును ఏ మహాకవులు గూడ స్వతంత్ర రచనల యందిట్లు చేయుట లరిది కావున గ్రంథకర్త లెట్లు చెప్పికొన్నను, రచనలో స్వతంత్రత గోచరించినను, కథా మాత్రమున నివి మూలాను సరణములే యన నొప్పును. పాపరాజుగారి కృతి దీనికతి సన్నిహితముగా నుండును.

అనుసరణయందుఁ గూడ నిరువురలో నొక ప్రత్యేకత గోచరించును. మూలమున ముప్పది యెనిమిది సర్గలతో రావణాదుల కథయు, తొంబది సర్గ లతో శ్రీరాముని కథయు, జెప్పబడినది. అనఁగా సగముకంటె నెక్కువభాగము గనే శ్రీరామునికథ చెప్పిన ట్లగపడును. తిక్కనగారి రచనలో నేడువందల యేబది పద్యములు రావణ చరిత్రయు నాలుగువందల యెనుబది పద్యములు శ్రీరాముని చరిత్రయు కలదు. అట్లే పాపరాజుగారి రచనలో పదునైదువందల పద్యములు రావణ చరిత్రయు, పదమూడువందల పద్యములు రాముని చరి త్రయు గలదు. రెండుమూడువందల హెచ్చుతక్కువల కేమిగాని నాయకుని కథకంటె ప్రతి నాయకునికథ నిర్వురు నధికముగాఁ జెప్పిరి. ఇది చాల వింత. ప్రతినాయకునికథనే ప్రధానముగాఁ జెప్పదలఁచినచో నాకథ కిట్టపేరే –'రావణ విజయ' మనియో, 'రావణ విలయ' మనియో పేరుపెట్టవలెను. అందు రావణుని జన్మ కర్మాదులు వర్ణింపవలెను. అట్లుచేయక యిట్లు చేయుటేమి? మూలము

చూడనట్లు నటించుటేమి ? ఈ విషయమున నిరువురు కవులు సమానముగ బాధ్యులనియే చెప్పవలెను.

రచనలో నిర్వురి దృష్టి వేరుగా కనబడును. కథానుగతముగా వర్ణన వచ్చినచో గొలఁది పద్యములతో రెండుమూడు సాభిప్రాయ విశేషణములతోఁ గథాకథనభంగము కలుగకుండ నావర్ణన నతిక్రమించుట తిక్కనగారి దృష్టి. సమయము వచ్చినపుడు - లేక కల్పించుకొనియైనఁ - గొన్ని పద్యములతోఁ బాండిత్య ప్రభావము నెఱపుట పాపరాజుగారి ప్రౌఢిమ. యుద్ధము వచ్చినపుడు తిన్నగా నుచితాను బంధముగా మూడునాలుఁగు పద్యములతో మొగ్గరము కట్టి వేయుట తిక్కనగారి తీరువు. ఆ యుద్ధమందెవ్వరీల్గినను కొన్ని పద్యములతోఁ దన సంగ్రామ కళాకౌశలము ప్రదర్శించుట పాపరాజుగారి పాండిత్యము. శృంగార ప్రసక్తివచ్చినప్పుడు పాపరాజుగారు ప్రాబంధిక ధోరణితో శబ్దార్థా లంకారచమత్కారములతోఁ బద్యపంక్తుల రాశి పోయకమానడు. తిక్కనగారి కా యుద్రేకము లేదు. మడుగు వట్టి కూర్చుండఁడుగాని, ఒయ్యారముగా వంగ్య ముగా, సహజముగా సరసోక్తిగాఁ దనదే యొక ముద్రగా వంతు చెల్లించు కొనును పాపరాజుగారి రచనలో మత్తేభశార్దూలములేగాక, విస్తారములైన వచ నములు, చిత్రశాలలవంటి సీసములు, లెక్కకు మిక్కిలిగానుండును. తిక్కన గారి పద్ధతి యిదికాదు. బంగారము తూచినట్లైతున కెత్తేయుండును. చంపకో త్పలములున్నను, వానిలో కందగీతములు - వజ్ర వైడూర్యములు చెక్కినట్లు ప్రకాశించుచుండును. ఇవి వారి కవితా విలాసములు. తిక్కనగారి నాఁటి కింకను ప్రబంధములు పొడసూపలేదు కావున నందలి విచిత్ర విన్యాసము లిందుఁగనబడవు. ప్రబంధ ప్రాభవము రాజ్యమేలిన పాపరాజుగారి కాలమునాఁటి కా విన్యాసములన్నియు నిందు రక్షకభటులవలె దారిఁజూపినవి. కనుకనే యీతని కవితారీతి యింతగా విస్తరిల్లినది.

తిక్కనగారు ప్రబంధముల నెఱుఁగరు. ఇతిహాస పురాణాదుల యాంధ్రీ కరణమొక క్రొత్తదారికాదు. ఏదోయొక నూతన కవితా నిర్మాణమాయన యెన్నికలో నున్నది. కాళిదాసు రచించిన రఘువంశమువంటి సర్గబంధము, దానివలెనే నిర్వచనముగా, దాదావు నూఱుపద్యములకొక యాశ్వాసముగా మలచిన బాగుండుననుకొన్నాడు. కృతిపతి ప్రశంస యుండవలసినదే - అది

యప్పటి తన యునికికి దోహదము. షష్ఠ్యంతము లక్కఱలేదు. ఆశ్వాసాంత పద్యముల నాతనిఁ బొగడుట చాలు. ఇత్యాదిగా వింగడించుకుని, ఉత్తరకాండ కథ మలచుకొని సర్గబంధ రచనకుపక్రమించినాఁడు. కాళిదాసు "ఆ పరితోషా ద్విదుషాంన సాధుమన్యే ప్రయోగ విజ్ఞానం" అన్నట్లుగా "కావ్యంబు సరసులైన కవుల చెవులకు నెక్కినఁగాని నమ్మ దెందుఁ బరిణతిగలుగు కవీశ్వరుండు" అని యాత్మ ప్రత్యయము నొక్కి వక్కాణించినాడు. ఉజ్జ్వల కవితా సామ్రాజ్య మాయనకున్నది. గుణగౌరవాదుల సరిగా వెలఁగట్టు పాండిత్యమున్నది. ప్రధాన కథతో సంబంధములేని యుపకథలను, అనవసరముగాఁ దోచిన వర్ణనలను, అసమంజసములైన వ్యాఖ్యానములను వదలుకొన్నాఁడు. వాచ్యమునకంటె వ్యంగమునకుఁ దెలుఁగున సరిగా దీపింపని వంగ్యమునకుఁ బునాదులువేసినాడు. కావ్యరచనకు బూనుకొన్నాఁడు. తెలుగులో సర్గబంధ రచనకు శ్రీకారము చుట్టి నాఁడు. ఇట్లు వెలుఁగులోనికి వచ్చినదీ నిర్వచనోత్తర రామాయణము కాని రఘువంశము ధీరోదాత్తాధ్యుషిత బహునాయకమైన సర్గబంధము. ఉత్తర రామాయణము ప్రతి నాయక ప్రభావాంతరితమైన ధీరోదాత్త నాయకము. ఇది తిక్కనగారు గ్రహించినట్లగపడదు. పాపరాజుగారికీసంగతి వాసనయే రాలేదు.

రావణుఁడు బలిచక్రవర్తితోఁబోర రసాతలమునకుఁ బోవుట, బంగరువు కొండకుఁ బోవుట, సూర్యునెదిరింపఁ బోవుట, పర్వతునివలనఁ బుణ్యపాప భోగానుభవముల నెఱుఁగుట, మాంధాతతోఁ బోరుట, చంద్రునిమీఁద దండెత్తుట– ఇత్యాదిగాఁ గథలు ప్రతి నాయకుని ప్రాభవ వైభవములఁ జెప్పును. పాపరాజు గారు వీనినిఁగూడ వ్రాసిరి. తిక్కనగారు త్రోసివేసిరి. నాయక ప్రతిష్ఠావహము లైన వానిలోఁగూడ రాముడు లక్ష్మణునితో 'రాజున కనవధానత తగదని చెప్పునపుడు, 'నృగు' 'నిమి' చరిత్రలనొక వాక్యముతో తిక్కనగారు సూచించిరి. పాపరాజుగారా కథలను విస్తరించి చెప్పుటయేగాక, 'శ్వానకథ'ను 'సౌదాస-మాంధాతల' కథలనుగూడా విస్తరించిరి. శంబూక వధానంతర మగస్త్యాశ్రమమునకుఁ బోయి యాతనిచే మణ్యాభరణ సత్కృతుండయ్యెనని చెప్పుచు, నా యాభరణ మగస్త్యునకు వచ్చినవిధమును – ఆ దురితముఁ బాసిన సమ్మోదమునన్ బ్రహ్మలోకమునకరుగు నతం డాదరవృత్తి నొసంగన్। గాదనకీ భూషణంబు గైకొంటి" నని తిక్కనగారు చెప్పగా, బాపరాజుగారు–

నడుమ గృధ్రోలూకోపాఖ్యానముఁజెప్పి, మణ్యాభరణ దాతయగు శ్వేతునికథఁ జెప్పి, దండకారణ్యకథయు, జనస్థానకథయుఁజెప్పి, మన యోపికను బరీక్షించెను. 'అశ్వమేధము చేయుట మంచిదని రెండుమూడు పద్యములతోఁ దిక్కనగారు చెప్పింపఁగాఁ, బాపరాజుగారాకథనే చెప్పుచు, నుపబలముగా-వృత్రకథ, ఇలోపాఖ్యానము, పురూరవుని కథనుగూడాఁ జెప్పి గ్రంథభాగము నెంతో పెంచిరి. అయిదు సర్గలుగానున్న యధిక పాఠములలో నాలుగొకచోటఁ జెప్పి, అయిదవదగు కపిల వృత్తాంతమును వాలిసుగ్రీవులకథఁ జెప్పిన తరువాతఁ జెప్పెను. ఇట్లే మఱికొన్ని పుటలు పెంచుటలో, పుటయు రెండుపుటలు గల వచనము లిరువదియేడును, సీసపద్యములు మూడువందల యిరువదియాఱును, మత్తేభ శార్దూలములు లెక్కలేనన్నియుఁ బెరిగినవి. ఈ విస్తరముచే నుత్తర రామాయణమింత పెద్దదిగాఁ దయారైనది. తిక్కనగారు ప్రతి నాయక ప్రాభవముఁ గొంత తగ్గించి వ్రాసిరిగాని, మరికొంత తగ్గించిన బాగుండును. నాయకోత్కర్షావహములైన ఘట్టములలో మఱి కొంత పెంచినచో నది యుదాత్తమై ప్రశంసా పాత్రముగా నుండెడిది.

ఈ రెండు గ్రంథముల దగ్గరఁ బెట్టుకొనియే పరిశీలించితిని. రామాయణోత్తరకాండను గూడఁ దోడుచేసికొంటిని రామాయణ కథారచయితలైన 'కాళిదాసు'ను 'భవభూతి' ని గూడ నవలోకించితిని. రామాయణ కథాశ్రితులైన తెలుగు కవులఁ గూడఁ బరిశీలించితిని - కథానాయకుఁడైన రాముని దేవత్వ-మానవత్వములఁ గనుగొనుటకే తెలుఁగు కావ్య పరిశీలనము పనికి వచ్చినది. పాపరాజుగా రధిక పాఠములఁదెనిఁగించిరి. వానిలోఁగొన్ని యస్తవ్యస్తములుగా గూడఁ గలవు. తిక్కనగారు తెనిగింపనేలేదు. ఉభయకవుల నిర్మాణములోని గ్రంథమే నా పరిశీలనమునకుఁ దగునని యట్లేచేసితిని. ఈనా పరిశీలనలో నలువది శీర్షికలు గలవు. ఇవన్నియు నుభయ గ్రంథసమ్మితములు. పరిశీలించునప్పుడు - కథౌచిత్యము, సందర్భౌచిత్యము. పాత్రౌచిత్యము, పదౌచిత్యము, శైలి, శయ్య, అలంకారములు, సామెతలు, నానుడులు - ఇత్యాదిగా మనసులో నున్నవి. తెలుఁగు కావ్యములు గావునఁ దెలుగుఁదనమెంత వరకు సాధింపబడినదను నంశముఁ గూడ బరిశీలనలో నొకభాగము. వ్యాకరణ ప్రయోగములఁ దడువలేదు. అవి ప్రత్యేకముగాఁ దడువఁ దగినవి. ఆయా శీర్షికలలో విమర్శించుటలోఁ దేలిన భావములా శీర్షికల చివరియందే సంక్షిప్తముగా వ్రాయ

బడినవి. ఈ భావములు నిర్ణయించుకొనుటలో నిస్సంశయముగా నిష్పక్షపాతముగా నాకుఁ దోచిన వానినే వెల్లడించితిని. ఇట్లు చెప్పుటలో నించుక న్యూనాధిక స్ఫురణ గోచరింపవచ్చును. కాని పక్షపాత బుద్ధితో నట్లు చేయలేదని మనవి. కావ్య పరిశీలనము ముఖ్యము. అందుఁ దోచిన భావములు వెల్లడించుట ముఖ్యము నా చేయునది ప్రథమ యత్నముగావునఁ దక్కిన వారికిది దోహదము కాఁగలదని యాశించుచున్నాను. గుణదోష వివేకము పండిత ప్రకాండాధీనమైనది గదా!

## కృత్యవతరణము

మూలము లేనిచోటనే కవులు స్వేచ్ఛగాఁ దమకవితా విలాసమును వెల్లడింతురని ప్రతీతి. కవిత్వముకూడ ధారాప్రవాహికముగా నుండును. కృత్యాదినుంచి మూలమునందుకొను వఱకు నుభయుల రచన లెట్లుండునో చూతము. తిక్కనగారు ఇష్టదేవతాస్తుత్యాదుల నాలుగు పద్యములతోఁ గృతి నియమాదులఁ బన్నెండు పద్యములతోఁ, కృతిపతి వంశాదిక మిర్వదెనిమిది పద్యములతో బూర్వరామాయణగాథ నలువదియొక్క పద్యములతోఁ జెప్పిరి. ఆశ్వాసాంత పద్యములుమూడును గలిపి ప్రథమాశ్వాసము ముగించిరి దీనికి మూలానుసరణము లేదు. మనుమసిద్ధి రాజ్యలక్ష్మి కాశీర్వాదముగా యొక శ్లోకమున్నది. రెండవ పద్యమునఁ బ్రాక్తనాద్యతన కవి నమస్కార మున్నది. అందులోనే "వారి కృపన్ గవితావిలాస విస్తర మహనీయుఁడైన సర్వ గుణోత్తర మూర్తి మన్మభూవరుడు తగంగ రాఁబనిచి వారని మన్నన నాదరించుచున్", అని చెప్పి, మూడవపద్యమున, "ఏ నిన్ను మామయని యెడు దానికిఁ దగనిమ్ము భారతీకన్యక, నాఁకీ నర్హుడవగు" దని పల్కెను. నాల్గవ సీసమున నతని వంశ రూప గుణవిభవాదుల నుగ్గడించి, "మత్కృతీశ్వ రుడగుచున్న మనుమనృపతి, సుభగుఁ గావించుటకు సముత్సుకుడనైతి" నని చెప్పెను.

ఒక పద్యమున నాశీర్వాదము, ఆఱవపద్యమునఁ గవిస్తుతి, ఒకటిన్నర పద్యమునఁ గృతి నడుగుటయు నిచ్చుటయు, నొక సీసమునఁ గృతిపతి వంశాదికము వర్ణించి, చివర, "మనుమనృపతి, సుభగుఁ గావించుటకు సముత్సుకుఁడనైతి"నని చెప్పుటలో నెంత సంయమన మున్నదో తెలియఁగలదు. ''రఘూణామన్వయంవక్ష్యే" అనుటకు ముందుగా నయిదారు శ్లోకములు చెప్పిన కాళిదాసు

గారు కూడ నీ సంయమన మెఱుఁగఁడు. ప్రసిద్ధులైన ప్రాచీన సంస్కృతాంధ్ర కవులెందఱో యుండఁగా, 'నొక్కరిసైనఁ బేరెత్తి చెప్పకపోవుట గర్వముకాదా' యనవచ్చును. అది గర్వమో కాదో మనకుఁ దెలియదు. పేరు పెట్టి చెప్పకున్నను 'అందఱికొక నమస్కార' మనుట భక్తి స్ఫోరకము కాకపోదు. ఇది సంస్కృతాంధ్ర కవులకు సమానముగా నిచ్చుటలో నౌచిత్యమే గోచరించును. అట్టి భావముచేతనే తనకుఁ "గృతి నిమ్మ"ని యడిగించుకొని, యాచనా భంగభయము తనకును, ప్రతిష్ఠా భంగభయము రాజునకును లేకుండఁ గృతి నిర్వహించెను.

కృత్యారంభమునందే తిక్కనగారు చేసిన కవితా నియమము లిట్లున్నవి. కావ్యము వ్రాయుదునను వానికీ చొరవ యుండవలెనఁట- "పూలరేకుల నుండి తావులు వెదఁజల్లు సమీరునివలె భావప్రకటనముఁ జేసి, యాభావమును దగు మాటలతో సరిక్రుచ్చవలెను. ప్రాతవడ్డ మాటలతో నెవరిని రంజింపలేక, యెవరును మెచ్చని రీతి తమదిగా, లోకము నవ్వ జేయరాదు. అట్టి వారును దుర్విటులును సమానులు. అర్థమునకుఁ దగ్గ మాటలుగాని, వానిలో వళులుం బ్రాసములు నిలుపవలెను గాని పులిమి పుచ్చరాదు. సంస్కృత పదము-తెనుగునఁ దత్సమమై విశేషణమైనపుడు-దాని లింగవచనములు విశేష్యములతో భేదింపరాదు. కృతి తన కిష్టమగుట చాలదు-పరిణతిగల కవీశ్వరులు మెచ్చవలెను- ఇది సత్కవి మార్గము"-ఇట్లు నిశ్చయించుకొని "సుప్రసాద సంబోధన గోచర బహుపదార్థ తాత్పర్యముగా" వ్రాయవలె నని కట్టడిచేసెను.

"సారకవితాభిరాము గుంటూరు విభుని మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలఁచి'' యైనను నా కవిత్వము మన్నింతురని వినయము జూపెను. ''అమలోదాత్తమనీష నేనుభయ కావ్యప్రౌఢి, బాటించు శిల్పమునన్ బారగుడన్ గళావిదుఁడ" నని వ్యక్తిత్వము గుర్తు చేసెను. తన కవితామతముగా-"జాత్యముగాను నొప్పయిన సంస్కృత మెందును జొన్ప, వాక్యసాంగత్యము చేయుచోనయిన గద్యము తోడుగఁ జెప్పిపెట్ట, దౌర్గత్యము దోఁపఁ బ్రాసము ప్రకారము వేఱగు నక్షరంబులో శ్రుత్యనురూప మంచునిడ'' నని నిజాభిమతము వెల్లడించెను. ''వచనము లేకయు వర్ణన వచియింపఁగ గొంత వచ్చుఁ బ్రౌఢులకుఁ, గథా ప్రచయము పద్యములన పొందుచితంబుగఁ జెప్పుటార్యు లొప్పిదమనరే'' యని నిర్వచనముగ వ్రాయుటకుఁ గారణము

సూచించెను. ''అలతియలతి తునియలఁగా హలసంధించిన విధంబు నమరఁగఁ జేతున్'' అని తన శైలీ విశేషముఁ బేర్కొనెను ఇటు నియమములఁ జెప్పి, వాని ననుసరించిన వారిలో నీయనయే ప్రథముఁడనిపించుకొనెను. ఆకాల మట్టిదిగదా!

ఉత్తమ కవుల గుఱించి యాయన భక్తి యిట్టిది. పై పద్యములలో ''భూరి వివేక చిత్తులకుఁ బోలునన్'' "భేదింపమికి మెచ్చు బుధజనము గృతిన్'' "కావ్యంబు సరసులైన కవుల చెవులకు నెక్కినఁ గాని నమ్మరు'' ''ఆర్యులొప్పిదమనరే'' ఇత్యాదిగాఁ బెద్దల నుద్దేశించి పలికెను. ఆత్మ ప్రత్యయము గల కవి-చెప్పవలసిన చోట దాఁగి యుండఁడు. తిక్కనగారు నట్లే చేసిరి. ఇందభిప్రాయభేదము లుండవచ్చును. కాని గ్రహింపవలసిన విషయమొకటి. తెలుఁగు కవిత కొక చక్కని దారి, సువిమృష్టమైన దారి, పెక్కురు మెచ్చుకొను దారి, మెచ్చుకొని యట్లే నడువఁగల దారి అప్పటికి లేనప్పుడు ఉన్న దారిలో నెవరికి వారుగా నున్నపుడు, ధీరుఁడై నిలచి, అందఱకుఁ జెప్పి, చెప్పిన దానిని చేసి చూపించుట యుత్తమ కవి చేయవలసిన పని. తిక్కనగారా మార్గమునే యనుసరించిరి. కాళిదాసాది మహాకవుల మార్గమునకు రాచబాటలు వేసిరి. దీనిని గర్వమనుటకంటె నుదాత్త నిర్వహణమనుట తగును. భారత రచనా కాలమునాఁటికి మఱి కొన్ని నియమముల నెక్కించెనో తగ్గించెనో తెలిసికొనుట మఱియొక కార్యము. నిర్వచనోత్తర రామాయణము నాఁటి కిట్టి నియమములఁ జేసెనని చెప్పుటయే చాలును

పాపరాజు గారిట్లు చెప్పిరి. ఇష్ట దేవతాస్తుతి, కవి ప్రశంస,. కృతి ప్రశంస, కృతిపతినిర్ణయము, కృతికర్తృ వంశాభి వర్ణనము, షష్ఠ్యంతములు. ఇత్యాది శీర్షికలతోనేఁ బది పద్యములకుఁ బైగాఁ జెప్పిరి. ఇష్ట దేవతాస్తుత్యాదిలోఁ త్రిమూర్తులను, వారి భార్యలను, గణపతి హనుమంతులను గీర్తించిరి. వాల్మీకిని, "మేడౌ కవీశ్వరు''లను బొగడి కుకవుల నిరాకరించిరి. మదన గోపాలస్వామి ప్రత్యక్షమై, ''వత్స! నీ ప్రబంధంబు మదంకితంబుగ నొనర్పు'' మనియడుగఁగా. 'మహాభాగ్య'మని, తన సహశ్రోతను బ్రొద్దుననే పిలిపించి చెప్పఁగా, నతఁడు 'వల్లె' యని తోడుపడెను. ఇట్లు నడిచిన దీనిలోఁ బుష్పగిరి తిమ్మన తనకు 'సహశ్రోత' యెప్పుడయ్యెనో యెట్లయ్యెనో తెలియదు. ఆయన చేసిన సాహాయ్యము గూడఁ దెలియదు. నన్నయ్యగారు చెప్పినట్లు వీరును "అని

కిరీటికి శౌరి తోడైన యట్టు'' అని చెప్పిరి. ఈ సందర్భమునఁ గథాంతర మొండు వినవచ్చుచున్నది. తాను రచించిన ప్రబంధమునే పుష్పగిరి తిమ్మన యాతని కీయఁగా, నితఁడు తనపేరఁ బ్రకటించుకొనెనని ప్రతీతి. ఇదియుఁ బ్రతీతి మాత్రముగనే నిలిచినది. ఇందులో సత్యమేదో ఆయిర్వురకే తెలియ వలెను. చారిత్రకులైనఁ జెప్పవలెను. ఇట్లే, సంస్కృత మహా కవులలో వాల్మీకినే చెప్పుటయు, పదునెనిమిదవ శతాబ్దినాటి కెందఱో కవులు ప్రసిద్ధులుండగా 'మేధా కవీశ్వరుల' నని శ్లేషించి చెప్పుటయు ఇంకొక విశేషము. దీనినిఁగూడఁ చారిత్రకులే చెప్పవలెను. ఎవ్వరేమి చెప్పినను, బయ్యంటలో బిగింపఁబడినను బాహుమూలముల నిక్కి చూచు బిగి గుబ్బలవలెఁ దిక్కనగారి కవిత దీపింప, బటువు గుబ్బలే తమ యొప్పిదమును బయ్యెద సాయమునఁ బంచి పెట్టినట్లు పావరాజు కవిత పతిథవిల్లి నట్లు కనఁబడుచున్నది.

కవులు పీఠికాభాగమునఁ దమ కవితా విన్యాసములఁ జెప్పుట పరిపాటి. తిక్కనగారును జెప్పిరి. పాపరాజుగారు చెప్పలేదు. ''వైదర్భీవిలస ద్విలాస మునఁ'' అని చెప్పుట కృష్ణుని ప్రీతికొఱకే యగును. ''మృదుపాకంబు రస స్థితి'' ఇత్యాదిగాఁ జెప్పుట శ్రీ రామునిఁ గవులు పొగడుట. ''కీర్తిలేని బ్రదుకు వలె, వార్తలేని కవిత్వంబువలె'' నని చెప్పుట యయోధ్యావర్ణనమని స్పష్టము. పైవిధముగా నందందుఁ గవితా ప్రస్తావనముండుట కవితానియమములఁ జెప్పుట గాదు. తిక్కనగారి వలెనే తన కాలము నాఁటికి మఱియుఁ బెరిగిన కవితానియ మములఁజేర్చి చెప్పిన బాగుండెడిది. ఎందుకుఁ జెప్పలేదనుట గమనార్హమైనది. పాపరాజుగారు కృత్యారంభ మావిధముగాఁ దీర్చిరి.

తిక్కనగారు కృతి నాయక వంశము వర్ణించుచు 'నారాయణుడు, బ్రహ్మ కశ్యపుఁడు, సూర్యుఁడు, మనువు, ఇక్ష్వాకువు'-ఇత్యాదిగాఁ జెప్పి, ప్రసిద్ధులైన రఘువును, శ్రీ రాముని వర్ణించిరి. ''మునిలోకంబు ప్రశంసచేయ, దుర్జనతా నిగ్రహతత్పరాత్ముఁడగుచుꣳ, సద్వృత్త సంరక్షణంబున రాగిల్లుచు'' నిత్యాదిగా శ్రీరాముని వర్ణించుట మిక్కిలి యుచితము. రాముడు వంశదీపకుఁడే గాక ప్రస్తుత కథానాయకుఁడగుటచే నీ వర్ణన యుచితతరము. ఇప్పటి రాజ ధర్మపాలకుఁడుగా చెప్పుట యుచిత తమముగా నున్నది ఆ వంశమునఁ గరి కాల చోళుఁడు, బిజ్జ నృపాలుఁడు, మనుమసిద్ధి, తిక్క నృపాలుఁడు, ఆయన మనుమడు మనుమసిద్ధి ఇత్యాదిగాఁ జెప్పుట-ఇతి వృత్త నాయకోదాత్తతాదులఁ

జెప్పుట మిగుల రమణీయము. కరికాల చోళాది నాయకుల ఘనకార్యములు చరిత్ర ప్రసిద్ధములు.

కరికాల చోళుఁడు-"ఫాల లోచనము లీలన్ గట్టెఁ గావేరి''ననియు, బిజ్జలుఁడు" పదుమువ్వురఁ గండడఁగంగఁబెట్టెఁదాఁ బిరుదు సెలంగబిజ్జలుఁ'' డనియు, మనుమసిద్ధి ''భూరి ప్రతాపంబు వైరి మదాంధకారమున కఖండ దీపముగఁజేసె'' ననియుఁ, దిక్కనృపతి" లకుమయ గురుము లూరికి నెత్తి వచ్చినఁ గొనఁడె యాహవమున ఘోటకముల''ననియు, గృతి నాయకుఁడగు మనుమసిద్ధి "ద్రవిడోర్వీపతి దర్పమున్ దునిమి, శౌర్యంబొప్పఁ గర్ణాటదర్ప విఘాతం బొనరించి" ''విజయ క్ష్మాధీశునిం గాసిగా నెనిచెం జోళన మన్మసిద్ధి'' ఇత్యాదిగా బహుప్రకారంబుల వర్ణించి ''అన్యరాజు లీడె యరిరాయ వేశ్యా భుజంగుడైన మనుమ జనవిభునకు'' నని ముగించెను. పైఁజెప్పిన వానిలో శ్రీరాముని ప్రతిష్ఠ యుభయతారక మైనది. కరికాలాదుల ప్రశంసలు వంశ ప్రతిష్ఠాకారణములే గాక చరిత్ర కందినవి. తిక్క భూపతి ప్రశంసలో'' లకు మయగురుములూరికి నెత్తి వచ్చిన'' అనుచరిత్రాంశమునకు సాక్ష్యముగాఁ బ్రొద్దుటూరికి సమీపమున గురుములూరి కడ నిప్పటికిని జీర్ణ శిథిల చిహ్నములు నిలిచియున్నవి. ఈ విధముగఁ గృతినాయక వంశవర్ణన ముభయతారకమై తిక్కనగారి దీర్ఘ దృష్టిని జాటుచున్నది.

పావరాజుగారు కృతిపతి నిర్ణయాదికము పేర నింత గ్రంథమును వ్రాసిరి. కృతిపతి శ్రీకృష్ణుడు కావున నాతని వర్ణన మెంతైన నుండవచ్చును. గ్రంథము నిమ్మని కోరుటయు నిచ్చుటయుఁ గవి కల్పితమే యగును. పుష్పగిరి తిమ్మన సాయము చేయుట 'అంతయో గొంతయో' వారికే తెలిసిన యంశము కావున నా ప్రస్తావన మిప్పటి కసంగతము. ఇఁక స్వవంశాభివర్ణన మాత్రము మిగిలినది. దీనినిఁ దిక్కనగారు తలపెట్ట లేదు. వారి యూహతో నది యప్రధానమని తోచును. ఆర్వేల వారిలోఁ బ్రసిద్ధుఁడైన వల్లభామాత్య మౌళి దగ్గఱ నుండి తన తల్లి దండ్రులైన నరసమాంబ-అప్పనార్యులవరకు వర్ణించెను. వారు ప్రపితామహ, పితామహ, పితరులు-వారి భార్యలు. వారి సాంఘిక చరిత్ర యెట్టిదోఁ తెలియదు. వారు గొప్ప వారని తలఁచుటలో విప్రతిపత్తియు లేదు. ఇతఁడు యక్షగానము తప్ప నింకేమి వ్రాసెనో తెలియదు. ''పూర్వకృత పుణ్య వాసనావిశేషమున" కృష్ణున కీ కృతి అంకిత

మొనర్పఁ దలఁచివాడు. "చిలుక మాటలుఁ బెంచినవారు విన్నట్లే" తన మాటలు శ్రీకృష్ణుఁడు విను నని తఁలచినాఁడు. ఆ పురాకృత పుణ్యమెట్టిదో తద్రచిత కావ్యము శ్రీ కృష్ణుఁడు వినుట యెట్టిదో పాపరాజునకు మాత్రమే తెలియును. ఇచ్చట యాత్మీయ చరిత్ర నప్రధానము చేసి కృతినాయక వంశవర్ణనముఁ జేయుట తిక్కనగారి పద్ధతి. పాపరాజుగారి ప్రగల్భత దానికి భిన్నమైనదని తెలియును.

"శ్రీరాస్త్రాం మనుమక్షితీశ్వర భుజాస్తంభే" యని తిక్కనగారును, "శ్రీరాధాధర బింబములదొరయు రాచిల్కం" అని పాపరాజు గారును కావ్యారంభముఁ జేసిరి. ఇచ్చట పూర్వ సంప్రదాయము నిద్దఱూ పాటించిరని తెలియును. తనకుఁ బూర్వుఁడైన నన్నయ గారి ననుసరించియే తిక్కనగారు కావ్యారంభముఁ జేసిరి. పాపరాజుగారు దానికిఁ దప్పిరి. శ్రీకృష్ణుఁడు తన కైశ్వర్యమిచ్చుటను గోరుట కంటె మనుమసిద్ధికి స్థిరసామ్రాజ్య లక్ష్మిని గోరుటను తిక్కనగారు చెప్పుట విశేషము. పాపరాజుగారు "మా కెప్పుడున్" అని కోరుటలో నా కోరిక ఆత్మాభిముఖమైనది. తిక్కనగారి కోరిక యాదర్శ ప్రాయముగా నున్నది. రాచిల్క స్త్రీల యధర బింబము సమీపించుటయు, శ్రీకృష్ణుఁ డాచిలుకను రాఁ బిలుచుటయు, దానికి రాధ నవ్వుటయు, చమత్కారముగా నున్నది. అట్టి కృష్ణుఁడు తన కైశ్వర్యము నిచ్చుగాక యని కోఁరుటలో నితరులకుఁ బోవలసిన దానిని తన కిమ్మని కోఁరుటయే యగును. ఈ కోరిక యప్రయత్నముగనే దొరలినను వాంఛనీయముఁ గాదని తోచును. "శౌర గ్రామణి" యను విశేషణము దీనికన్నివిధముల పాలుపోసినట్లున్నది.

తిక్కనగారి రచన దీనికన్నివిధముల భిన్నము. వ్యత్యాసము చూపుటకై యుపరిస్పృశముగా నింత మాత్రము చాలును. తిక్కనగారు కథ వ్రాయునపుడు తూరుపెత్తువాఁడు చేటకు వెంట చేటనందు కొన్నట్లున్నదిగాని గాలికోస మెదురు చూచినట్లు లేదు. కవితా నియమములఁ జెప్పుటలోఁ శిక్షకుఁడు శిష్యునకు బోధించినట్లేగాని సీఖ్ను నమిలినట్లు లేదు. కృతినాయక వంశ వర్ణనము చారిత్ర కాంశములతోఁ బూస గ్రుచ్చినట్లున్నదిగాని 'తడక గోడఁ' బెట్టినట్లు లేదు. అందముగాఁ గొన్ని పద్యములు పాపరాజుగారు వ్రాసిరిగాని తిక్కనగారి యుదాత్త భావనాపటిమనుగాని, సంగ్రహ రమణీయతను గాని, యందిచ్చినట్లు లేదు.

## అయోధ్యా వర్ణనము

మూలమ నందు "ప్రాప్త రాజ్యస్య రామస్య రాక్షసానాం వధేకృతే" యని యున్నది. అనువాదకులింకను దానినందుకొనలేదు. తిక్కనగారు "అమ్మ నుజనృపతి కభ్యుదయంబుగా - పురోత్తమము వర్ణింతున్" అనెను. పాపరాజు గారు "సమర్పితంబుగా నా యొనర్పబూనిన......సాకేతపట్టణం బెట్టదనిన" యని చెప్పిరి సంక్షేపముగాఁ జెప్పుచున్న కథకే "కథాప్రపంచం" బని పేరు బెట్టుట యెట్లుతగునో తెలియదు. "శ్రీతరుణీ విహార........ప్రపహతాభ్ర జాతమై" యని పాపరాజుగారు అయోధ్యను వర్ణించిరి. పద్యము బాగున్నది. సంస్కృత సమాస జటలమై నాలుగు పాదముల నిండుగానున్నది. అనుప్రాస ములకుఁదక్కువలేదు. కాని సాకేతము రాజసౌధ సంఘాతముతో నొప్పిన దనుటకంటె విశేషములేదు.

తిక్కనగారు "అఖిల భోగంబుల కాస్పదం బగుట భోగీంద్రు పట్టణ మున కీడయి", "సకల వస్తు పూర్ణమగుచు" నని చెప్పిరి. అనఁగా యీ పట్ట ణము భోగవతికిని, త్రిమూర్తుల పట్టణములకుసీడై వివిధోత్సవముల కాశ్రయమై సజ్జనాభి రామయై సకల వస్తు పూర్ణమై యుండెనని యర్థము నిజమున కా పట్టణ మెట్లున్నదో తెలియదు. తిక్కనగారు ప్రజాజీవిత సౌభాగ్యము సుజ్జ్వల ముగా నున్నదనిరి పాపరాజుగారు 'రాజసౌధము లుజ్జ్వలముగా నున్న'వనిరి. మూలమున వచ్చు నిర్బంధ మిరువురకును లేదు. తిక్కనగారు ప్రజాజీవిత మును పాపరాజుగారు ప్రభుత్వోన్నతిని ఎక్కువఁ జేసి చెప్పిరి. ఈ యంతర మిచ్చుటనే గాక కావ్యము నందంతటను జాజులు విచ్చినట్టు పరిమళించుచున్నది.

వప్ర వర్ణనమున "వప్రఖచిత రత్నములుఁ దారకా సముదయమా యన్నట్లు, వప్రోత్కీర్ణ సాలభంజికలు విహరణ తత్పర దేవతా తరుణులా యన్నట్లొప్పె" నని తిక్కనగారనిరి. పాపరాజుగారు "చీఁకటి నదుముకొని వప్రఖచిత వజ్రములు ప్రకాశింపగాఁ జకోరికలు సంతోషమునఁ బొంగె" ననిరి. ఇరువురు నత్యుక్తుల బారలు సాచినను, తిక్కనగారు "ఇంత పొడపని వాక్రువ్వ నేరికైన రాదనుట కోట వర్ణనగాదు నిజము". అని చెప్పి కోట వైపునకు మన లను ప్రోత్సహించిరి. పాపరాజుగారాపనిఁ జేయలేదు.

ఖేయ వర్ణనము నిరువురు నుత్ప్రేక్షాతిశయోక్తులతోఁ జెప్పిరిగాని, తిక్కనగారు ప్రకృత స్థితినుండి యతిశయోక్తులఁ జెప్పఁగా పాపరాజుగారు అతిశయోక్తులపై నతిశయోక్తులఁ గ్రుమ్మరించిరి. సౌధవర్ణనముఁ దిక్కనగారొక సీసమున వెల్లడింపఁగా పాపరాజుగా రేడెనిమిది పద్యములతోఁ బొడిగించిరి. అవి రాజ సౌధములుగాక తక్కిన సౌధము లనుకొనుట కట్టి భేద మెందును కనబడదు.

హస్త్యశ్వరథ పదాతులను వేఱుగా నాలుగు పద్యములతోఁ బాపరాజుగారును, గజ తురగముల రెండింటిని రెండు పద్యములతోఁ దిక్కనగారుఁ జెప్పిరి. వేశ్యావర్ణనము నిరువురుఁ జేసిరి గాని వేశ్యావర్ణన మని చెప్పకున్నచో నది సామాన్య తరుణీ వర్ణనమువలెనే "తగు కొప్పు లాననములు చరణ యుగముల నఖములు సాటిలేని పెంపువహియింప" గా నున్నవని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారట్లు గాక వేశ్యా విలాస భేదములు గుర్తుకు వచ్చు నట్లుగా ''మిగిలిన చెవులు మెఱుగుఁ బెట్ట", "లేత నవ్వునకును బూతఁ బూయ", ''కలికి గ్రేఁగన్నుల నలువు మిగుల" "సరసంపు నడవడి తెరలుఁ బుచ్చ'', ''వెఱవుగల్గి మనోభవ వీర రసము కరువుగట్టి చేసిన పోల్కి'' యిత్యాదిగా వార వనిత లొప్పుదురని వెల్లడించిరి. తిక్కనగారు ప్రాచీనులైనను వారవనితా వర్ణనములో నాధునికులఁ దలఁదన్నినారనిపించును. పుష్పలావికాది వర్ణనము తడవలేదు. పాపరాజుగారు వర్ణించిరి.

చాతుర్వర్ణ్యమును సీసములో నొకొక్క పాదమున పాపరాజుగారు వర్ణింపఁగా, తిక్కనగారు బ్రాహ్మణ వైశ్యులను మాత్రమే చెరియొక పద్యముతో చిత్రీకరించిరి. తక్కిన వారినేల విడిచిరో తెలియదు. పాపరాజు గారు చెప్పని దేవాలయ వర్ణనము ''అమరనగంబు నెచ్చెలుఁలొ హైమవతీశు ననుంగుఁ గొంద వియ్యములొకొ'' యని తిక్కనగారు ప్రస్తావించిరి. అది దేవతా భక్తికి గుర్తు. మలయానిలము నొక పద్యములో పాపరాజుగారు చెప్పఁగాఁ, దిక్కనగారు గంధవహము నొక పద్యములో, సమీరకుమారుని రెండు పద్యములలో, యారామోపవనములలో మలయ మారుత విహారము రెండు పద్యములలో నుల్లేఖించిరి. నెల్లూరి ప్రాంతమున నీ మలయానిల విహారము లిట్లుండునేమో తెలియదు. సస్య వర్ణనము తిక్కనగారు చేయలేదు. పాపరాజుగారు విడువనూ లేదు. ఇట్లు యయోధ్యా వర్ణనము నిరువురును ముగించిరి.

"శ్రీరాస్తాం మనుమక్షితీశ్వర భుజాస్తంభే" యని వస్తు నిర్దేశముతో కథ నందు కొనుట తిక్కనగారిలో విశేషము. పుర వర్ణనమున 'సకలవస్తు పూర్ణ' మని చెప్పుట మొదలు ప్రజాజీవితమును వర్ణించుట యింకొక విశేషము. వేశ్యా వర్ణనముఁ జేయుచు "మొవ్వంపు మేనుల జవ్వనంబుల కింపు మిగిలిన చైవుల మెఱుగుఁ బెట్టి" యను పద్యములోఁ జూపిన రచనా చాతురి యభిరమ్యముగాఁ దోచును. తిక్కనగారు పందొమ్మిది పద్యములతోఁ గథ ముగింపగాఁ బాప రాజుగారరువది పద్యములతో గ్రంథముఁ బెద్దఁజేసిరి. ఇదియు నొక విశేష మన్నచో నది చదువుకొను వారి యదృష్టము.

'పూర్వ రామాయణగాథ' యనఁగాఁ జెప్పఁబోవు కథకు ముందు జరిగిన కథయని తెలియును. ఈ పూర్వ రామాయణ గాథను మూలమునఁ జెప్పలేదు. తెలుఁగు కవులే కల్పించుకొన్నది. ఇందు ప్రాచీనుఁడైన తిక్కన గారినే యర్వా చీనుఁడైన పాపరాజుగా రనుసరించిరి. ఇది యుచితముగా ననుకొన్నను పాప రాజుగారు తిక్కనగారి కంటె పెద్దది చేసి చెప్పిరి. ఆఱు పద్యములలో "రాముడు పర్ణశాల నధివసించె" నని తిక్కనగారు చెప్పఁగాఁ పదాఱు పద్య ములతో పాపరాజుగారు పొడిగించిరి. రావణాసుర సంహారము పఱకు పది పద్యములతో తిక్కనగారును, ముప్పదియాఱు పద్యములతో పాపరాజుగారును చెప్పిరి. తర్వాత కథను నాలుగు పద్యములతో తిక్కనగారు చెప్పగా, పది పద్యములు పైగానొక పెద్ద వచనము తోడుచేసి పాపరాజుగారు చెప్పిరి. విశ్వా మిత్ర యాగ రక్షణము, సీతా వివాహము, రావణ సంహారము ఇత్యాదులందు తిక్కనగారు మఱి కొన్ని పద్యములుఁ జేర్చిన బాగుండును. కాని పాపరాజు గారి పలె నింత విస్తారముగాఁ జెప్పుట సరిగాదని తోచును. ఈ కథలో పాప రాజుగారు భరత లక్ష్మణులను కథా మాత్రముగా నైనఁ బేర్కొనలేదు. కాని హనుమంతునకు 'ధవళ యజ్ఞోపవీతము, కెంపుల మొలనూలు, రత్నహారములు హొంబట్టు పంచె, హేమ కంకణములు ఇత్యాదిగాఁ బెట్టి యొక దివ్య విగ్రహ ముగా సృష్టించిరి. బహుశః తన కాలపు బ్రహ్మచారుల వేషము ఇట్టుండెనేమో ననిపించును. తిక్కనగారీ చోట "శరణార్థియగు దివాకర సూతిఁ జేకొని" యనియే చెప్పెను గాని హనుమంతుని మాట యెత్తలేదు. ఈయన విగ్రహ మిట్టిది. ఆయన భక్తి విశేష మట్టిది.

కాని "నిరోప్యగాత్ముఁడై సర్వలో కామోదం బొనరించె నా భరతు డార్య స్తుత్య వృత్తంబునన్" అని భరతుని గూర్చియు, "ఇంద్రజు ననిలోఁ జంపి

మహేంద్రాది త్రిదశనతుల కెక్కిన యనుజున్ సాంద్రానుమోదమున రఘు చంద్రుడు మోమెలమిఁ బొంద సంభావించెన్" అని లక్ష్మణుఁ గూర్చియు చెప్పి భరతు నిరాడంబర జీవితము లక్ష్మణు నిర్వ్యాక పరాక్రమమును వెల్లడిం చిరి. ఇట్టివి కవుల కుండవలసిన యవధానములని తోపఁజేసిరి. పాపరాజుగారు భరత శత్రుఘ్నులను తడవక "కాదంబినలు మానసోదంబులనె యుండె" నను వర్షర్తు వర్ణనముతో "శ్రీ సూర్యకుల సుధాసింధు వాకాంక్షించి" "చలిగట్టు దొరపట్టి జపియించు మంత్రంబు" ఇత్యాది భగవత్కీర్తనలతో "చిత్ర కూటమణీ విచిత్ర కూటసుఖేట" ఇత్యాది విచిత్ర పద విన్యాసములతో, ప్రబంధ కవితా రీతికి పతాక పట్టించెను. కవికి స్వేచ్ఛ యుండవలసినది నిజమేయైనను, ఇది హద్దులు దాటి పొంగి పొరుటయు, నత్యవసరమైన ధానిని మరచి పోవుటయు కూడని పనులని తోచును.

## రాముని దర్శింపగా నగస్త్యాదులు వచ్చుట

అనువాదములో నిది ప్రథమఘట్టము. ఇచ్చట నుండియే కవులు తమ యనువాదము నారంభించిరి. కాని యామాట చెప్పలేదు. తిక్కనగారి కృతిని పాపరాజుగారు చూచినట్లు చెప్పిరిగాని అనువాదమును బేర్కొనలేదు. తిక్కన గారు కథను సంస్కృతమునఁ జూచిరి పాపరాజుగారు కథననుసరించుచు వల సినచోట మిక్కిలిగా మార్పులు చేసిరి చూడుఁడు-మూలమున-"కౌశికోథయవ క్రీతో రైభ్యశ్చ్యవన ఏవచ, కణ్వో మేధాతిథేఃపుత్రః పూర్వస్యాందిశియేస్థితాః"- అని యున్నదానిని "కౌశిక బకదాల్భ్య కణ్వ ప్రభృతులైన దురిత విదూరులే తూర్పువారు" అని తిక్కనగారును, "కణ్వగాలవగార్గ్య కౌశిక వరతంతు రోమశాదికులు తూర్పునుండి" అని పాపరాజుగారును బేర్కొనిరి. మూలము నందలి కణ్వకౌశికపదములను యతిస్థానములకుఁ దీసికొని, తక్కిన వానిని యథాభిమతముగాఁ గూర్చుట యిందుఁ గన్పడును. కాని, 'పూర్వస్యాందిశి' యున్నదానిని, తూర్పున నుండి' యని తెలుగు సేయుట పాపరాజుగారి మూలాను సరణమునకు గుర్తు.

"దనుజ సంహారరఘువీరునని ప్రశంస చేయుతలవులశిష్యప్రశిష్యకోటి, గొలువ నరుదెంచి మొగసాల నిలిచి" యని పాపరాజుగారు చెప్పిరి. మూలము గూడ నిట్లే యున్నది. తిక్కనగారు మాత్రము- "శిష్యసంఘంబుతో రాము

పోష్యవర్గ మగుట మునికుల మెల్లను నరుగుదెంచె నతని విజయోత్సవముగొని యాడు వేడ్క-'' నని చెప్పిరి. మునికులము రాజునకుఁ బోష్యవర్గ మగుటయు, నతని నభినందించుటకై వారువచ్చుట ధర్మమనియు రాజధర్మము నుద్ఘోషించుట యిందుఁగనఁబడును. అందుకొరకే మునికులమెల్ల వచ్చుట జరిగినది పాపరాజుగారి రచనలో 'మునికులము' లేదు. 'పోష్యవర్గము' లేదు. 'విజయోత్సవము గొనియాడువేడ్క-' - లేదు.. ప్రశంస చేయుటకు మాత్రము వచ్చిరనెను. మునితపములలో నాలవపాలుగై కొను రాజునకు మునులు 'పోష్యవర్గ' మనుట పాపరాజుగారికి తెలియదో మూలమునే యనుసరించిరో తెలియదు.

మునులు సభాద్వారమున నిల్చి తమరాక చెప్పి పంపుటయు, దౌవారికుడు రాజునకు విన్పింపఁగా,రాముడు "తోడ్తెమ్ము వారిఁజయ్యన" అనగావాఁడు మునులఁ బిలుచుకొనిపోవుటయు జరిగినది. ''పతి యెదురేగి నమ్రుండయి భక్తి మెయిన్ గొనివచ్చి యుజ్జ్వలోన్నత కనకాసనంబుల మనఃప్రమదంబున నండఁజన్ యథోచిత గతినుంచి మోమలర ''సేమమె'' నావుడు, బాధలెల్లఁ దీర్చితి, భువనంబులన్నిటికి సేమమె'' యింకిట మాకు సేమమే'' యని మునులు పల్కుటయుఁ దిక్కనగారు సెప్పిరి. రాజసభామర్యాద లెటిఁగిన వారి రచన యిట్లుండును. పాపరాజుగారిచోట - ద్వారపాలకుఁడు చెప్పగనే రాముడు ''బంగరుకొండనుండి డిగు బాలదివాకరులీల'' నాసనముడిగి, మహర్షులఁ గదియఁబోయి నమస్కరించి తోడ్తెచ్చి, యాసనోపవిష్టులైనవారితో ''కుశలంబే మునులారా'' యని మూఁడు పద్యములతోఁ బ్రశ్నించెను. రాముని భక్తి భావము ప్రకటమైనదిగాని - ప్రభుత్వ పద్ధతులు మూలఁబడినవి అట్లుఁగాక, 'తిక్కనగారి రాముఁడు ప్రజాపరిపాలకుడైన రాజు - పాపరాజుగారి రాముఁడు పరమేశ్వరుడైన దేవు' డనియెనఁ గావలయును.

అగస్త్యాదులు - ''పంక్తిముఖు నాతనితమ్ముని గుంభకర్ణునిన్ దనయుని మేఘనాధుని నుదగ్రబలాఢ్యులు గాఁగఁ'' దెల్పగా విని రాముఁడు, "మీరు చెప్పుటవలన వారట్టి వారని తెలిసినది. వారి జన్మకర్మాదులు - తపోవిభవాదు లెట్టి'' వని యడుగుటయు, వారు చెప్పుటయుఁ దిక్కనగారి రచన. దీనిలో నొక యతిశయోక్తిగాని యన్యోక్తిగాని యనవసరోక్తిగాని లేదు. మునుల ప్రత్యుక్తిలోఁగూడా ''సమరమందు రాక్షసశ్రేణి నోర్చుట, నీకునెంతపెద్ద నృపవరేణ్య'' అనియు, "అలుక వొదమి చాపమందుకొనినం ద్రిజగము

యక పోవుటకుఁ కారణములు మనసులో నున్నవి. కార్య మనుకూలమగుటకు "హరికడకేగుఁ'డని చెప్పెను. "ఆతఁ డభయంబొసఁగు" నని కూడ చెప్పెను. ఇచ్చట శివుని ఉదాత్త వ్యక్తిత్వము తిక్కన రచన వలన మనకు తెలియును. పాపరాజుగా రట్లుఁ గాక "అవధ్యుల్ రాక్షసుల్" "నేమర్దింపఁగ నోప" యని కచ్చితముగఁ జెప్పిరి. అప్పుడును 'మోమోటములేకఁదెల్పెద'నని రూఢిఁజేయించిరి. 'విష్ణువుచేఁదప్పఁ దక్కిన వారిచే రాక్షసులుఁజెడ'రని ముద్ర వేయించిరి. ఈ యిరువురి రచనలో నేది యుక్తమో తెలియుటఁ గష్టము కాదు. "ఆశ్రిత హితమొనరింప నీకె చెల్లు నటంచున్" ఇంద్రాదులు పోవుట వారి యుచితజ్ఞతఁ దెల్పును. పాపరాజుగారు "శ్వేతరుచిఁదగి" యిత్యాదిశ్లేషోక్తులతో "అహిరాజ భూషణుఁడైన యావేల్పు మాయహిభయం బేరీతి నడఁచుననక" యిత్యాది గర్భితోక్తులతో, "అభవకందర్పమదాపహా"యిత్యాది మత్తేభగర్భిత సీసములతో శివునిఁ బొగడిరి. పొగడిక బాగుగానే యున్నదిగాని, ఫలములేదు.

పదునైదు పద్యములతోఁ పాపరాజుగారును, మూడుపద్యములతోఁ దిక్కనగారును జెప్పిన విష్ణు దర్శనమిట్లున్నది. పాపరాజుగారేడుపద్యముల తో విష్ణుదర్శనమును, నైదుపద్యములతో విష్ణుస్తోత్రమునుజేసి "తామసముసేయ నేలరావే ముకుందా" యని ప్రార్థించిరి. విష్ణువు ప్రసన్నుడై "ఎఱుఁగుదు మున్ సుకేశుఁడు మహేశుకృపన్ విభవాభి రాముఁడౌట" యిత్యాదిగాఁజెప్పి "వేల్పులార! వ్యథ నింకకుఁడింక జయింతు వారలన్" అని యభయమిచ్చెను. ఈ యభయమునే తన యాశుగవృష్టితో శ్లేషించెను. తిక్కనగారిట్లు చెప్పిరి. ఈ చెప్పుటలో విష్ణువర్ణనాసక్తి ప్రసక్తముకాదు. "రుద్రా విర్భావితశక్తి నే నెడఁగనే యాదైత్యుఁ, దత్పుత్రకుల్ భావారూఢులుగారె పద్మజవర ప్రాప్తాను భావుల్, తదీయావాసంబగు లంక వింతయే" యని జెప్పిరి. ఇందులోఁ "ద్రిలోకాక్రోశ మాలింపనే" యనియు, "అయినను నీమతం బెరుఁగునంతకు నేమియుఁజేయనైతి" ననియు చెప్పుట గమనార్హమైనది. దేవతలకున్న బాధ తనకునున్నట్లు, దేవతల ప్రార్థనతోఁతాను చేయనున్నట్లు వ్యక్తమగును. పాప రాజుగారి రచనలో నీభావములు లేవు. "నిజనివాసములకు శతమఖా ద్యనిమిషులు ఋషులు పోయినా" రని తిక్కనగారును, "ఇందిరానాథ వదనారవింద గళద మందమధుర వచో మకరంద బిందు బృంద తుందిల నుమనోమిళిందు లై పురందరాదులు సెందిరి మందిరముల" నని పాపరాజుగారును చెప్పిరి.

తెనిఁగించిరి. "గోప్యముగాకున్నఁ జెప్పుఁ"డను దాని నిర్లేల మార్చనో తెలి యదు పాపరాజుగారి రచన యిట్లున్నది.

తిక్కనగారీపట్టున మూలముఁ దగివలేదు. ఇంద్రజిత్తును బొగడనులేదు. మూలమున కపార్థము జెప్పుచుచేసు. 'కదిఁదిమగ' అని రావణాదులఁ జెప్పుటచే 'వారల నడుగఁగా పలసియున్నయది' యని ఉచితముగా నడిగించి రామును దాత్తతను పోషించెను. కడకు "తత్తపః పరుల యనుజ్ఞఁ గుంభజుడు పల్కె" నని యగస్త్యునకు మహామునుల యాజ్ఞను పాపరాజుగారు సంపాదింపఁగాఁ; దిక్క నగారు - 'అమ్ముని రఘుపతికి నిట్లులనియెన్' అని స్వతంత్రముగాఁ బల్కినట్లుగా చెప్పిరి. ఈ చెప్పినవానిలోనే నేవి యుచితములని గ్రహింప వలెనో అది పాఠక మహాశయుల పని.

## 4. తృణబిందు పుత్రికాపరిణయము -

పులస్త్య మహాముని తపముఁజేయుచుండగా, విహారమునకై వచ్చిన కన్య లను జూచి వారికి శాపమునిచ్చిన కథను దొమ్మిది పద్యములతోఁ బాపరాజు గారును, మూడు పద్యములతోఁ దిక్కనగారును జెప్పిరి. "అమరాహిఖచర కన్యలు" విహారమునకై వచ్చిరని పాపరాజుగారును, "కాంచెమనుజ దేవకింపురుష సిద్ధవిద్యాధర కన్యకానికాయము" నని తిక్కనగారును చెప్పిరి. మనుజకన్య లకుగూడ నిందుస్థానముగల్పించుటచే నిది కథావృత్తమునకు జీవగఱ్ఱయైనది. మూలమునందుఁగూడ "దేవ పన్నగ కన్యాశ్చ రాజర్షిత నయాశ్చయాః అని రాజర్షి కన్యలను నిందుచేర్చిరి. పాపరాజుగారు మనుజకన్యలనిందు విడిచిరి. ఇదియొక పొరపాటు.

"ఓ లీలావతులార! నేఁడు మొదలేలోలాక్షి వీక్షించున న్నాలోలేక్షణ ......మాలాతో" నని శపించినట్లు పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు -"మీ రిచటికి రావల, దింకిట ననుఁజూచినఁ గలుగుఁ జుమీ తత్క్షణంబ గర్భము మీకున్" అని నియతి సేయించిరి. శపించుటలో-నియతిచేయించుటలో తాత్పర్య భేదమున్నను, గర్భముదాల్చుట తథ్యమని యిరువురు కవులు చెప్పిరి. బాగు న్నదికాని, ఆస్త్రీలు - "మగరాల చికిలికమ్మలుడాయఁ దెలుపెక్కెఁ జెక్కి లేమని యోర్తు చెలియనడిగె" ఇత్యాదిగా గర్భచిహ్నస్ఫురణలు కలిగినట్లుగాఁ బరస్పరము మాట్లాడుకొనుట లస్వాభావికములుగా గనుపట్టును. ముని శాపము

జనితో ద్యద్గర్భ భారంబు మున్ శరముం జేర్చిన గంగఁబోలి" యనియు, "ధనం ప్రాప్యైవ నిర్ధనః" అని యున్న దానిని, "అధనుండర్థంబుఁ బ్రాపించినట్లు" అనియు, ''నిధాయాస్యే స్వయంముష్టింరురోదశన త్రైరివ" అని యున్న దానిని ''అస్యాంతస్ఫురన్ముష్టియై'' అనియు, 'అంజనాదభి నిష్క్రాంతః కరేణ్యేవ మహా గజః' అన్న దానిని ''కరిణి కరేణు వుంబెనగు క్రైవడి'' ననియు, "తంరాక్షసాత్మ జం చక్రే మాతురేవ వయస్సమం అమరంచైవ తంకృత్వా-పురమాకాశగం ప్రాప్యత్"-ఇత్యాదిగా సున్న వానిని "శంభుఁడు దయాంచద్బుద్ధి దద్బాలుఁజూఁచి యమర్త్యత్వము మాతృసన్నిభవయశ్శ్రీ స్ఫూర్తియున్ విశ్వది గ్జయతేజంబు నభశ్చరత్వము" ననియు యథాతథముగా ననువదించెను. మఱియు, ''త్రీన్ పుత్రాన్ జనయామాస త్రినేత్రసమవిక్రమాన్ త్రయోలోకా ఇవావ్యగ్రాన్ స్థితా స్త్రయ ఇవాగ్నయః త్రయో మంత్రా ఇవాత్యుగ్రాః త్రయోఘోరాఇవాధయం'' ఇత్యాదిగా నున్న మూలమును తనకిష్టము వచ్చినట్లుగా విఱిచి ''తోడనే పుట్టఁ పావకత్రయ స్ఫురణ త్రిలోకసంగతిఁ ద్రిపూరుషమాత్రగతిన్ ద్రినేత్ర పై ఖరిఁ ద్రిగుణంబులున్ బలెఁ ద్రికాలము లట్టులు ముప్వురాత్మజుల్" అని పొంద పఱచిరి. "వ్యాధమోపేక్షితాయథా'' అన్నదానిని "ఉపేక్షిత మహావ్యాధి త్రయంబున్ బలెన్'' అని వ్యాఖ్యానించిరి. మూలమును జూడకుండ నుత్తర రామాయణము వ్రాసిన పాపరాజుగారు ఈ చిన్న కథాంశములో నిన్నియుపమాన ముల మూలాన సరణముగా నెట్లనువదించిరో తెలియదు. వారు చెప్పక పోయినన ముఖమున్నది అద్దమున్నదిగదా! తిక్కనగారికి ప్రసక్తి లేదు. మూలము చూచి నను ఉపయోగించుకోలేదు. పాపరాజుగారికీవట్టున "ఆంధ్ర మహాభారతము"వలె నాంధ్రోత్తర రామాయణ మన్నచో నింత ప్రసక్తి వచ్చు నది కాదు.

ఇది ప్రాసంగికము ఇకఁ బ్రస్తుతాంశమునకు వత్తము. మాల్యవద దుల తపంబును జెప్పుచు దిక్కనగారు "అర్జవ శాంతి దాంతి నియమాఁ గరిష్ఠ గుణైక నిష్ఠమైఁ నిర్జిత చిత్త వృత్తులయి" ఇత్యాదిగాఁ దపస్సాధనమ లైన శాంతి దాంత్యాదులను జెప్పిరి. పాపరాజుగారు-"కీలాలంబని నీరుగ్రోల రహిన్ముక్కించెన్, బలాశంబులం చాలోకించుట మానెఁ బర్ణముల" నిత్యాదిగా జెప్పిరి. శాంత్యాదులఁ జెప్పిన మీఁద వేడుకకై వీనిని జెప్పినను జెప్పవచ్చును పాపరాజుగారు "కీలాలము, పలాశము" ఇత్యాదిపదముల యర్థాంతరములతో నాటలాడిరి. "పలల భోజన తపోనలము వేడిమి నంచతేజి బంగరు జెక్క

ఇత్యాదిపదములతో నర్ధద్వయము సాధించి పాండిత్యము గనఁబఱచిరి. కాని తిక్కనగారివలె సందర్భౌచిత్యము గమనింపరైరి.

విశ్రవసుడు కుబేరుని గనుటయు, నతడు తపముజేసి బ్రహ్మచే వరము లందుటయు తండ్రి చూపిన లంకా పట్టణమేలుచుండుటయుఁ బదునాల్గు పద్యములతోఁ దిక్కనగారును, ఇరువది నాల్గు పద్యములతో బాపరాజుగారును చెప్పిరి. ఇది క్రమోపగతమేయైనను, తిక్కనగారి విశేషమును బాపరాజుగారు సాధింపలేకపోయిరి చూడుఁడు. కుబేరుఁడు జన్మించినపుడు "తత్సమయంబు నన్ మునివితానము గొల్వఁగ వచ్చి, యెంతయున్ వత్సలతన్ గుమారునకు 'వైశ్రవణుం' డను పేరు పెట్టి, యత్యుత్సవ వృత్తి 'నెత్తికొనియున్ గొని యాడియు' నట్లు పుత్రపౌత్రోత్సవ మాచరించెఁ గమలోద్భవుం"డని తిక్కన గారు చెప్పిరి. పాపరాజుగారు, "భారతీధవుఁ డరుదెంచి పౌత్రుఁ జూనిఁ దప్పక గాంచి ధనేశ్వరుండు పేఁడవు, వైశ్రవణుడనం జగంబునఁ బ్రశస్తి వహించు"నని చెప్పి వెడలిపోయెనని చెప్పిరి. ఈ పోవుట యొక రాజకార్యము నెఱవేర్చిపోయి నట్లున్నది. "ఎత్తు కొనియున్ గొనియాడియు"నని చెప్పిన తిక్కనగారి మాట వంశవృద్ధుఁడు తన పిల్లల్నాదరించినట్లున్నది. ఇది యుదాత్త నిర్వహణము గదా!

"ఘోరంబౌ తపము, నిరాహారుండై చేసె బహుసహస్రాబ్దంబుల్" అని కుబేరుని తపస్సును తిక్కనగారు చెప్పిరి పాపరాజుగారా తపస్సునే - "ఆహుతులఁ బ్రజ్వరిల్లెడు" "ఘననిష్ఠన్ జలపాయియై" "పద్మాస్త్రగతి వహింపగలాడు" ఇత్యాదిగా మూడువేలేండ్లు తపముఁజేసెనని చెప్పుచు, "ద్వాదశ ద్వాదశాత్మక కిరీటమణి ప్రకాండ దీధితులు రేయెండఁగాయ" గా బ్రహ్మ ప్రత్యక్షమయ్యెనని చెప్పిరి. 'బహు సహస్రాబ్దంబుల్' అని చెప్పుటకంటె, మూడువేలయేండ్లని యొకహద్దు పెట్టుటయుఁ, తపస్సునింత యెక్కువచేసి చెప్పుటయు బాగులేదనిపించును.

కుబేరుడు - "అర్థ సంపత్సముదాయ, నిత్యసుఖ, భవ్యదిగీశతవేడె" ననియు, బ్రహ్మ, "వరుణాంతక జిష్ణులజూచి" - మీకుఁ దోడుగా నితనిని నాల్గవ దిగీశుని 'జేసితి' ననియు, 'బుష్పక విమానమునిచ్చితి' ననియు జెప్పి నట్లు తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు చెప్పుటలో భావమింతేయున్నను పదములకూర్పు నెక్కువచేసిరి. "పెన్నిధివలె, హరాసురాగ్రణి" అను పద్య

తిక్కనగారిట్లు చెప్పిరి. తృణబిందువు పుత్రికతోఁబులస్త్యుని కడకుంజని "చని మునినాథ! యిత్తరుణి సాధ్వి; గుణాన్విత; నాదుకూర్మినందన! నిగ్రహీత చిత్తుడఁగదా యనిత్రోవక, దీనినాదరంబునఁ బరిచర్యగొమ్ము" అని యప్పగించెను. పులస్త్యుడును ధర్మవేదియై పరిగ్రహించె ననెను. ఈ చెప్పుటలోఁ గన్యా గుణములు చెప్పి, 'నాదకూర్మి నందన' యనుటలో నవశ్య పరిగ్రాహ్యత్వము సూచితమైనది. "నిగ్రహీతచిత్తుఁడ'నని త్రోసివేయకు" మన్నప్పుడు, త్రోసివేసినచో నపరిహార్యములు స్ఫురణకు వచ్చుచున్నవి. కనుకనే 'ధర్మ వేదియై' పులస్త్యుడును నామెను బరిగ్రహించెను. కన్య నిచ్చునప్పుడుఁ గూడఁ దన యున్నతి తగ్గకుండ మాటలాడిన తృణబిందువు-'ధర్మ వేదియై' గ్రహించిన పులస్త్యుడు ఆదర్శమహర్షులుగా గనబడుటతో నీ సన్నివేశము బంగారునకు పరిమళ మబ్బినట్లైనది తనకాలపుఁ గన్యాదాతల మది నుంచుకొన్నట్లు మాట్లాడుట పాపరాజుగారి చిత్త వృత్తి యనవలెను.

తిక్కనగారు చెప్పుచు-"అది మొద లాలతాంగి వినయమ్మున వల్లభు చిత్తవృత్తి సమ్మదము దలిర్ప, భక్తి గరిమంబున" భర్తకు తృణబిందు పుత్రిక పరిచర్య చేయుచుండినదని చెప్పిరి. ఇది యుచితము, మూలమున- "తపశ్చరణయుక్తస్య శ్రామ్యమాణేంద్రియస్యతే శుశ్రూషణపరా నిత్యం భవిష్యతి నసంశయం" అన్న దానిని వాఖ్యానించుచు, "శ్రామ్యమాణేంద్రియస్య" అనుదానిని విస్తరించి, "స్నానంబుగావించి" "తోయములాడుచో నొడలు దోమెడు" "పలికినచో నదుత్తరము" ఇత్యాదిగా మూడుపద్యములు పావరాజుగారు పూరించిరి. ఈవిధముగా దృణబిందుని పాత్రకు దత్పుత్రికా పాత్రకు ఔచిత్యము చేకూర్చుటలో నిరువురు కవుల పాండిత్యము లిట్లు సాగినవి. ఎది యోగ్యమనుట పాఠక నిర్ణయాధీనము.

## 5. విశ్రవ స్సంతానము

ఆ దంపతులకు విశ్రవసుఁడు పుట్టి పెరిగి పెద్దవాడై తపస్సంపన్నుడు కాగా, భరద్వాజుడు తన కుమార్తె దేవవర్ణినిచ్చి పెండ్లి చేసెను. ఈ కథను పాపరాజుగా రేడు పద్యముల తోడను తిక్కనగారు మూడు పద్యముల తోడను జెప్పిరి మూలమును దిక్కనగారును కథా మాత్రముగఁ జెప్పఁగాఁ, పాపరాజుగారు కొంత పెద్దచేసి "హంస బోధము, నభోలక్ష్యము, జపావృత్తి"

ఇత్యాదిపదములతో నర్థద్వయము సాధించి పాండిత్యము గనఁబఱచిరి. కాని తిక్కనగారివలె సందర్భౌచిత్యము గమనింపరైరి.

విశ్రవసుడు కుబేరుని గనుటయు, నతడు తపముజేసి బ్రహ్మచే వరము లందుటయు తండ్రి చూపిన లంకా పట్టణమేలుచుండుటయుఁ బదునాల్గు పద్యములతోఁ దిక్కనగారును, ఇరువది నాల్గు పద్యములతో బాపరాజుగారును చెప్పిరి. ఇవి క్రమోపగతమేయైనను, తిక్కనగారి విశేషమును బాపరాజుగారు సాధింపలేకపోయిరి చూడుఁడు. కుబేరుఁడు జన్మించినపుడు "తత్సమయంబునన్ మునివితానము గొల్వఁగ వచ్చి, యెంతయున్ వత్సలతన్ గుమారునకు 'వైశ్రవణుం' డను పేరు పెట్టి, యత్యుత్సవ వృత్తి 'నెత్తికొనియున్ గొనియాడియు' నట్లు పుత్రపౌత్రోత్సవ మాచరించెఁ గమలోద్భవుం"డని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు, "భారతీధవుఁ డరుదెంచి పౌత్రజునిఁ దప్పక గాంచి ధనేశ్వరుండు పేఁడవు, వైశ్రవణుడనం జగంబునఁ బ్రశస్తి వహించు"నని చెప్పి వెడలిపోయెనని చెప్పిరి. ఈ పోవుట యొక రాజకార్యము నెఱవేర్చిపోయి నట్లున్నది. "ఎత్తు కొనియున్ గొనియాడియు"నని చెప్పిన తిక్కనగారి మాట వంశవృద్ధుఁడు తన పిల్లల్నాదరించినట్లున్నది. ఇది యుదాత్త నిర్వహణము గదా!

"ఘోరంబౌ తపము, నిరాహారుండై చేసె బహుసహస్రాబ్దంబుల్" అని కుబేరుని తపస్సును తిక్కనగారు చెప్పిరి పాపరాజుగారా తపస్సునే - "ఆహుతులఁ బ్రజ్వరిల్లెడు" "ఘననిష్ఠన్ జలపాయియై" "పద్మాసగతి వహింపగలాడు" ఇత్యాదిగా మూడువేలేండ్లు తపముఁజేసెనని చెప్పుచు, "ద్వాదశ ద్వాదశాత్మక కిరీటమణి ప్రకాండ దీధితులు రేయెండఁగాయ" గా బ్రహ్మ ప్రత్యక్షమయ్యెనని చెప్పిరి. 'బహు సహస్రాబ్దంబుల్' అని చెప్పుటకంటె, మూడువేలయేండ్లని యొకహద్దు పెట్టుటయుఁ, తపస్సునింత యెక్కువచేసి చెప్పుటయు బాగులేదనిపించును.

కుబేరుడు - "అర్థ సంపత్సముదాయ, నిత్యసుఖ, భవ్యదిగీశతవేదె" ననియు, బ్రహ్మ, "వరుణాంతక జిష్ణులజూచి" - మీకుఁ దోడుగా నితనిని నాల్గవ దిగీశుని 'జేసితి' ననియు, 'బుష్పక విమానమునిచ్చితి' ననియు జెప్పినట్లు తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు చెప్పుటలో భావమింతేయున్నను పదములకూర్పు నెక్కువచేసిరి. "పెన్నిధివలె, హరాసురాగ్రణి" అను పద్య

లనేగాక, "లోకపతివి, హైమగర్భత" అను విశేషణములతో నొక పద్యము గూడఁ జెప్పిరి. దీనికి మూలముకూడఁగనబడదు. వెంటవచ్చిన 'ఇంద్ర యమ వరుణులఁ జూచి బ్రహ్మ పలికినట్లు తిక్కనగారు సెప్పఁగాఁ, కుబేరునితోఁ జెప్పి నట్లే పాపరాజుగారు చెప్పిరి. ఇది పాపరాజుగారి నిర్మాణము.

కుబేరుడు బ్రహ్మచే వరములుపొంది తండ్రికడకువచ్చి, నాకుఁదగిన నివాసము చూపింపుడనఁగా, నతఁడు లంక పేరుచెప్పి, దనుజులు విడిచిపోయి నను లంక రమ్యముగానున్నదనిచెప్పి, యందుచేరుమనెను ఆతఁడట్లుచేసి తండ్రికడకు రాకపోకలు చేయుచుండెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజు గారింతయుఁ జెప్పిరిగాని యొకటిరెండు విశేషములాలోచింపఁదగ్గవి. కుబేరుఁడు తండ్రితోఁ జెప్పుచుఁ- "దండ్రి! భవదాజ్ఞన్ బ్రహ్మమెప్పించి యిష్టవరంబుల్ గొనివచ్చితిన్, దగునివాసం బా యజున్ వేడనైతి" నని పల్కెను. ఎందుకు వేడలేవో చెప్పలేదు. 'నివాసము బ్రహ్మనడుగవలెనా, యని యనుకొన్నచో అవసరియే. కాని ఆ మాటకూడాఁ దండ్రితోఁ జెప్పవలసిన పనియుండదు. ఈ మాట యథాలోచితముగా జెప్పినట్లున్నది.

"ఈతిబాధలేక, యింతైనఁ బగవారిచేతిబాధలేక చెలువుగలుగు నట్టి గీము" కావలెనని కుబేరుఁడడుగుటయు "కలదీ దక్షిణవార్ధి మధ్యమున" - ఇత్యాదిగా విశ్రవోముని చెప్పుటయు నిందలికథ. అడుగుటకుఁ జెప్పుటకు నడుమ లిప్తకాలమైన సందులేకుండ నీకార్యము జరిగినది. ఇచ్చట దిక్కన గారు - "ఆ విశ్రవసుఁడు తనదు ప్రభావంబుననెల్లయెడలుఁ బరికించి, తదీ యావాసయోగ్యముగ మది భావించి ముదమున నర్థపతికిట్లనియెన్", "లంక యనఁగ లోకములఁ బేర్కొనిన నెలవు" - ఇత్యాదిగాఁ జెప్పిరి. తనప్రభావముచే నెల్లయెడలుపరికించి, ఇది యీతనికి తగునని నిశ్చయించి చెప్పుటకును, అడి గినమాత్రమే ఆలోచనచేయక చెప్పుటకును గల యంతరము విజ్ఞులెఱుఁగుదురు. పాపరాజుగారు చక్కగానాలోచింపకచేసిన కవితానిర్మాణమిదియని తెలియును.

## 6. మాల్యవ దాదుల యుత్పత్తి

కుబేరుడు లంకజేరినమీఁద, రాముఁడు సందేహమడుగుటయు నగస్త్యుడు చెప్పుటయు నాదిగా, మాల్యవదాదులు స్వర్గముపైకి దండెత్తిపోవువరకు నిది యొక కథ. రాముడు - "మునీంద్ర! మున్ను నసురాధిపులేలెడి పీడె లంక...తజ్ఞ

నన తపోవిభూతి బలసత్త్వచరిత్ర విశేషముల్, జనార్దను దెసహాని పుట్టిన విధంబు వినన్ గడువేడుకయ్యెడున్" "అతనికి-మనమెఱింగిన యీతనికిని దారతమ్యమెట్టిదియో" - యని యగస్త్యుని బ్రశ్నించెను. అగస్త్యుడు చెప్పదొర కొనెను. ప్రశ్న వేయుటయు బదులు చెప్పుటయు నిచ్చట సరిగానున్నది. ఇది తిక్కనిగారి రచన.

పాపరాజు గారిట్లుచెప్పిరి. రాముఁడు - "ఓ వింధ్యాచల" ఇత్యాదిగా నాలుగు పద్యములతోఁ బ్రశ్నించెను. ఈ ప్రశ్నలో "ఆదిఁ బులస్త్య వంశభవు లాసుర ముఖ్యు లనంగ వింటి" ననెను. ఎవరుచెప్పఁగా రాముఁడెప్పుడెట్లు వినెనో తెలియదు. ఈ 'ఆది' దేనికాదియో వివరింపలేదు. "పరమేష్ఠినుండియును రక్షోవంశ మాద్యంతమున్ వినిపింతున్" అని అగస్త్యుఁడు చెప్పుటతోఁగూడ నతడైనను జెప్పెనాయన్న, నతడును హేతిప్రహేతులనుండియే చెప్పెను. వారినుండియే రక్షోవంశ మాది యనుకొన్నచో - హిరణ్యాక్ష హిరణ్యకశిపు లాదిగా మహారాక్షసు లేమైనట్లు? ఇట్టియబోధస్థితిలో దీనిని విడిచిపెట్టెను. పైగా, "రవివంశోత్తమ! సంశయంబయినచోఁ బ్రశ్నింపఁగానేర్తు - వినన్ నేర్తు" నని స్తోత్రము చేసి - "రామ! యట్టియక్షరాక్షసకోటిలో నెంచదగిన వీరు లిద్దఱిరి" యని హేతిప్రహేతుల కథనందుకొనెను. ఇప్పుడుఁగూడ హేతి ప్రహేతులు యక్షులా-రాక్షసులాయన్న ప్రశ్న మిగిలియేయున్నది. తిక్కన గారు "హేతిప్రహేతులనఁ బ్రఖ్యాతు లుదయమైరి రాక్షసాన్వయమున" అని స్పష్టముగాఁ జెప్పిరి. పాపరాజుగారట్లు చెప్పక ద్రావిడ ప్రాణాయామము చేసిరి.

ప్రహేతి విరక్తుఁడై తపమునకుఁబోఁగా, హేతియనువాఁడు కాలుని చెల్లెలిని వివాహమాడి విద్యుత్కేశుని గనెను. అతడు సుకేశునిఁగనెను. ఆ సుకేశుడు దేవమణియందు "మాల్యవంతుఁ డనంగ సుమాలియనఁగ మాలి యనఁ గాంచెఁగొడుకుల" నని యిరువురు చెప్పిరి పద్యముల విస్తారమెట్లున్నను, పాపరాజుగారి రచనలో మూలానుసరణమెట్టిదో యిచ్చటఁజూడనగును.

మూలమున "మధుకైటభ సంకాశౌ" అనియున్నదానిని "మధుకైటభ విక్రమ ప్రకాశు" లనియు "తోయ మధ్య ఇవాంబుజం" అనుదానిని, "తోయ గాంబుజము లీవిన్" అనియు, "గంగాగర్భమివాగ్నిజం" అనుదానిని "వహ్ని

జనితో ద్యగ్గర్భ భారంబు మున్ శరముం జేర్చిన గంగఁబోలి" యనియు, "ధనం ప్రాప్యేవ నిర్ధనః" అని యున్న దానిని, "అధనుండర్థంబుఁ బ్రాపించినట్లు" అనియు, "నిధాయాస్యే స్వయంముష్టింరుకోదశన కైరివ" అని యున్న దానిని "అస్యాంతస్ఫురన్ముష్టియై" అనియు, 'అంజనాదభి నిష్క్రాంతః కరేణ్వేవ మహాగజః' అన్న దానిని "కరిణి కరేణు వుంబెనగు కైవడి" ననియు, "తంరాక్షసాత్మజం చక్రే మాతురేవ వయస్సమం అమరంచైవ తంకృత్వా-పురమాకాశగం ప్రాప్యత్"-ఇత్యాదిగా నున్న వానిని "శంభుఁడు దయాంచద్బుద్ధి దద్బాలుఁజూఁచి యమర్త్యత్వము మాతృసన్నిభవయశ్శ్రీ స్ఫూర్తియున్ విశ్వాది గ్జయతేజంబు నభశ్చరత్వము" ననియు యథాతథముగా ననువదించెను. మఱియు, "త్రీన్ పుత్రాన్ జనయామాస త్రిణేత్రసమవిక్రమాన్ త్రయోలోకా ఇవావ్యగ్రాన్ స్థితా స్త్రయ ఇవాగ్నయః త్రయో మంత్రా ఇవాత్యుగ్రాః త్రయోఘోరాఇవాధయం" ఇత్యాదిగా నున్న మూలమును తనకిష్టము వచ్చినట్లుగా విఱిచి "తోడనే పుట్టఁ పావకత్రయ స్ఫురణ త్రిలోకసంగతిఁ ద్రిపూరుషమాత్రగఱిన్ ద్రినేత్ర పైఖరిఁ ద్రిగుణంబులున్ బలెఁ ద్రికాలము లట్టులు ముప్వురాత్మజుల్" అని పొందపఱచిరి. "వ్యాధమోపేక్షితాయథా" అన్న దానిని "ఉపేక్షిత మహావ్యాధ త్రయంబున్ బలెన్" అని వ్యాఖ్యానించిరి. మూలమును జూడకుండ నుత్తర రామాయణము వ్రాసిన పాపరాజుగారు ఈ చిన్న కథాంశములో నిన్నియుపమాన ముల మూలాన సరణముగా నెట్లనువదించిరో తెలియదు. వారు చెప్పక పోయినన ముఖమున్నది అద్దమున్నదిగదా! తిక్కనగారికీప్రసక్తి లేదు. మూలము చూచి నను ఉపయోగించుకోలేదు. పాపరాజుగా రీవట్టున "ఆంధ్ర మహాభారతము" వలె నాంధ్రోత్తర రామాయణ మన్నచో నింత ప్రసక్తి వచ్చు నది కాదు.

ఇది ప్రాసంగికము ఇకఁ బ్రస్తుతాంశమునకు వత్తము. మాల్యవద దుల తపంబును జెప్పుచు దిక్కనగారు "అర్జవ శాంతి దాంతి నియమాఁ గరిష్ఠ గుణైక నిష్ఠమైఁ నిర్జిత చిత్త వృత్తులయి" ఇత్యాదిగాఁ దపస్సాధనమ లైన శాంతి దాంత్యాదులను జెప్పిరి. పాపరాజుగారు-"కీలాలంబని నీరుగ్రోల రహిన్రుక్కించెన్, బలాశంబులం చాలోకించుట మానెఁ బర్ణముల" నిత్యాదిగా జెప్పిరి. శాంత్యాదులఁ జెప్పిన మీఁద వేడుకకై వీనిని జెప్పినను జెప్పవచ్చును పాపరాజుగారు "కీలాలము, పలాశము" ఇత్యాదిపదముల యర్థాంతరములతో నాటలాడిరి. "పలల భోజన తపోనలము వేడిమి నంచతేజి బంగరు ఱెక్క

తేజరిల్ల'' గా నుద్భ్రాంతుడై బ్రహ్మవచ్చెనని పాపరాజుగారనిరి. ఈ యుద్భ్రాంతికిఁ గారణము - అంచతేజి తెక్కలు తేజరిల్లుటయేగదా! తేజరిల్లుటయనగా మెఱుగారుటయో మండుటయో తెలియవలెను. తిక్కన గారి బ్రహ్మ కీయుద్భ్రాంతి కలుగలేదు. కావున "ప్రత్యక్షంబయి దేవబృందములతోఁ బద్మాసనుం," డని నిర్వహించిరి. "బ్రహ్మ ముఖాంభోజము చూచి లేచి భయకంపావాప్తి సాష్టాంగ దండము లర్పించి," యని పాపరాజు గారనిరి. వరములీయవచ్చిన బ్రహ్మనుజూచి "భయకంపావాప్తి'' యెందుకుఁ గల్గెనో తెలియదు. "సంభ్రమ ప్రీత్యుత్కర్షము లంతరంగమున ఘూర్ణిల్ల'' నని తిక్కనగారు చెప్పుటలో నౌచిత్యము గోచరించుచున్నది. ఇవి యిట్లున్నను ''భారతీపంకజలోచనా కచవిభాసుర కేసరవాసనా, గతా, హంకర నాళి ఝంకరణహారి మృదూక్తుల" పల్కరించుట యుద్భ్రాంతుఁడైన యప్పద్మగర్భునకే తెలియవలెను. సమాసము కూర్పు బాగున్నది కాని, సందర్భ సన్నివేశములు దెబ్బ తిన్నవి. మూలము నందు సత్యార్జవ శమోపేతైః తపోభి రతి దుష్కరైః'' యని యుండఁగా తెలుఁగున "తదీయ ప్రాంచి తాచార సూనృత సంభావ్య మహాతపో జనిత వహ్ని జ్వాలికాహతి'' నని పెద్ద నమాసమల్లిరి వీనిలో ''సత్య'' పద్యమునకు, 'సూనృత'' యను పదముఁ దక్కఁ దక్కిన వన్నియు స్వకపోల కల్పనలే. ''కీలాలంబని''యను పద్యము యమూలకంబని మున్నె తెలిసినది. తర్వాత ''తతో విభుశ్చతుర్వక్త్రో విమాన వరమాస్థితః సుకేశపుత్రా నామన్త్ర్య వరదోస్మీత్యభాషత"యని మూలమున నుండఁగా "ఇంక ప్రయాస మొందవలదు.'' ఇత్యాదిగా నమూలకములైన పద్యములు వ్రాసిరి. ''ఊచః ప్రాంజలయ స్సర్వే వేపమానా ఇవద్రుమాః'' అన్న మూలమునకు అనువాదము లేదు. పాపరాజుగా రీవిధముగ ''కవితావ్యాయామ'' మెందుకు చేసిరో తెలియదు. మూలము ముట్టకున్నను తిక్కన గారు సముచితముగా నిర్వహించిరని తెలియును.

## 7. మాల్యవదాదుల దండయాత్రలు

బ్రహ్మచే వరములంది, విశ్వకర్మ సహాయముచే లంకను ప్రవేశించి నర్మద యను గంధర్వ కామిని తన పుత్రికల ముగ్గురనీయఁగా వివాహమై పుత్రికా పుత్రులను మాల్యవదాదులు పడసిరని యిరువురు కవులుఁ జెప్పిరి.

వారి యందఱి పేర్లనుగూడ చెప్పిరి మాల్యవంతునకు నేడ్వురు పుత్రులు నొకపుత్రిక, సుమాలికిఁ బదుగురు కుమారులు నలుగురు కూతుండ్రు, మాలికి నలుగురు కుమారులు - ఇంతమంది పేర్లను సంఖ్యఁ దప్పకుండఁ జెప్పవలె నన్న, నిరువురు కవులు మూలమును జూచియే యుండవలెను. మూలముఁ జూచినారనుట కిదియొక సాక్షి.

ఒకటి రెండు విశేషము లిందుఁ గనఁబడుచున్నవి. మాల్యవదాదులు విశ్వకర్మ వలన లంకా వృత్తాంతము న్విని "దనుజ పతి లంక కందువ గని, నిధి నిరుపేద వాఁడుఁ గన్నట్లు మనంబునఁబొంగి" యని తిక్కనగారును, పాపరాజుగారు "శిల్ప సమాట్సుధా సంకాశోక్తుల నుత్సహించి బహురక్ష శ్రేణితో దోర్బలాహంకారంబునఁ జేరిరి" యని చెప్పిరి. ఇచ్చట నిరుపేద వాఁడు పెన్నిధిఁ గన్నట్లు" యని చెప్పుట యుచితమోఁ "దోర్బలాహంకారం బున జేరిరి" యని చెప్పుట సమంజసమో తెలియవలెను. పాపరాజుగారి రచ నలో సామంజస్యము తక్కువ యని తెలియగలదు.

తిక్కనగారు-నర్మద యను గంధర్వి "కోరియిచ్చె తనదు కూతుల ముగ్వురఁ దానవేశ్వరునకుఁదమ్ములకును" నని సాధారణముగాఁజెప్పిరి. పాప రాజుగారు "నర్మద, సుపర్వసతియయ్యె దుర్మదులకు నసురులకు నెట్లొ నంగెఁ గన్యకల ననకు కలిమి గుణమట్టిది" యని చెప్పిరి. కలిమి గుణమట్టి దియే కావచ్చును కాని కూతుల నిచ్చునపుడు యా కూతుల సౌందర్యాదులుఁ జెప్పక తల్లి సౌందర్యము వర్ణించుటేమి? అనవసరముగా ననౌచిత్యము సంపా దించుట యిట్టిదే యగును.

తిక్కనగారు మాల్యవదాదుల దుశ్చరితలఁ జెప్పుచు "దుర్దాంతుండై శ్రుతి బాధసేయుచు క్రతుధ్వసంబు గావించుచున్" "పరనారీ హరణం బొనర్చు, వివిధోపాయంబులన్ మేదినీ సురవరంబులనొంచు, దేవగృహసంశోభా భిఘాతంబు సేయు...ధర్మంబు నష్టంబుగన్" అని చెప్పిరి. పాపరాజుగా రాదిత్యులు మొదలుగఁ పదునొకండు తెఱఁగులైన దేవయోనుల కష్టపాటుఁ జెప్పుచు "మున్పటిలీలం గరుడోరగామర మునీంద్రశ్రేణి బాధింపఁగన్" యని చెప్పిరి. దేవతాయోని భేదముల నెన్ని చెప్పినను యవన్నియు ధర్మ శరీర ములో నొక యంగమే కదా! దానిని బాధించెననఁగాఁ గాలికో వ్రేలికో బాధ

కలిగించెనని భావముఁ తిక్కనగా రట్లు గాక శ్రుతి బాధ, క్రతు ధ్వంసము, పరనారీ హరణము, మేదినీ సురవిద్రోహము, దేవాలయాభి ఘాతము-ఇత్యాది ధర్మ శరీరబాధా చరణంబుఁ జెప్పి కడకు "ధర్మంబు నష్టంబుగన్'' ''దానవులు విహరించి'' రని దెల్పిరి. ఈ నిర్వచనములో తిక్కనగారు వ్యాసుని తర్వాత నంతటి ధర్మమూర్తి యని మనకుఁ దెలియఁబరచిరి. మూలమునందున్న ''వర ప్రదానా దతి గర్వితా భృశమ్ క్రతు క్రియాణాం ప్రశమంకరాస్సదా'' యని యున్న శ్లోక పాదమును గూడ చూడకపోయిరని తెలియును

## 8. ఇంద్రాదుల శరణాగతి

ఇంద్రాదులు మాల్యవదాదులచే నార్తులై శివుని దర్శించి, విష్ణువును బొగడి యావిష్ణువు రాక్షసులను దునుముదునని చెప్పఁగా సంతసించి, తమ నివాసములను జేరుకొనుట యొక కథాభాగము దీని నయిదు పద్యములచేఁ దిక్కనగారును నిరువదియేడు పద్యములచేఁ బాపరాజుగారును జెప్పిరి. పాపరాజుగారి రచనలో వర్ణనాంశములుఁ బోగాఁ దక్కిన వానితోనే ప్రకృత పరామర్శ చేయు టుచితము.

ఇంద్రాదు లార్తులై శివుని దర్శించి ''పరిభవించుట లెల్ల నెఱుంగఁజెప్పి నిస్తుషముగ దైత్యవర్గములఁ ద్రుంపఁగ గోరిరి. ''హరుఁడు సుకేశుడు మీఁద కృపనాతని సంతతి కల్గికుండియున్ సురముని వృత్త భంగములు చూడఁగఁ జాలక ''యేను నేర,నాహరికడ కేగుఁ డాతఁ డభయంబొసఁగున్ దయమీకు'' నని చెప్పఁగా, నా దేవతలు విష్ణువు కడ కేగిరి. ఇది తిక్కనగారి రచన. పాపరాజు గారిట్లు చెప్పిరి. ఈ చెప్పునపుడు శివుని స్తుతించి రాక్షసుల బాధఁ జెప్పి ''కావగదే శివా''యని మ్రొక్కిరి. ఆ శివుఁడు వారినిఁ జూచి ''మీ తో మోమోటము లేకఁ దెల్పెద, నవధ్యుల్ రాక్షసుల్, వారలన్ నే మర్దింపఁగ నోప, వారిఁగెడపన్ నేర్చున్ ముకుఁదుండు మీ రీ మంత్రం బెద సమ్మి శౌరిఁగన బొం డిష్టార్థముల్ చేకుఱున్''

''దతిజాహితుచేఁ దక్కఁగ నితరులచే చెడరు వార-లిదినిజ'' మని చెప్పినట్లు వ్రాసిరి. తిక్కనగారి మాటలో 'నేను నేర' ననఁగా 'చంప'నని గాని, 'చంపలేను' అనిగాని చెప్పక 'తెలియను' అన్నట్లు స్పష్టమగును. తెలి

యక పోవుటకుఁ గారణములు మనసులో నున్నవి. కార్య మనుకూలమగుటకు ''హరికడకేగుఁ'డని చెప్పెను. ''ఆతఁ డభయంబొసఁగు'' నని కూడ చెప్పెను. ఇచ్చట శివుని ఉదాత్త వ్యక్తిత్వము తిక్కన రచన వలన మనకు తెలియును. పాపరాజుగా రట్లుఁ గాక ''అవధ్యుల్ రాక్షసుల్'' ''నేమర్దింపఁగ నోప'' యని కచ్చితముగఁ జెప్పిరి. అప్పుడును 'మోమోటములేకఁదెల్పెద'నని రూఢిఁజేయించిరి. 'విష్ణువుచేఁదప్పఁ దక్కిన వారిచే రాక్షసులుఁజెడ'రని ముద్ర వేయించిరి. ఈ యిరువురి రచనలో నేది యుక్తమో తెలియుటఁ గష్టము కాదు. ''ఆశ్రిత హితమొనరింప నీకె చెల్లు నటంచున్'' ఇంద్రాదులు పోవుట వారి యుచితజ్ఞతఁ దెల్పును. పాపరాజుగారు ''శ్వేతరుచిఁదగి'' యిత్యాదిశ్లేషోక్తులతో ''అహిరాజ భూషణుఁడైన యావేల్పు మాయహిభయం బేరీతి నడఁచుననక'' యిత్యాది గర్భితోక్తులతో, ''అభవకందర్పమదాపహా''యిత్యాది మత్తేభగర్భిత సీసములతో శివునిఁ బొగడిరి. పొగడిక బాగుగానే యున్నదిగాని, ఫలములేదు.

పదునైదు పద్యములతోఁ పాపరాజుగారును, మూడుపద్యములతోఁ దిక్కనగారును జెప్పిన విష్ణు దర్శనమిట్లున్నది. పాపరాజుగారేడుపద్యముల తో విష్ణుదర్శనమును, నైదుపద్యములతో విష్ణుస్తోత్రమునుజేసి ''తామసము సేయ నేలరావే ముకుందా'' యని ప్రార్థించిరి. విష్ణువు ప్రసన్నుడై ''ఎఱుఁగుదు మున్ సుకేశుఁడు మహేశకృపన్ విభవాభి రాముఁడౌట'' యిత్యాదిగాఁజెప్పి ''వేల్పులార! వ్యథ నింకకుఁడింక జయింతు వారలన్'' అని యభయమిచ్చెను. ఈ యభయమునే తన యాశుగవృష్టితో శ్లేషించెను. తిక్కనగారిట్లు చెప్పిరి. ఈ చెప్పుటలో విష్ణువర్ణనాసక్తి ప్రసక్తముకాదు. ''రుద్రా విర్భావితశక్తి నే నెడఁగనే యాదైత్యుఁ, దత్పుత్రకుల్ భావారూఢులుగారె పద్మజవర ప్రాప్తాను భావుల్, తదీయావాసంబగు లంక వింతయే'' యని జెప్పిరి. ఇందులోఁ ''(?)ది లోకాక్రోశ మాలింపనే'' యనియు, ''అయినను నీమతం బెరుఁగునంతకు నేమియుఁజేయనైతి'' ననియు చెప్పుట గమనార్హమైనది. దేవతలకున్న బాధ తనకునున్నట్లు, దేవతల ప్రార్థనతోఁతాను చేయనున్నట్లు వ్యక్తమగును. పాప రాజుగారి రచనలో నీభావములు లేవు. ''నిజనివాసములకు శతమఖా ద్యనిమి షులు ఋషులు పోయినా'' రని తిక్కనగారును, ''ఇందిరానాథ వదనారవింద గళద మందమధుర వచో మకరంద బిందు బృంద తుందిల నుమనోమిళింధు లై పురందరాదులు సెందిరి మందిరముల'' నని పాపరాజుగారును చెప్పిరి.

ఇట్టి యమకచ్ఛేకాదులతో బంధను బిగించునేర్పు పాపరాజుగారిది. వ్యంగ్య మర్యాదావిష్కృత భంగ్యంతరములు తిక్కనగారిపనీ తెలియును.

మాల్యవంతుడు దేవతల సన్నాహమంతయువిని తమ్ములఁబిలిచి యంతయుఁజెప్పి, మధుకైటభాదులు ప్రముందుట నుపన్యసించి "తరమె విష్ణునితోఁబోర తమ్ములార!" యని చెప్పెను. "వారలకంటె నెక్కుడగువారమె విష్ణునితోఁడంబోర" నని చప్పగాఁబలికెను. "తన్మనోంబుజం బీరసమెత్తఁజేసె, నిదియెంచి యొనర్పుఁడు మీఁది కార్యమున్" అని యస్త్రములు పాఁరవేసెను. తమ్ములడ్డమతిరిగి, యన్నగారికి బదులుసెప్పి "రమాపతి యస్మదాదులన్ గదిసి రణంబొనర్చునె" యని నమ్మఁబలికి యుద్ధసన్నాహము చేసిరి. ఈకథ యంతయు నిరువదియైదు పద్యములతో, బాపరాజుగారు నెప్పిరి. ఇందు మాల్యవంతుడు విష్ణువుతోఁ బోరుటకు భయపడినట్లు స్పష్టము. ఇట్లు ప్రతి నాయక పదమునకనర్హులుగా మాల్యవదాదులు కనబడుచున్నారు. ఈరచన పావరాజు గారిది.

ఆయుపద్యములతో నీకథనే తిక్కనగారిట్లు చెప్పిరి. ఇందులో, ప్రతి నాయకావనతి యేమాత్రము గోచరింపదు. మాల్యవంతుఁడుద్ధతుఁడై - "సర్వ జగంబులున్ బెదర సంగర రంగమునన్ జయించి హృత్పర్వమొనర్పగా వలయు దైత్యుల" కని యుద్ఘాటించెను. తమ్ములు నట్లేపలికిరి. అంద యుద్ధమునకు సిద్ధమైరి. ఇందుఁ బ్రతినాయకోన్నతి కర్హమగనే తిక్కనగా. చెప్పిరి పాపరాజుగారు మూలమునను:సరించియే యీవిధముగాఁ దీర్చిరనవలెను.

దైత్యులు యుద్ధమునకుఁ బోవునపుడు...అ లంకాపురిలో వినంబడె సృగాలారావముల్" ఇత్యాదిగా రెండుపద్యములతో దుశ్శకునములు చెప్పి "ఉత్పాతంబుల్ దిలకించి దైవకృతముం దప్పింపరా" దంచు మాల్యవంతుఁడు ముందుకుపోయెనని పాపరాజుగారు చెప్పిరి. దీనితో యుద్ధముచేయుటకు విముఖుడయి, తమ్ముల ప్రేరణముననే, దైవకృతము తప్పింపరాదనియే యుద్ధమునకు బోయినట్లున్నది. ప్రతినాయకుఁడిట్లుండుట యెందును గనుగొనము. తిక్కన గారు దీనిని మార్చి "దివిజావళికిన్ మనచేయుహానికై యెంతలు పుట్టెఁ జూడుఁ" డని పరిహాసము చేసినట్లు పల్కిరి. మూలముఁగూడ "తానచింత్య మహోత్సాహాన్ రాక్షసా బలగర్వితాః యాంత్యేవన నివర్తంతే" అని యున్న దానినిగూడఁ బాపరాజు గమనింపలేదు. ఇది విపరీతముగానున్నదని తోఁచును.

కాని, - "భ్రాతరం జ్యేష్ఠం భగాంశావివ వాసవం" అన్నదానిఁ బ్రీతిన్ సూరెల నశ్వినుల్ గొలిచిరాఁ బెంపొందు నింద్రుంబలెన్" అనియు, "మాల్యవంతంతు తేసర్వే మాల్యవంత మివాచలం" అని యున్నదానిని, "మాల్యవదాఖ్య నగంబులీల" ననియు, "నిశాచరా హ్యాశ్రయంతే దాతార మివదేహినః" అన్నదానికి మఱికొంత తోడుచేసికొని "పటీరనైర్మల్యా లస ద్యశో ధనసమన్విత ధాత ధనార్థికోటిలో ధన్యతఁగన్న కైవడి" ననియు ననువదించిరి. యనువాదముచేయునపుడు మూలమున దారాడు జాగ్రత్త ప్రతినాయక పాత్రపోషణమునఁ గనఁబడకపోవుట మిక్కిలి చిత్రము - ఈ విధముగా నిరువురి రచనలు వ్యక్తీకరింపఁబడినవి.

## 9. మాల్యవదాదుల యుద్ధము -

ఈ యుద్ధమును తిక్కనగారు ముప్పదిమూడు పద్యములతోను, పాపరాజుగారు ఱువదియేడు పద్యములతోను జెప్పిరి. ఉభయుల రచనావిశేషములు మాత్రమే పరిశీలింపదగును. మూలమునందు "సువర్ణవృష్ఠే సబభే శ్యామః పీతాంబరో హరిః కాంచనస్య గిరేశ్శృంగే సతటిత్తోయదోయథా" అన్నదానికి, "గరుడునిపై శార్ఙ్గధనుర్ధరుడగు విష్ణుండు - మేరుతటిఁ బొల్చుతటిత్పరివృత జలదముఁబోలెను" అని తిక్కనగారు చెప్పిరి. శార్ఙ్గధనుర్ధరు' డను విశేషణము 'పీతాంబరుఁ'డను దానికంటె నర్థవంతముగాఁగూర్చి యుపమానముతో జత చేసిరి ఇది చక్కగా నున్నది ఇంతటితో నాఁగక, "విరియదనుజ రాజహంస వితతియతనికిన్" అని అధికముగాఁ జెప్పిరి. అదియుఁ జక్కగా నున్నది. దీనిని మూలమునుండియే యనువదించెనని తోఁచును. అయినను స్వతంత్రత తెలియుచున్నది. పాపరాజుగారు, "శార్ఙ్గతూణ గదా ఖడ్గసహిత మహిత గారుడ స్కంధమెక్కి-బంగరువుగట్టు తుదనుగను పట్టు నీలతోయదమాయనంగ" చక్రధరుఁ డరుదెంచె ననెను. గారుడస్కంధమునకే శార్ఙ్గతూణగదాదులు విశేషణము చేసి 'పీతాంబరో' యను దానిని విడిచి పెట్టినను, ఆ మూలమున కిది యనువాదముగా నున్నది. కాని, తిక్కనగారు చెప్పిన 'దనుజ రాజహంస వితతి' యందుఁ గనఁబడదు. అది ఆయన ప్రతిభ. 'అద్దవు బిళ్లకైవడి' ఖద్యోతుఁడు మాసిపోవుట' పాపరాజుగారి కల్పనము. ఇచ్చటఁ గూడ "మాసిన యద్దపు

బిళ్ల''ను చెప్పినచో మఱియు బాగుండును. కాని ఆ పదము ఇచ్చట లేదు. ఇంతే గాదు ఈ యుపమానము తిక్కనగారు చెప్పలేదు. మూలమున గూడఁ గనబడదు.

వాసవ దూత పోయి ''యిదెవచ్చిరి దైత్యులు నానెఱింగెనో'' అన్నట్లు యుద్ధమునకు ముకుందుఁడు సిద్ధమయ్యెనని పాపరాజుగారు చెప్పిరి. ఇట్లే మఱి రెం డుత్ప్రేక్షలను గూడఁజెప్పిరి. కాని దేవదూత వచ్చి చెప్పగా శౌరి తెలిసి కొనెనని చెప్పలేదు. తిక్కనగారు ''హరిఁగని దేవదూత శరణాగతుఁడై'' రాక్షసుల రాక చెప్పెననిరి. మూలమునఁ గూడ ''రాక్షసానాంసముద్యోగం తంతు నారాయణః ప్రభుః దేవదూతా దుపశ్రుత్య'' అని యున్నది. ఇట్లు మూలమున లేకున్నను తిక్కనగారు చెప్పకున్నను, యథార్థమునకు దూరమైనను, మూడు యుత్ప్రేక్షలతో ముట్టఁబల్కుట పాపరాజుగారి సంరంభము. ఈ సంరంభము తోడనే మూలము చెప్పకున్నను శ్రీ విష్ణుని శృంగారవైభవాధికవర్ణనము పెద్ద చేసి పాపరాజుగారు ప్రబంధమునఁ గూర్చిరి.

మూలముఁ జూచియే పాపరాజుగా రనువదించిరనుటకు మఱి కొన్ని సాక్ష్యములుగూడఁ బరిశీలింపదగును. మూలమున. ''శ్యామావదాతై స్తైర్విష్ణు ర్నీలై ర్నక్తంచరోత్తమైః వృతోఽంజనాద్రి రేవాసీత్ వర్షమాణైః పయోధరైః శలభాఇవకేదారం మశకాఇవపర్వతం యథామృతఘటం దంశా మకరాఇవ చార్ణవం'' ఇత్యాదిగా నున్న వానినెల్ల సమీకరించి, ఒదుగని వానినిఁ దొలగించి, "వర్షాబ్దగతి నంపవాన దైత్యులు ముంప నచలుఁడై హరియంజనాద్రిదెగడె" ననియు, "శలభ సంహతి తల శత్రులొక్కటమీఱఁ గేదారగతి నుండె కేశవుండు", అనియుఁ బెక్కురీతుల భద్రపఱచిరి. ''రాక్షసేంద్రా గిరినిభాశ్శర శక్త్యష్టితోమరైః నిరుచ్ఛ్వాసం హరించక్రుః ప్రాణాయామా ఇవద్విజం'' అని యున్నదానిని ''ఆనక్తంచరశేఖరుల్ గురియు దివ్యాస్త్రప్రకర్షంబులున్ ప్రాణాయామ పరాయణుండయిన విప్రగ్రామణిన్ బోలుచున్'' అని వెల్లడించిరి. "శంఖ రాజరవస్సోధత్రాసయామాస రాక్షసాన్ మృగరాజ ఇవారణ్యే సమదా నివ కుంజరాన్'' అని యున్నదానిని ''సింహం బర ణ్యావనిన్ గర్జిల నేనుఁగుల్ బెదరున ట్లందంద మూర్ఛిల్లుచున్'' అని పొందుపఱచెను. ఇట్టివే మఱి కొన్నియును గలవు. ఇవి మూలమును చూచిన యనువాదములని సాక్ష్యము

నిచ్చుచున్నవి. ఇట్లు యధామూలముగా నుపయోగించుకొనియు నా మాటను జెప్పక పోవుట పాపరాజు వంటివారికిఁ దగినదా యని ప్రశ్న ?

మాలిహతుఁడైనపిమ్మట మాల్యవదాదులు యుద్ధముననోడి పలాయితులై లంకఁజేరుటను తిక్కనగా రాఱుపద్యములతోడను, పాపరాజుగా రిఱువదియైదు పద్యములతోడను జెప్పిరి. వారికవితా విలాసమిట్టిది. ''కడువేగంబున లంక కేగి -యందునున్ దడయంబెగ్గిలి బృందమెల్లఁగొని పాతాళంబుక్రిందం జొరంబడిరి" అని మాల్యవదాదులు పాతాళమేగుటను తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు చెప్పుచు - ''మాల్యవ ద్దనుజేంద్రుండట నిల్వఁగూడకయ సోదర్యాప్త మిత్రంబుగాఁ జనియెన్ లంకకు సిగ్గుతో, నిటులు కంజాతాక్షుచేఁ బెక్కుమార్లనిలో నొచ్చి రసాతలస్థులయి" రని చెప్పిరి. ఇది మూలాతిక్రమణము - స్వేచ్ఛాలాపము. మూలమున - ''అశక్నువంతస్తే విష్ణుం ప్రతియోద్ధుం భయార్దితాః త్యక్త్వాలంకాం గతావస్తుం పాతాళం సహపత్నయః" అని యున్నది. ఇట్లు మూలము చెప్పినను, తిక్కనగారు చెప్పినను, గమనింపక ''పెక్కుమార్లనిలో నొచ్చి'' యనిచెప్పుట విపరీతము.

ఈ యుద్ధము జరిగినతరువాత నగస్త్యుఁడు శ్రీరామునిఁబ్రశంసించుచు ''ఇంద్రున కప్పుడు తమ్ముఁడవై తనయుడవైతిపుడునీవు దశరధపతికిన్" అని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు - "హరిహరియంచు మేమనఁగ నన్యువలెన్ వినసేల؛ నీవె శ్రీహరి విపుడాలకించిన మహత్త్వమునీయది'' ఇత్యాదిగాఁ బొగడిరి. ఇద్దఱు స్తుతిపాఠములు చేసినను భావములు వేఱు. తిక్కనగారి మాటలలో రాముఁడిప్పుడు మానవుడనియు, అప్పుడు దేవుడనియు స్ఫురించును. నిజస్థితి యెట్లున్నను, ఇప్పుడు రాముడు మానవుఁడుగానిచో ఆతనిచే రావణుడు హతుడుకాడని తార్కికసిద్ధాంతము. ఈ భావమునే కావ్యమునందు తిక్కన ప్రతిఫలింపఁజేసెను. కావ్యారంభముచేయుచు - "ముని లోకంబు ప్రశంసచేయ, జనములోన్మోదంబు వొందంగ, దుర్జనతానిగ్రహతత్పరాత్ముఁ డగుచున్, సద్వృత్త సంరక్షణంబున రాగిల్లుచు నేలెరామనృపుఁడు'' అని వాఖ్యానించెను. ఆయన భావమట్టిది. పాపరాజుగారట్లుగాక "హరిహరి యంచు మేమనఁగ నన్యువలెన్ వినసేల? నీవె శ్రీహరి, విపు డాలకించిన మహత్త్వము నీ యది''-ఇత్యాదిగాఁ జెప్పిరి. ఈ మాటలలో శ్రీరాముఁడప్పుడిప్పుడు కూడ దేవుఁడనియే స్ఫురించును. ఈ కథలన్నియు దైవ కథలు

గనే భావింపవలయును. ఒకవేళ జనులందఱు అట్టివారైనట్లు తలంచినను, కావ్య ప్రతి పాదితము మానవానుకార్యము కావలెఁగదా'' ప్రకృత మీనమస్య నింతటితో విరమించుట యుక్తము.

అగస్త్యుఁడు రామునితో ''అధిప! సాలక టంకటులనఁగఁ జనిన నాఁటి వారుఁ, బౌలస్త్యులు నాఁగబరఁగు నేఁటివారు-నమానులు. నిక్క-మరయ బాహు బలమున సాహసదోహలమున'' నని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు- ''అలపౌలస్త్యుల కంటె వీరులగు పూర్వాదిత్యులన్, లంకవారలు ప్రావిం చుట''-ఇత్యాదిగాఁ జెప్పిరి. పౌలస్త్యులే బలవంతులో మాల్యవదాదులే బల వంతులోఁ దూచి చెప్పనేల యని తిక్కనగారు 'సమాను'లని చెప్పిరి. పాప రాజుగారు మాల్యవదాదులే బలవంతులని చెప్పుటకుఁ గారణము గనఁబడదు. మూలమునందు ''సర్వపితే మహావీరా రావణాద్బలవత్తరాః'' అని యున్నది. మూలాను సారియగు పాపరాజు గారట్లు చెప్పవచ్చును. కాని మూలము చూచి నట్లుగాఁ గూడఁ జెప్పకపోవుటేమి? మానదండములేని-ఎక్కువ ప్రయోజనము లేని యీ చర్చ నింతటితో విరమించుట మేలు.

## 10. రావణాదుల జన్మప్రకారము

సుమాలి తన కూతురగు కైకసిని విశ్రవోముని యాశ్రమము జేర్చు టయు, నామెకు రావణాదులు జన్మించుటయు నొక కథ. దీనిని బాపరాజుగారు నలువది పద్యముల తోను, దిక్కనగా రిరువది పద్యముల తోను జెప్పిరి. పాపరాజుగారు-సుమాలి పుత్రికను దీసికొని పోవునపుడు-''స్వర్ణాద్రి తుంగ రథస్థుండయి, పుత్రికైకసి నిజాంకంబెక్కి-రా'' బోయెననిరి. ఉదూఢయౌవన యైన పుత్రికను తొడపై నెక్కించుకొనుట యేకాలముననైన విపరీతముగాఁ దోచును మూలమునఁ గూడ ''కన్యాం దుహితరం గృహ్య వినాపద్మమివ శ్రియం'' అనియున్నది. ''విముక్త పద్మయగు శ్రీచందాన నింపొందు'' నన్న ఉపమానము మాత్రము తీసికొనెను గాని, తక్కినది తన యిష్టము వచ్చినట్లే కూర్చెను. మఱియు ''జవ్వనివైనన్ దినముల్ గ్రహింపబడె నుద్వాహార్హనిన్ గానమిన్'' అని తానే కుమార్తెతోఁ జెప్పుచున్నను మాలి ఆ వయసుమీఱిన కుమార్తెనే తొడపై నెక్కించికొనుట మిగుల విడ్డూరమనియే తోచును. సరియే అట్లు కూతును గొనిపోయి, పితృదర్శనార్థమై పోవు కుబేరుని జూచి-''ఔరా చంద్రునివలె నున్నాడు, ఇట్టి వానిని గనుట యదృష్టము. కైకసిని విశ్రవో

ముని పెండ్లియాడినచో-ఇట్టి పుత్రులు గలుగరా'' యని రక్షోహిత కాంక్షియై సుమాలి కైకసిని జూచి, ఆమెతోఁ గొన్ని మాటలు చెప్పి "మాయమ్మ; సుపుత్రులన్గను శుభాన్వితవై '' అని దీవించిపంపెను. అన్నియు బాగున్నవికాని, 'ఇతనికి భార్యవైనచోఁ గుబేరుని జయించు పుత్రులఁగందు'' వనియు, 'రాక్షసుల్ పొందరె సౌఖ్యము' లనుటయు స్వలాభ ప్రేరితతములుగాఁ గనుపట్టును "నీవలన నన్వయ మొప్పుఁ, బ్రసిద్ధిఁ గాంచునం చేనును నెల్ల బాంధవులు నెన్నుదు" మని చెప్పుటలో పైఁ జెప్పిన స్వలాభ ప్రసక్తి మిక్కిలి గూఢముగా నున్నది.

దీనినే తిక్కనగారిట్లుచెప్పిరి. సుమాలి చింతాక్రాంతుఁడై అల్లునిగురించి విచారించెను. సుమాలియొక్కడే విచారించుట యందున్నది. ''మేదిని కరుగం బాలకయున్నను బోవదు బాలికగాని పోవలయు బరిణయమునకున్'' అని యనుకొనెను. ఇచ్చట భూలోకమునకుఁ బోనిష్టము లేకున్నను బోక తప్పదనుకొనెను. ఇట్లనుకొని కైకసివెంట నిడుకొని కడకు పౌలస్త్యాశ్రమోపాంతమునకుఁ బోయెను. ఇంతవరకుఁ గైకసితో మాట్లాడలేదు. అచ్చటఁగుబేరుని జూచి 'యతనిఁ గన్నతండ్రికిఁ దనకూతునిత్తు' నని నిశ్చయించి కూతుతో నిట్లు చెప్పెను. ఇంతవరకు నతనిలోఁ గూడ స్వలాభ ప్రేరణలేదు. "తగిన వరుండు నీకు వనితా విశ్రవసుండ నీ కనిన పుత్రులచేత మదన్వయంబు రూపగు నిదెచూచి ఘనుదదాత్మజు నుజ్వల వైభవోన్నతున్" అని పుత్రికతోఁ జెప్పెను. పై జెప్పిన వానిలో మదన్వయంబ రూపగు ననునది తప్ప తక్కినవన్నియు యోగ్యములుగా నున్నవి. మదన్వయంబు రూపగు ననునది కూడ అల్లునివలన తన వంశము కూడఁ బ్రసిద్ధికి వచ్చుననియే భావమయినట్లు తోచును. కాని, పాపరాజు గారు చెప్పిన 'ఖౌదపై నెక్కించుకొని' 'ఇతనికి భార్యవైనచోఁ గుబేరుని జయించు పుత్రకులఁగందువు' 'రాక్షసుల్ పొందరెసౌఖ్యములు' ఇత్యాదివచనములు మందునకైన గనఁబడవు. ఇది యిరువురలోని తారతమ్యము. ఆ కైకసి గూడ ''తాను మున్ మనమునం దలపోయు విధంబ తండ్రి సంభావనఁ జెప్పినన్'' విని సంతసిల్లినదట. ''యేఁ బోవుటయుక్తమేని మునిపుంగవునాశ్రమ మెద్ది పోదునే'' యన్నదఁట. సుమాలి సుతను సాగనంపెనఁట! ఇట్లు ప్రయాణమైన తిక్కనగారి కైకసియు, "కమ్మల దాలు చెక్కుల ధగద్ధగలీనఁగ'' బ్రమొక్కి ప్రయాణమైన పాపరాజుగారి కైకసియు మన్నకన్నులకుఁ గనఁబడుచున్నారు. మూలమున ''హితార్థం చింతయా

మాన రాక్షసానాం మహామతిః'' అని యున్నది. ఈ రాక్షసుల మేలుదలంచిన వాఁడు సుమాలియే. ఆతఁ డేరాక్షసుల మేలు దలంచునో చెప్పఁబనిలేదు. ఆతని వెంట నడిచిన పాపరాజుగారు కూడనట్టివాఁడుగా నుండుట సాజముకదా!

పాపరాజుగారిట్లు చెప్పిరి. 'కాంచన పాంచాలిక వలె', కైకసి మున్యాశ్రమమునకుఁబోఁగా, నచ్చట తరువులు 'కాంచన తరువుల తెఱంగుకైకొనిన' వట; 'ఆననాబ్జ సంహూచితలజ్జయై' 'క్షోణి పదాగ్రమునన్ లిఖించుచున్' విశ్రవో మునియెదుట నిలచినదఁట; ఆ ముని సాయమగ్నికార్యానంతర మామెను చూచెను. ఇచ్చట నొకసీస పద్యమున్నది. ''తెలివియౌ చేరలంతేసి కన్నుల దాని-సొగసు నడదాని నక్కన్నెఁ జూచె నతఁడు''-అని. తన్నుఁ జూచుచు నిలుచున్న యా కన్నె 'సొగసునడ లెప్పుడు చూచెనో తెలియదు. ''పీడెవుఁ గావి మోవి' ముని దర్శనమునకుఁ బోవునపుడు తగునో తగదో తెలియదు. చీరకట్టికొని యున్నను దాని 'పెన్దొడ' లెట్లు కనబడెనో తెలియదు. ఎవరికిఁ దెలియకున్నను గవికి మాత్రము తెలియదా? ఆ ముని విస్మయమంది 'ఎవ్వతెవు, నీదు పేరేమి' ఇత్యాదిగా నడుగుట తగునుకదా! ''ఎవ్వరైనఁ బ్రేరేచిరొ; నీవె వేడ్కకుఁ జరించెదొ; కల్గిన మాట కల్గినట్లోచెలి! తెల్పు''మని విశ్రవుఁడడిగినాడు. ఇట్టి సందేహములు మునీశ్వరులకుఁగూడ గలుగుటవింత! ''నే సుమాలియను రక్షస్స్వామి గారాబు కూతురఁ, బుష్పోత్కట చెల్లెలన్, రహివహింతున్ గైకసీ సంజ్ఞచే, గురునిర్దేశమునన్ భవచ్చరణముల్ గొల్వంగ నేవచ్చితిన్'' అని బదులిచ్చినది. బాగుగనే యున్నది. ''పరికింపందగు నా మనో రథము మీ భవ్య ప్రభావంబునన్'' అని యన్నది. ఇట్లనుట బాగుగ లేదనిపించును. 'పుష్పోత్కట చెల్లెల' నని చెప్పుటయు సరిగా నగుపడదు. ఆ మునీశ్వరుఁడు ధ్యాన దృష్టితో సర్వముఁ దెలిసికొని ''సంజకడనన్నుం జేరి మాటాడుటన్ ఖలులౌ రాక్షసు లుద్భవించెదరు నీగర్భమ్మునన్'' అని చెప్పెను. దానికి గైకసిచిన్నవోయి, ''అనఘా యూధవ బ్రహ్మవై మను నీ తేజమునన్ జనించిన సుతుల్ మాంసాశులై దుష్టవర్తనులై సాధువిరోధులై మెలఁగుటర్హంబె'-ఇత్యాదిగాఁ బ్రార్థించినది. 'కాల దోషంబు పెద్దలకేఁగాదు విధాతకైనఁ దగునేతప్పింప' నని చెప్పుచు విశ్రవోముని-నీ పుత్రులయందు మేటియనఁగా దీపించు విద్యాగరిష్ఠులలో శ్రేష్ఠుఁడు బ్రహ్మనిష్ఠుఁడు గనిష్ఠుఁడు అని చెప్పి యా కైకసిని చేకొనెను. పాపరాజుగారి రచన యిది.

ఈ కథను తిక్కనగారిట్లు చెప్పిరి. మునీంద్రుకడకుఁ బోవునపుడే "పోవుటయుక్తమేనిపోయెద'' నని ఆమెచెప్పుట ఉదాత్త లక్షణముగా నున్నది. అట్లుపోయి పౌలస్త్యునిఁజూచి, ''వినయ విలాసభయ వికాసవ్రీడా జనిత వికార సుభగనిజ తనులత వెడఁవ్రాలఁ జతురతన్'' సమస్కరించినదట. నమస్కారముచేయునపుడా యంగ సౌష్ఠవ మెట్లున్నదో వినయవిలాసాది శోభితమైన యాతనులతయే తెలుపు చున్నది. మ్రొక్కి నిలిచి యతని ముందట మేదిని నుంగుటమున నొరయుచు నిలచెను. "క్షోణి పదాగ్రమున" లిఖించుటలో, "మేదినినుంగుటమున నొరయుటలో సౌకుమార్యమర్ధ మగుచునే యున్నదికదా! విశ్రవోముని-" ఎచటనుండిరాక, యెవ్వని సుత, వేమి పనికినిందువచ్చితి'' వనియడుగగాఁ, సైకసి - ఏను సుమాలి కూతురు - మునీశ్వర మిమ్మిటఁ దండ్రి పంపునన్ గానఁగరాక'' అని చెప్పినది. అంతేకాని ఉద్దేశము వ్యక్తం చేయలేదు. అది సాధ్యము కాలేదు. ఉచితమునుగాదు. కాని ఏమి పనికిందు వచ్చితి వన్నప్రశ్నకు బదులీయక ఊర కుండరాదు. కనుకనే- "నునుగాంతి దనర్చెడి మోమువంచుచున్ దానటఁ జెప్పలేమి విదితంబుగ" చెప్పునట్లుచేసినది. చెప్పలేని-చెప్పరాని కోరికను జెప్పుటలో నీచూపు అసమాన అసమాస్త్రముగదా! పులుకుపులుకున నోరగాఁ జూచినదన్నచో ఆభావమునకు దగ్గరగా నున్నట్లు తోఁచును. ఈ భావప్రదర్శన మందఱకెట్లు సాధ్యమగును! ఆచూపు విశ్రవోమునికి కరుణా స్వరూపమై అంకురశ్రీ నినుపాఱినదఁట! ఇది యొకయమోఘమైన ప్రయోగము. అతడు దివ్యబోధమున నంతయుఁ దెలిసికొని యల్లని నగవున మునింగి మధురముగా నిట్లు చెప్పెను. ఇచ్చటఁ గూడ నాతని హృదయమెట్లు కదలాడినదో చెప్పుటకు మాటలుచాలవు. "నాయెడన్ దనయలాభము గోరితి- వియ్యకొంటి" నని చెప్పుటలో భావ పర్యవసానము తెలిసినది. కాని, "అకట; వేళ గ్రూరము, తనూజుఁ గ్రూరులఁ గాంతు" వని ముని చెప్పెను. 'అకట' అను సంతాపోక్తితో ఆభావము చెప్పుటలో నాతని హృదయావేదన వ్యక్తమగును. తరువాత 'గుమారు లట్టి వారగుట న్యాయమా' యని యామెయడుగుటయుఁ, గుమారులలోఁ గనిష్ఠుడుత్తముడగునని యతఁడు చెప్పుటయు జరిగినది. ఇచ్చట నాపుత్రుఁడు 'మత్కులంబును భవదీయవంశమును బూతముచేయు" నని తిక్కనగారు చెప్పఁగాఁ, బాపరాజుగారు ఒకటిన్నర పద్యముతో నా కుమారుని గుణ గణములు చెప్పుచు 'మనునాతని వలన గుల'మని చెప్పిరి. మూలమున ''పశ్చిమో

యస్తపసుతో భవిష్యతి శుభాననే౽ మమవంశాను రూపశ్చ ధర్మాత్మాచ భవిష్యతి" అని యున్నది. ఇవన్నియు నొక యెత్తు. తిక్కనగారి కైకసీ పాత్ర పోషణ యొక యెత్తు.

కైకసికి రావణాదులు పుట్టి పెరిగి పెద్ద వారైనారని యిరువురు కవులు చెప్పిరి. శూర్పణఖను కూడ మఱచిపోక చెప్పిరి. రావణుడు పుట్టినప్పుడువాని భీషణాకారమును, ఆ సమయమున దోచు దుశ్శకునములను ఎక్కువగా వర్ణించి, విశ్రవోముని వచ్చి జాతకర్మాదులు-ఉపనయన విద్యాభ్యాసాదులు నెఱవేర్చె నని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు నామకరణము జరిపించెను గాని తరువాతివి చెప్పలేదు. విశ్రవసువువలన విద్యాభ్యాసము పొందినవారు తరువాత నిట్టి క్రూర కర్ములగుట సంభావ్యము కాదని మానెనేమో తెలియదు. మూల మున గూడ నీ విద్యాభ్యాస ప్రసక్తి లేదు. పాపరాజుగారు మాత్రము "విశ్ర వస్తనూజాతు లుపవీతులై తండ్రివలన నఖిల విద్యా విశేషంబు లెఱింగి" ఇత్యాదిగా వక్కాణించిరి. దీనికి ఎనిమిది పద్యములు గూడ వ్రాసిరి.

ఒకనాఁడు "కైకసీ కాంత స్వభావసిద్ధమగు క్రౌర్యమునన్ దశకంఠుతో ననున్" "కనుఁగొంటే భవదగ్రజుండయిన యక్షస్వామి సౌభాగ్య మాతని చందంబున నీవు నట్టి సిరు లొందంజూడ గాంక్షింతు" నని చెప్పినదని పాప రాజుగారు చెప్పిరి. తిక్కనగారు గూడ "ఇతని మహాసంపద సూచితె, మీ రొక్కనికి పుట్టి, శ్రీ తేజములం దితఁ డిట్లుండగ, నీ వి ట్లతిహీనత నున్నఁ, బురుషుఁడంద్రే నిన్నున్" అని యన్నట్లుగాఁ జెప్పిరి. ఇరువురు సమానము గనె చెప్పినను, పాపరాజుగారి కైకసి "స్వభావసిద్ధమగు క్రౌర్యము"తోఁజెప్పుట యెక్కువగా నున్నది.

రావణుని ప్రతి వాక్యములలో గూడ "ఈ ధనదుని మించెదను, లోకము లేలెద" నని చెప్పినట్లుగా నిర్వురు కవులును జెప్పిరి. కాని "జననీ వాగ్వ్య జనానిలజ్వలితరోషజ్వాలుఁడై" దశాననుఁడు బదులిచ్చెనని పాపరాజుగారు చెప్పుటలో నాతనికి సహజముగా నున్న "రోషజ్వాలను" తల్లి తన మాటలతో విసరి పెల్లుగా నుండునట్లు జేసినదని తెలియుచున్నది. దీనివలననే "స్వభావ సిద్ధమగు క్రౌర్య" మామె కున్నదని తెలియును. ఆ క్రౌర్య మామె మాటలలోఁ గనబడదు. హృదయములో నున్నదనుటకు పాపరాజుగారే సాక్షి. తిక్కన గా రుపాయముతోఁ దప్పించుకొన్నారు.

రావణు తపశ్చర్య నాలు పద్యములతోఁ దిక్కనగారును బందొమ్మిది పద్యములతో బావరాజుగారును జెప్పిరి. ఉద్ధతముగానే చెప్పిరి. తొమ్మిది శిరములు నఱికి హోమము చేసి పదియవ శిరము నఱుకనుండగా బ్రహ్మ ప్రత్యక్షమై వరము వేడుమనెను. రావణుడు వినమ్రుడై "దేవవ్రాతవియచ్చర ప్రకరదైతేయ వ్రజాదిక్రియన్ జావేరూపున నాకులేకునికి యిష్టంబు" "ఏనాబలవిరహితులగు మానవులను సరకుసేయ"నని వేడెను. బ్రహ్మయిచ్చెను. తిక్కనగారిట్లుచెప్పగాఁబాపరాజుగారును-"గరుడాదిత్య...వసురుద్ర శ్రేణిచేఁ బోరులన్ మరణం బొందని మన్కియిమ్ము, గణియింపన్ దక్కుమర్త్యాదులన్" అని వరములు వేడినట్లే వ్రాసిరి. ఇర్వురు సమానముగనే చెప్పిరి. కాని తిక్కనగారు "ప్రీతినొసగె నుజ్వలంబులగు దివ్యశరంబులు గామరూపమున్" అని బ్రహ్మప్రీతుఁడై యిచ్చినట్లుగాఁజెప్పిరి. పాపరాజుగారు చెప్పలేదు. ఈ వరము లేకున్నచో రావణుడు మాయాభిక్షుకత్వాది రూపము లెట్లు తాల్చునో తెలియదు. ఇచ్చటఁ బాపరాజుగారు ప్రమాదపడిరనవలెను. ఇంతేగాక "అతఁడు వహ్నివేల్చిన శిరంబుల్ గ్రమ్మఱన్ మొల్చి చెఁల్వొనయన్ గట్టడచేసి" యనియే చెప్పెను కాని తిక్కనగారు. "క్రమ్మఱందలలుగ్రక్కున గల్గననుగ్రహించి" గామరూపాదులిచ్చెననియు, "వెల్లువ ముంచి పిదప నీ రెల్లను వెనడొంకఁ, గొలననెసఁగెడు చంచ త్పుల్లారవిందములక్రియ నల్లనవదనములు దోచె" ననియుఁ జెప్పిరి. ఈ పద్యము కూర్పును, దాని కుచితమైన సన్నివేశమును, దాని నుపయోగించుకొనుటను తిక్కనగారు నేర్చిరి. పాపరాజు గారు జారవిడిచిరి. మూలమున" అమరత్వమహంవృణే" అని రావణుఁడడుగుటయు "నాస్తి సర్వామరత్వంతే వరమన్యం వృణీష్వమే" అని బ్రహ్మ చెప్పినట్లునున్నది. దీని నిద్దఱుకవులందుకోలేదు. మఱియు "ఛందత స్తవరూపంచ మనసాయదృదీప్సితం భవిష్యతి నసందేహో మద్వరాత్తవ సువ్రత" అని యున్నదానిని "దివ్య శరంబులు గామరూపమున్" అను దానితోఁ దిక్కనగారు జెప్పిరి. కాని పాపరాజుగారు చెప్పలేదు. ఇట్లే విభీషణునకు వరము లిచ్చుటను ఇర్వురు కవులు చెప్పిరి. ఈ చెప్పుటలో వెనుకముందు లెట్లున్నను సరియే గదా! రావణునకు వరప్రదానమట్లున్నది.

కుంభకర్ణునకు వరములిచ్చుటకై బ్రహ్మ పోయెను. దారిలో దేవతలెదురుపడి వాని దుర్మార్గములు సెప్పి "కావున నీతని మోహితుఁగావించుట

జగములెల్లఁ గాచుటసుమ్మీ" అని ప్రార్థించిరని తిక్కనగారు చెప్పిరి. పాప రాజుగారు-"అయ్యసురకళీష్టమీయ దగదయ్య", "గట్టిగాఁ బదమువ్వీఁ బెట్టె నేనియు" "తనువుఁ జూతమన్న" "నందనవనవాసినుల" "ఏవరములేకయే"- ఇత్యాదిగా పద్యములు సెప్పి "మాయా వివశాత్ముఁజేసి వరమం చొకదాని నొసంగినన్ శుభం బావహిలున్ జగంబులకు" అని వ్రాసిరి. గ్రంధము కొంత పెంచి వ్రాసినను పాపరాజుగారును తిక్కనగారు ఇంచుమించుగా నొకటేకోరిరి. బ్రహ్మ సరస్వతీ దేవిని బిలిచి "అసుర మోమునందు వసియించి నను నిద్ర యడుగు" మని చెప్పెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు "భారతీదేవి మొగంబు చూచెఁ దొలిదేవర" యనియు, నామె వనియేమనఁగా, నతఁడు- "కుంభకర్ణు రసనాభాగంబునన్ నిల్చి నే వరమీ వచ్చిన వేళ నయ్యసురతో వ్యర్థోక్తులాడింపు, మే ల్వరముల్ కోరఁగ నీకు"-మని చెప్పగా నామె "యట్లే" యని వెడలిపోయెననియుఁ జెప్పిరి. ఇచ్చటఁ గొంచెము భేదము కనఁబడు చున్నది. "ఆతని ముఖమున నీవే మాటాడు" మని తిక్కనగారును "అతఁడు మాటలాడుచుండఁగా, నవి వ్యర్థాలాపములు చేయుమని పాపరాజుగారును చెప్పి నట్లైనది. వ్యక్తి స్వాతంత్ర్యములో నా భేద మవగంతవ్యము కాగలదు. మఱియు సరస్వతీదేవి యలంకారము చేసికొని వచ్చుట తొమ్మిది పంక్తుల వచనముఁతో బాపరాజుగారు చెప్పిరి. అది యప్రసక్తము గదా.

అల్పావశిష్ట స్వాతంత్ర్యముతోనే కుంభకర్ణుఁడు "షాణ్మాసముల్ తమి నిద్రి పఁగ, నొక్కనాఁ దశనమందన్ జేయవే" యని బ్రహ్మను గోరెను. "అట్లేయగుఁగాక" యని చెప్పి బ్రహ్మ వెడలిపోయెనని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు చెప్పుచు "నిద్ర దయసేయుమనియె సురద్రోహియు"... "పద్మజుఁడిచ్చెన్" అని చెప్పిరి. మూలమున "కుంభకర్ణ స్తుతద్వాక్యం శ్రుత్వా వచనమబ్రవీత్ స్వప్తుం వర్షాణ్యనేకాని దేవదేవమమేప్సితం ఏవమస్త్వితి తం ప్రాహ వేధో హృష్టా దివౌకసః దేవీ సరస్వతీచైవ రాక్షసంతం జహౌపునః" అని యున్నది. మూలమునఁ జెప్పుభావమునే తిక్కనగారును జెప్పిరి. ఈ యిరు వురికి భిన్నముగాఁ బాపరాజుగారు చెప్పినట్లు కనబడును. ఇట్లేల చెప్పిరో తెలియదు. కుంభకర్ణునకు ఆఱునెలలు నిద్ర ఒక దినము ఆహారమని జన శ్రుతి. రామాయణము కూడ నా మాటనే చెప్పుచున్నది. దానిని బట్టి యిట్లు వ్రాసెననవచ్చును. కాని రామాయణకాలమున కంటె నెంతో ముందు జరిగినదీ

కథ. కావున నట్లు సెప్పుట తగదని యొక యాక్షేపము. ఈ యాక్షేపమును గమనింపక మూలము ననుసరింపక జనశ్రుతిని బట్టి పాపరాజుగారీ తీర్మానముఁ జేసిరని తోచును.

కనుకనే తిక్కనగారాలోచించి మరల నిట్లు సెప్పిరి. "దీనికిన్ గారణ మా సురలవలని కపటమునుమ్మీ" యని కుంభకర్ణుఁడు విచారించుచుండఁగా, ఖంక్తి కంఠుఁడు సేరన్ జనుదెంచి తాను తమ్ముఁడు ననునయ మొనరించి సముచితాలాపములన్ "బ్రహ్మను గొనియాడఁగా, నతఁడు "ఆఱవ నెలకును నొకదినమందు లేచుఁ, గుడుపును గమనం బునుగల్గు నాఁడు పగతుర కనిలో నన్ విజయుడీతఁ" డని చెప్పెనని 'సమర్థించిరి. ఇంతట శక్తి చాలనప్పుడు ముందున్న మూలము ననుసరించుట మంచిది. కాదేని తిక్కనగారివలె సమర్థించుట మంచిది. రెండునుగాని యప్పుడే పాపరాజుగారి పాటు దప్పదు.

## 11. రావణాదుల లంకా ప్రవేశ వివాహాదులు

రావణుఁడు తమ్ములతో శ్లేష్మాతకవనమున కేగి "తల్లికిన్ బ్రదిక్షిణ మధియైన తండ్రికిని భక్తిఁ బ్రణామము లాచరించి" అని పాపరాజు గారును "కైకసి దీనికిఁ గడుసంతసంబంది" అని తిక్కనగారును చెప్పిరి. తల్లి దండ్రులకు నమస్కారము చేయక తల్లికి మాత్రమే చేసి సంతసించినట్లు చెప్పుటేమి యన్న దొకప్రశ్న. మూలమున నీ సందర్భము లేదు. కనుక విచారణీయమైనది. పులస్త్యుడు, విశ్రవసుడు-ఇట్టి మహామునులు తమ్ము కోరిన కన్యలకు పుత్రసంతతి ప్రసాదించిన మీఁద నా బిడ్డలఁ బెంచు బాధ్యత తల్లుల కప్పగించి తాము మరల తపస్సునకుఁ బోవుట ప్రసిద్ధము. ఉపనయనాదులామునులే చేయవచ్చును, చేయక పోవచ్చును. ఇట్లున్నదానిలో "ఉపనీతులయి తండ్రివలన విద్యావిశేషము లెఱింగి" యని పాపరాజుగారు చెప్పిరి. తిక్కన గారు చెప్ప లేదు. మూలమున లేదుగదా! ఈ చోటఁ దండ్రిచే విద్యా విశేషము లెఱింగిన వారు-"భూధరములెత్తి పుట్టచెండులవలె నాడుటేమి-విమానముఁ(గూల్చుటేమి" ఇత్యాదిపనులెట్లు చేయుదురో! తల్లిదండ్రులు చూచుచు నెట్లూరకుందురో తెలియదు. కనుకనే విశ్రవోముని తపస్సుకు పోయెననియుఁ దల్లికడ వారు పెరిగిరనియుఁ జెప్పుట తగుననిపించును. ఒకవేళ నిచ్చటనే తండ్రియున్నట్లు తలచినచోఁ గుమారులిట్లు తపోవీర్యవంతులై వచ్చి నమస్కరించినప్పుడొక్క మాట

యైనఁ బ్రశంసించినట్లు అభినందించినట్లు పలుకకపోవుట మిగులనాశ్చర్యకరము. కాఁగాఁ దండ్రి తపస్సునకుఁ బోవుటయుఁ, దల్లికి నమస్కరింపఁగా నామె సంతసించుటయు జరిగినది. తిక్కనగారీ పద్ధతినే యవలంబించిరి. పాపరాజుగారాచారము నిర్వహించుటకుఁ దండ్రికి నమస్కారముఁ జేసిరని చెప్పి ఇంతట కథఁ బెంచిరి. శ్లేష్మాతకవన-మప్పటి రావణాదుల నివాసమేగాని, విశ్రవోముని తపస్సు చేయు పుణ్యాశ్రమము కాదనియైన గ్రహింపకపోవుట విచారకరము. ఈ యిద్దరిలోఁదారతమ్యమిట్లున్నదనుట ఫలితాంశము.

సుమాలి రావణుకడకుఁబోయి, ఆరు పద్యములతో నాతనిఁబొగడి, యాఱుపద్యములతోఁ దన కష్టములు చెప్పికొని "లంకాపురాధిపత్యమున నీవు వెలయుదు" వనిచెప్పి, లంకను స్వాధీనముచేసికొమ్మనెను. దానికి సమ్మతింపక రావణుఁడు "మఱి లేవా యిండ్లు", "తద్వశమౌ నిల్లెటు లాక్రమింతు" నని ప్రత్యాఖ్యానము చేసెను. మరలఁ బ్రహస్తుఁడు సరిదిచెప్పఁగా, ధ్యానించి "మీ భాషితంబే కర్తవ్య" మని యొప్పుకొని కుబేరునియొద్దకుఁ బ్రహస్తునిబంపెను. ఇరువదిరెండు పద్యములతో ముగిసిన యీభాగములో ప్రతినాయకుని పరాక్రమము మొదట దెబ్బతిన్నను, తరువాతఁ బ్రహస్తునిమాటలతో దారికి వచ్చినది. రావణుఁడు మంచివాడేయైనను పరులమాటలకు లోఁబడువాడని తెలియును

తిక్కనగారు చెప్పుచుఁ "బ్రీతుండయ్యును దశముఖుఁడాతని చిత్తంబు చందమారయు బుద్ధిన్" "ధనదుఁడగ్రజుండు, తదధీనమగులంక యాసపడుట యుచితమగునె" అని పల్కెనట! తరువాతఁ బ్రహస్తుఁడు సుమాలిచెప్పఁగా నంగీకరించెనట. ఇట్లుచెప్పుటలోఁ బ్రతినాయకుని ప్రాభవము వ్యక్తమైనది. పరోపదేశము తనకిష్టమైనను ఒక యడ్డుమాటవేసి వారి యనుమతిఁగూడ కైకొనుట రాజనీతిలో నొకమార్గము. దానినిఁ దిక్కనగారిందు ప్రవేశపెట్టిరి. పాపరాజుగారు త్రోసివేసిరి. కాని "తగని కుమారుఁడైన మమతారహిత స్థితి యొప్పఁ దండ్రికిన్" అని కమ్మని పద్యము వ్రాసిరి.

తిక్కనగారిట్లేచెప్పుచు, కుబేరుడు విశ్రవోమునితోఁజెప్పు వాక్యములలో "ఏమి పురుషార్థములు చేయునెడల నెపుడు మీయనుజ్ఞయే నాకునహాయమగుట నరసి మీదివ్యచిత్తాన నవధరించి చేయఁగలపని యెయ్యది" అని యడుగుటయు, విశ్రవసుఁడాలోచించి చెప్పుటలో "మున్నికార్యము వాఁడునన్నడిగినన్ మో

మీక కోపించి 'మీ యన్నం బుణ్యచరిత్రు నేన మును లంకాధీశ్వరుం జేసితిన్' "మసల నందఱం జేరికిఁజేకొనందు, సమ్యగ్గురుభక్తి ధర్మరుచిమాన్య వివేకము లెంతదవ్వు! నీకెగ్గొనరింపకుండఁ బురమిచ్చి తొలంగుము" అని చెప్పుటయు మిగుల బాగున్నవి. కుబేరుని మాటలలో "ఏమి పురుషార్థములు" అన్న పద్యమువంటిది పాపరాజుగారు చెప్పలేదు. విశ్రవసు వాక్యములన్నియు ఆత్మీయతా భావస్ఫోరములు. ఇట్టివి తిక్కనగారే చెప్పుదురు. పావరాజుగారి రచన అట్టి ఆత్మీయతలేని ప్రబంధ ప్రసక్తి. ఇట్లు లంకను ప్రవేశించిన తరువాత రావణుఁడు "దర్పోన్ముఖయౌవన కందర్పాస్త్రసము జ్వాలాంగిఁ దనచెలియలి" ని - ''కాలకేయ వంశకరుఁడు విద్యుజ్జిహ్వుఁ'' డనువానికిచ్చి పెండ్లి చేసెనని తిక్కనగారును, "జవ్వని నా శూర్పణఖాఖ్యఁ గన్య" ను - ''విద్యుజ్జిహ్వుడన్ గాలకేయున'' కిచ్చి పెండ్లిచేసెనని పాపరాజుగారును చెప్పిరి చెల్లెలే యౌవనవతియైనచో, నన్నగారంతకంటె యౌవనవిభ్రాజితులని చెప్పనవసరములేదుగదా!

ఒకనాఁడు రావణుఁడు వేఁటకుఁబోయి త్రోవలో మండోదరీయుతుఁడైన మయునిగని, తత్సమాచారమంతయు విని, యామెను బెండ్లాడుట నిర్వురుఁ జెప్పిరి. పాపరాజుగారు - మండోదరిని జూచినవెంటనే అయిదాఱుపద్యములతో నామెనువర్ణించి, అతని స్త్రీలౌల్యము వ్యక్తముచేసెను. "ఈతనిన్ గెలిచియైనన్ దీనిఁబెండ్లాడెదన్'' అని ఆతని సాహసమునుగూడ వెల్లడించెను. దీనికి మూలములేదు. తిక్కనగారును జెప్పలేదు. తిక్కనగారుగూడఁ గొంతకథఁ జెప్పిరి దానిలో "క్రూరుఁడగుట యెఱుంగక కోరియిచ్చెఁ గన్యనప్పుడు యుదకప్రదాన సహితముగ" నని చెప్పిరి. ఇచ్చటఁ 'గ్రూరుఁడగుట యెఱుంగక' అని వాచ్యముగాఁ జెప్పినదానిని పాపరాజుగారు వాని గుణములతో వ్యక్తీకరించిరి.

పాపరాజుగారు - 'ఒక శక్తినిచ్చుచు' ఇది పరమ ఘోరసాధనమెదిరించిన నెట్టిపగతునేనిఁ జెఱుచు" నని. తిక్కనగారు "ఒక యోధముఖ్యునని నంతకునైనన్ గీటడంచు దాని నమోఘ ప్రకృతియగు శక్తినిచ్చె" ననిరి. ఇచ్చట "నొక యోధముఖ్యునని" యని దానికొక విశేషణము జేర్చిచెప్పుట విశేషము. మూలమున "అమోఘాంతస్య శక్తించ ప్రదదౌ పరమాద్భుతాం పరేణ తపసాలబ్ధాం'' అనియున్నది. 'వరేణ తపసాలబ్ధాం' అనువానికి 'ఇత

రుడు తపస్సుచేసి పొందిన' దని యర్థముచేసికొన్నచో తిక్కనగారుచెప్పిన "ఒక యోధముఖ్యునసి"యు ఇదియు సరిపోవును. కాని అప్పటికి నా యోధ ముఖ్యుఁ డెవ్వడో తెలియవలసియున్నది. ఐనను 'పరమ ఘోరసాధన' మని పాపరాజుగారు చెప్పినదానికంటె విశేషముగఁ దిక్కనగారు చెప్పిరని తెలియు చున్నది.

"మాణిక్యోజ్జ్వల కంకణస్ఫురితమౌ మండోదరీకన్యకా పాణింబట్టిన, సాత్త్వికోదయము జూపట్టెం దశగ్రీవుపై" ననియు, 'అప్పయోజపత్రేక్షణ పెండ్లియై' యనియు రావణ వివాహాదులను జెప్పెను. తిక్కనగారు - "వీటి కరిగి యుత్సవముతో వివాహమయ్యె నద్దానవవల్లభుండు" అనిచెప్పి వివాహము సంప్రదాయబద్ధముగ బంధుయుక్తముగ జరిగెనని చెప్పిరి. వివాహాదులెట్లు జరు గుటమంచిదో మనకుతెలియవలయును. కన్యకను జూచినమాత్రమే పుట్టు స్త్రీ లౌల్యము, ఈతని గెలిచియైన పెండ్లియాడెదనను సాహసము, తనపేరు ప్రతి షలను జెప్పుకొను ఆత్మశ్లాఘ, అమోఘశక్తినిచ్చుటలో అరణ్యముననే వివాహ మాడుటలోగల అత్యుత్సుకత అన్నియుఁ దేటపడునట్లుగాఁ బాపరాజుగారు ప్రస్తావించిరి. తిక్కనగారినాఁటికివన్నియు నింతగా ముదురలేదని తెలియును.

కుంభకర్ణునకు నిద్రవచ్చెను. రావణు 'నొక మందిరము గోరె' నని తిక్కనగారును, ఆ నిద్రవచ్చుటయేగాక 'జాగ్రదవరోధ' మొనర్చెనని పాప రాజుగారును జెప్పిరి. "కైలాసమువోలెఁ బ్రాంశు ధవళం "బగు మందిరమిచ్చె నని తిక్కనగారును, "చికిలిప్రాగెంపు" "ఆమడనరవెడలుపు మూడామడ నిడివియు" నిర్ణయించి యిల్లు గట్టించెనని పాపరాజుగారును జెప్పిరి. అందల్ప మనల్పముగ నొనర్చిన నిద్రం బొంది "పెక్కేండ్లు నిందితదురితాబ్ధిలో మునిగి యుండె" నని తిక్కనగారును - "కిన్నరాదులఁ గిట్టి గెల్చు నాందోళంబు మించ బల్మఱుఁ గల్వరించుకొనుచు" "కాలను గ్రమించెనకుంభకర్ణుఁ" దని పాపరాజుగారును చెప్పిరి. కథామాత్రముగ నున్నట్లు తిక్కనగారు చెప్పగా, దానికై శిల్పులరావించి, నిడివి పొడవులు నిర్ణయించి, చికిలి ప్రాగెంపు టిట్టికల గోడలు మొదలుగా పెట్టించి "అల్పమనల్పము"గాదయారు చేయుట పాపరాజుగారి రచన. మూలమున తత్రనిద్రాం సమావిష్టః కుంభకర్ణోనిశాచ రః బహూన్యబ్ద సహస్రాణి శయానో నప్రబుధ్యతే" అని యున్నదానిని గూడ గమనింపలేదు. రావణునికిఁ దగినట్లే తన కవిత్వము నడిపించెను.

## కుబేర యుద్ధము

కుబేరుఁడు రావణునికి నీతిఁగఱపుటకై దూతనంపుటయు, నాతనివధించి రావణుడు కుబేరునిపైకి దండయాత్ర సేయుటయు నొకకథ. దూత ముందు విభీషణుఁ జూచి తర్వాత రావణునిగనుట నిరువురును జెప్పిరి. పాపరాజుగారు "మనహితోక్తులు సగౌరవముగ విననేర్చునే పంక్తివదనుఁడేల యన్న యిప్పనిఁ దలపెట్టి? నైననేమి వచ్చితివి కదర"మ్మని వానిఁ బిలుచుకొని పోయెనని చెప్పిరి తిక్కనగారు "వచ్చిన కార్యమారసియవక్రచరిత్రుఁడు దానవేశ్వరున్ జెచ్చెరఁగానిపించె" నని చెప్పిరి. "రావణుడొకవేళ వినిన వినునేమో యను నూహ తిక్కనగారిదిగాఁ దోచును. పాపరాజుగారు – రావణుఁడు వినడని తెలిసియు దూతను తీసికొనిపోయెను. ఇచ్చటనెవ్వరి యూహసమంజసమో పాఠకులకు దెలియును. "ఇంచుక చేరి మ్రొక్కి" "ముకుళితకరుఁడై" ఒదుగు రావణునితో నిట్లు పలికెనని పాపరాజుగారును, "వినీతవేషుఁడై చొచ్చి, ధరాతలంబురము సోకఁగ నానతుఁడై, యుపాయనం బిచ్చి, కరప్రదర్శితమహిందగ సంకుచితోప విష్టుడై" యని తిక్కనగారునుజెప్పిరి. ఇచ్చట రాజసభా మర్యాద లెఱింగిన మహామంత్రివలెఁ దిక్కనగారు నడిపిరి. పాపరాజుగారి కదిలేదు.

పాపరాజుగారిట్లు చెప్పిరి. "స్వామి పరాకు" అని ప్రారంభించి, "రక్షోధిపా" యన్నంతవరకు నీతి మాటలను, "యసూయామగ్నుఁడౌవాని కాపద చేకూరునవశ్య మట్టియశమున్ ప్రాపించెమీయన్న" యని మొదలు పెట్టి, "శుభంబు మాన్చు చెడుగుందనమేల" యన్నంతవరకు కుబేరుడు పద్ద పాట్లను దూత చెప్పినట్లుగా వ్రాసిరి. మొదటి యాఱు పద్యములలోఁ 'నీతిబోధ' యను పేరుతో రావణుని దూలనాడుటయే గనబడును. చివరి ఎనిమిది పద్యములలోఁ గుబేరునికి బిశంగనయనత్వము వచ్చిన రీతి గనబడును. ఈ రెంటియందు గూడ దూతచెప్పవలసిన మాటలకంటె నెక్కువగనే, నిర్లక్ష్యముగనే మాటాడెను. మఱియు రావణుఁడడుగకుండగనే కుబేరుని పిశంగ నేత్రత్వము చెప్పు టనుచితమనిపించును. దీనితో రావణుఁడు మండిపడినట్లు పాపరాజుగారు వ్రాసిరి.

తిక్కనగారిట్లు చెప్పిరి. "నీతిబోధ"యను పేరుతో "దేవా, దేవర తోడబుట్టువు" అని ప్రారంభించి, "ఇది నాకానతియిచ్చిన పదకము" అన్నంత వరకైదుపద్యములను "అర్థవిభుఁడు" అన్నదిమొదలు" అత్తెఱగెల్లనిట్టిద"

అను పద్యముతో మూడు పద్యములను నడుమ రావణుఁడడుగుటయు దూత చెప్పుటయు రెండు పద్యములుగా నున్నవి. ఈ చెప్పుటయందుగూడ, దూత చెప్పవలసినదిగాఁ దన ప్రభువు మాటలుగా, కాఠిన్యము దోపకుండఁ, "దపోవి భవంబునఁగాదె యంత పెంపు గనుట, యిత్యాది వాక్యములుగానున్నవి. ఈశ్వ రుడుమెచ్చి "సర్వార్థవిధాయకంబయిన యాత్మసఖత్వము" గూడ నిచ్చెనని చెప్పెను.

ఇచ్చటమూలమున, "తత్రదేవో మయాదృష్టస్సహ దేవ్యా మయాప్రభుః సవ్యంచక్షుర్మయా చైవ తత్రదేవ్యాంనిపాతితం కాన్వియంస్యాదితి శుభా నఖల్వ న్యేన హేతునా" అనియు, "దేవ్యాదివ్యప్రభావేన దగ్ధం సవ్యంమమేక్షణం" అనియు"తత్సఖిత్వం మయాసౌమ్య రోచయస్వ ధనేశ్వర" అనియు ఇత్యాది శ్లోకములున్నవి. వానిలో "కాన్వియం స్యాదితిశుభా నఖల్వన్యేనహేతునా" అని స్పష్టముగాఁ జెప్పినట్లున్నది. దీనిని పాపరాజుగారు "దనసవ్యనేత్రమున నీర్ష్యా రోగ మగ్నాత్ముడై" "ఇటుల కుటిలబుద్ధి నీక్షించు యక్షేశ" నని దోషారోపణ చేసినట్లు గనబడును. దేవిప్రభావముచే కుబేరునిదృష్టి భగ్నముకాఁగా," "దేవినే దృష్టిఁగంటివా దృష్టియొకటి" "పిశంగరుచిగాంచు" నని యీశ్వరుడే చెప్పి నట్లును పాపరాజుగారు చెప్పుట యనాలోచిత మనవలెను. తిక్కనగారు ఇట్టి సందేహములు లేకుండఁ జెప్పిరి. "వామపార్శ్వభిగతులగు వారి తేజ మదరి యద్దెసలోచన మతనికపుడు పింగళంబైన, వారే కపింగళుండవనగ బరఁగుము జగముల ననిరిధనదు" నని చెప్పి యెట్టి దోషమంటకుండ జేసిరి. ఇరువురు కవులిట్లు చెప్పగా, రావణుఁడు క్రుద్ధుడై దూతను తలనఱికెను.

రావణుఁడు కుబేరుని మీదికి యుద్ధమునకుఁబోయెను. కుబేరుఁ డాయుద్ధ ములో మూర్ఛనొందఁగా, గెల్పు చాటించుకొని తారాద్రి కరిగెనని కథ నిరు వురు కవులు నడిపిరి. తిక్కనగారు చెప్పుచు "ధనదుఁడు గట్టెదురం ద మ్ముని౯ కనుగొని, సూతుఁ దురగముల నిలుపంగా బనిచి, పులస్త్య తనయు నందను డనుటకు సముచితముగఁ దానిట్లయెన్" అని చెప్పిరి. పాపరాజుగారు "కిన్న రేశ్వరుఁడు వచ్చి చులుకుఁ జూపుల దశకంఠుఁ జూచి పలికె"నని చెప్పిరి. 'పులస్త్య తనయ నందను' డనుటకును 'చులుకుఁ జూపులఁ' జూచుటకును అంతర మెంతయున్నదో చెప్పఁ బనిలేదు.

తిక్కనగారు - "వెడమాటలింకనేటికి రణకౌశలంబుఁ బ్రకటింపు" మనఁగా, "దనుజేంద్రుఁడు ధనదు నస్త్రతతిఁగప్పె"నని చెప్పిరి. పాపరాజు గారు "అని తమదౌరదూతెడు ధనదుని మారీచ ప్రహస్త ధూమ్రాక్షశుకా ద్యనిమిష రిపుమంత్రులు మార్కొని" రని చెప్పిరి. తమ నాయకునితో నెదుటివాఁడు మాట్లాడునప్పుడు, అవి నీతిబోధకములైనపుడు, తమ నాయకుఁ డేమి బదులిచ్చునోయని యైనఁ జూడక పరాక్రమించుట అశిక్షిత దుర్వృత్త సంప్రదాయమనక తప్పదు.

తిక్కనగారు "సురవైరి గినిసియొక్కట నిరువదిగదలెత్తికొని, ధనే శ్వరునురమున్ శిరమును బదులున్ గరములు చరణంబులుగదియ మోదె"నని చెప్పిరి. పాపరాజుగారు-"ఒకసారి మేఘమై" 'ఒకసారి సింహమై"-ఇట్లు మాయాయుద్ధమున భ్రమింపఁ జేసి రావణుఁడు-"నిష్ఠురగదన్ దలమోదినఁ గ్రొత్త నెత్తురుల్ఁ జొటజొటఁగా"-కుబేరుఁడు మూర్ఛవోయెనని చెప్పిరి. రావణుఁ డెఱిఁగిన మాయలు గుబేరుఁడెరుగక పోవుటేమో! ఇరువది చేతులతో నొక్క గదనెట్లు పట్టుకొనెనో, ఆ గద వ్రేటునకే కుబేరుఁ డెట్లు మూర్ఛ పోయెనో అంతయు 'గారడీ విద్య'గా నగుపడును.

పాపరాజుగారు చెప్పిన-"యక్షుల్ భయంబున వృక్షంబులు ప్రాకియున్ గిరి బిలంబుల్ సొచ్చియున్" అన్న పద్యము తిక్కనగారు చెప్పిన "కాలుకొన్నంతయు" అను పద్యముతో దీటుకాదన్న సత్యదూరముగాదు. పాపరాజుగారు చెప్పిన "శాతకుంభస్తంభ సాహస్రములు గల్గి" అను పర మేష్ఠి రజతపుష్పక వర్ణనమంతయుఁ దిక్కనగారు చెప్పిన, "అసురపతి గెల్పుగైకొని యలకఁజొచ్చి యొందు సేయంగనొల్లక యుచితపరుఁడ పోలెఁ దన ప్రజవారించి" యన్న పద్యముతో సరితూగఁ జాలదు. ఈ విధముగఁ గుబేరుని జైత్రయాత్ర అంతమైనది.

## 12. రావణుడు కైలాసము నెత్తుట

పందొమ్మిది పద్యములతోఁ దిక్కన గారును. ముప్పె తొమ్మిది పద్య ములతోఁ బాపరాజుగారును చెప్పిన కథ యిది. తిక్కనగారిట్లు చెప్పిరి. విమా నము కదలక పోవుటను బరిశీలించు రావణాదులఁ జూచి, నంది-"తొలంగు

డెదగా-నిది యీ శనివాసదేశ''మని హెచ్చరించెను. వారు కదలకపోఁగా "పార్వతీశ్వరు లిందు విహరింతురు, 'పడనడతురు మిమ్ముంగన్న ప్రమథ గణంబుల్'' అని మరల మాటాడెను. రావణుఁ డాతని జూచి నవ్వి, ''అగు, నీ వడువునఁ జెలువంబు గలుగు వారలచేతం జెడదే యీతం"డని పరిహసించెను. నందికిఁ గోపము వచ్చి, యాతనికి శాపమిచ్చి, ''నిన్నుఁబట్టి యిపుడనీలుగఁ దలలు దు న్మాడ నాకు శక్యమగునయైన జగము చేతినిండఁ జచ్చిన వాఁడవు మున్న" అని పలికెను. రావణుఁడు కోపించి'' అయినఁ జూడుమని పర్వతము పెకలింపనుద్యుక్తుఁడయ్యెను.

పాపరాజుగారిట్లే చెప్పుచు, నాఱేడు పద్యములతోఁ గైలాసము వర్ణించి రెండుపద్యములతో విమానము కదలకపోవుటనుజెప్పి, నంది యాక్షేపణము-రావణుధిక్కారణము మూడుపద్యములతోఁ జెప్పెను. తిక్కనగారికంటె నెక్కువగా నీమాటలున్నవి. "వికటుఁడై దీప్తాస్యుఁడై కుబ్జుడై బలధుర్యుండగు నంది" యని, నందినిగూర్చియు, ''శంభుఁడెవండహహా! నను నిల్పెడు నంతవచ్చెనే యిట నిను నీశివున్ నిలువనిచ్చిన-నట్టుల కాదె" యని శివుని గూర్చియు, "వెక్కులుప్రేలనిచ్చినను ప్రేలవె? నీపశుబుద్ధి మాటలన్ దక్కనె" యని, మరల నందినిగూర్చి రావణుఁడన్నమాటలు పాపరాజుగారు వ్రాయవలసి నట్టివిగాఁ దోపవు. ఇందులో, "ఇతి వాక్యాంతరేతస్య కరాః కృష్ణపింగళః వామనోవికటో ముండీనందీ హ్రస్వభుజో బలీ" యన్నమూలమును చూచి నప్పుడు ఆమూలమునకంటెఁ దక్కువగనేచెప్పె ననవలయును. కానీ "నీ పశు బుద్ధి మాటలందక్కనె" యన్నమాట అన్నిటిని మించినది.

తిక్కనగారు ఇట్లు సెప్పిరి. ''అనుచు శైల మూలమునకేగి, చేతులఁ గ్రుచ్చి యమరఁబట్టి కూలద్రోవ నప్పళించి యెత్తె, నల్లాడెనమ్మహానగము ''గిరి రాజ తనయ బిట్టులికి వెసం బొదివి పయిప్రాలి కౌఁగిట గదియించెను" శంక రుండు చిఱుతనగవు కాంతి మోము చెన్నువింత గావింపఁగ నుంగుటమున నల్ల నూడుటయును" "కరములు చాపకట్టు వడఁగా గిరి యెప్పటయట్ల క్రుంగినన్ విరవిరఁ ద్రెళ్ళి నొవ్వడరి విహ్వలుడై దశకంధరుండు" వాపోయెననియుఁ జెప్పిరి. దీనికి వ్యాఖ్యాన మవసరము లేదుగదా.

పాపరాజుగారికథనే చెప్పుచు, వెండికొండనెత్తుట కొకటిన్నర పుట వచ

నమును, పార్వతీ పరిష్వంగమునకు మూడు పద్యములను, శైలమ్ముద్రొక్కుట కు రెండు పద్యములను, ఆక్రోశమున కైదు పద్యములను జెప్పిరి. అంతట నతిశయోక్తులఁ గ్రుమ్మరించిరి. సరియే. "చెలిన్ గవుగింటనెయుంచి యల్లడ య్యెం గఱకంఠుఁ డద్రినతఁ డెత్తఁగ,- గాముకు లెగ్గు నెంతురే" యని యర్థాంతరన్యాసముగూడనుపయోగించెను. శివుఁడు కాముకుఁడైనచోఁ జేసినపని యెగ్గుకాదు. అది యెగ్గైనచో శివుఁడు కాముకఁడుకాదు. ఆ చేసిన పని యెగ్గై నను శివుఁడు కాముకుఁడు గావున దాని నెంచలేదని యర్థము వచ్చును. శివుడుఁ స్వయముగాఁగామారి. సందర్భ నన్నివేశములు కామునికిగాఁ జేసెనందమా అట్టి దేహయు వర్ణింపబడలేదు. పార్వతిగూడ "విభ్రాంతయై శంభునిన్ కౌగి లించె"ననియే చెప్పఁబడినది. ఈ సందర్భములోగా శివుఁడు కాముకుఁడెప్పు డయ్యెనో యెట్లయ్యెనో ఆయర్థాంతరన్యాసమేమో పాపరాజుగారికే తెలియును. 'మెఱుంగుఁ జన్నుగవ కంచుకపున్ముడి పీడగా'' బార్వతియెట్లు కౌఁగిలించెనో ఆమెకే తెలియదు. త్రికముడితాను విచ్చిననే గాని పీడదుగదా! 'శంభుఁడాస నము డిగ్గకమున్,దనవామ పదాంగుష్ఠంబున నదిమె దశాస్యు హస్తములు క్రిందు పడన్" అని చెప్పిరి. ఆసనము దిగకుండ తాను గదలకుండ, రావణుని హస్తము లూడిరాకుండ, యా నర్కనునెట్లు చేసెనో యా శంభునకే తెలియును. పాపరాజుగారి రచన యిట్లు సాగినది.

తిక్కనగారిట్లు చెప్పిరి. రావణుడు హస్తము లిరికించికొని చాలకాలము వాపోఁవగా, శంభుఁడు- తా నెఱుంగని యట్టులు తడవుగాఁగ నిల్పి" "బాహులు తిగిచికొనగఁనిచ్చి" "రావణుఁడను నామమునఁ బరగు త్రిజగములన్" అని చెప్పి "పుష్పక మర్థినెక్కి, మెటఁబోయెదొపొమ్ము" అని పీడుకొల్పెనని చెప్పిరి. పాపరాజుగారు చెప్పుచు,- "వేదవిద్యా పాండిత్యము సర్వశాస్త్ర కుశలత్వంబున్ మహా సాహితీ నైపుణ్యంబు" కను పడ స్తోత్రముచేసి, మఱియు నొక 'రగడ' తోఁ బొగడఁగా ఈశ్వరుఁడు 'రావణుఁడనుపే' రిచ్చి సంతోషము దెల్పెను. అదే సమయమని రావణుడు 'కొఱంతలేని యాయుస్సును చంద్రహాసమని' మ్మనెను శివుఁడు "సీతిఁజేకొనక దుశ్శీలుండవై మమ్మనా దృతి నొంపెంచితివేని మావరము మమ్మే చేరుఁబొ"మ్మని చెప్పెననిరి. పాప రాజుగారి విన్యాసమిది. తిక్కనగారి రచన యట్టిది.

## 13: వేదవతీ వృత్తాంతము-

వేదవతి తపము చేయుచుండఁగా రావణుఁడుపోయి యామెను బలాత్కరించెను. ఆమె తన తపోగ్నిలో భస్మమయ్యెను ఈ కథ నిరువురు కవులు చెప్పిరి. తిక్కనగారిట్లు చెప్పిరి. తపము చేయుచున్న వేదవతినిజూచి రావణుఁడు-దాని 'హృద్యాకారమున్ యౌవనోద్యమమును' జూచి కామాయత్తుఁడై-"ఎవ్వని తనయవు, నీపతిఁ యెవ్వఁడు, పేరేమి" ఇత్యాదిగా ప్రశ్నించెను. ఆ మాటలు వినీవినని యట్లామె అతిథిసత్కారముచేసి, మఱియు రావణుఁడడుగఁగా తన చరిత్రయంతయుఁ జెప్పి "అది మొదలుగాగ....నిటుండుదు" నని చెప్పెను. దీనినే పాపరాజుగారు చెప్పుచు 'ఘన మండలము' 'చూచియూచెల్వ' 'నీకులం బెయ్యది' 'నీబిగి గుబ్బచన్నులకు' 'అణుమధ్య నీమధ్య' మిత్యాది పద్యములతో వర్ణించి చెవులకుఁ బండువు చేయుమని రావణుడడిగెను. ఆమెయు నాతని పలుకులకెడసేసి ఆతిథ్యమిచ్చెను. ఇచ్చట తన సౌందర్యాదికము వర్ణించి, 'నీ బిగిగబ్బి చన్నులకు' ఇత్యాదిగా పలుకు రావణునిస్వభావము గుర్తించియో గుర్తింపకయో ఆతిథ్య మిచ్చుటలో పాపరాజుగారి వేదవతి ప్రమాదపడినట్లు కనబడును.

తిక్కనగారు చెప్పుచు "కాంతి దొలగ" 'లలనా విష్ణదనంగనెవ్వరు' ఇత్యాదిగా రావణుఁడడుగఁగా, నా మాటలు విననొల్లక చెవులుమూసికొని "తపములకెల్లఁ దానఫలదాత విష్ణు వమాననీయుఁడే" యని ఆమె బదులు చెప్పెను. రావణుఁడు మరుబారి కోర్వలేక "నాదువక్షమన్ వఱలు సరోవరంబున నవారణ గేళి యొనర్చు కోమలీ" యని యడిగెను. ఆమె వైపే చూచుచుండెను. ఆమె కోపగించి, అతిథ్యమిచ్చుటయు సంభాషణ చేయుటయు నుగ్గడించి "మతి లేదు, నీకుఁ జొప్పడు నతివలలో నన్నుఁ దలఁప నగునె దురాత్మా" యని కలుషించి పలికి, తానచ్చట నుండి పోఁబోయెనని వెల్లడించిరి. ఇట్లు చెప్పుటలో రావణు దుష్టబుద్ధియు, నామె సాధుశీలము, తిక్కనగారి రచనా విశ్వాసము పరాకాష్ఠ నందు కొన్నవి.

పాపరాజు గారిట్లు చెప్పిరి. ఆమె తండ్రి కుశధ్వజుని కథ చెప్పి, శంభుఁడను దైత్యుని కథఁజెప్పి "వెన్నుని గుఱించియిటఁ దపమున్నదాన'నని చెప్పి, కంటివ యిచ్చట వింతలు...తడ వుంటివ యిటఁ జనుము రాక్షసోత్తమ"

యున్నది. రావణుఁడు 'తనకిది దక్కె' నని భావించి, నీ కీ వెట్టియేమి? నీ తండ్రికిఁ బట్టిన వెట్టియే నీకేల? హరి బలవంతుఁడైనచో నా దైత్యునిఁ బోనిచ్చునా? నన్నుఁబొందు" మని మాటలాడెను. ఆమె చెవులు మూసికొని "బ్రహ్మ వంశమునఁ బుట్టియుఁ పాడు బుద్ధి మాన" విత్యాదిగా బుద్ధులు సెప్పి, 'పిల్లికి, దొలఁగు రాచిలుకపగిది' నావలికి పోఁబోయె"నని చెప్పిరి. అన్నియు బాగున్నవి కాని 'పిల్లికిఁ దొలఁగురాచిలుక పగిది' నని చెప్పుట బాగులేదు. ఆమె భయపడినట్లు స్పష్టమైనది. కావుననే రావణుఁడుద్రిక్తుఁడై "బహుబంధ వైఖరుల్ దెలుపక పోవనేల' యని వెంటఁబడి వేణికపట్టి యీడ్చినాడు.

ఇచ్చట వేదవతిలో సామాన్య స్త్రీ సహజమైన భీతి యున్నదిగాని, తపోనిష్ఠా గరిష్ఠమైన ధృతిలేదు. తిక్కనగారి వేదవతికాధృతి యున్నది కావున రావణుఁడు తాకినంతవరకు వేనలి తెగునట్టు లొకవ్రేల వ్రేయగాఁ "నదికత్తి విధంబునఁ దాకి కత్తిరించిన క్రియఁద్రెంచె." చుంగులు రావణుచేతిలో నిలిచినవి. అతఁడును "వెఱఁగుపడుచుఁ తపము పేర్మికి నలికి" నిలిచి పోయినాఁడు. ఆమెయు 'రోష మహానలజ్వలన మూర్తి'యైనది. పాపరాజుగారి వేదవతి యట్లుగాక, రావణుఁడు వేణిఁబట్టి యీడ్వఁగా, నామె 'బెత్తిలియెత్తి వ్రేయుడున్' రావణు చేతికిఁ దున్క చిక్కినది. 'ఇది దీని తపః ప్రభావ' మని చలవడి యుండె'' నఁట! 'అలవడి' యుండుటకు, 'అలికి' యుండుటకుఁ గల భేదము స్పష్టమేగదా!

అగ్నిలోఁ బడచు తిక్కనగారి వేదవతి "బన్నము లిట్లు నీవు పఱుపంబడి మేను దొరంగుచుండి" యనఁగాఁ, పాపరాజుగారి వేదవతి "ఓరీ! నీ విపుడంటు కొన్నమెయినే నొల్లన్'' అని యన్నది. అనఁగా రావణుఁడు శరీరమును గూడ ముట్టు కొన్నట్టు స్పష్టమేగదా! "దశాననునే పడఁగన్ విష్ణునాత్మ నిడి సొదఁజొచ్చెన్'' అని తిక్కనగారును, "దశాస్యు పుత్రమి త్రానుజ యుక్తిఁ ద్రుంపనెప మయ్యెదఁ గాకని వహ్నిఁ జొచ్చినన్'' అని పాపరాజుగారును చివరిమాట చెప్పిరి. ఈ కథలో రావణుఁ 'డెవ్వనితనయ' వని యడుగునప్పుడే, ఆతని మాటలు వినీ విననియట్టు లాతిథ్య మిచ్చుట మొదలుకొని ప్రతియంతరమున జాగరూకత ప్రదర్శించి, చివరకగ్నిలోఁ బ్రవేశించెనన్నాఁరు తిక్కనగారు. రావణుడు కామాయత్తుడై "నీ బిగి గుబ్బ చన్నులకు" ఇత్యాదిగా బలికినను ద్రోసిపుచ్చి ఆతిథ్య మిప్పించి, 'పిల్లికిఁ దొలఁగు రాచిలుక పగిది''

భయముతోఁ బ్రక్కకుఁ దొలగించి, రావణుఁ 'దలవడి' చూచుచుండగా నోర్పు వహించి చివర "ఓరీ! నీ విపుడంటు కొన్న మెయినేనొల్లన్" అని పలుకుచు వేదవతిచే నగ్ని ప్రవేశము చేయించినవారు పాపరాజుగారు. పైరెంటిలోనేవేవి యుచితానుచితాను బంధములో తెలిసికొనుట పాఠకుల పని.

అగస్త్యుఁడీ కథ చెప్పగావిని శ్రీరాముడు "విస్మయము నార్తియుఁ గోపముఁ బ్రీతియున్ బెనంగొన 'దపమిట్టిదిన్ గలదె? కోమలి తొల్లియు నన్నె కోరనే" ఇత్యాదిగాఁ దలచెనని తిక్కనగారు చెప్పిరి పాపరాజుగారు- "తన పద్మ వాసినీత్వముఁ జూపునహి" "ప్రేమ శ్రీహరినగు నిన్నె పెండ్లియాడె" "ఇక్ష్వాకు కులము ఖ్యాతి వహియింప మానవాకార మూని నట్టినిన్నాశ్రయింతు" "సాకేతనగర రాజము వైకుంఠము నీవెహరివి"-ఇత్యాదిగాఁ బొగడిరి. రాముని దేవునిఁగాఁ బొగడుట పాపరాజుగారి స్వభావము. తిక్కన్నగారిలో నొక విశేష మున్నది.

వేదవతికథ కృత యుగమునాఁటిది. అప్పుడీ రావణుఁడే స్త్రీలఁ జెఱ పట్టు వాఁడుగానే యున్నాఁడు ఆ రావణుని శ్రీరాముఁడు వధించెను. అనగా రామునికంటె రావణుఁ డొక యుగము పెద్దవాడని తెలిసెను. ఇంత పెద్దవాడై యింత చదివిన వాఁడై యా వయసున సీతనెత్తి కొనిపోవుట విస్మయకరము కనుకనే రాముఁడు విస్మయమంది "దనుజుఁడునాడు నియ్యనుచితం బొన రించెనె" యని యాశ్చర్యము ప్రకటించెను. పాపరాజు రాముని దేవునిగా భావించు వాఁడౌటఁనట్లేచిత్రించెను. ఇంతేగాక రావణుని దుశ్చరితములు కూడ వేదవతి కథకు ముందు నాల్గు సీస పద్యములలో వెల్లడించెను. ఆయన హృద యము నీయన చిత్తము సరితూఁచఁ గలవారము మనమేగదా!

## 14. రావణుని దిగ్విజయములు

రావణుని ద్విగ్‌జయములఁ జెప్పుచుఁ దిక్కనగారు మరుత్తుఁడు యజ్ఞము చేయుచుండగా నాతనిని యుద్ధమునకు, బిలిచెననియు, ఆతఁడు 'తగవుగాద' ని శాంతము వహింపగా, నాతఁ డోడి పోయెనని కేకలు వెట్టి యజ్ఞోపకరణములు చీకాకు చేసి పోయెనని తిక్కన్నగారొక సీసపద్యముతోఁ జెప్పిరి. పాపరాజుగా రా కథనే చెప్పుచు మరుత్తుఁడు 'నీ కులగోత్రాదికముఁ జెప్పినచో యుద్ధము చేయుదు' ననఁగా రావణుడు కుబేర విజయసూచికముఁ జెప్పెననియు, "అవుర! మఱేమి నీ మహిమ! యన్నను గెల్చితి వన్నమాట" యని పరిహసించి మరుత్తుడు

"శరచాపంబులు పూని, వజ్ర కవచ స్ఫారప్రభల్ భూనభోంతరముల్ నిండ" యుద్ధమునకుఁ బోయెననియు, నింతలో బృహస్పతి తమ్ముఁడు సంవర్తుడడ్డము వచ్చి దీక్షవహించి శత్రుపైఁ నలుగుట న్యాయమే, యిది మహాక్రతు, వించుక విఘ్నమైనచోఁ గులమునశించు' ననిచెప్పఁగా మరలిపోయెననియుఁ జెప్పిరి. మొదటనే యాలోచించి యుద్ధమునకుఁ బోకుండుట యొకటి. పోయిన మీద జయమోపరాజయమో తేల్చుకొనుట యుత్తమము. రెండును జరుపని యవిమృశ్యకారిగా మరుత్తుని దీర్చుట యిందు గనబడును.

మఱియు, "యజ్ఞభాగంబులకు వచ్చి హరి కృతాంత వరుణ ధనదులు-బర్హియు వాయసంబు హంసయును గృకలాసంబునై భయమున, నడఁగి యుండిన, నెఱుఁగక యసురపోయె" నని తిక్కనగారు చెప్పగాఁ, బాపరాజు గారు మయూరాదులకు సహజములైన గుణములనే యింద్రాదులు వరములుగా నిచ్చిరనెను. తిక్కన పాపరాజుగారి తీరులిట్టులున్నవని చెప్పుటే నా యుద్దేశము. వాని బాగోగులు నిర్ణయించుట పాఠకుల పని.

తరువాత సురథుఁడు, పురూరవుఁడు, దుష్యంతుఁడు, గాధిరాజు మున్నగువా రోడితిమని చెప్పిరి. అనరణ్యుడు మాత్రము యుద్ధముచేసి చచ్చెను. తిక్కనగారు, "నాకులమునన్ దివ్యావతారుం డొకం డనపాయుం డుదయంబు నేసి'' 'నీ శిరో దళకముం దున్మాడు వాఁ'డని చెప్పెను. రావణుఁడు నవ్వుచు, అగునగు, నీయందు బొంకు గలుగునెట్లు? పోలుఁబోలుఁ బిదపఁ జూచికొందము-మిదినీవుకొమ్మని పరిఘునతని శిరము పగులనేసె"ననిచెప్పిరి. దీనినే పాపరాజు గారు చెప్పుచు, "కఱకుటఱచేతఁ దన మస్తకంబు వ్రేయ వాయుహతసాలలీల భూవరుఁడుకూలె"ననియు, రావణుఁడు- "నీసిగ్గిటుచేసె, నోటమి వచించిన నీ దురవస్థ వచ్చునే"యని దూఱెననియు, ఆ రాజుకన్ను విచ్చి, "నినువధియించు నొక్క మహనీయ చరిత్రుఁడు మత్కులంబునన్ జననమునంది "యనిపల్కఁగా దేవతలు పూలవాన కురియించిరనియు, దానిని సహింపలేక రావణుడు-"బల్ గదగొని మస్తకంబు వగులన్ వడినొంచి జయంబుగాంచె ననియుఁ జెప్పిరి. అఱ చేతి వ్రేటుతోనేఁగూలిన వానిని గదయెత్తి మొత్తుట విపరీతము. దేవతలు మెచ్చుకొన్నచో వారిని గొట్టవలెఁగాని చచ్చిపోవు వానినిఁజావఁగొట్టుట మిక్కిలి విపరీతము. మూలమునఁగూడ "రామోదాశరథిర్నామ యస్తేప్రాణాన్‌హనిష్యతి"

"స్వర్గతేచ నృపేతస్మిన్ రాక్షసస్సోఽవసర్పత" అనియేయున్నది మూలాతి క్రమణముచేసియైన చచ్చినవానినిఁ జంపుట నేమనవలెను?

పైవిధముగా యమలోక దండయాత్ర, పాతాళలోక యుద్ధము, పద్మ నగరంబునకు బోవుట యిత్యాదిగా దిగ్జయయాత్రసాగినది. తిక్కనగారుచెప్ప లేదు. కార్తవీర్యునితో యుద్ధము, వాలితోఘర్షణము నిరువురుచెప్పిరి. అవి తరు వాత జెప్పబడును. ప్రకృతము దిగ్విజయయాత్రలోఁ జెఱపట్టబడిన స్త్రీలయార్త నాదములగూర్చియు రావణునివిలాసములగూర్చియు నించుక ముచ్చటింతును.

మూలమున లేక, తిక్కనగారు చెప్పక, పాపరాజుగారు మాత్రమే చెప్పిన వినోదములలో నిది యొకటి. రావణుఁడు ప్రహస్తాదులతో-"ఎల ప్రాయంబును జెల్వమున్ జతురతల్ హేలావిశేషంబులున్ గల కన్యామణు లెవ్వరొక్కొ: బలిమిన్ గాంక్షానుకూలంబుగాఁ బలుమందిన్ జెఱఁదెత్తు" నని యడిగెను. వారు మోములు విచ్చుకొని-"ముదిమి యెన్నడులేని కొదమప్రా యపుఁ జెల్వునేర్పులు వేల్పు కన్నియల కమరు" ఇత్యాదిగా మనుజకన్యల, నాగకన్యల, గంధర్వ కన్యల యొప్పులుచెప్పి, "మఱియుఁ దక్కిన జాతుల మందయాన లొఱపులు వహించియుందు రొక్కొక్కవగల వీరిలో మెచ్చువచ్చి వారిఁబట్టి తేవలయు"నని విన్నవించిరి. 'అందఱిని దెత్తు'నని రావణుఁడు క్రోలాడెను. ధర్మకర్మాదుల వాసన గూడమూచూడనీ వేడుకకాంద్ర విచిత్ర విన్యాస ములు కూడ నింత పచ్చివిగా నుండవనిపించును. పాపరాజుగారి లాలసత యట్టిది. ఇదియు మంచిదేనన్న మంచిదేగద!

తిక్కనగారు "తట్టికివచ్చి యిట్టట్టు పోనొల్లని లేళ్ళవిధంబున లీల విడిచి"...'వెగడుపడి విన్ననై, కడుఁజిన్నవోయిఁ పుష్పకంబున నున్న యప్పొలఁతులెల్ల'' విలాపములు చేసిరని చెప్పిరి. పావరాజుగారు-"సీమంత మౌక్తిక శ్రేణి జల్లన రాలదట్టించి ముందలల్ పట్టి యాడ్చి" "జనుల మాటున కేగినసకియ లెంత పొరలియేడ్చినఁబోనీక చెఱలుపట్టె"నని స్త్రీఁ జెఱపట్టు నప్పటియౌద్ధత్యము వర్ణించిరి. తిక్కనగారి హృదయము కరుణాపాదకము. పాపరాజుగారి హృదయము పరశుక్రీడా ధూర్తమని తెలియును.

"పరమ పతివ్రతా విభవభానురలీల జెలంగు మమ్ము నిష్కరుణత నిమ్మెయింజెఱచె'' "ఉడుగక కాల్చుచునుండెడిశోకంబు యతి తీవ్రహవ్యవాహ

నుడుగాఁగ" "రావణాభిచారమ్ముగ భావమందు, నుగ్రముగ వేల్పు తెఱగున నుండె"-నని తిక్కనగారును పాపరాజుగారు-" ఏముపతివ్రతాత్వము వహించిన వారలమేని" "మనవారి పీఁచుద్రుంచిన చందమున వీరి వారి వైరులు పట్టి చీర వలదె" యని చెప్పిరి తిక్కనగారి మాటలలోఁ దాముకనిక్కముగాఁబతివ్రతలైనట్లును, తమ్మిట్లు పఱచు రావణుఁ డవశ్యము మృత్యువుఁ దొందుననియు, దానికై తాము రావణాభిచారహోమము చేయుచున్నట్లుగాఁ, దీవ్ర భావభావనా పరంపరలు క్రమ్ముకొనుచున్నట్లు గానఁబడుచున్నవి. పాపరాజుగారి మాటలలో 'పతివ్రతాభావము వహించుట' యన్నది పతివ్రతలగుటకంటెఁ దక్కువగా నున్నట్లు స్ఫురణ. తమ భర్తలను రావణుఁడు ద్రుంచినట్లు, వానిని మరెవ్వరైనను ద్రుంపరా యన్నట్టి భావన గనబడుచున్నది. ఇది సామాన్యస్త్రీల రోదనమువలె నున్నది. తిక్కనగారి మాటలు "తత్పురుష పరిగ్రహంబయిన పుణ్యసతిం గలుషింపఁ జేసి, తద్వరుని పరాక్రమంబున నవశ్యము మృత్యువుఁబొందు'' నని చెప్పుచు సాక్షాద్వేదవతీ శాపవాక్యములుగా వినఁబడుచున్నవి. ఇట్టిభావచాలనము పాపరాజుగారి కెట్లువచ్చును? భావములు తోఁచుట, అవి యుదాత్తములుగా నుంచుట, ఉదాత్తతరములుగా వానిఁ బొందుపరుచుట అంపఱివేతికోని పని కాదుగదా!

## 15. శూర్పణఖాశ్వాసనము

కాలకేయ యుద్ధమునఁ దనభర్త మరణింపఁగా శూర్పణఖ ఆర్తయై రావణుతో మొరపెట్టుకథ నిరువురు చెప్పిరి. పాపరాజుగారు, "అర్ధశాస్యకర్కశ చిత్తమెఱిగి చెలియ లళికి యిట్టులనియె" అని చెప్పఁగా, తిక్కనగారు-"అరుగు దెంచియన్నయడుగుల కడ నార్త నాద మడరఁద్రెళ్లి నాథుఁబనవి'' యేడ్చిన దనిరి. ఇరువురు చెప్పిన యేడ్పు బాగున్నది కాని, "అర్ధశాస్య కర్కశచిత్త మెఱిఁగి చెలియలళికి" యేడ్చుటయేమియు బాగులేదు. తిక్కనగారు 'ప్రల్లదురాలై ' యేడ్చినదన్నమాటకు దీటురాదు. మూలమున "పాదయోః పతితాతస్య వక్తుమేవోపచక్రమే సాబాష్ప పరిరుద్ధాక్షీ రాక్షసీ వాక్యమబ్రవీత్" అనియే యున్నది. పాపరాజుగారి రచన యిది.

పాపరాజుగారిట్లు చెప్పిరి. శూర్పణఖ దుఃఖముతో "వీరులు లేరెయెందు నీవలె వైధవ్యంబు దెచ్చువారలు గలరే" ఇత్యాదిగా మూడు పద్యములతో

రావణుదూలనాడినది. ఈ మాటలతో 'రావణు కర్కశ చిత్త మెఱిగి యశికి' పలికినట్లు లేదు. 'తుములమునను గుఱుతెఱుగక డా సిన నీ పెనిమిటిఁ దుని మితి, వెనుక నెఱిగి సౌక్కపడితి" ఇత్యాదిగా నన్న మాటలలోఁ గూడ రావణు కర్కశత్వము కనబడదు. పాపరాజుగారు మాత్రమే రావణునట్లు చిత్రించిరి. రావణుఁడు "ఏమికొఱంత నీకు జలజేక్షణ; కోరినయెల్ల వస్తువుల్ ప్రేముడి నే నొసంగెద" ఖరుఁడు "దూషణాద్యనుజవర్గముతో" దండకారణ్యమున నుండును, అతనిఁ గలిసియుండుము" ఇత్యాదిగా శూర్పణఖ నూఱడించి, ఖరు నితో "నీ యవరజ దీని శూర్పణఖ నారసికొంచు" ఉండుమని చెప్పెను. 'శూర్పణఖ నారసి కొనుచుండు' మనెనేగాని ఎక్కువ చెప్పలేదు. 'ఆరసి కొనుట' లో సంకేతమే మో తెలియదు ఈ చెప్పిన వానిలో నన్నియు బాగు న్నవికాని "కోరిన యెల్లవస్తువుల్ ప్రేముడి నే నొసంగెద" నని చెప్పుట సరిగా నున్నట్లు లేదు. ఖరునితో ఈ విధముగా స్వేచ్ఛాప్రవర్తనము ప్రేరేచినట్లగు పడును. రావణుఁడితరుల యెడనెట్టి వాఁడైనను స్వవిషయమునఁ బట్టుదలగల వాఁడేయగును. దండకారణ్యమున రాముని వరించి భంగపడిన శూర్పణఖ రావణునితో రాముని దుర్వృత్తమునే జెప్పినది. కాని తన యన్యాయమును మరు గునఁబెట్టినది. ఇట్లున్నను పాపరాజు గారిట్లు స్మరించు టెందులకో తెలియదు

తిక్కనగారు పై సంగతి నంతయుఁ జెప్పిరిగాని, చివర "ఇష్టమగు పదార్థ మెయ్యది యేనియు ననుదినంబు వేడ్కనడిగి తెచ్చి యనుసరించి నడుపు మని నియమించెద"నని, ఖరుని నియమించునట్లుగా జెప్పెను. 'సర్వధనంబులు నీకునిచ్చెద' నన్నవాఁడు చివరకు ఖరునిఁ గూటపెట్టుట గూడ నిందుగమనార్హ మైనది. పాపరాజుగారు "వనజదళాక్షి నాకడకు వచ్చుచుఁ బోవుచునుండు మెప్పు డున్'' అని చెప్పుటతో శూర్పణఖ యూఱడిల్లి నట్లుగాఁ జెప్పిరి. ఇందులో నుచితజ్ఞత యెవ్వరిదో పాఠకుల నడుగవలెను.

ఇంకొక విషయము రావణుడు చెఱపట్టి తెచ్చిన స్త్రీలేడ్చుచుండఁగా విమానమునుండి దించుటను జూచి విభీషణుఁడు-మోమువ్వలివైపు చేసి కొని రావణువైపు చూచుచు "ఏవం బిచ్చరిత్రంబు నిష్ఠురమ్మోహో" యని పల్కెను. రావణుఁడలఁతిగనవ్వుచు- "పగఱవారిఁ జెఱలఁ బట్టక, ముద్దాడి వత్తురయ్య శౌర్యవంతు"లని బదులిచ్చెను. విభీషణుఁడు-"గుణదోషవివేకములేనివారి యెడ హితబోధనిరర్థక" మనియెంచి ప్రసంగాంతర మందుకొనెనని తిక్కనగారు

చెప్పిరి. పాపరాజుగారుకూడఁ జెప్పుచు-"పరస్త్రీలఁజెఱపట్టుట పాపమనియుఁ జెప్పిరి కాని, రావణుఁడు బదులిచ్చుట కవకాశము లేకుండగనే కుంభీనసాహరణముగూడఁ జెప్పిరి. దానితో మండిపడి రావణుడు తత్ప్రతిక్రియా పరాయణుఁ డయ్యెనని చెప్పిరి. ఇచ్చటఁ గూడ నెవరి పద్ధతి యుచితమో పాఠకులే కనుగొనవలెను.

పాపరాజుగారు చెప్పుచు "ఎవ్వఁడెప్పుడేదిచేయునోవాని కట్టిదిజరిగితీరు" నని' దానికుదాహరణముగా కుంభీనసాహరణముచెప్పి, తామందరు వేఱువేఱు పనులలో నున్నందున కుంభీనసాహరణమైనదని చెప్పి "అలుగం దగ దాతని మీఁదనింకిటన్" "వాని బట్టి చంపిన నపకీర్తి బంధుహాని" యని విస్తరించెను. రావణుడు మండిపడి వానిని మాటలతో విడువరాదని యుద్ధోన్ముఖుఁడయ్యెననిరి. ఇచ్చటఁ బాపరాజుగారు చెప్పినమాటలు తిక్కనగారు చెప్పలేదు. ఎందుకనఁగాఁ బరస్త్రీలను జెఱపట్టినపుడు చెప్పిన మాటలు విననివాడు-ఇప్పుడేల వినుననితలచి యుండును. ఒక విధముగా నిదిసమర్ధనీయమగును. కాని, పరస్త్రీల విషయమై యూరకున్న పాపరాజుగారి విభీషణునకేమిసమర్ధన? ఇదికూడఁ బాఠకులే కనుగొనవలెను.

## కుంభీనసోల్లాసనము

రావణుఁడు ససైన్యముగా మధుపురముముట్టడించి కోటలోనికిఁ బ్రవేశించెను. బాపరాజుగారిట్లుచెప్పిరి. కుంభీనస యేడ్చుచు నన్నగారి కాళ్ళపయింబడి "అతండుక్రూరుఁడైన నన్నుజూచి బాళుటయెనాయము" "నన్నుముత్తైదువజేయ నింపొదవినట్లయినన్ మధుఁగావు" మిత్యాది వేడుకొనెను. రావణుఁడు "నెమ్మది వంతమాను తరుణీ! మధుఁగాచితి నిన్నుఁగూర్చి" "ఆరజనీచరాగ్రణిన్రమ్మను మింద్రుమీద బవరంబొనరింపఁగ" ఇత్యాదిగాఁజెప్పెను. ఆమెయు సమ్మతించి యట్లేచేసెననిరి.

దీనిని దిక్కనగారిట్లు చెప్పిరి. కుంభీనస కాళ్లపై బడగా, రావణుఁడామెను లేవనెత్తి" నిన్ను, దెచ్చిన పాపాత్ముఁడున్న చోటు సెప్పు మప్పుడవాని నిర్జించి నీకు హర్ష మొనరింతు" ననెను, ఆమె "తగునే నీయిలు సొచ్చి నన్నుఁగొనిరా దైత్యేశవంశాధముండు- కరం బెగ్గొనరించె; నైనను భుజాటోపంబు సూపంగ లోక గరిష్ఠుండగునీకు వాఁడుదొరయే! కన్యాత్వమే నాకు

లేదుగదా! పద్దదికార్య, మింకఁజనదా దుష్టాత్మ సర్జింపఁగన్" "మధుపున కలుగుటయన-నను విధవంగాఁ జేత" "అదియుఁగాక, 'రాక్షస' మన మొదలఁ బరిణయప్రపంచంబునం దొక్క యధమ విధముఁగలదు. కావున నదిగాఁగఁ దలఁచియైనఁ దప్పుసైరింపునాకుఁగా దళితవైరి" "అతఁడు నతిబహుళనిద్రాయుతుఁడై యున్నాఁడు-గాచుటొప్పదె సంబోధితుఁ జేసితెచ్చి సేవారతుఁజేసెద" ఇత్యాదిగాఁ బ్రార్థించెను. రావణుఁడును - "అలఁతులఁబోవుతప్పెయిది: యైనను నాతఁడు నేఁతి కుండపై నెలుక చలంబుఁబోవిడిచి యేను భవత్పతిఁగాచితిన్, మనం బలరఁగఁబోయి నిద్రతెలియంగ నుపాయము సేయు"మిత్యాదిగాఁజెప్పెను. ఆమెయు సంతోషముతోఁబోయి భర్తనునిద్రలేపికొనివచ్చి రావణుదర్శింపగా, నతఁడు సత్కరించెననిరి.

పై మాటలలోఁ బాపరాజుగారి కుంభీనస మిగులమాటనేర్పరిగానున్నది. కొన్నిమాట లుభయత్రసమానముగానున్నను, "తనభర్తనధమునిగనే పేర్కొని, తనవైధవ్యము నుగ్గడించి' రాక్షస వివాహవిధి యంగీకృతముగాఁ బ్రస్తావించి, నీకువాఁడు దొరయే యనిపొగడి సుకుమారముగా గార్యమనుకూలము చేసికొన్నది. రావణుని మాటలలోఁగూడ "వాఁడునేఁతికుండపై నెలుకయని' వాని యవధ్యత్వమల్పపరిహాసముగనే సమర్థించుట యొకక్రొత్తపోకడ. పాఽ రాజుగారి కుంభీనసలో నిట్టి చాతుర్యము కనబడదు-రావణునిలోఁగూడ-"చిచ్చాదిగట్టినట్లు, చెడు సింహసటాచ్ఛట లూడ్చుపోల్కి" నన్నయుద్ధతికిఁ దగిన కార్యపరత్వము లేదు. తిక్కనగారి కుంభీనస రాక్షసవివాహముపేరెత్తి "అదిగాఁగ దలంచియైనఁ దప్పుసైరింపు"మనుటలో నప్రకటితార్థము గర్భితముగాఁ దోఁచును. వైభవోపేతముగా జరిగిన శూర్పణఖా వివాహము 'అట్లైనదిగదా' యన్న స్ఫురణను గలిగించ ప్రకృత మీ కార్యము చేయరాదన్నస్ఫూర్తిని గలిగించును. ఇట్టు మహారమణీయములుగా నున్న వీవాక్కులు. వీనిలోమనకేది యుపాదేయమో పాఠకులే గ్రహింపగలరు.

## చంద్రికావర్ణనము

చెరి పదునైదు పద్యములతో నిరువురుకవులును సూర్యాస్తమయాంధకారోదయాదులు వర్ణించిరి. ఇరువురి రచనలు బాగున్నవి. తరువాతఁ బాపరాజుగారు చంద్రికావర్ణనమని రెండుపుటల వచనము వ్రాసెను. ప్రబంధములందుఁ

బరిచితములైన వర్ణనలే కొంచెముమార్పుతో నిందును గనఁబడును. "నవచంద్రా తపకాంతిలక్ష్మి తొలుతన్ రాణించె" - అని మొదలుపెట్టి "కౌముదిగావున సకలపదార్థ పరిజ్ఞానంబునకు నిదానంబై యనూనంబైన" దని ముగించిరి. తిక్కనగారు చేసిన వర్ణనలతోఁ బోల్చిచూచుటకు దగిన పోలికలుగూడ నిందు జూపట్టవు. కావునఁ దిక్కనగారుచేసిన వర్ణనలే యిందుఁ జూడనగును.

తిక్కనగారిట్లు వర్ణించిరి "పంచినకెంపుబాసి దివిఁబ్రాఁకి దిశల్ వెలిగించి చంద్రకాంతంబుల నీరుసేసి" ఇత్యాదిగాఁ జంద్రోదయము ప్రవృద్ధమైనది. "బడిచేసిన చందంబున గడువేగంబొకట నొకటి" ఇత్యాదిగాచకోరికలు గవిసెను ఆ చకోరికలు వెన్నెలచిగుళ్లను నమలెను. కాని అవి యందే పొటమరించెను. ఆ కిరణములను ద్రుంచిత్రుంచి తల్లులీయఁగాఁ బిల్లలాహారించెను. చంచుపుటములతో వెన్నెలవిడఁదీసి అమృతమందిచ్చు నేర్పునకు సంతసించి చకోరదంపతులు క్రీడించెను. వెన్నెల తీవునకుఁ జొక్కెను. వెన్నెల కాలువలో నడ్డంబుగానిలిచి యాడెను వెల్లువవలె వెన్నెల పొంగిరాఁగా దానికి వాని మనస్సులు పొంగిపోయెను వెన్నెల కరుళ్లలో తెక్కలువిచ్చి యాడులాడెను. "చెలఁగిచెలఁగి మలఁగిమలఁగి యల్లల్లన క్రాలిక్రాలి బిట్టుతూలితూలి" ఆకసమంతయుఁ దమదేయన్నట్టు క్రీడించెను. ఒకదానితోనొకటి 'పోటీ' పడి, యొకటి కమిసినదానిని మఱియొకటి లాగుచు విహరించెను. గుంపంతయు విడిచి ముందునకుఁబోయి యిష్టమైన వెన్నెలకొనలు చిదిమిచిదిమి, మేసెను. చంద్రునివైపు చూపునిలిపి పయిపైఁబ్రాకు మరీచులలో నూనూగుకొనలు త్రుంచుకొనుచు సౌఖ్యమే తామైనట్లు క్రీడించెను ఇత్యాదిగా బహువిధ క్రీడా వినోదములఁ జకోరికలు విహరించినవని తిక్కనగారు చెప్పిరి.

మఱియు—జగమంతయు, బాలలోఁదోఁగెనో, అన్నిరంగులను బ్రహ్మ తెలుపుగాఁ దీర్చెనో, చంద్రుఁడు విశ్వరూపుఁడై వెలిగెనోయన్నట్లు అంతటఁ దెలుపే నిండెననియు, సకలరూపములు వెన్నెలపూతపనలో గండరువుపనులో వెన్నెలనీరు పూఁతపనలో యున్నట్లుండెననియు, రతాంతమునఁ బ్రియుఁబాసి చెలికడకువచ్చిన జవరాలి చిఱునవ్వువెన్నెలవలె చెంగలువలలోని చిలిపివెన్నెల ప్రకాశించెననియుఁ, గ్రొత్త మెఱుంగులతోడ దైత్యేంద్రుఁడందు విడియుటతో వివిధవర్ణమైన యాకొంత - యావెన్నెలలోఁ బులితోలుగప్పిమైనిండుగ బూది నలఁదిన భూతనాథుని పోలుపుఁ దెలిపెననియుఁ బ్రకారాంతర వర్ణనాసౌభాగ్యము

ముద్రించెను. చంద్రికావర్ణనమని కవులువ్రాసిన కావ్యవర్ణనలలోనే యొక్కటియు నింత విరివిగా భావపూర్ణముగానున్నట్లు తోపదు. మూలమునందీవర్ణన ప్రస్తావనయేలేదు. ఐదువందలయేండ్లకుఁ దర్వాత వచ్చినయుత్తర రామాయణమునఁ గూడ నిట్టిపోలకువ కన్పడదు. ఇదంతయు మహాకవి భావానాబలమునఁ బ్రోదియై వన్నెలుతీఱిన యొక నవ్యకవితా సృష్టి. దీనితో నుత్తర రామాయణ మునకుఁ బోలికలేదని చెప్పఁజాలను.

## 16. రంభా రావణ సమాగమము

ఇది పాపరాజుగారి రచనలలో నుజ్జ్వల ఘట్టములలో నొకటి. అతఁడు దీనినిట్లేరచియించె ననవచ్చును. తిక్కనగారి రచనయు నట్టిదే ఇప్పుడు మనము వానినిఁ బరిశీలింతము. రావణుడు వెన్నెలబయల విహరించుచుండగా, నలకూబరునకై పోవుచు రంభయాతనికంటఁబడెను ఈకథను పాపరాజుగారు పదునెనిమిది పద్యములతోఁ జెప్పిరి అయిదాఱు పద్యములతో రావణు విరహోద్రేకమును వర్ణించి, "...విరహార్తుఁడగుచు మద్దుగుమ్మ యొక్కతె రాఁగోరికొనుచునుండె"నని చెప్పిరి. తర్వాత నెనిమిది పద్యములతో రఁ శృంగారించుకొనుటయు, 'అలకాపురమిదె' యని చెలికత్తెతోఁ జెప్పుట "అసురులు మూర్ఖుల్ చనరాదీతెరువున" నని పైదొలగిపోవుటయు, నందానదీ తీరమునఁ బోవుచు—"దశకంఠుఁ డేకతముననున్న యెలఁదోటయే దైవ యోగముననుఁ లేమ పులియున్న పొదసొచ్చు లేడిపగిది" చొచ్చిపోవుచుండె ననెను. ఇంతచెప్పినను, "అసురులు మూర్ఖుల్ చనరాదీ తెరువున" నని తెలిసినను "దైవయోగమున" నచ్చటికేపోయిచేరుట యిందలి విశేషము. దీనికిన్ని పద్యములుచెప్పుట తగు-నన్నఁదగును।

"అప్పద్మనయన కీల్కొప్పు", 'అయ్యామోదము', 'కరకంకణ' 'కని నివ్వెఱపడి', 'మించి దృష్టికి', 'మదనుండే సృజయించె దీని', 'కలువ లీడనవచ్చు', 'పచ్చల కంకణమ్ములు', 'నునువాల్చూపులు', 'ఏమోహ నాంగుఁడు", - ఇత్యాదిగాఁ బదిపద్యములతో భావింపుచు, "వేల్పు వెలంది పోవ, నా త్రోవకు నడ్డమైనిలిచి తొయ్యలి కేల్గవఁబట్టి" రావణుఁడిట్లని పల్కెనని చెప్పిరి ఇందు రావణుని చాపలముతప్ప వేఱొకటి గానరాదు. "అని మొనఁ దెగివచ్చినట్టి వీరుల" ఇత్యాది పద్యములు రంభవృత్తిని దెల్పునవేగాని ప్రకృత

మునకుఁ దోడ్పడునవికావు రావణునకుఁ బెండ్లియై బిడ్డలనుగని, ఆబిడ్డలుగూడ వీరులై యుద్ధమునఁ బాల్గొనుచుండఁగా, నట్టిరావణునకింత మోహమునంట గట్టుట సరికాదనిపించును

ఈ విషయమునే తిక్కనగారిట్లు చెప్పిరి. రావణుఁడు "అత్తఱిఁ జంద్రుఁ జూచు, మలయానిలురాకకు స్రుక్కు", -ఇత్యాదిగా విరహాకులుఁడై యుండఁగా, "అప్పుడొకర్తు కొంచెమగు నాభరణంబులు సన్నపూతయున్ గొప్పిడి త్రిప్పిలోఁ జెరివికొన్న నడంగిన పూవులు" ఇత్యాదిగా రంభ సింగారించుకొనుటనుజెప్పి అమెపోవుచుండగా రావణుఁడడ్డముపోయెనని చెప్పెను. దీని నొకటిరెండు పద్యములతోఁ బొడిగింపవచ్చునేమోగాని అంత బంధముగ్రవాయుట సుతరాము సరిగాదని తోఁచును. అంతగాఁ బాపరాజుగారు వ్రాసినను, "ఉన్మత్త చకోర దంపతుల మచ్చికకున్ మదిమెచ్చు" నన్న తిక్కనగారి పద్యమువంటి దొక్కటిగూడ లేకపోవుట సున్నములేని తాంబూలమువలె నగపడును. చంద్రికా వర్ణనములోఁ దానువర్ణించిన చకోరవిహార ముద్దీపన సామాగ్రిలో నొకటిగాఁ జెప్పుట తిక్కనగారి యౌచిత్యపోషణము. రాత్రులయందు ఈ విరహోద్దీపన సామాగ్రిచెప్పుట మఱియొక విశేషము

పాపరాజుగారిట్లు చెప్పిరి రావణుఁడు-"ఎవ్వరిదానవే జలరుహేక్షణ" అన్నపద్యము మొదలుకొని "చాలునిఁక నేల రమ్మ" ని కేలువట్టికొని 'చెంగల్వ పాన్పు'చేరువరకు నిరువదియొక్క పద్యములున్నవి. రంభ బదులు చెప్పుచు "వేడుకకాంద్రకత్తై తిరుగు" అన్నపద్యము మొదలుకొని "తగదయ్యాదశకంఠ" అను పద్యము వరకు నేడెనిమిది పద్యములున్నవి. ఈ పద్యములెట్లున్నను, "నా ముచ్చట దీర్పవే" యని చేయి పట్టుకొనిన రావణుతో" జడుపుంజెమ్మట నొడలం దడియ" గానున్న రంభయెట్లు మాట్లాడెనో! "దశాస్యుఁగని రంభ తడయక పలుకు పెట్టిదో మనసుకు రాదు. రావణుఁడు "సకి! నాతనుజునకు నీవు సతివై కోడంద్రిక మెపుడు చేసితి" వని యడుగఁగా, రంభ - "మీయన్న కుమారుడు నలకూబరుడు నన్ను భార్యగాఁ జేకొనెనుగదా! నా పేరు రంభగదా" యన్నది. 'విక్రమధురంధరుఁ, డించుక యల్గెనేని చీకాకుపడుం జగంబు' లన్నది. 'కామిరెలు నీకులేరా' యన్నది. 'తగదయ్యా, దశకంఠ' అని ప్రార్థించి నది. ఇవన్నియువిని వాఁడు పక్కుననవ్వి "రంభవా! తెలిసెఁగాదా నీతొడల్ చూచి నన్" అన్నాడు. ఆ మాటలన్నింటికి ఈనవ్వే ఉత్తరమా? "పౌండరీకనిరూఢి

బరఁగువారికిఁగాక, కలికి నీకనుదోయిఁగాంచనగునె" యన్నాడు. "బలారి కొల్వులోగల వెలయాండ్రకెల్లను శిఖామణి వీవేగదా" యన్నాడు. "జనకుండు సుతుఁడును జన్నంబుచేసిన,వనిత వారేమికావలయు నీకు" అన్నాడు. కడకు చెంగల్వపాన్పుకు తీసుకొనిపోయినాడు. ఈమాటలలో అడిగినమాటకు సరియైన యుత్తరము ఎచ్చటను గన్పడదు. 'రంభవా! తెలిసెఁగాంతా! నీతొడల్ చూచి నన్' అను బహిరంగ పరిహాసములున్నవి. విరుద్ధ సంబంధములు కొట్టవచ్చినటు లున్నవి. 'పేరుఁడు-తపోధనవంతుఁ' డని పేర్కొన్న నలకూబరుని 'పదిలో పదునొకం'డైనవాఁడుగా పేర్కొన్న తిరస్కారములున్నవి. ఇవియేవియున్నను 'ఉక్తికిఁ-బ్రత్యుక్తి' సరిగాలేకపోవుటతో నంతయుఁ బరిహాసశృంగారముగా భాసించినదని చెప్పవలసివచ్చినది. ఈ పరిహాసశృంగారములో ఉన్మత్తుడైన రావణుడు చెంగల్వపాన్పుకు దీసికొనిపోయెనన్నారు. ఆయడవిలో నతనికి ఆ యొత్తిడిలోఁ జెంగల్వపాన్పెవ రమరించిరో తెలియదు. వెంటవచ్చిన చెలికత్తె ఏమైనదో తెలియదు మోములుచేర్చి, సందిళుల నదిమి—ఇత్యాదిగా పర్యవసానము చెప్పినాడు. "అకృతాశ్లేషము...అసందష్టాధరంబయ్యు దైత్య కులేంద్రుంగరగించె దానిరతము" అని యాహా అన్నాడు. ఈ ఘట్టమును విమర్శించు భారము పాఠకులకే వదలుచున్నాను.

తిక్కనగారి సందర్భమునే యిట్లు చెప్పిరి. రావణుఁడు- "ఎవ్వతె-వెక్కడికిఁబోయెద" వని యడుగఁగా, రంభ 'అంభోజంబు చందాన నానన ముజ్జృంభణమంద" నేను రంభను, నలకూబరు కడకు పోవుచున్నాను, ఇట్టి వేళ నెవ్వరైన నడ్డము వత్తురా? "నగవుం దగుమాత్రమ కాకయొప్పనే" యన్నది. ఆనన ముజ్జృంభితము చేసి చెప్పుటయు, తన యూరు పేరు మొదలగునవి చెప్పుటయు గమనార్హములు. రావణుడు తన యూరుపేరు చెప్పి 'జగంబులెల్ల నీ వెక్కటి నేలు'' మని ప్రార్థించినాఁడు. రంభ-"పంక్తి ముఖుండ వేని నే నక్కట నీకు గోడలఁ గదయ్య తొలంగు తొలంగు" మని రెట్టించినది. రావణుఁడు యుక్తిగా "కొడుకునకుఁ బెండ్లమైన గదా కోడలగు" నన్నాడు. రంభ దానికి వివరణము లిచ్చి ''ఈ నెతి తప్పిన మాటలు దానవకులనాథ యిట్లు తగునే పలుకన్" అని మాటలాడినది. అప్పటికిని రావణుఁడు కామాతురుఁడై-" నాకు నప్సరో వనితలు వింతయెరె?.''కులభామవోలె తగవుం ఘటిం

చెదే? "సిరి వచ్చిన మోకాలుఁ జూపువారుఁ గలరే?'' అని ప్రతి భాషలాడి నాఁడు. రంభ- మనంబునఁ గుత్సించుచు "నేను లంజియం గావుదు, వాని తోడి తమకంబది లంజియకాదు, ప్రేమ సద్భావమెఱుంగనైతి,...నీవచనంబు త ప్పకట నీఱుల పట్టున నేయిమందొకో!" ఇత్యాదిగా భంగపఱిచినది. బదులు పలుకలేక రావణుఁడున్మత్తుడై "అంగనబోదిని సగాఢాలింగనముగఁ దాఁ్రమ చూడ లీలాచతురానంగ క్రీడా సంగతి నెంగిలి గావించె" నని గుప్తముగాఁ బర్యవసానము చెప్పినాఁడు.

ఈ రచనలోఁ గూడ నంతరాంతరములు ప్రత్యేకముగఁ బేర్కొనఁబడిలేదు. ముఖాంబుజ ముజ్జృంభితము జేయుట మొదల్కొని, సుకుమారముగాఁ చీవాట్లు పెట్టుట, వానినే రెట్టించుట, సిగ్గుపడఁ బల్కుట, కుత్సించి మాటలాడుట ఇత్యాదిగా నుదాత్త సంభాషణ క్రమము నడుపుటయే కాక "ప్రేమ సద్భావమెఱుంగ" వని "నీఱులపట్టున నేయిమందొకో" యని విదిలించి పాఱవేసి చివరకు పాశవిక ప్రవృత్తికి లోనైనట్లు తీర్చినాఁడు. రావణుఁకు మొదట "అక్కాంత కే లనురాగంబునఁబట్ట' నట్లు చెప్పినను చివరకు "అంతయు వినియును వినని చెవులు చేసి" "అంగనఁ బొదివి" ఇత్యాదిగా మన్మథ పైశాచిక ప్రవృత్తికాకర మైనట్లుగాఁ దీర్చుట బలవద్గమన సంరంభము నెల్ల నొకచిన్నకంద పద్యములోఁ జెప్పుట- తిక్కనగారిలేఖినీ బలమనిపించును. మూలమున నిచ్చట-"పదముక్త్వా సతాంరక్షో నివేశ్యచశిలాతలే కామమోహాభిసంరబ్ధో మైథునాయోపచక్రమే" అని యున్నది. దీనినిగూడ గమనించక పాపరాజుగారట్లు చెప్పుట యేమో తెలియదు. దీనిని గూడఁ బాఠకులకే వదలుట మంచిదని తలంచెదను.

రావణుబలవద్గమనమును రెండు సీసములతో రెండు మత్తేభములతోఁ బాపరాజుగారును ఒక సీస పద్యముతోఁ దిక్కనగారును జెప్పిరి. 'తమకించి యొడినించి' 'అకృతాశ్లేషము' "కటిచక్రంబు చలించె" "రాజహంస విహార' ఇత్యాది పద్యములతోఁ బాపరాజు గారు చెప్పినను "బెట్టిదపుకేళి నలమటఁబెట్టి విడిచిపుచ్చె దశకంఠుఁ"డని బలవద్గమన విహారము వర్ణించుట చిత్రముగా నున్నది. తిక్కనగా రాబలవద్గమన మెత్తికోక 'అసురగారించి విడిచిన నమ్మృగాక్షి' 'పురశ్రీ విధమున, ఉద్యాన లక్ష్మికరణి, నెత్తమ్మి కొలను భంగి, మవ్వెంపుఁదీగె మాడ్కి" విన్ననయ్యె నని రి ఇచ్చట నుభయకవుల హృదయోదాత్తత వ్యక్తమగుచున్నది గాన వివరింపఁబడిలేదు.

రంభానలకూబర సమాగమము నిరువది పద్యములతోఁ బాపరాజుగారును నాల్గుపద్యములతో దిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు-భంగముఁ బొందిన రంభ వర్ణనము నర్థపుట వచనములోను, నలకూబరుని యుత్సుకత్వము నాల్గు పద్యములలోను, రంభ యేడ్చుట నారుపద్యములలోను, నలకూబరుఁడు శాపమిచ్చుట నారేడు పద్యములలోను చెప్పిరి. చెప్పిన వానిలో నత్యుక్తులు నతిశయోక్తులు పెక్కులు. 'దీనగతి నతనియడుగుల వ్రాలెన్' అని చెప్పినప్పటికి అర్థపుట వచనముతో రంభాశ్లేశము వర్ణించుచు, 'హెచ్చువాసనవక్కలిచ్చు "ఆడపంపుఁజెలినికూడ విచారింపని నలకూబరుని యాతురత్వమును వర్ణించిరి. మూలమున "సాదేపమానాలజ్జంతీ భీతాకర కృతాంజలిః నలకూబరమాసాద్య పాదయోర్నిపపాతః" అన్నదానికి ఇంతయార్భాటముచేసిరి. నలకూబరుఁడడుగుటయు రంభచెప్పుటయు నిట్లే కొలఁదికి మీఱినది. మోహెత్తినై 'కన్నుల మంటలంటికొనగా'ఁజూచి "ఒప్పని మృగాక్షులఁ బల్మినిబట్టెనేని సమ్మోదము దీఱ నంత శిరముల్ పదియుం బదినూఱువ్రక్కలై పడుఁగా"కని శాపముపెట్టెను. దేవతలుమెచ్చిరి. రావణుఁడాశాపమువిని "నాటనుండియుఁ గోపనలమనోంబుజానుకూలత్వము" పొందెనని చెప్పిరి. మూలమునందు "నారీషుమైథునే భావనా కామా స్వభ్యరోచయత్" అనియున్నది. దానికిని, 'కోపనల మనోంబుజానుకూలత్వము'ను పొందుటకును దారతమ్యముఁ జెప్పబనిలేదు. ఈవిధముగా బాపరాజుగారీఘట్టము ముగించిరి.

తిక్కనగారు చెప్పుచు-"వెలవెలఁబాఱుచుఁగొంకుచు" రంభ నలకూబరుని దగ్గరికిపోయి 'అఱలేక' సమస్తముఁజెప్పఁగా, 'నతండు ప్రభావమునన్ సమస్తమున్ గని కలుషించి, యింక దశకంధరు డెవ్వతెనైన నీక్రమంబునఁ బయిపడ్డ నప్పమృతిఁ బొందఁగలం"డని శాపమిచ్చెనని చెప్పిరి "అదిమొదలు గదాఁ బలిమింబైవడఁడెన్నఁడు చెలువల"నని రావణునిశ్చయముగూడఁ జెప్పిరి. గ్రంథముఁ బెద్దదిగాఁజేయుట తప్ప పాపరాజుగారు విశేషమేమియుఁ జెప్పలేదు. "ఒప్పని మృగాక్షులపైబడినచోఁ దలకూలు"ననియే యిర్వురుచెప్పిరి. కాని రావణుని ప్రవృత్తి తర్వాత నెట్లుండె ననుటలో మూలమున "నారీషుమైథునేభావం నాకామాస్వభ్యరోచయత్" అనియు, బాపరాజుగారు, "ప్రాపించె నాటనుండియు గోపనల మనోంబుజాను కూలత్వము" ననియుఁ, దిక్కనగారు "పంక్తివదనుఁ డిదిమొదలుగఁ దాబలిమిన్ బైపడడెన్నడుఁ జెలువల"ననియుఁజెప్పిరి. పాపరాజు

గారి మాటలో 'స్వయముద్యుక్తలైనవారియెడ, ఉద్యోగసాధ్యలైన వారియెడ నీశాపము పనిచేయదని రావణుడు తెలిసికొన్నట్లుతోఁచును. మంత్రములవలె నుపయోగించు భావములఁగూడ నిట్లువ్రాయుట చింత్యమనితోఁచును. రసాభాస శృంగారము శాపోక్తులతో ముగిసిన తర్వాత రావణుఁడెట్లుండె ననుటను తిక్కనగారు-''కొందలపాటునన్ మనముగుందినఁ, గంటికినిద్రరాక సేనందెలిపించి'' యని మనసు కుదుట లేకపోవుటనుచెప్పిరి. పాపరాజుగారి కాభావము తట్టలేదు. ''కారలంబడిన బాలల్ వొందిరానందమున్'' అనిచెప్పుచుఁ, బ్రభాతవర్ణనము పదుమూడు పద్యములతోఁజేసి, ''అంతకుమున్నె రావణనిశాటకులేంద్రుఁడు వీత నిద్రుఁడై'' అని తర్వాత కథనందికొనిరి. తన కార్యమునుగూర్చి దానిపైవచ్చిన శాపమునుగూర్చి కొంచెమైన నాలోచింపకపోవుట మానవ స్వభావమున కెట్లు తగునో యదియు విచారణీయమే !

## 17. దేవాసురసంగ్రామము

ఇదియొక పెద్దఘట్టము. దీని నెనుబదిరెండు పద్యములతోఁ దిక్కనగారును, నూటనలుబదియైదు పద్యములతోఁ బాపరాజుగారును చెప్పిరి. పద్యములు నూటనలుబదియైదే యయినను, లెక్కకుమించిన సీసములతో వృత్తములతో ఒకటిరెండుపుటలకు మించిన వచనములతోఁ బుటలు మిక్కిలిగాఁ బెరుగును. వానిలో మూడునాల్గు విషయములెత్తి చూపింపనగును.

తిక్కనగారిట్లుచెప్పిరి. రావణుఁడమరావతిపై దండువెడలెను. అప్పుడింద్రుడు శ్రీవిష్ణువు సహాయముకోరఁగా విష్ణువు ''బ్రహ్మచే వరములు గొన్న గర్వమునవచ్చె, నలంతులఁబోడు, కాలపరిపాకము వచ్చిన నేనతీర్చెదన్, అంతకు నీవసనకు నీవచాలు దెన్నివిధములన్'' అనిచెప్పగా నింద్రుఁడు సంతసించి యుద్ధమునకుఁబోయెను. పాపరాజుగారీ కథనే చెప్పుచు ''నీవేలాగు నరత్వమంది పగవానిన్ గెల్చెదంచేని, రాజీవప్రోద్భవు మాటనిల్పుటకుఁగా జేకొంటి శాంతంబిఁకన్ భావిప్రాంచితరామరూపమున నిప్పౌలస్త్యుఁ బోనిత్తునే'' యని రూఢిగాఁజెప్పిరి. విష్ణువేయవతారమున నేమేమి చేయునో యది దేవరహస్యము. దానిని బయలుచేయుటతగునా? రామావతారమున దేవుఁడుగానుండినచో రావణుఁడు జావఁడుగదా! ఈచిక్కులన్నియు మనసులోఁబెట్టుకొని 'కాలపరిపాకమువచ్చిననేనతీర్చెదన్'' అని తిక్కనగారు గంభీరముగా జెప్పిరి. మూల

మున "అహమేవ నిహంతాస్మి రావణం సనుతంయుధి దేవతాస్తోషయిష్యామి జ్ఞాత్వాకాల ముపస్థితం" అనియున్నది. దీనినిగూడ విడిచిపెట్టి యీనాఁడు తనకుఁ దెలిసినది గదాయని యానాఁడే తెలిసినట్లు చెప్పుట పాపరాజుగారి సాహసమనవలెను.

ఇంకొకచోట, ఇంద్రజిత్తు మాయాతిమిరముఁ గల్పించి జయంతునికి దిగ్భ్రమ గల్పింపఁ, దాతయగు పులోముఁడువచ్చి జయంతునాగి "యనివారణఁ బర్వెడు సీతమంబు మున్నిచ్చె జయార్థమై యభవుఁ డీతని, కిరివుచేతఁజావఁగా వచ్చెడిదేమి? సంగరమవశ్యము చేయగనీను" అని జయంతునికిఁ జెప్పి సముద్రము లో దాఁగుటకుఁ గొంపోయెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు- "మనుమఁడలయుటంగని తన మాయవలన నెత్తికొని పోయె జలరాశి, కెవ్వరతని పోకతెలియక యద్భుతాంబుధిమునుంగ" నని చెప్పిరి. ఎప్పుడైన నెవ్వరికైనఁ దెలియకుండ నెత్తికొని పోవచ్చును. కాని తిక్కనగారి మాటలలో "జయంతు నాఁగి మున్నిచ్చె జయార్థమై యభవుఁడీతమ" మని చెప్పుటయు అట్లే తీసికొని పోవుటయు జరిగినది. పాపరాజుగారు మాత్రము జయంతునికిఁ దెలియకుండఁగనే పులోముఁ డెత్తికొని పోయినట్లు చెప్పిరి. మూలమున "ఏతస్మిన్నంతరే శూరః పులోమానామ వీర్యవాన్ దైత్యేంద్ర సైన్యాత్సంగృహ్యశచీపుత్రోఽపవాహితః" అని యున్నది. దాని ప్రకారమే పాపరాజుగారు చెప్పిరనవలెను. యుద్ధము చేయువానికిఁ బరిస్థితిని చెప్పి అతనిఁ దొలఁగించుటలో నౌచిత్యమును పాపరాజుగారు గ్రహింపలేదనవలెను.

మఱియొక చోట, నింద్రుఁడు సన్నద్ధుఁడై సైన్యము గదలించునప్పుడు- "ఎదురుగ వీచె నిష్ఠుర సమీరము, లుల్కలము లుగ్రభంగి నెల్ల దిశల దుల్లె" నిత్యాదిగా నపశకున దర్శనము గలిగెనని తిక్కనగారు చెప్పిరి. మూలమునఁ గూడ "నిర్గచ్ఛతస్తు శక్రస్య పరుషం పవనోవవౌ భాస్కరో నిష్ప్రభశ్చాసీన్మహోల్కాశ్చప్రపేదిరే" అని యున్నది. పాపరాజుగారీ ప్రస్తావన యేమియుఁ జేయలేదు. "కమనీయుశత కోటి ఘంటికా ఘణాఘణా రవముచే దిక్కరుల్ సెవుడు వొరయ" "అమరవిభుతేరుమాతలి యపుడు నడపె" నని యింద్రుని సమర విజృంభణమునే చెప్పెను. అపశకునము లప్రియములని తెలిసినను, మూలమును తిక్కనగారు చెప్పినను దాని వ్రాయకపోవుట పాపరాజుగారి సాహసము.

మఱియొకచోట, బలియుఁడై యింద్రుఁడు రావణుని డీలుపఱిచి "అర దము చుట్టుముట్టి కొనియాఁడి దశాస్యుని బిట్టదల్చి పైకుఱికి తెమల్చిపట్టుకొని యుద్ధవిడిం దమతేరు మీదికిన్ సురపతి కొంచుపోవుటలుచూచి" సైన్యములు హాహాకారములు చేసెనని-రావణుఁడు బద్ధుఁడగుటను నిశ్శంకముగాఁ బాపరాజు గారు చెప్పిరి. మూలమునఁగూడ "ఘాతయిత్వా మహావేగా ద్రథస్థం తంచరావణం జీవగ్రాహం గృహీత్వాతం ననాదసపురందరః ఏవంగృహీత్వాతం శక్రస్స్వర్గ లోక మనీనయత్" అని అసంశయముగాఁ జెప్పఁబడినది. కాని, తిక్కనగారట్లు చెప్పలేదు. ఇంద్రుడు దిక్పాలురతో—"ఎద్దెసనైన శంకబెడియేగు, విరించి వరమ్ము నెమ్మదిన్ పెద్దయునమ్మి వీఁడిటు లభేద్యతఁ గ్రుమ్మరుచున్న లోకమా పద్దశఁబొందు......ఇద్దనుజాధముంబొదివి యేపఱబైపడి పట్టికొందమే" అని చెప్పఁగా వారును మంచిదని విజృంభించి రావణు తేరుచుట్టుముట్టిరి. ఇంద్రుడు వెనఁజొచ్చి పట్టుకొన నాయితమై 'ఒరసి కొనఁబోవఁ'గా నంతలో నింద్రజిత్తు వచ్చి మాయాతిమిరముచే నందఱఁ గన్నుమూయించి, ఒంటరియైన యింద్రుఁ బట్టుకొని తమతండ్రికిఁ జూపెనని చెప్పిరి. రావణునంతవాఁడు బద్ధుడగుట ఇష్టములేకయో ఉచితముగాదనియో లోకము నమ్మదనియో ప్రయోజనము లేదనియో విడిపించుటకైన వీఁడు చావఁడు కాఁబట్టి - మనమేప్రయత్నము చేయవలసివచ్చుననియో తిక్కనగారిట్లు నిర్వహించిరని తోఁచును పాపరాజు గారు మూలమునే యనుసరించి రావణుని బద్ధునిఁజేయించిరి గాని, మూలము నందువలెనే స్వర్గమునకుఁ దీసికొనిపోయినట్లు చెప్పరైరి. తిక్కనగారివలె బద్ధుఁడు కానట్లును జెప్పరైరి పాపరాజుగారి యింద్రజిత్తు ఇంద్రునిబంధించి "ననున్గన్న దశాననుం ద్రిదశ కోటింగూడి బంధింప నెంచిన నీవే యిటఁ జిక్కితింద్ర" యనిపల్కుటతో, దశాననునికి మోక్షముగల్గినట్లు తెలియవచ్చును- అంతవరకు "సురపతి కొంచుపోవుటలు" నిక్కమైనట్లేగదా ! ఇచ్చట నిరువురు కవుల తారతమ్యములు పాఠకులే నిర్ణయింపవలెను.

కొండొకచోట, దేవతల ప్రార్థనపైబ్రహ్మ 'యింద్రుని విడువు'మని యింద్రజిత్తునుకోరెను. అతఁడు "నావిక్రమమున వెలపెట్టెదేని కారుణ్యము సేయుము నాకుశాశ్వతంబగు నమరత్వ"మనియడిగెను. బ్రహ్మ "కలదే శాశ్వతం బగు నమరత్వం బీశ్వరునకుఁదక్క"నని బదులిచ్చెను. అపుడింద్రజిత్తొక తెఱంగుఁ జెప్పెదనని-"హోమసమాప్తి నుత్థితరథోత్తమ మొక్కటి దక్క,

నొంట సంగ్రామముఁ జేయఁబో, నదియ కాలముగాఁ దుదకియ్యకొంటి; నాకీ మెయిమేరవెట్ట వరమిమ్ము పరాక్రమలీలమెచ్చి; నీవేమియునీక పోకతగవేనియుఁ బొమ్మమరేంద్రు నిచ్చితిన్'' అని యన్నట్లుగాఁ దిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారుగూడ నింతయుఁజెప్పిరిగాని, చెప్పుటలో వ్యత్యాసములు కనఁబడును. బ్రహ్మ-యమరత్వమందఱికి లేదనఁగా, 'హోమసమాప్తియం దుద్భూతరథమెక్కినపుడుమాత్రము అమరత్వము వచ్చునట్లును, తక్కినవేళల నాశము సమ్మతించినట్లును' ఆ మాటల సారాంశము. ఇవిసామాన్యుల మాటలవలెనున్నవి కాని విశేషములేదు 'నా విక్రమమునన్ వెలగట్టెదేని', 'ఈకపోక తగవేనియు బొ-మ్మమరేంద్రునిచ్చితిన్' ఈ మాటలు ఇంద్రజిత్తు నుదాత్తతకు నౌదార్యమునకు సాటిలేని చిహ్నములు. అట్టి మాటలందరి కవులకు రావనుట యిందలి రహస్యము- బ్రహ్మపోవుచు, ఇంద్రునూరడించి హితములు పల్కి, "దోషసంగమవినివృత్తికై యొక మఖ మొనరింపుము విష్ణుతుష్టిగన్" అని చెప్పినట్లు తిక్కనగారు వ్రాసిరి. దానినే యనువదించుచుఁ బాపరాజుగారు-అహల్యా కథసంతయుఁ జెప్పి, 'పిడిన సిగజారు విరిపువ్వునరులతో మురువుడించిన వాడుమోముతోడ' ఇత్యాదిగా నింద్రుని వర్ణించెను. ఈవర్ణన అనమయప్రసంగముగాఁ దోఁచును. చెఱనుండి బయటకువచ్చువానికీ పూలయలంకారమెట్లువచ్చెనో తెలియదు. అందులోనే "ఆ నడిరేయిఁ గోడిపలె నార్భటిసేసి" ఇత్యాదిగా అహల్యా జారవృత్తాంతమంతయుఁజెప్పుట సముచితముగాఁ దోపదు. తిక్కనగారీపట్టున -ఇంద్రుని 'వక్త్ర సరసిజంబు లజ్జయను రాత్రిఁగదుఁ జెడియున్కికిం గృపారసపరుఁడై" యనియు "సాధ్వినహల్యగోరి గౌతమునికిఁ దప్పితి'' వనియుఁ జెప్పుట యెంతో యుచితముగా నున్నదని తెలియును.

## 18. రావణ కార్తవీర్యార్జునుల పోరు -

రావణుని బంధమోక్షములతో నీకథ నడుచును. శ్రీరాముఁడగస్త్యునితో "ఇట్టులాతనికిన్ టీరముచెల్లెఁ, గానియెచటన్ దద్విక్రమక్రీడ మాన్ప నొకఁడైనను జాలఁడే" యని యడిగెను అగస్త్యుఁడు నవ్వుచు నీకథ సెప్పెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారిట్లేచెప్పుచు- నగస్త్యుండు-"హననంబోర్వక వాని యోటములె నీవాలింపఁ గాంక్షించె" దనిచెప్పెను. రావణుని యెన్ని యోటము లగస్త్యుడు చెప్పగా రాముఁడు వినెను? ఇంతవఱకు నట్టి ప్రస్తావనయే లేదే? ఇందుకొఱకై "యెంతని వర్ణింతుము నీగుణస్ఫురణ" యని పొగడిక

యేమి? ఇది పాపరాజుగారి రచన రావణుని విక్రమము నెదర్పజాలువాఁడెవఁడైన లేఁడాయని రాముడడుగుటయు నగస్త్యుడు చెప్పుటయు తిక్కనగారి రచన. ఏదిబాగో చెప్పవలసిన భారము మనదికదా!

పాపరాజు గారిట్లు చెప్పిరి. "మాహిష్మతికిన్ జని రావణుండు సమర స్పృహ వచ్చితి, నా యాగతి మీ యధిపతికిన్ జెప్పుఁ"దని రావణుఁడు రాజ మంత్రులతోఁ జెప్పెను, "నేఁడే వచ్చునొ రేపె నచ్చునొ? వనిన్ స్త్రీయుక్తిఁ గ్రీడించుచున్ రాఁడో? రాజుల చిత్తముల్ దెలియునే"? అతండు వచ్చినను బాశిన్ రమ్ము" అని యా మంత్రులు బదులు చెప్పిరి. "నా ప్రయాణకథ లెల్లన్ విన్నవాఁడై వధూస్తోమంబున్ గొని దాగనేగె, రణభీతుంజేరి పోరాడునే భూమిన్ రావణుఁడంచు వారినగుచున్" రావణుఁడు వింధ్యాద్రికిఁ బోయెనని పాప రాజుగారు చెప్పిరి. తిక్కన గారిట్లు చెప్పిరి. రావణు పిలుపునకు రాజమంత్రు లిట్లనిరి. "నీవన్నుత విక్రమమున్ బ్రకటించుకంటె నంబుధినడుమైన నీ పురికిఁ బోయి యొదుంగుము చాలమేలగున్" ఈ మాటలలో గర్వపరిహాసము వ్యక్తమగుచున్నది. రావణుఁడు" మీ జనపతిలావు నాదుభుజశక్తియు నించుక తూచి చూడకేఁజన"నని బదులుచెప్పెను. మంత్రులు రావణు నచ్చటనే యుంపఁదలచి, రాజు నర్మదా విహారమునకేగుటఁజెప్పి,యాతనిఁ బిలుచుట తమకుఁగాదని చెప్పి, "నేఁ డియ్యెడ నిలువుము," "వేగపడకు, మనుజ విభుచేతి బలువును జాతుగాక"యని చెప్పిరి. రావణుఁడు బదులు చెప్పుచు, "మెలఁగు దెస మెలఁగి క్రమ్మఱు తల నొకమరి యేమరించి దాడిమెయిన్ దోర్బలము మెఱసి పైఁబడి నా చలము నెఱవి పోదు"నని చెప్పి వింధ్య నగమునకు బోయెనని చెప్పిరి. రావణుఁడు వచ్చుట పోవుట నిర్వురు చెప్పినను, పాపరాజుగారి మంత్రులలో రాజభృత్య న్యాయమేగాని యెక్కువ కనబడదు. తిక్కన గారి మంత్రులలో, మంత్రులకుఁ దగిన ఉక్తి ప్రత్యుక్తులు గోచరించును. ఆ మంత్రుల మాటలలోను రావణుని మాటలలోను గమనింపఁదగిన రాజతంత్ర మొకటి స్పష్టముగా గోచరించును. కవియైన వాని కిట్టి లోక తంత్రము తెలుంగు టావశ్యకమని యిందు తెలియుచున్నది.

రావణుఁడు నర్మద కేగి స్నాతుఁడై "స్మరణ ప్రాప్తంబౌ కాంచనమయ లింగముఁ జేకొని ప్రాణప్రతిష్ఠ చేసి" పూజాతత్పరుఁడయ్యెను. "అమ్మహా పూజ కొనసాగినట్లైన సంగరంబున గెల్చు నేశత్రునైన విఘ్నమందిన

నోడు; నవ్విధము మత్త చిత్తుఁడౌట గణింపక చేయఁ బొడఁగె" నని పాపరాజు గారు చెప్పిరి. ఇది చింత్యము మత్త చిత్తుఁడైనచో నీ పూజా విధానమునే తల, పెట్టఁడు తలపెట్టినపుడు తత్ఫలమును గమనింపక పోఁడు. అంతటి యాప దయు నతనికిఁ బొడకట్టలేదు, మూలమున "సతుమత్తోనజానీతే విధిహీనం శివా ర్చనం" అని యున్నది. మత్తుఁడై విధిమంతముగా శివార్చన చేయుటకు మఱచె నని చెప్పిన సరిపోవును. ఆ విధియైనఁ దెలియవలయుఁగదా!

మఱియు, "యత్ర యత్ర సయాతిస్మ రావణో రాక్షసాధిపః జాంబూనద మయం లింగం తత్రతత్రస్మనీయతే" అని మూలమున నుండఁగా, దానినివదలి "స్మరణ ప్రాప్తంబౌ కాంచనలింగ"మునని రావణు ప్రభావ మాహాత్మ్యము లుగ్గడించెను. ఇట్లు చేయుటేల? ఈ పూజకు "తొగలు కెందమ్ములు తుమ్మి పూ లచ్చెంగపువ్వులు పొన్నలు పొగడవిరు" లిత్యాదిగాఁ బూల రకములు కొండయెత్తునఁ బోయించెను. ఇంత ఘనముగాఁ జెప్పనేల? ఇదంతయు వైభవ ద్యోతకము. తిక్కనగారింత యెత్తుగాఁ బ్రబంధము నడుపలేదు. అంతయు నుచితసంవిధానముగాఁ దీర్చుచేసిరి.

నర్మద యొడ్డున రావణు శివపూజయు, నర్మదా ప్రవాహమునఁ గార్త వీర్యుని యువతీ విహారమును అనర్గళముగా సాగుచున్నవి. రెంటికిని మారము కొంత యుండును. నర్మదా ప్రవాహమెగదొట్టి శివపూజా విఘ్నము సేయఁగా నదియేదో చూచిరమ్మని యనుచరులకు సైగఁజేసెను. "కరధ్యానంబునన్ జెంత మంతురులన్" బిల్చి చెప్పెనని పాపరాజు గారు చెప్పిరి. సేవకులు పోయి చూచి వచ్చిన సంగతిఁ జెప్పఁగా, "శివపూజా నియమంబు మాని తొలి జేజే పెద్ద" "యుద్ధక్షోణి మాతారతమ్యవిశేషంబులు గానిపింతు"నని సైన్య ముతో బయలుదేరెనని పాపరాజుగారు చెప్పిరి. శివపూజా నియమమె ట్లావిరియై పోయెనో అతనికే తెలియదు. "సరిత్కల్లోలజాలంబులో గుంభీంద్ర ంబలెఁ గేళిసల్పు నృపముఖ్యున్ దవ్వులంజూచి" రావణుఁడు ముందుకుఁబోయెనని పాపరాజుగారు చెప్పిరి. "ఎఱిఁగి కరంబుపొంగి, కడునేకత మి ట్లగబడ్డచో నతండెఱుఁగకయుండ ముట్టకొని యేపడగించెద" నని మంత్రులతోఁజెప్పి రావణుఁడు ప్రయాణమయ్యెననియు, "అత్తఱి నరుణాభ్ర మసిమయధారలతో దివిఁదోచె ముందటన్" అనియుఁ ఢక్కనగారు చెప్పిరి. ఒంటరిగా జిక్కి నపుడు కార్తవీర్యుని బంధింపవలెననిగాని, అరుణాభ్ర మమసియ ధారలతో

నెదురౌటగాని తిక్కనగారికివలెఁ బాపరాజుగారికిఁ దోచకపోవుట విచిత్రమే యనవలెను. "అర్జునాభిముఖే తస్మిన్ ప్రస్థితే రాక్షసేశ్వరే చండః ప్రవాతి పవనస్సనాదస్సరజాస్తదా" అనియున్న మూలముకూడ నాతనికిఁ గనఁబడలేదు.

కార్తవీర్యుఁ "డవరోధకాంతల యళుకుమాన్చి" కాంచన వేష్టకోజ్జ్వలోత్సేధగదాధరుండగుచుఁ జెచ్చెర రావణుఁమీదికేగఁగన్" అని పాపరాజుగారు చెప్పిరి. "కట్టాయితమై యువిదల నిట్టుండుఁడు వెఱవకిచట, నిదె వచ్చెద'నన్ ముట్టిన దానవులను బలిపెట్టెద నర్మద" కని తిక్కనగారు చెప్పిరి. ఇరువురు కవులు కమ్మని పద్యబంధము మిక్కిలిగాఁ గూర్చిపెట్టినను లోపలియోత ప్రోతము లెట్లున్నను, "నన్ముట్టిన దానవులను బలిపెట్టెద నర్మద" కన్న వాక్యము శిరోభూషణముగా నున్నది.

రావణకార్తవీర్యులిద్దరు తలపడిరి. "సింహముంగదియు సింహంబున్ బలెన్" అని పాపరాజుగారును, "ఆ తారక కార్తికేయుల వలెన్" అని తిక్కనగారును చెప్పుటలో ఉపమానము గ్రహించుటలోఁగూడ నౌచిత్య మిట్లుండవలెనని తెలియును. తరువాత గదాయుద్ధము నొకపెద్ద వచనముతోఁ జెప్పి, "గరుడుఁడు సర్పమున్ బొదువుకైవడి" రావణుని ముట్ట, "హరి బలిఁ గట్టివైచిన క్రియన్ బటుపాశ నిబద్ధుఁజేసె" నని పాపరాజుగారు చెప్పిరి. బలి ధర్మపాశబద్ధుఁడయ్యెనేగాని యితరముగాదు. హఠాత్తుగా స్త్రీవిహారమునకై పోయినచోట జరిగిన యుద్ధములోఁ గార్తవీర్యునకీపాశము లెట్లువచ్చెనో తెలియదు. తిక్కనగారిట్లు చెప్పిరి. "పట్టి యిరువది కరంబులఁ గట్టిగ వీపుపయి మోదుగాఁబెట్టి, తగన్ బెట్టు మెడవట్టికొని తుదిముట్టఁగ, మగఁటిమి నభంబు ముట్టఁగ నార్చెన్" "కంచుకి గణంబు నల్లజూచి యొకనిఁబిలిచి యోరీ వీనిఁ బెక్కేలితోన తెమ్మని సముద్ధతముగ నప్పగించి" యని సముచిత నిర్వహణము చేసెను. ఇరువదిచేతులవానిని వేయిచేతులవాఁడెట్లు చేయవలెనో యట్లుచేసెనని తెలియును. ఇరువురుకవుల తారతమ్య మిట్టిదిగనే కనఁబడును. ప్రహస్తాదులడ్డుపడఁగా, వారు విడిచినబాణములచేతనే వారిని బరాభూతులఁజేసి కార్తవీర్యుఁడు మాహిష్మతికిఁ బోయెనని పాపరాజుగారు చెప్పిరి. కాని యంతఃపుర పరిజనము లేమైరో చెప్పలేదు. తిక్కనగారట్లుగాక, "తరుణీజనము వినోదపుఁ బరివారము ముందునడుపఁబనిచి", వెనుకఁబోవుచు, 'నిలునిలు' మని వెంటఁ

బడిన ప్రహస్తాదుల నమ్ములనోడుచేసి విజయముతో నూరుఁజెరెనని చెప్పిరి. "తనకొలఁది యెఱుంగక యీ దనుజుఁడు వనితావినోదతత్పరు నన్నున్ జెనసె" "ఇవ్విధికోపమునకు నుపశమంబెట్లు సేయుదు నాక్కా" యని కార్త వీర్యుఁడాలోచించుట అతని యుదాత్తతకు గుర్తుగాఁ దిక్కనగారు వ్రాయుట విశేషము.

తరువాతఁ బులస్త్యుఁడువచ్చి రావణుని విడిపించుకొనిపోవు కథ యున్నది. పాపరాజుగారు – "జనపతి యలకుచు మీపనిచిన పని గావించు కంటె శ్రేయముగలదే యని దశముఖు విడిచి ప్రియంబున నాతని సత్కరించె భూషాదులచే'' నని చెప్పిరి. ఇంతవరకు బాగున్నదికాని, "సత్కరించి వహ్ని సాక్షికంబగు సఖ్యమాచరించి పనుపు నధిపునెంచి పౌత్రునూరడించి వరమేష్ఠి సుతుదేగె, పంక్తిముఖుఁడు నెలవుబాసి చనియె" నని యొక పద్యమున్నది. ఇది పాపరాజుగారిది కాదేమోయని యనుమానము. తనకు ఓడిపోయినవానితోఁ గారాబద్ధుఁడైనవానితో అగ్నిసాక్షికమగు సఖ్యమెవ్వఁడు చేయును? కాని, "అహింసకంసఖ్యంముపేత్యసాగ్నికం ప్రణమ్య తం బ్రహ్మసుతం గృహం యయౌ" అని మూలమున్నది. దాని కనువాదముగూడ నున్నది. ఇది పాప రాజుగారి పద్యముకాదని యెవ్వరు చెప్పవలయును? కావున నీయహింసక సఖ్యాదులుగూడ పాపరాజుగారు చెప్పినవేయనుట తప్పదు. ఐనను మూలమున కనువాదమని పాపరాజు చెప్పదుగదా! తిక్కనగారిట్లు చెప్పిరి. కార్తవీర్యుఁడు పులస్త్యుని సత్కరించి వచ్చినపనియేమని యడిగెను. పులస్త్యుడు చెప్పుచు– "ఆలవి యెఱుంగనేరక దశాస్యుఁడు లోకముతోడివానిగాఁ దలఁచి" "తుది ముట్టయున్న నీకొకఁడెదురే? యడగాక, పగఱ యేపడఁగినఁ దప్పదలంప, విదియ కడునొప్పిదమగు" "నలినజుడైన బ్రహ్మకును నాలవవాఁడు దశాన నుఁడు నిర్మలగుణలోలు! వీఁడు మనుమండని చెప్పఁగ నాకు సిగ్గగున్ బలు కులువేయు నేటికిఁ గృపాపరతాస్తుతిదక్క, వీని మందలవదు నాకుఁగా" ఇత్యాదిగాఁ బలికెను. కార్తవీర్యుఁడు నట్లచేయుదు మహాత్మ... దశాస్యు వేగఁ దోడ్కొని చనుఁ" డని రావణు విడిపించెను. పైమాటలలో "వీఁడు మను మండని చెప్పఁగనాకుసిగ్గగున్" అన్నమాటలు విలువగట్టరానివి. 'వహ్ని సాక్షికంబగు సఖ్య'మనుమాట స్మరించుటకుఁగూడఁ బనికిరానిది. ఇట్టిపోరు ముగిసినది.

## 19. వాలి యుద్ధము - రావణుని చతుస్సముద్ర స్నానము -

రావణుఁడు సైన్యముతోఁ గిష్కింధకేగెను. అచ్చటఁ 'దారు' డను వాఁడువచ్చి "దానవేంద్ర! నీవును జను వాలిమీద-నసువుల్ ఖరియింపఁగ నొల్లవేని, నాయన యిపుడేగినాఁడు చతురబ్ధుల స్నానము లాచరింపగన్" అని చెప్పెను. రావణుఁడు - "క్రొత్తలు వింటిమి మఱేమి క్రోతులపురి" నని యనుకొనుచు దక్షిణసముద్రమునకేగెనని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగా రాతారుని పేరేయెత్తికొనలేదు. సుగ్రీవుఁడు యుద్ధాటోపము సేయఁగా, రావణుఁడు "పడుచుంబైదలుపన్నిన గడవిచనక" యుద్ధము చేసెదరా యనెను. సుగ్రీవుఁడు-"నాకిట్లింతయు నీడఁబోయితి" "యిష్టు దక్షిణపు మున్నీటన్ గృతస్నానుఁడై యేకాంతంబున నుండుఁబో'' మ్మని చెప్పఁగా విమానమునెక్కిపోయెననిరి. కిష్కింధారాజ్యమునకు వాలివెనుక నంతటవాఁడు సుగ్రీవుఁడని గుర్తింపలేకపోవుట యొకదోషముగా నగుపడును. మూలమున- "తత స్తం వానరా మాత్యస్తారః తారా పితా ప్రభుః" అని యున్నది. దానివలెనే 'తారు'ఁడు వచ్చి మాట్లాడుట చెప్పెను. కాని, అప్పుడైనను 'తారాపితా' అని యున్నదానినిఁ గూడఁ జెప్పక విడిచిపెట్టెను ఒకవేళ సుగ్రీవుఁడు వాలిచేఁ దఱుమఁబడిన తరువాత వాలి యూరలేనప్పుడు రావణుడు కిష్కింధకుఁ బోయెనాయన్ననదియు సరిపోదు. ఈసంగతి యంతయు రామాయణకథకు బూర్వకాలికము గదా! ఏమైనను పాపరాజు మూలముచూచియే యనువాదము చేసెననుట స్పష్టము.

'అవంధ్యగతి సంధ్యవార్చు' వాలిని జూచి శాఖా మృగమాత్రుగాఁ దలచి కపటంబునఁ బొంచి పొంచి పట్టెద" ననుకొని, రావణుఁడు వాలికి వెనుక భాగముగాఁ జప్పుడు లేకుండఁబోయెను. అప్పుడు వాలి "పదముల చప్పు డింత చెవి బాఱినఁ; గన్నులు విచ్చి" రావణునిఁ జూచి తన్ను బంధింఁపగా వచ్చుట నూహిఁచి వీని సముద్రములలో ముంచి తేల్చెదనని తలఁచి కన్నులు మూసి యుండెనని పాపరాజుగారు చెప్పిరి. ముందు పద్యమున "సద్దుగాకుండ నొయ్యన పాదంబులు పెట్టుచున్'' అని చెప్పి, తర్వాతి పద్యమునఁ ''పదముల చప్పుడింత చెవిఁబాఱినఁ గన్నులు విచ్చి'' అని చెప్పుట యెట్లు సమంజసమో తెలియదు. చప్పుడుగాకుండ నడుచువానికంటె వినువానికాశక్తి యెక్కు

వలెయా? లేక రావణుఁడు వచ్చుటను ముందే వాలి యెఱింగెనా? లేక రావణుఁడు చప్పుడు గాకుండ నడిచినను, ఆపదముల చప్పుడును వాలి తెలిసికొనెనా? 'చప్పుడు' అనఁగా నచేతనవస్తువు లొకదానితో నొకటి తాకుటచే గలుగు ధ్వని అని యున్నది. రెండు దూది యుండలు రెండు మల్లె మొగ్గలు తాకుటలో గలుగు నప్పటి చప్పుడాయిది? ఏమో, అతనికే తెలియవలెను. ఎట్లైనను వాలి యా చప్పుడు విన్నాఁడు. కావున రావణుఁడు చప్పుడు కాకుండ నడిచినట్లున్నను చప్పుడేమో కల్గినదని మనము తెలిసికోవలెను.

తిక్కనగారిట్టు చెప్పిరి. "రావణు నుద్యోగమునకు దైవము ప్రతికూలమైనఁ దత్వవిధి ధ్యా సావేశవి రామంబై యావనచరవిభుఁడు కన్నులరవిచ్చుటయున్" "గడగంటిచూడ్కిఁ దశముఖుఁ బొడగని" "మగుడ నేత్రములల్ల మూసికొని" యుండెననిరి వాలి కన్నులు మూసికొనుట నిరువురు చెప్పినను, తెఱచుటకు గల కారణములు వేరు, చప్పుడు విని తెఱచెనను కారణము దైవము రావణునికిఁ బ్రతికూలమగుటచే వాలికి తత్వవిధిధ్యాసావేశవిరామము కలిగినదని చెప్పిరి. ఇది ధర్మప్రవర్తకుఁడైన దైవము చేయు వాలిధ్యానావేశవిరామము. ఇది కూడ ధర్మనిష్ఠమే. వాలి రావణు నుద్యోగమంతయు నూహించుట లోకనిష్ఠ. ఈ లోకనిష్ఠలో రావణుని పాపోద్యోగమునకు ప్రతిక్రియ చేయఁదలంచుట గూడ ధర్మనిష్ఠయే. దాని కనుకూలముగా కన్నులు మూసికొని యుండుటయు ధర్మనిష్ఠయే. ఈ విధముగ ధర్మనిష్ఠా కార్య జాతము వెల్లడించినవాఁడు తిక్కనగారు. లోక తంత్రమున జరుగుకారణ కార్యజాతములో మునిగి తేలినవాఁడు పాపరాజుగారని తెలియుచున్నది.

రావణునిఁ జంక నిఱికించికొని "చతురుదధి స్నాతుఁడై" వాలి "కిష్కింధా పురోద్యాన పద్ధతిఁ బ్రాపించి భుజాంతరంబున మహాదైన్యంబుతో వ్రేలు" చుండిన రావణు దిగవిడిచినగుచు "దేవారి; హా; యెప్పు"దని రావణుఁ బల్కరించె నఁట: రావణుఁడు కూడఁ "గ్రమ్మరన్ జననం బొందితి" నంచుఁ దలపోయుచు నాలుగు పద్యములతో వాలినిఁ బొగడి" "నీవు నే నెన్నటికిట్లు చెల్మివహించియె యుండుద"మని పల్కెను. మాసము రోజులక్కడ నుండి విమానము నెక్కిపోయెను. ఇట్లు పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు గూడఁ జెప్పిరి గాని యొకటి రెండు విశేషములు గలవు.

తిక్కన గారిట్లు చెప్పిరి. వాలి రావణునిఁ జంక నిఱికించుకొని పోవునపుడు "అసురేశ్వరుఁడప్పుడు కాలుఁ జేతుల లాఁవఱి రభసంబునన్ గుదుప, నక్కడ నిక్కడ నూడఁజూచి మైగిలుపఁగ నవ్వి, శక్తి యెఱిఁగించుట నెమ్మదిగోరి వాని మై సురసుర నొక్కి" ననియు, "చదియంగ నొక్కి యెత్తికొని శాతనఖంబులఁ గ్రూరదంష్ట్రలన్ వదనములన్ శరీరము వారక వ్రచ్చుచుఁ" బోయెనని చెప్పిరి. ఈ ప్రయాణములో నిరువైపుల ఘర్షణములు ప్రతిక్రియలు పెక్కులు గన్పడును. అవన్నియుఁ జంకలోఁ జిక్కిన వానికిఁ జిక్కించుకొన్న వానికి స్పష్టముగాఁ దెలియఁగలవు. పాపరాజుగారు వాలిపోవునప్పుడు "ప్రక్కలఁ జక్కఁగా నదిమి బాహు శిరఃప్రముఖాఖిలాంగముల్ మిక్కిలి నొవ్వఁ జేయుచు" పోయెనని ఒక వైపు పట్టును మాత్రమే చెప్పఁగలిగిరి.

మూలమున – "సర్పమివాండజః అథతే రాక్షసాహాత్మ్యా హ్రియమాణం దశాననం ముమోక్షయిషవో వాలిం రవమాణా అభిద్రుతాపి" ఇత్యాదిగా నున్న వానిని గలిపి పాపరాజుగారు చిలువ నొడిసివట్టి పఱచు పన్నగారిదారి" "ఆకాశంబున కడ్డమేగిన ప్రహస్తాద్యసురామాత్యు లప్పాకారిప్రియసూతి వాలజనిత ప్రత్యగ్రజంఝానిలోద్రేకం బోర్వక తూలికల్ చెదరులీన్ వేషముల్విచ్చి చీకాకై పోయెడు జోక నొచ్చి చని" రని చెప్పిరి. ఉపమానోపమేయ సాధర్మ్యము లెట్లున్నను ప్రహస్తాదు లడ్డము వోవుటయు నొచ్చిపడుటయుఁ జెప్పిరి. తిక్కనగారింతయాడంబరముగాఁ జెప్పలేదుగాని యా వాలియొక్క– "మేనిగాలిఁ దోయదములు దూలఁ బశ్చిమ దిగంబుధికిన్ జనియెన్" అని ముగించిరి తర్వాత– "కోపంబాఱినఁ జంకవాపి ధరణిన్ గూర్చుండఁగాఁ బెట్టి" అచ్చట నప్పుడ కనినట్టుల సంభ్రమించి" "ఎందుండి రాక యిక్కడి" కని వాలి సంభావించెనని తిక్కనగారు చెప్పిరి." "అప్పని విందము నీవింటికడకు విచ్చేయు"మని సాదరప్రియభాషల నాడెననిరి. ఇచ్చట "పరిహాసే ప్యనౌచిత్యం" అన్న సూక్తినెంత గౌరవించెనో కావ్యజ్ఞులకుఁ దెలియకపోదు.

పాపరాజుగారుచెప్పిన పద్యములు బాగున్నవి. కాని తిన్నగారి రచనకు వానికి పోలికలేదని తెలియును. చూడుఁడు–"తగునీకేమని పల్కినన్ వినుము, భుజాదర్పంబునన్ మాఱులేక గిరీశుగ్గిరితోన యెత్తి, సురలోకస్వామి జంఘారిగా, శిగబంధించి, జగత్త్రయంబును బసుల్ సేయన్ విజృంభించి గర్వగరిష్ఠుఁడగునన్ను నిద్దెసకుఁ దేరంజాలుటన్ వాసవీ"–అని యున్నది. ఇచ్చటఁ దన్ను,

ప్రశంసిందుకొనుచునే యెదుటవాని యాధిక్యము మినుముట్టంజేయు నేర్పరితనము తిక్కనగారికే చెల్లినదనవచ్చును. పాపరాజుగారుచెప్పిన నాల్గుపద్యములు-కేవలస్తుతులు. ఈ విధముగా నిద్దరి రచనలు సాగినవి.

## 20. హనుమజ్జననాది వృత్తాంతము -

రావణ పరాజయ హేతువులైన కార్తవీర్య వాలి కథలనుజెప్పి అగస్త్యుడు "లీలనటు దనుజవల్లభు కేళీపాత్రముగఁజేసి క్రీడించిన యవ్వాలి భవదస్త్రమున కఱసాలియుఁజాలమి నుతింపఁజాలదె" యని పొగడెను. రాముఁడు చిఱునవ్వున 'అతని వినితిమి, యింకనొకటి వినఁగవేడుక' యని యడిగెను. అగస్త్యుఁడాలోచించు చుండఁగనే రాముఁడు-"కొంత యెఱుంగుదుఁ బవనజువింత దివిజరాజ తనయు విక్రమము; హనూమంతునకు వాలికిన్గల యంతరమే కొలదియొకొ చరాచర వేదీ" యని ప్రశ్నించెను. అగస్త్యుడు "అంజనేయునతులబలము విన వేడ్కసేసె నితఁ" డనియెంచి, "కేసరియను వానిభార్య గుణశాలిని యంజన నాఁగనొప్పు సుందరి" యని కథ మొదలు పెట్టెను. ప్రసక్తానుప్రసక్తముగాఁ గథనాకళించుకొనుట యిట్టిది. రావణపరాజయ కారణమైన వాలికథ చెప్పి, దానితో సంబంధముగల హనుమంతునికథ చెప్పుటను సూత్రము పట్టినట్లుగా తిక్కనగారు పేర్కొనిరి. పాపరాజుగారికీ పట్టు చిక్కినదికాదు.

పాపరాజుగారి కథయిది. రామునితోనగస్త్యుడవ్వాలికథఁ జెప్పుచు, నారదుఁడు రావణునకు యమాదుల జయింపఁబొమ్మనుటయు, నాతఁడట్లే పోవుటయు మొదలుగా కపిలముని దర్శనముచేయువరకు కథసాగినది. అప్పుడు "ఆదినారాయణస్వామివగుటఁ దెలిసె నరయ నరుడవెనీవు పట్టాభిరామ" యని అగస్త్యుఁడు రామునకు దేవత్వము నర్పించెను రావణ వధార్థమై నీవు పుట్టఁగా, నీపనులు చేయుటకై రుద్రాద్రుల యంశలతో హనుమదాదులు పుట్టిరనిచెప్పెను. అందులో హనుమంతుడు సాక్షాద్రుద్రుఁడే యనెను. "సాక్షాద్రుద్రుఁడు గాక యున్నఁగలవే చర్చింప నీశౌర్యధైర్యా" దులని పొగడెను. ఈవిషయము నీవు తప్ప నితరులెరుంగరని పదిపద్యంబులఁ బ్రస్తుతించెను. తర్వాతఁ "కుంజరీ గర్భవాసము నందుండియు నిర్గమించెనితఁ" డని హనుమజ్జన్మాదికముఁ జెప్పనుపక్రమించెను. ఇట్లు చెప్పుటతో బండి గాడితప్పినది. తిక్కనగారికి చిక్కిన పట్టు ఇతనికి దూరమైనది. తిక్కనగారికే కాదు మూలమునకుఁగూడ దూరమై

తృతీయాశ్వాసమునుండి పంచమాశ్వాసమువరకు ప్రయాణముచేసి హనుమంతుని కథనందుకున్నాడు. రామునిపైభక్తి యాంజనేయునిపైభక్తి యతిశయము గావచ్చును, కాని కథా సూత్రము త్రెంపికొనుట చేయరానిదని తెలియును. ఈ విధముగాఁ గుంజర గర్భమున హనుమంతుడిపుడున్నాడు.

తిక్కనగారిట్లు చెప్పిరి. "వాలింగలియు వాయుపుత్రు సరియే" యని పొగడుచు "అంజనానాఁగ సుందరి యనిల ప్రసాదమున ధర్మవిధిన్ మహనీయ మూర్తి విస్ఫురితు గుమారుగాంచెఁ బరిపూర్ణ తపోమహిమాభిరామయై" అని యగస్త్యుఁడు చెప్పెను. ఇందులో విశేషణములన్నియు సాభిప్రాయములు. ఒక్క పదముకూడఁ బాదపూరణమునకైనది గాదు. అంజనా కేసరుల-అనిల ప్రసాదము, పరిపూర్ణ తపోమహిమాభిరామత, ధర్మవిధి-యెట్టిదో దానికిఁదగిన కుమారుడెపుట్టెనని స్ఫురింపఁజేయును. తిక్కనగారి కవిత యట్టిది. పాపరాజుగారు "కుంజర గర్భవాసఁమునందుండియు నుద్భవించె నితఁడంచద్బాల భాను ప్రభన్" అనిచెప్పిరి. అందలి సాభిప్రాయ విశేషణములెవ్వియు లేవు. పైఁగా, సీసపద్యమునిండుగ, "రత్నకుండల భాసుర కపోలముల వాని, ధవళ యజ్ఞోపవీతముఁవాని, హొన్నుముంజి పట్టుపంచె మొదలగువానితో నొప్పెడు కుమారుఁగాంచె" నని చెప్పటలో-ఇవి ఉపనయనమునాఁడు పెట్టినవో, పుట్టుకతోడనే పుట్టినవో అది దేవరహస్యమైనది. ఆ దేవరహస్యమును నమ్మియే పాపరాజుగారిట్టి కుమారు మనకుఁజూపించుచున్నాడని తెలిసికోవలెను.

హనుమంతుఁడు ఫలభ్రాంతితోఁ బాలభానునిఁబట్ట బోయెను. అప్పుడు వాయుదేవుఁడు- "సలిలకణార్ద్రితన్ గిరణజాలము వేడిమి సోకకుండ నే వలనను దానయై పొదివివచ్చెఁ దనూభవు" నని తిక్కనగారును, "భానుకడకేగు నప్పిన్నవాని కెండదాఁకకయుండ నుద్దండవృత్తి నుడిగి మిన్నేటితమ్మి పుప్పొడి దుమారఁమెనసి వలిగాడ్పు వెనువెంట జనుచునుండె" అని పావరాజుగారును చెప్పిరి. కుమారునకు వేడితాకకుండ వచ్చుటలో 'సలిల కణార్ద్రితన్-ఎవ్వలనను దానయై పొదివి' వచ్చుట మేలో, 'ఉద్దండవృత్తి నుడిగి, మిన్నేటి పుప్పొడి దుమారమెనసి, వెనువెంట చనుట'మేలో వివరింపఁబనిలేదు. ఇట్లే "పద్మహితుఁబట్టి యాననమునఁ బెట్టుకొను, బెట్టువేడిగా నట్టెవిడుచు నడఁచుఁ జేతులు సెగయైనయవియటంచు" ఇత్యాదిగా రెండుగడియలు జరిగినకాలము బాల్యక్రీడలని త్రోసివేయవచ్చును. మూలమున- "శిశురేషత్వదోషజ్ఞ ఇతి

మత్వాదినేశ్వరః కార్యంచాత్రసమాయత్తమిత్యేవంనదదాహనః" అని యున్నది. బాలుఁడని సూర్యుడే వేడి చూపనప్పుడు తిక్కనవారు గూడ దానినట్లే చూడ వలెఁగదా!

"ఆస్సైంహికేయుఁ దర్కగ్రాసాదరవృత్తి వచ్చుకపిఁగనుఁగొని సంత్రాసభరితమానసుఁడై వాసవుకడకేగి"సంగతివిన్నవించెనని తిక్కనగారుచెప్పిరి. పాపరాజుగారుచెప్పచు-"అగ్రహరాజుఁబట్టిన మహామహానీతనిఁజూచి రాహువత్యాగ్రహావృత్తితోఁ గహకహార్భటిఁజేయుచుడాయ"నని చెప్పిరి. తిక్కనగారి రాహువునకులేనికోపము పాపరాజుగారి రాహువునకేల వచ్చెనో తెలియదు. మూలమున "అపక్రాంత స్తతస్త్రస్తో రాహుశ్చంద్రార్కమర్దనః సఇన్ద్రభవనం గత్వా"అనియున్నది. మూలమునగూడ రాహువు 'త్రస్తు' డైనట్లు చెప్పగా పాపరాజుగారిట్లు చెప్పుట యెందుకో తెలియదు. ఇచ్చటనేగాదు, వాయువు తన కొడుకు వెంటనంటి పోవునపుడు కూర "సూర్యదాహభయాద్రక్షన్ తుషారచ శీతలః" అన్నదానిని విడిచి స్వేచ్ఛగ సంచరించెను "తుషారచయశీతల"మైన దానికంటె "సలిలకణార్ద్రము" ఐనదానికంటె జల్లనివస్తువుతాను జెప్పెనేమో గదా!

ఇంద్రుఁడైరావతము నెక్కి రాగా, నతనివెంట రాహువువచ్చెను. కాని 'విభీత స్వాంతుఁడై' రాహువు పరువెత్తెను. ఇది నల్లనిపండని హనుమంతుఁడు, "ఎగచికొనిబోయి కపి-దివిజేంద్రు దంతివెనుక సౌఅ-నంటఁదఱిమిన, మనములోన మెచ్చియును, తనచేసినమేర తప్పునని, తలంచుచు మృదురోషుఁడై యతండు"- వజ్రాయుధమున వ్రేయఁగా హనుమంతుఁడు మూర్ఛపోయెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారీకథనే చెప్పచు -"భద్రగజంబుపై కుఱుకు పావని నొండొకటన్ మరల్పలే క్రదులు వక్కలించు కులిశాయుధముద్ధతిఁ బూనివైవ నయ్యద్రిచరుండు వామహనువఃదునన్నొచ్చిన మూర్ఛఁజెంది పూర్వాద్రిపయిన్ బడెన్" అని చెప్పిరి. హనుమంతుఁడు మూర్ఛపోవుట నిరువురు చెప్పినను కారణ సామగ్రిచూపుటలో వ్యత్యాసమున్నది. తిక్కన రచనలో "హనూమంతుఁ డెగచికొని పోయి యంటఁదఱుమఁగా నింద్రుడు మనమ్మున మెచ్చుకొనియుఁ దనచేసిన మేర తప్పునని మృదురోషుఁడై వజ్రాయుధము విడుచుట యింద్రుని పాత్ర కౌచిత్యము చేకూర్చును. మెచ్చుకొనుట, మృదురోషుఁడగుట దీనికి జీవగఱ్ఱలు. పావరాజుగారి రచనలో నట్టివేవియు లేకపోగా,

"అద్రులవ్రక్కలించుకులిశాయుధము" గొని వైచుటలో నతని యుద్రిక్త స్వభావము వెల్లడియగును "అద్రుల వ్రక్కలించు" పావని నొందొకటన్ మర ల్పగ లేక" ఇత్యాదిపదము లీ భావనము పెంచుచున్నవి. మూలమున-"ఏవమా ధావమానంతు నాతిక్రుద్ధశ్శచీపతిః హస్తాంతాదతిము క్తేన కులిశేనాభ్యతాడయత్" అని చెప్పబడినది. 'నాతిక్రుద్ధః' 'హస్తాంతాదతిము క్తేన'-ఈపదములు సౌమ్యతా స్ఫోరకములు. ఇట్లు మూలము చెప్పినను, పూర్వుఁడగు తిక్కన గారు చెప్పి నను వానిని గ్రహింపక పాపరాజుగారు తమ రథమును నడిపించిరి.

వాయువు తన సంచారముపసంహరించుట మొదలు-పావని తేఱు కొనఁగా వాయువు యథాప్రకారమగునంతవరకు కథ నిరువురును జెప్పిరి. తిక్కనగారు-బ్రహ్మేంద్రాదులు వాయువునుజూచి "సుతాననస క్తలోచనుండై మనపచ్చుటఁగానఁ" డని యనుకొనిరని చెప్పిరి. పాపరాజుగారు "వనజభవు రాకఁ గనుగొని యనిలుఁడు గొడుకుఁ గొనివచ్చి యజునకు మొక్కెన్" అని చెప్పిరి. బ్రహ్మాదులు తాము వచ్చుటనుగూడ వాయువు గమనింపలేదని తిక్కనగారు చెప్పుటలో వాయుకృత జగత్సంక్షోభమునంతయు గమ్యమానము చేసిరి. పాపరాజుగారట్లు చెప్పక పదిపద్యములతో జగత్ క్షోభమును జెప్పి గ్రంథము బెంచిరి.

తిక్కనగారిట్లు చెప్పిరి. వాయువు తనకుమారుని బ్రహ్మచేతఁ బెట్టఁగా నాతఁడు-"ఫాలంబునఁ గేలిరవొంద నెత్తిపొదవి, భుజము నాఁతని మ స్తకంబు వక్షంబున జేర్చికృపాతిరేకమున గాఢముగన్" "పశ్చిమ దిశచందంబుననిశ్చేష్టు డయిన బాలునిన్ జూచుఁడు, వాఁ డాశ్చర్యంబుగనపుడ పునశ్చైతన్యా గమనంబునన్ దెప్పరిలెన్'' "దర్శనమాత్రన శోక విమర్శక్షమచిత్తుఁడయ్యె మారుతి, బాహా స్పర్శమునఁ బ్రబలదురితనికర్శుఁడు వ్రణ నిర్వికారుఁగా నొనరించెన్" అని చెప్పిరి. వాయుదేవుఁడు సంతోషించెననియుఁ జెప్పిరి. పాపరాజుగారీ విమర్శనమేదియు నందుకోలేదు. బ్రహ్మ- "పవిధార వివశుఁ డైన యక్కుమారుని గనుఁగొని యాదరమున'' "అనిల సుతుని నెమ్మేను నిమిరిన శోషదీఱి" మూర్ఛదెలిసిన యంజనముద్దుపట్టి నంకమునబెట్టి యజుఁడు ముద్దాడుచుండె''నని చెప్పిరి. ఇచ్చట మూర్ఛదేఱుట ముఖ్య విష యము. దాని నతి ముఖ్యముగా వి స్తరించి తిక్కనగారు సముచితౌదాత్త్యము

ఘూపించిరి. పాపరాజుగారీ మూర్ఛదేలుట సామాన్యముగాఁ జెప్పి జగ దుప ప్లవమును మిక్కిలిగాఁ జెప్పిరని దీనివలనఁ దెలియును.

బ్రహ్మాదులు వరములిచ్చుటమొదలు-సుగ్రీవ సఖ్యమువఱకు నిరువురు కవులుగూడఁ జెప్పిరి. మూలమున లేకున్నను, తిక్కనగారు చెప్పకున్నను పాపరాజుగారు విద్యాభ్యాసమును బ్రస్తావించుచు "కుడిచి చల్లని నీడలఁ గూరుచుండి గురువుచెప్పినఁ జదువ రీధర వడుగులు'' అని చక్కని పద్యము వ్రాసిరి. ఇది బాగున్నది. మూలము రచించువాఁడికిని, పదుమూఁడవ శతాబ్ది నాటికిని విద్యార్థుల చదువులిట్లు లేవేమోయని తోఁచును. కావుననే ఆ ప్రస్తావన వారందుకోలేదు. ఇట్లు గాఢముగా మూలము నాధారము చేసికొన్నను, "జలసిక్తం యథాసస్యం" అనుదానికి- "వాడు లేఁబైరు వానచేవలెఁ జెలంగె" నని యనువాదము చెప్పినను బాపరాజుగా 'రిదియనువాద' మని చెప్పకపోవుట యెందుకో తెలియదు.

## 21. అగస్త్యాదుల వీడుకోలు -

ఇది శ్రీరాముని పట్టాభిషేకానంతరము వచ్చిన బంధుమిత్రుల వీడుకొల్పుటకై యేర్పడిన సమావేశము. వాలిసుగ్రీవుల జన్మకర్మాదులు, సనత్కుమారుని బోధ, శ్వేతద్వీపవృత్తాంతము రాముని సాక్షాద్దైవత్వము-అన్నియు ముగించుకొని, పాపరాజుగారు-''ఏ కొదువయు లేని నిన్నుఁ గనుఁ గొంటిమి, వేడుకయయ్యెఁ, బోయివచ్చెద'' మని యగస్త్యుఁడడుగుటయు, రాముఁడు-చేతులు జోడించి "క్రతువులు నేనొర్చునెడరావలయుంగృప మీర లిందఱున్" అని చెప్పి వారిని వీడ్కొనిరని చెప్పిరి. రాముఁడడుగుటయు మునులు చెప్పుటయుఁ గేవలౌపచారికమే. క్రతువులు చేయునాఁటికిఁ బిలుపు లుండనే యుండునుగదా! తిక్కనగారిట్లు చెప్పిరి. రాముఁడు చేతులు జోడించి-"మసలితిరి విచిత్ర కథా రసప్రవృత్తిన్ దడవెఱుంగ రాక, యనుష్ఠానసమయమయ్యె, నభోమధ్య సమీపంబునకుఁ దరణి యరదము వచ్చెన్" "విజయం చేయుఁ" డని పల్కెను. ఆ మునులును, "విశ్వజనీనుండగు నన్నుఁ జూపు సదనుష్ఠానంబుగాదే" ''ఈ ద్విజకోటింబరికించుకొమ్ము" అని చెప్పి వెడలిపోయిరని చెప్పిరి. ఇచ్చటఁ 'బొ'మ్మనుటయుఁ 'బో'యెద' ననుటయు నవసరముఁ బట్టి యుండును. రాముఁడు సమయజ్ఞుఁడై యనుష్ఠాన సమయము గుర్తింపఁ జేయు

టలో ధర్మానుష్ఠాతల కంటె రక్షకులకే బాధ్యత యెక్కువయని గుర్తుచేయఁ బడినది. ఆ మునులు గూడ-"భవ ద్విజయ శ్రీ తమ కోర్కెగా సుకృతముల్ వే భంగులన్ జేయుసీ ద్విజకోటింబరికించి కా" మ్మనుటలో రక్షణ భారమంతయు నప్పగించు స్వాభావికమే యయ్యు నమూల్య విషయము. మఱియు "మనలితిరి విచిత్ర కథారసవృత్తిన్‌దవిలి" యని రాముఁడే యెత్తి చెప్పుట చాల ముఖ్య విషయము. పాపరాజుగారికిట్టి శంకలు లేవు, సమాధానములు లేవు. మునులకు రాముఁడు దేవదేవుఁడు. రామునికి మునులు సాక్షాదపరబ్రహ్మలు గదా!

రాముఁడు వంతులువారిగా నొక్కొక్కరినే సాగనంపుచు "జనకాదిక్షితి పాలలోకములకున్ సంభావనా పూర్వకార్చన లందించి" వారివెంటఁ దన తమ్ములను గూడ దోడిచ్చి పంపెనని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారిట్లే చెప్పుచు, రాముఁడు మణిమయభూషలియ్యగా నందుకొని జనకుఁడు- "నృప సోమ! యివేటికి? మామయంచునన్ బ్రేమ బహూకరించుటయె పెక్కు ధనం బులు; సీత-లక్ష్మి, నీ వే మధువైరి; నీ మహిమ లెన్నుచు నూరికిఁ బోయి వచ్చె దన్" అని యన్నట్లు వ్రాసిరి. ఈ మాటలు సందర్భోచితములుగాఁ దోపవు. జనకుఁడు తత్త్వవేత్తయైనను, రాజర్షిగా నుండి యల్లునివలెనే రాముని జూచుట యుక్తము. "సీత-లక్ష్మి, నీవే-మధువైరి' వనుమాటలు పొరపాటున నైనను అతని నోట వచ్చుట శ్రేయస్కరము కాదు. మూలమున-"యాన్యాహృతాని రత్నాని మదర్థం సంచితానివై దుహిత్రే తానివై రాజన్ సర్వాణ్యేవ దదామిచ" అని యున్నది. దానిని గూడ ద్రోసివేసి యిట్లు చెప్పుట పాపరాజుగారి రచన.

భరతాదులు కొన్ని యమూల్యములైన కానుకలు తెచ్చి యీయఁగా, వానిలోఁ గొన్నిటిని "చేకొని సుగ్రీవాది మహాకవులకు నవ్విభీషణాదులక కిచ్చెన్" అని పాపరాజుగారు చెప్పిరి సుగ్రీవ విభీషణులకడ నిట్లు చెప్పుట యుచితముగా లేదు. తిక్కనగారు సుగ్రీవ విభీషణులఁ జూచి, "పురుష రత్న ములన పొందుట యుచితమీరత్నములకు"నని ధరావిభుండు వారికప్పుడొసఁగె గారవమేర్పడ జాత్య రుచిర రత్న జాలకంబు" నని చెప్పిరి. పురుష రత్న ములకు జాతి రత్నములు తగుననుటయు, వారిని ప్రత్యేకము గౌరవించుటయు వ్యక్తి విశేష గౌరవ స్ఫోరకము. వారలనెట్లు గౌరవింపవలయునో తిక్కన గారికిఁ దెలియుననవలెను.

శ్రీరాముఁడొకహారము నందుకొని "తాత! భగునుసీ కిది గ్రహింపు"

మని జాంబవంతునితో ననఁగా, నతడు" నన్నేలకొమ్మనె, మునలికేల'' నని యనఁగా, రాముఁడు నవ్వుకొనుచు, నాహారమాయన కిచ్చెనని పాపరాజుగారు చెప్పిరి. ఇది బాగున్నది. ఉచితముగా నున్నది. తిక్కనగారు దీని చెప్పక పోవుట లోపమనవలెను. ''వాలిపుత్రు నమ్మరుత్పుత్రుఁ బిలిచి నిజాంకయుగళి నిలిపికొని తానె తొడవులన్నియును దొడిగి యర్కసుతుం జూచి పతి యిట్టు లానతిచ్చె" నని పాపరాజుగారు చెప్పిరి. తక్కిన యుపచార మంతయు బాగున్నదిగాని, తొడపై నెక్కించుకొనుట భాగులేదు. అట్టి వాత్సల్యము ఎవ్వరికో గాని లభింపదు. ఇచ్చటనేగాక మఱి రెండు చోట్లఁ గూడ ''అంగదుసమరోచ్ఛ యాంగదు నలరింపు'' "వాసవి దుష్కార్యము లెంచకంగదునిఁ బ్రోవఁదగున్" అని పాపరాజుగారు పేర్కొనిరి. ఇవి బాగున్నవి కాని, తిక్కనగారు చెప్పిన ప్రీతి విశేషమిందుఁగన్పడదు, వానర సమూహము నెల్ల సముదాయముగాఁ బాలింపుమని చెప్పి వారిలో 'నంగదుఁ బాలింపు' మనుట ఉదాత్త ప్రాభవసూచకము. ఇట్లున్నను వృద్ధుఁడైన జాంబవంతుని పేరు విడిచి పెట్టుట తిక్కనగారి ప్రాభవమునకు వెలితియే యగును.

హనుమంతుఁడు తనకుఁదాలేచిరామునితో''రఘువీర! భవత్పద పంకజంబులన్, ఘనతరభక్తియెల్లపుడుగ్రాలఁగ, మీకథలెంతకాల మూర్వినిదగు-నంత కాలము శరీరమునిల్వవరంబొసంగవే'' యనివేడుకొనెను. రాముఁడట్లేయిచ్చితి నని తనకంఠహారమాతనిమెడలో వేసెను. ఇది బాగున్నది. కాని, అతనిపైగల మన భక్తికి, రామాయణములో నాతఁడుచూపిన వ్యక్తిత్వమునకు సరిగాలేదని తోచును. తిక్కనగారట్లుగాక, హనుమంతుఁడడుగకుండనే యా వరము లన్నియునిచ్చి తనకంఠహార మాతనిమెడనలంకరించి ''తిరిగి కౌఁగిలించి యగచరసత్తమునద్గుణములఁదవిలి సంస్తుతించె'' ననిచెప్పిరి. ఇరువురు కవులుత్తమముగనేచెప్పిరి. కాని, రామాయణమందు వాల్మీకివలె సీతనికి భ-ప్రపంచమున నున్నతసత్కారముండుట మరువరానిది.

పుష్పకవిమానము సాగనంపుట యొక చిన్నకథ. ఆకాశమున విమానము ''మీ గుణంబుమెచ్చి మీసేవగావింపు మనుచు మరలఁబనిచె' రామునికి విన్నవించెను. రాముఁడు సంతసించి-దానికిఁబూజలుసేయించి-దేవయానరత్నమ నేఁదలఁచినయపుడెరమ్ము, నీకు నిలువనింపొ దెనకిప్పుడ పొమ్ము'' అని సాగనంపగానదివెడలిపోయెనని పాపరాజుగారు చెప్పిరి.

తిక్కనగారట్లుగాక, పుష్పకవిమానమువచ్చి, కుబేరునిమాటలుగా, "రామ ధరణీనాథుండులోకత్రయం బాతంకం బెదనుజ్జగింప, సురలత్యానందముం బొందదుర్జాతుం బంక్తిముఖున్ వధించి, కొనియెన్ సర్వంబులంకాపురిన్" నీవును నందొక సరుకా భూవల్లభునకు వినోదమునకుం బాత్రంబై | వలసిన చోటులకుం బోవలతివి; నిన్ను నిందుఁబు త్తేదగునే" "అదియునుగాక లోకముల నన్నిటిఁగావఁదలంచి, దుష్టదుర్మద ఖరదండమండన పరాయణుఁడై చను నట్టివారికిట్టిది తగుగాక, పూని యొకటిన్ గడఁదేర్పగడంకలేక, యెల్లిదు దులగువారి కేటికి సలీల విహారము వేడ్కసేయగన్" కావున నెల్లభంగు లను గ్రమ్మఱఁజయ్యనబోయి రామధాత్రీవిభునొద్ద నిల్వుము: మదీయహి తంబిది; యేనుబంపఁగాఁ బోవుటనెగ్గులే దతఁడు పొచ్చెముసేయక నమ్మితించి సంభావనచేయు; నన్ను, జనపాలక! సమ్మదమంది వచ్చితిన్-ననుఁబని గొమ్ము"-అని పల్కెనఁట. రాముఁడు సంతోషించి "ఏ వలన నుండియైనను నా వలసినయపుడు గ్రక్కునన్ జనుదేరంగావలయును, దలఁచునంతకు నీవలనెట్లు తిరుగు నిఖిల జగములన్" అని చెప్పెను.

ఈ కుబేరుఁడుచెప్పిన మాటలన్నియునచ్చముగాఁదిక్కనగారు చెప్పి నవే యగును. ఆయన రాజనీతిజ్ఞత యట్టిది. "పూని యొకటంగడతేర్పగ లేక-యెల్లిదులు" అన్నమాటలు కుబేరుఁడేచెప్పుటచే నవి అవజ్ఞాకరములు గావు. "ఏనుఁబంపఁగాఁ బోవుటనెగ్గులే, దఁతడు పొచ్చెముసేయక సమ్మ తించు అన్నమాట" లుదాత్తభావస్ఫోరకములు. ఇంతటి రాజనీతిజ్ఞత పాపరాజు గారికి లేదు కావుననే ఆయన 'ముక్తసరి'గాఁగావ్యము నడిపినాడు. విమానము మాటలాడునా యని యొక సంశయ మస్మాదృశులది. అదిదేవయానముకాఁబట్టి, లేక, విమానమునడుపువాఁడొకఁడుండునుగాఁబట్టి, విమానమే ప్రధానము కాఁబట్టి అట్లు నిర్దేశించినారనవలెను.

మూలమున "సిద్ధానాంగమనే సౌమ్య; మా విషాదేనయోజయేత్" అని యున్నదానికి "సిద్ధుల గమనంబులకు విరుద్ధముగ ఁజనకు"మని తిక్కనగారు చెప్పిరి. ఇది యనువాదమో స్వతంత్రమో తెలియదు. పాపరాజుగారు దీనిని తడవనేలేదు. కాని "అభిప్రేతాందిశంతస్మాత్ ప్రాయాత్తత్పుష్పకంతదా" అన్న మూలమునకు 'ప్రేతదిశ' అని యర్థముచేసికొని "దక్షిణంబునకు నాక్ష ణంబుననేగెనని యుగ్గడించిరి. ఇది యనువాదము కాకున్నచో దక్షిణదిశ కే

పోయెనని యేలచెప్పుదురు? ఏమైనను మూలము ననుసరించి యున్నట్టులేదు.

## 22. రాముని యుద్యాన విహారము

పాపరాజుగారు-"ప్రజలనందఱి దాఁగన్న ప్రజల కరణి నరయుచు" నని యొకగీతము చెప్పి వసంతర్తువర్ణన పధాఱుపద్యములతోఁజెప్పి, నాలుగు పద్యములతో నొక పుట వచనముతో వనవిహారప్రయాణ నన్నాహముచెప్పి, "ఎదుర్కొనియె సొంపున గంధవహార్భకుండు"నని యుద్యానమున నడుగు పెట్టించెను. ఇందులోఁ బ్రాబంధిక పద్ధతియుఁబంధఁపాటవముఁదప్ప నింకేదియు గోచరింపదు.

తిక్కనగారు రెండుపద్యములతోఁ బ్రజాపాలనమును, ఒకపద్యముతో నుచితవిహారమును, మూడుపద్యములతో యువతీవిహారము నుగ్గడించి, "తదీయసమీరుఁడు దన్నుఁగానరా క పగిదిపీచిన" ఉద్యానవనముఁబ్రవేశించి రని చెప్పిరి. గ్రంధవిస్తారము పాపరాజుగారిది, కావ్యకధౌచిత్య పోషణము తిక్కనగారిదని పరిశీలకులు భావించుటలో నసంగతములేదని తెలియును.

పాపరాజుగారిట్లుచెప్పిరి. "ఎదుర్కొనియె సొంపునగంధవహార్భకుండు" అని స్వాగతముఁబల్కి, పరిచరులనెల్లనందేనిలిపి, వనప్రవేశముచేయించి "'కుంభినీనుత గబ్బిగుబ్బ పాలిండ్లతోఁబ్రతియైన గజనిమ్మపండ్లుగొన్ని 'మెట్టదామరలు' 'మల్లెనరులు' 'మేలుసంపెగలు' కుందబృందములు' కొన్ని వనపాలకులు కానుకపెట్టగా "వనిత నీ యంగములపోలు వస్తువితతి చేకొనక మాకు నిల్చునే చిత్త" మని నర్మోక్తులాడఁగా, సీత - "శిరమొక్కించుక వంచి కేవలఁగటాక్షించె"ననియు, నా చూపులే తూపులుగామరుఁడు వేసె ననియుఁ జెప్పిరి ఇది యాఱుపద్యములతో నడిచినది.

దీనినే తిక్కనగారు మూఁడుపద్యములతోఁజెప్పిరి. "తదీయ సమీరుఁడు తన్నుఁగానరాక పగిదిపీచినన్ గొలువుఁ గైకొనె"రాముఁడనియుఁ "వనపాలిక మత్తమధుపములకుఁదప్పి మధుభరితంబై క్రొత్తావిగ్రమ్మునరవిరి గుత్తి విభు నకిచ్చె"ననియు, "జనపతియందఁగా వెఱచుచాడ్పున జానకిఁజూచి, కానుకల్ గొనఁదగువారలుండ మనకుంజనునే' యని చేయి వాయఁబెట్టిన వనపాలికా కరపుటీకలిత స్తబకంబు పుచ్చె మెల్పున సతి-శేతనవ్వునఁగపోలతలంబులఁ గాంతి నిండఁగన్" అని చెప్పెను. ఇచ్చట నీ విశేషమగపడును. "కానుకల్

సేయఁ, బల్లవముల సెజ్జలుల్లముల లజ్జలడంపఁగఁ, దేఁటితండముల్ దివుటలుముం పఁగా, సమదలీల మనోజవినోదసక్తులై యవసర సేవమెచ్చి మలయానిలు సౌరభధన్యుఁజేయుచున్" గ్రీడించిరనియున్నది ఇట్టిదే పాపరాజుగారును వ్రాసిరి. పద్యమునకుఁ బద్యమేగాని, రెంటిభావముకు హస్తిమశకాంతరము గన్పడును. 'ఇష్టఫలావ్తిరంజిలెన్" అని భావమంతయును వాచ్యముగ నున్నట్లే తెలియును. తిక్కనగారట్లుఁగాక, తీవెలు పల్లవముల సెజ్జలు తేఁటితండము - లిత్యాదులాలంబనముకాఁగా మనోజసక్తులైరనియు, 'నవసర సేవమెచ్చి మలయానిలు సౌరభధన్యుఁ జేసిరని చెప్పుచు, ధ్వనిమార్గమున నూహ రమ్యచిత్రము నిర్మించిరి. "అవసర సేవమెచ్చి"యను పదనిర్మాణము ప్రాచీన సంస్కృత మహాకావ్యములఁగూడ నరుదేమోయనిపించిరి. ఇట్టి విన్యాసములకొఱకే యీకావ్యరచన నుద్దేశించిరేమోయనితోఁచును. పాపరాజుగారికిట్టి గట్టి పట్టున్నట్టు కనిపింపదు.

శ్రాంతయైనసీతనుజూచి రాముఁడు. "అలసితివిందుబింబముఖియక్కట! యంగము చెమ్మరించె. గుబ్బల అవికేల? మాన్పుకటిభారము"- ఇత్యాదిగాఁ బరామర్శించెను. ఆమె చెలికత్తె "ఘనరసగుంభనంబులెసఁగన్, భువనాధికరాగమొప్ప, మీరనుపమితామృత స్ఫురణనాడితి: రందున వేడ్కజెందె: నైన నురువనౌఘపుష్పహరణంబునఁ బుట్టినశ్రాంతివాయ నెంచిన యది మేఘపుష్పములు"- అనిబదులిచ్చినది. రాముఁడు నవ్వుచు- "గగనకుసుమమధ్యకామింప మేఘపుష్పమ్ములరుదె!"యని యాడుచు నామెతోఁ గొలనికడకుఁ బోయెనని పాపరాజుగారు చెప్పిరి. రసగుంభనము, భువనాధికరాగము, వనౌఘ పుష్పహరణము, మేఘపుష్పములు ఇత్యాది శ్లేషసంఘటితపదములు చదివినవారికర్థమగునవి. క్షణానంతరస్ఫురణ కలవి. ఇవికూర్చుట పాండిత్యమేయైనను, రసికజనాకర్షకములుగావు. అందునను జెలిమికత్తెలు ప్రయోగించుట యరుదు. విశేషార్థప్రతిపత్తియు మృగ్యము. ఇంతకు- అలసినసీత జలక్రీడగోరుచున్న దనియేగదా చెప్పఁదలఁచినది. దీనికింత ప్రబంధ గంధమేల యనిపించును. ఐనను బాపరాజుగారి రచన యిట్టిదని చూపించుటయే మనకార్యముగదా!

తిక్కనగారిట్లుచెప్పిరి. చెలికత్తెలు సీతతో-"నీదు కృపాకటాక్షమున నీరజషండము నందు నిర్భరాహ్లాదముఁ బొందఁగా, వనవిహార పరిభ్రమవృత్తియెమ్మెయిన్ ఖేదము చేయలేకునికికిన్, కమలాకరకేళిమీఁద లేదాదర మించుకేని" యనియన్నారు. తమకుఁ బూర్తిగా నిష్టమున్నను, ఇష్టములేనట్లు వ్యక్తము

చేయుట యొక ప్రౌఢోక్తి. దీనిని ప్రభువు గ్రహింపఁగలఁడని యజమానురాలితోఁ జెప్పుటతో నిది గుబాళించినది. సీత యీకోరికను గ్రహించినది గాని దీనినిఁ దన కోరికగాఁ జెప్పవలెనో వారి కోరికగాఁ జెప్పవలెనో యన్నది సందేహము. దానిని గంఠమున నాపికొని సీత "స్వేదజలక్లిన్నమైన రాముని మోముచూచి నది. చూచినదనఁగాఁ జూచియుఁజూడనట్లు చూచినది. చెలుల చతురోక్తికిని సీత సాకూతావలోకనమునకును భాష్యముచెప్పుచు రాముఁడు- "అనుచరుల నడిగి యడిగియు, పనిగొంద్రేవలయునెడలఁ బ్రభువులు; పోద-లెం"డని ముందుకు నడచెను. అందఱు సరస్తీరమునకుఁ జేరిరి. ఇష్టమున్నను లేనట్లుగాఁ బ్రకటించు చెలికత్తెయు, రాము నిష్టముకనుఁగొనుటకై సాకూతముగాఁజూచు జానకియు, తనకిష్టమున్నను దాని నప్రధానముచేసి ముందుకు నడుచు శ్రీరాముఁడును- అందఱును సరస్తీరమునఁజేరినారు. ఇట్లు నడిపించినది తిక్కనగారి ప్రతిభావిశేషము. ఇట్లు ప్రతిఫలించిన ప్రతిభగొప్పదో పాండిత్యముగొప్పదో చదువరులే గ్రహింపఁగలరు.

## 23. రాముని సరోవిహారము

దీని నిరువది పద్యములతోఁ దిక్కనగారును నలువది పద్యములతోఁ పాపరాజుగారును జెప్పిరి. అన్నియు జలక్రీడావిశేషములే. మచ్చునకు రెండు మూడంశములఁ బ్రస్తావింతును. తిక్కనగారిట్లు చెప్పిరి. "అందఱకు మున్న సలిల విహారమునకుఁగదగిఁ యొక్కర్తు గ్రక్కునఁ దొడవులూడ్చి నెలఁతుకల మొత్తమును పచ్చవిలుతు నను గు టంప పొదిలోని 'బరిగోల' యట్టు లుండె" "వీఁగుఁజన్నులపయిఁ గేలమర్చుచుఁ, దనూలత లించుకగొంకఁ, గుంతలంబులు మెలపొందగాఁ జెవులపొందునఁ జేర్చుచుఁ" గొలనిలోనికి దిగెనని చెప్పిరి. ఇట్లు చెప్పుటలో, వస్త్రాభరణాదులనూడ్చి సిద్ధముగానున్న చెలువ మరునియంప పొదిలో బరిగోలవలె నున్నదని చెప్పుట యపూర్వము. ఇంతకు ముందెవ్వరు నిట్టి యుపమానము వాడుకోలేదని తోఁచును. "వీఁగుఁ జన్నులపైఁగేలమర్చుట, తనూలత లించుక జంకుట కుంతలంబులు చెవుల సందున నిఱికించుకొనుట-ఇత్యాదులు క్రొత్త విన్నాణములు. ఇఁక నీఁదులాటకుఁబూనిన యంగనల ప్రత్యంగవర్ణన మదికిఁ బులకలెత్తించునట్లుండఁ గలదు.

పాపరాజుగారీ వర్ణనల జోలికిఁ బోలేదు. నిజమునకివి యెల్ల నందఱికీ నందుబాటులో నుండునవియుఁగావేమో! తిక్కనగారు - స్త్రీలు కొలనిలోనికి దిగుచుండగనే-చిలుకులయాట, జల్లు పోరాట, యీఁదులాట, ఓలలాట, ఇత్యాదిగా జలక్రీడా విశేషములఁ జెప్పుచు, గండుమీలతోఁ జక్రవాకములతో నంభోరుహములతో నళులగుంపుతోఁ-కన్నులఁ జన్నులు మొగములు కచములుం బెరయుటను వర్ణించి కావ్యశోభ నినుమడించిరి. పాపరాజుగారట్టివేవియు నందుకొనలేదు.

పాపరాజుగారు ప్రారంభమునందే-యీ సరసి శైవలకేశిని, పద్మకోరకస్తని,-ఇత్యాది పదబంధముతో వర్ణించి "కలికి జక్కవలు నీవలి గుబ్బలకు నుబ్బ" ఇత్యాదిగా రాముఁడు సీతతో సంభాషింప మొదలుపెట్టెను. కాని తిక్కనగారి భావనయిందు గనఁబడదు. సీత చేయిపట్టుకొని రాముడు కొలనిలోనికి దిగఁగా, బెదురుతో నామె రామునిమెడ కౌఁగిలించుకొనెను. అప్పుడు రాముఁడు- "ఒక్క కలశంబు ధరించినవార లెంత లోఁతైనను జొచ్చి యీఁదఁగ మృగాక్షి! యురోరుహకుంభ యుగ్మమునన్ బూనియు నీటికై వెఱచి పోయెద"వని సరసమాడెనని చెప్పిరి. తిక్కనగారు- "చేయిచ్చి యబల కధిపతిఁ తోయజషండంబు సొరఁగఁదాకొని చనఁ, జే దోయి పులకించె గనుఁగవఁ దోయలరుచుఁ బెరసెఁ, గోర్కితో నెదగూడెన్" "పొలతుక లోఁతని చొరఁగా, నళుకుచుఁ బిడిది కడుగులిడ నప్పటి దృగ్దీప్తులు క్రందు సెందు సందడి పొలపంబది యధిపు నుల్లమున కింపొసఁగెన్" అనిచెప్పిరి. ఇరువురు సమాన స్థానాపన్నములే చెప్పిరి. కాని మొదటిది ముదురుపాకమున నున్నట్లు, రెండవది లేతపాకముఁ దీగె సాగుచున్నట్లు గనఁబడును. రెండు నాకర్షకములేయైనను తిక్కనగారి రచన ఉత్తర కాలాయతి గలిగి సుకుమారముగా హృదమునకు హత్తుకొనును.

పాపరాజుగారు- "మొగము బిటారమున్ నుదుటి ముంగురులున్ దళుకొందు చూపులున్ బిగి చనుదోయి చెమ్మగిలు చెక్కులతేఁటలు...చెయ్యులన్ దగిలి విభుండు లోమఱచెఁ దత్సరసిన్ విహరింపవచ్చుటల్" అని చెప్పిరి. తిక్కనగారు "కలియఁ జరించు తేటపొదిఁ గైకొనఁ- దా ధవళాయతాక్షి వేనలిపయిఁ జూడ్కినిల్పు, నళినంబులఁ జేకొనఁ- దాలతాంగి చూడ్కుల్పు మదిమెచ్చు, — విభుండు వేడుకన్" అని చెప్పిరి. రెండును సమాన స్థానా

పన్నములే యైనను, పాపరాజుగారి రచనలో నుపమేయములే చెప్పఁబడినవి. తిక్కనగారి రచనలో-నుపమానములను జెప్పుచు నుపమేయములం దాధిక్యము తెల్పుట యొకటి, పాపరాజుగారి రచనలో 'అవి చూచుచు మైమరపొందుట చెప్పఁగా తిక్కనగారి రచనలో మైమఱపు లేకుండుట యొకటి – చెప్పబడినవి. ఇందేది హృదయాకర్షకమో మనోమోహనమో చదువరులే నిర్ణయింపఁగలరు.

పాపరాజుగారు- "దశరథాత్మజుకరవారి ధార ధారుణీ కుమారిక కురులపై నెఱసి, చెక్కు లొరసి, కణలీల మొగమాని మెఱసె ముఖ సుధాకరునిఁ గొల్వవచ్చిన తారలనఁగ" నని చెప్పిరి. తిక్కనగారు- "చెలువచిగురుఁగెంగేలఁ గాశ్మీర జలము నతివ నగుమోమునన్ జందనాంబువులును నెలతపేనలిఁ గస్తూరి సీరునయ్యె నయ్యెడలఁ గాంతికర యంత్రధార"నని చెప్పిరి. ఇరువురుగూడ- "జానక్యాః కమలా మలాంజలిపుటే" యను శ్లోకమునకుఁ బ్రతిచ్ఛాయ వ్రాయదలఁచినను, దీర్పులో వేఱుగానున్నను, పాపరాజుగారి కరయంత్ర ధారకు వర్ణ వ్యత్యయము కలుగలేదు. కురులపైఁ బడిః జలము తారలవలె నెట్లుండునో తెలియదు. తిక్కనగారి కరయంత్రధాఁ వేనలిపైఁబడి కస్తూరిసీరుగా నైనది. ఇందేది హృద్యము, ఉపాదేయమైనదో చదువరులే నిర్ణయింపఁగలరు. ఇట్టివిహారములు మఱికొన్ని గలవు. వేడుక కొరకై యింకొకటి మాత్రము ప్రదర్శించెదను.

తిక్కనగారు- "సలిలకేళికి నొలసియు ఖొలయ కిట్లు ప్రాణవల్లభు మీఁదికిఁబ్రాఁకి వేడ్క నలిమి యలిమియైఁ బెనఁగొన నతనియందు నిలిచి విహరించుచుండె" నని సీతను వర్ణించిరి. పాపరాజుగారు- "కోడెమిటారి గుబ్బకవ గుబ్బెతఁ గ్రుమ్మిన, మున్నుచల్లుపోరాడిన క్రాంతివీఱఁ, బులకాంకురముల్ చెలువారఁ, గుంజరీ క్రీడలనుబ్బు హస్తిపతికిన్ బ్రతియై జలకేళి దేలుచున్ వేడుకవెల్గిఁ దేలె రఘువీరుఁడు మారుఁడు కేకవేయఁగన్" అనిచెప్పిరి.. ఇచ్చటఁ గుంజరీ క్రీడారహో విహారము ప్రసక్తమైనట్లు కన్పడును. 'దీనికి మారుఁడు కేకవేయగన్' అనునది బలము నిచ్చుచున్నది. సందర్భమంతయు నతికినట్లున్నది. అందఱు చెలికత్తెల నడుమ నిట్టిక్రీడల నెఱపుట పాపరాజుగారి కెట్లున్నను శ్రీరామునివట్ల నిది యుక్తమా యనిపించును. కనుకనే తిక్కనగారు "అలమి యలమిమైఁ బెనగొన నతనియందు నిలిచి" సీత తన

కాంక్షాతిరేకమును చాటు చాటుగా దీర్చుకొనుచుండెనని చెప్పిరి. సీతకైననిది యుక్తమా యన్నచో "కామోష్ట గుణఉచ్యతే" అనునదియే సమాధానము కావలెను. ఈ యిరువురిలో నేపక్షము యుక్తమైనదో అదియుఁ జదువరులే తేల్చికోవలయును.

పాపరాజుగారు కమ్మని సీస పద్యమొకటి వ్రాసిరి. అది మిగుల బాగుగానున్నది. ఆ పద్యమిది: "మొగములు గానరానిగిడి కామినులీఁదఁ గొలనెల్లఁ జంద్రమండలములయ్యెఁ గుచములు గానరాఁ గొమ్మ లీఁద సరోవరం బెల్లఁ గమల కోరకములయ్యె" ఇట్లే తక్కిన పాదములు, గీతముతో కూడ విచ్చిన కమలవనముతో నిండి చెంగల్వ కొలనువలె ముద్దులుమూట గట్టుచున్నది. దీనివంటిది తిక్కనగారు వ్రాయలేరని కాదు-యేలనో వ్రాయలేదు.

## 24. ఏకాంత విహారము

జల క్రీడానంతరము 'మేడపై విహారము' 'అయోధ్యకు వచ్చుట' యను పేరుతో దాదాపఱువది పద్యములు పాపరాజుగారు వ్రాసిరి. తిక్కనగారు మూడు పద్యములతో ముగించిరి. ఇరువురి రచనలు లేకపోవుటతో దాని నిటఁ బేర్కొనవలసిన పనియుండదు. పాపరాజుగారి సొంతరచనలోఁ గూడ—"మాంసా నిచ విచిత్రాణి ఫలాని వివిధానిచ రామస్వాభ్యవహారార్థం కింకరా స్తూర్ణ మానయన్" సీతాం సంగృహ్య బాహుభ్యాం మధుమైరేయకం శుచి పాయయామాన కాకుత్స్థః శచీమింద్రోయధామృతం" అని మూలమున నున్న దానికి- 'పౌలోమిఁగూడి యమృతము గ్రోలెడు సురరాజుఁ బోలి క్షోణీసుతతోఁ గ్రోలె సుధారసధారలఁ బోలిన మాధ్వీకసరము భూవిభుఁ డెలమిన్' అని తెలుఁగుజేసిరి. ఇదియు మూలముఁ జూచి తెలుఁగుజేసిరనుట కొక గుర్తు. "పౌలోమిఁగూడి యమృతము గ్రోలెడు సురరాజు పోలి" యనునది మరియొక గుర్తు. "కింకరా స్తూర్ణమానయన్" అని యున్నదానికి "అంబకౌసల్య వనుప" నను నొకవిశేషము గూర్చినను "మహానసంబు జనులు" అని పర్యాయము జెప్పుట ఇంకొక గుర్తు. శాస్త్రీయముగా నమాధానమున్నదో లేదో తెలుసుకోఁ దగిన మధు మాంసాహారాదులకు "అంబ కౌసల్య వనుప" భుజించె ననుటయాయన స్వతంత్ర రచనకు మాయనిగుర్తు. ఇట్టి విశేషములతోనే రచన యొప్పుచున్నదని చెప్పుటే ఇచ్చట ముఖ్యము.

మఱియుఁ బాపరాజుగారి రచనయిది. సీత యలంకృతయైవచ్చి రామునకు 'కప్పురపు బాగా' లొసఁగెను. "బంధచాతుర్య బంధముల్ పణముగా ద్యూతకేళి ప్రౌఢి దొరసిదొరసి" "వలపురాజువేడబమొ వారల యద్భుత మోహభావమో" "మరుని సమ్మోహమున మంత్రాక్షరము లొండొరుల నొండరులు పల్కు పలుకులెల్ల" "వారి వలపులు సొలపులు వశమె పొగడ" ఇత్యాదిగాఁ గొన్నిపద్యములు చెప్పిరి. అన్నియు బాగున్నవికాని "పొగడ వశమె" అని చెప్పియు మరల చెప్పుటెందులకనిపించును. "నెరసిన నుదుటి ముంగురులఁ జక్కఁగ దువ్వి" అను పద్యముతో రాముని చాతుర్యమును, "గళరవంబులునేర్చి కలవరంబులు పల్కు" నను పద్యముతో సీతయొప్పిదమును వర్ణించి, "రాత్రి క్షణంబయితోఁచె వారికిన్" అని ముగించిరి. పాపరాజుగారి వక్కణమంతయుఁ బ్రాచీన ప్రబంధముల యొరవడిలోనిదేగాని క్రొత్తదిగాదు. శృంగార వనవిహారములోఁజూపిన సిగ్గులు బెణుకులుగూడ నిందు మృగ్యములు. అంతటి శ్రీరామునిఁ దనకాలపురాజులతో నొకనిగాఁదలచుకొని యిట్లుచెప్పుట యపచారమే యగును. ఏమైనను సీతారాములకుఁ జెరియొక పద్యముగా వంతు చెల్లించుకొని పాపరాజుగారు ప్రక్కకు వైదొలఁగిరి.

తిక్కనగారిట్లు చెప్పిరి. "కర్పూర ధూమాది గంధ సంవాసితా భ్యంతర రమణీయ హర్మ్యములను" ఇత్యాదిగాఁ గ్రీడానుకూల స్థలములఁ నొందుపఱచి, "ప్రమదము మూర్తమైనటులు రాగము రూపువహించినట్లు"గా దంపతుల నాయత్తపఱచి, "చూడ్కికి సందడి చొరనీక యెందేనిఁ జూచు చాడ్పున నొప్పుచూఱవిడిచి" "అంత రంగ మానిష్టమైనటు లందకలిసి" "ఎదఁ బొలవోని వేడుకల యేడ్తెఱ సొంపున నంతకంటె నెక్కుడగు మదంబు పేర్మిరతి కోర్కులు కొమ్మలువోవ, నప్పుడప్పుడు నలిఁ జేరినట్టులు విభుండును వారిజపత్రనేత్రయున్ గడపలలేని కేలితమకంబున" విహరించిరని చెప్పిరి. "ఎలమి నొండొరులకుఁ దలయంపులుగఁ జేయు బాహులతలు జన్మఁఫలము లంద" "సుఖము సొంపు నొక్కసూటిగ నడువంగ" "లేని నెపంబు వెట్టి...సొరెదకుఁ బుక్కిటి బంటిగఁ జేసి" "జగతీపతి-కుగ్మలి, రాముఁడింతికిన్" దగినట్లుగాఁ బైకొని క్రీడించిరని చెప్పిరి. "అదరులు గదిరిన నతిముఱి వర్తిల్లు చెయువుల క్రందునఁ జిక్కువడుచుఁ, గళుకులగుచు. అదరఁబడుచు, అనువు గొనుచు" మదనకేళి యొనర్చిరని చెప్పిరి. "తూలెడు ముంగురుల్ దోతెంచు ఘర్మాంబు

వుల దోఁగి నుదుటిపై మలఁగుచుండ" "లేఁతదమిఁ గ్రొత్త చెన్నొందు లేమ చంద మధిపు డెంద మానందమయంబు చేసె" "మఱవు మునుఁగువడ వేడ్కలు తెఱవులుగొని నిగుడ, రెండు తెఱఁగుల చేతన్ బొరివోవు నెమ్మనంబుల నెటి నిరువురు నలవరింపనేరరు రతులన్" "చొక్కు లెక్కుడుసేయంగ సోలమడరి యిరువురును సౌఖ్య రసములఁ గరుడుగట్టి పోసిచేసిన రూపుల పోల్కెలైరి" ఇత్యాదిగా నభిరామ మనోహరముగా వర్ణించిరి. ''కోర్కి లేచినఁ ద్రిప్పికొను నింద్రియంబుల యక్కఱ దీఱంగ'' "ఒండొరువుల మదన కళా పాండిత్యము మెచ్చుమియు నెపంబిడ-నెపమై" ఇత్యాదిభావములు కడుంగడు రమణీయములు. ఇంతటి-ఇట్టి భావములు చెప్పుచున్నను, వీనిలోఁబునరుక్తిలేదు. భంగ్యంతరము లేదు. ఊకదంపు లేదు, అతిశయోక్తి లేదు. అన్నియు సరిక్రొత్త భావములు. అనుభవసిద్ధములకు గ్రొత్త మెఱుఁగులు. ఏ కాంత విహారము నిట్లు కాంత మధురముగా భావస్ఫురముగా వర్ణించుట క్రొత్త పోకడ. పదుమూడవ శతాబ్ది లోని తిక్కనగారికిని, దక్కిన కవులకును, పదినెన్మిదవ శతాబ్దిలోని పాప రాజుగారికిని గొప్ప యంతరము గలదని దీనివలన స్పష్టమగును." సతియుఁ బతియుఁ గరంగిరి స్వైరగతుల'' నని స్వైర ప్రవృత్తిగాని, "వారి చొక్కులు టెక్కులు వారి వగలు'' ఇత్యాదిగా బదముల పట్టిక గాని యిందు మందునకుఁ గూడఁ గానఁబడవు. అచ్చముగా సాగినది రచన.

## 25. గర్భధారణము

పాపరాజుగారు- "అనితరగర్భచిహ్న మచలాత్మజ దాలిచె రాజమౌళితో ననిశముగూడి తొల్లియచలాత్మజ గర్భము దాల్చుకైవడిన్''అని చెప్పిరి. తిక్కనగారు- "వసుధపట్టి అతిథిదేవ విప్రపితృతర్పణంబుల గర్భమహిమఁ దాల్చె" నెమ్మనమున నినకులము ధ్రువమ్ముగ సత్సుతులఁ బడయవలెనని తలఁచెన్"-అనిచెప్పిరి. ఈకాలమున గర్భధారణముఁగూర్చి యభిప్రాయము లెట్లున్నను, రామునికాలమునాఁటికి సతీపతులు పుత్రోదయమున కువ్విళ్ళూరుట సహజము. అదికూడ- ''అతిథి విప్రదేవ పితృతర్పణంబుల'' సంసిద్ధి కొఱకే యనియుఁ దిక్కనగారిభావము. ఇది భారతీయ సంప్రదాయ ప్రతిష్ఠాపకము. పాపరాజుగారికీ సంప్రదాయప్రతిష్ఠ ముఖ్యమైనదిగాఁ దోఁపదు. సమయము వచ్చినపుడైనను తత్సంప్రదాయము నుద్బోధించుటావశ్యకము కదా!

పాపరాజుగారు- "దౌహృదము జానకీదేవి దాల్చునపుడు" "అచ్చాలాలిన్ దొడమీదనుంచుకొని" "కాంక్షావర్ధనాకాంక్షియై" రాముడిట్లడిగెనఁట. "స్తన శృంగారరసంబు" "గడుసువలిగబ్బిగుబ్బల" "సోమునిగెల్చిన నీనగు మోము" "జడగతిఁబాదముల్" ఇత్యాదిగాఁ బద్యములు సెప్పి, "వాంఛిత మేమో నూత్నముగ నడిగి మగఁడది యత్నమునన్ జేయవలయు" "యొకటి యిచ్చ జనించినఁదెల్పవే" యని రాముఁడడిగెను. సీతయు-" మీటినఁమ్రోయు వీణవలె మించునెలుంగున" భర్తతోననెనఁట. ఇట్లు చెప్పుటలో-"పేదతనముతో వడకెడి నీ నడుమున కియ్యెడ గర్భసమృద్ధి యభయమిచ్చెఁగద చెలీ!" యని యడుగు ధైర్యము రామునికి వచ్చినదనపలెను. గర్భముగూర్చి యింత యాతుర పడి యడుగుటెందులకు? ప్రాముఖ్యము గుర్తించినకాలములో ఆమాటను మాట మాత్రమైనఁ బ్రస్తావింపకపోవుటెందులకు? ఇది గమనార్హమైనది.

తిక్కనగారిట్లు చెప్పిరి. "గర్భసంపదకలిమి నీయందుఁదేటపడియె నిందువదన" "ఇగ్గురుగర్భసంపద వహించియుఁ దెల్పవదేమి" యని రాముడు ప్రశ్నించెను. మఱియు, "వంశము సుధాంశుఁడు వెల్గినరాత్రివోలె" వెల్గుగదా యనియుఁ బల్కరించెను. "సిగ్గును లేతనవ్వుకదిసెన్ గమలానన ముద్దుమోమునన్" అని సీత సిగ్గరితనమును ముచ్చటగాఁ దిక్కనగారుగూడఁ జెప్పిరి. గర్భవతియైనభార్యను జూచునపుడు కలుగుభావములలో వంశవిస్తరణాభిలాష యొకటి. అతిధివిప్రదేవ పితృతర్పణము మఱియొకటి. ఆ భావములనే తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారికవి పట్టలేదు.

పాపరాజుగారిట్లు చెప్పిరి. "మాటలఁ దాటకాంతఁకుడు మాటికిఁ దేనియలొల్కవేడినన్ బాటలగంధి సిగ్గు ప్రతిభాషిత చాతురి నడ్డగింపగాఁ గాటపుఁగాంక్షయన్ తరువుకత్తె మదిన్ ద్వరసేయ, నల్లనన్ మీటిన మ్రోయువీణవలె మించు నెలుంగున" సీతయిట్లు పలికెనన్నాడు. సిగ్గు అడ్డగించినది. కోరికచెప్పవలెనని కాంక్షయను తరువుకత్తె తొందరించినది. అట్లుచేయుటకుఁ గారణము-తాటకాంతకుఁడు తేనియలొలుకు మాటలు మాట్లాడుట. ఇవన్నియు నేదోయొక రీతి సరిచేసుకొన్నను "మీటిన మ్రోయు వీణవలె మించునెలుంగున" మాటలాడుటే బాగులేదనిపించును. ఇట్టి సమయమున స్త్రీజాతి కంఠమెట్లుండునని తెలియుటే దీనికిఁ బరిష్కారము. ఇఁకఁ, దాటకాంతకుఁ డనుటతో రాముని

రోషారుణవదన పద్మము కనఁబడును. అట్టి రాముఁడు 'తేనియలొల్క' మాట లాడుట మిగుల విచిత్రము. అయినను బాపరాజుగారు మాటలాడించునపుడు వద్దనుట యెట్లు?

తిక్కనగారిట్లు చెప్పిరి. తన మది లజ్జవాపి వసుధాపతి మేవడియైన మాట పొందునఁదగఁజేరి కోరికలు దోఁచు తెఱఁగెఱుగందలంచి యల్లన యడు గంగ, సమ్మద విలాసము నేత్రెల నెమ్మొగంబు నూతనరుచినొప్పఁగా వికచ తామరసానన వేడ్కనిట్లనున్" అని చెప్పిరి. ఇచ్చట వసుధాపతికి-తాటకాంత కునకు, నెమ్మొగంబు నూతనరుచికి-పీణవలె మించు నెలుంగునకు-భేదసాదృ శ్యములు చెప్పఁబనిలేదు. ప్రియుఁడైన రాముఁడు మేవడిమాటలతో దగ్గరఁజేరి పలుకరించుట-అప్పటి సన్నివేశ సందర్భ సంస్కారములన్నియు రాముని యందును సీతయందును మూర్తీభవించుట-ఈ చాతుర్యము తిక్కనగారి కల ములో నున్నది. పాపరాజుగారిలో లేదు. కనుకనే ఇరువురిసీతలు వేఱువేఱు విధములుగా మాటలాడినారని తెలియవలెను.

పాపరాజుగారిట్లు చెప్పిరి: "సారంగీశిశుకోటి దప్పి పులితీర్చన్, సింహపోతశ్రమంబాఱన్ దంతి కరాంబువుల్ నిగుడఁజేయన్, మించు భాగీ రథీ తీరారణ్యములన్ వసించు మునిపత్నీ శ్రేణితోడన్ ఫలాహారంబుల్గొని యొక్కనాఁడు మెలఁగన్ బ్రాణేశ వాంఛించెదన్" అని సీతకోరికను పాప రాజుగారు చెప్పిరి. తిక్కనగారు-"సింగంబుల్ మునిబాలకుల్ తిరుగుచోఁ జెయ్యేది మోమియ్య, సారంగంబుల్ తిరుగన్, దపోధనసతుల్ రాజీవముల్ గోయుటల్ రంగద్వీచులఁ బద్మముల్ మెఱయ, ధర్మప్రీతిమై చూచుచున్ గంగ తీరము కానలోనఁ దిరుగంగాఁ గౌతుకంబయ్యెడిన్" అని సీతయన్నట్లుగాఁ జెప్పిరి. రెండుకోరికలు బాగుగనేయున్నవి. కాని కొంత విచారమవసరమని పించును. పాపరాజుగారి సీతకోరికలో-విరుద్ధములైన జంతువులనుకూలముగా నుండుట, మునిపత్నులతో ఫలాహారములుగొనుట, ఒక్కనాఁడు సంచరించుట- వీనిలోఁ జివరిదితప్ప మొదటిరెండును - మునుల మునిపత్నుల ప్రభావము లోనివి. రామునిభార్యవచ్చినదికావున వారును అనుకూలముగా నుండవచ్చును. అచ్చట నుండవలసినకాలము తన యేర్పాటులోనిదే-ఇక రాముని యనుమతి ముందేలభించినది. కావునఁ దనప్రయాణమున కభ్యంతరమేదియు లేనట్లు తోచును. కావుననే "నీవు తలంచినట్లు తరుణీమణి రేపటిరేపటంతటన్ బావన

గాంగ భూములకుఁ బంచెద" నని రాముఁడన్నాడు. తిక్కనగారి సీతకోరికలో గూడ నిట్లే సమన్వయమున్నది. కాని, ఒక విశేషము—"ధర్మప్రీతిమై జూచు చున్" అన్నది కలదు. పైనివన్నియు చూచుటకు 'ధర్మప్రీతి' యే కారణమని యర్థము. ఆమాట పాపరాజుగారి రచనలో లేదు. అది లేకపోవుటలో కేవలము చూచివచ్చుటకు మాత్రమేయైన-నది ప్రసవ సమయము కారణముగా నిరాకృతము కావచ్చును. అట్టి సందేహమున కాస్పదములేకుండ తిక్కనగారు "ధర్మప్రీతిమైఁజూచుచున్" అని ముందుగనే వాకట్టు కట్టిరి. ఇంతేగాక ఇట్టి సమయములో విశేషకారణములేక, రాజులు తమభార్యలను దూరముగానొంటి పంపరని రామునకేగాక తిక్కనగారికికూడ విదితమేయగును. మఱియు, "దూరమునాక ఘోరవన దుర్గతలంబులఁ గేళిసల్పఁగాఁ గోరెదు భామలన్, బ్రియలఁ గోరినయట్టుల పుచ్చు రాజులన్ ధారుణి నెందుఁగాన" మని లక్ష్మణుఁడన్నట్లుగా రాముడు పల్కినమాటలు తిక్కనగారివేకదా! కనుక ధర్మప్రీతిమైఁ జూచుటకుఁ బోవుట అభ్యంతరముకాదనియే అట్లు చెప్పెను. మఱియు వివాహమునకై సంకల్పము చేయునపుడు-"ధర్మప్రజా సంపత్త్యర్థంస్త్రియముద్వహే" అనుటలో మొదటిది ధర్మప్రీతి-రెండది ప్రజాప్రీతి. అట్టి ధర్మప్రీతిమైబోవుట సుతరాము అభ్యంతరముకారానిది. మఱియు, 'సింగములు మునిబాలకులు కలిసి యాడుచుండఁగా, సారంగములు తిరుగుచుండగా, మునిపత్నులు పువ్వులు కోయుచుండఁగాఁ దరంగములపైఁ దామరలు మెఱయుచుండగాజూచుటకైఁ బోవుట ధర్మప్రీతిచేతనేకాని యింకొక వినోదముచేతగాదనుట స్పష్టము. ఇన్ని విధములుగా ధర్మప్రీతినాధారముచేసికొని 'మెలంగన్ గౌతుకంబయ్యెడిన్' అని మాత్రమే యడిగినదని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారి రచనలో నీ ధర్మప్రీతిలేదు. దానికి సంబంధించిన యూహలు లేనేలేవు. జింక పిల్లలదప్పి పులితీర్చుట, సింగపుపిల్లలదప్పి యేనుగులు తీర్చుటవంటి 'సర్కను' వినోదములును, మునిపత్నులతో ఫలాహారములుచేయుటవంటి కౌతుకకార్యములున్నవి. పైఁగా 'నొక్కనాఁడు మెలఁగన్' అని అధికారపూర్వక అనధికారవిజ్ఞప్తియు, 'ప్రాణేశ వాంఛించెదన్' అని భర్తృసంబోధనతో పలుకుటయుఁ బాపరాజుగారు తీర్చినది. నాకు మాత్రము 'ధర్మప్రీతి' యాధారముగాఁ జేసిన తిక్కనగారి విజ్ఞప్తియే ఉచితముగాఁ దోచును. చదువరు లేమిచెప్పెదరోకదా!

## 26. అపవాద వృత్తాంతము

పాపరాజు గారిట్లు చెప్పిరి. రాముఁడు భద్రుని జూచి యడుగుటఁ
వాడు 'వేనోళ్లఁబొగడి' రని చెప్పుటయు మొదట జరిగినది. మరల రాము
చిఱునవ్వుతో "శుభా శుభోక్తుల వచియించు చోట ననుగూర్చి జానకిఁగు
నిందలన్ బలుకకపోవ-రత్తెఱఁగబద్ధము లాడక తెల్పుమీ" అని యడిగె
భద్రుఁడు-'పలుమాఱడిగిన నేమి చెప్పుదును" ఈ జను లెవ్వరినిఁ బూజిం
ఇత్యాదిగా రాజులగూర్చిఁ మాట్లాడెను. అంతటితో నూరకుండిన బాగుండెఁ
అట్లుండక వాఁడు– 'మీయానకు వెఱచి వచింతు' 'లంక నేఁడు కాల ముఁ
యిల్లాలి నించుక కొంచక మరలఁదాఁగొని వచ్చి మరులు హెచ్చి యెచ్చరిక
లేక యేలుచు నున్నాఁడు" "ప్రజకు రాజానుమతమె ధర్మంబుకాదె" ఁ
వచించెను. రాముఁడు కటకటంబడి ఒద్ద నున్నవారి నడిగెను. వారు
"స్వామీ యేమి తెల్పువార" మని పల్కిరి. కొంతసేపూరకుండి రాము
తమ్ములఁ బిలిచికొని రమ్మని కంచుకిఁ బంపెను. ఈ ప్రశ్నోత్తరముల
రాముఁడు యథాలాపముగనే మొదట ప్రశ్నించినను, తర్వాత తన్నుఁ గు
జానకిఁ గూర్చి యడుగుటలోఁ దముఁగూర్చి యేదో సంశయము మ
రామునకున్నట్లే కనఁబడును. భద్రుడుకూడ మొదటనేమియు లేనట్లు చెప్పి
తర్వాత సంశయించుచునే నిందావార్తను జెప్పి, చివరకు 'రాజాను మ
ధర్మంబుగాదె" యనిచెప్పెను. ఈ విధముగా నిందావార్త బయటపడినది.

తిక్కనగారిట్లు చెప్పిరి. "పడుచుంబైదలను బోవఁబనిచి' భద్రు
వానితో– విన్న తెఱఁగొక్కింతేనిఁ బోనీక విస్తారం బొప్పఁగఁ జెప్పు"
రాముఁడడిగెను. వాఁడు నుత్సాహముతోఁ గొన్ని మాటలు చెప్పెను. రామ
సంతోషముతో "కల- దున్న రూపయిది, నీ పలుకులు మాకెక్కె" నని
కుచు, "తొలుత రాజ్యంబు సేయంగఁ దొడగి, మనము వివిధ వర్ణాశ్రమం
వృత్తమరసి యలవరించుచోఁ గొందఱ కహితమగుటఁ గొన్నిమాటలు ష
యున్నె?" అని కదలించి యడిగెను. ఈ ప్రశ్న రాజు వేయవలసినదే
వాడు సమాహితుడుగనే "ఈ యనుమాన మేటికి నరేశ్వర!" యని నూ
బదులుచెప్పెను. రాముఁడు నవ్వుచునే– "మదీయ సంస్తుతులనన్నియు జె
కీడు మాట సెప్పనగునో కాదో నాక, ననుఁబాపము ముట్టకయుండఁ జెప్పు"
మరలఁ బ్రశ్నించెను. దీనితో వానికి గుండెలు దిగజాఱినవి. మోము వెల

నైనది. ఇక్కడక్కడఁ బడుచున్నాఁడు. దానిని గమనించి రాముఁడు జంకుఁ బాపవలెనని తలంచి, "లోకుల మాటలు సెప్పిన నాకెగ్గగునె? ప్రియం బొనర్పు నాకు హితుఁడవై నీకింత వెఱవ నేటికి? నేకాంతం బయినచోట- నేనడుగంగన్" "కీడుఁగాంచి మనల నాడెడువారల నోరులుడపఁగా మనోముదంబు నొందు గాన దీన నొండెగ్గులే" దని తఱిమితఱిమి యడిగెను. వాఁడు బదులుసెప్పెడు నంతలోనే రాముఁడు "ఇతఁడెటు సెప్పనాకో! నా మతి కలఁగెడు! జనుల పనులు మఱవక యుచిత స్థితి నడుపుదు"నని కళవళపడుచుండెను. ఎలుగు రాలు పడఁగా భద్రుఁడు "ఎల్ల లోకంబులు నెఱుగ . . . అనుగలంబు చేసి కొని యున్న వాఁ"డని యెల్లరు పలుకుచుండఁగా వినుచుంటి"నని విన్న వించెను. రాముఁడు- "సుర సుర డెందము చూడిన తెఱఁ"గయినను, ధీరుఁడు గావునన్ 'గొఱత పడకుండ' 'ప్రియవదనుండై', ప్రక్కనున్న విజయా దుల నడిగెను. వారు నట్లే పలికిరి. రాముఁడు 'మూర్ఛవచ్చిన మనంబునకున్ ధృతి నూఁతనిచ్చి' అందఱిని బొమ్మని తమ్ముల రమ్మనెను. ఈ రచనలోఁ జివర కపవాదము వినుట జరిగినను, దానిని విన్పించుటలో రామునిలోఁ బెక్కుమార్పులు కనఁబడును. ఇవన్నియుఁ బాపరాజుగారి రచనలోఁ గనఁబడవు.

రాజుగారి రచనలో మొదటి స్తుతి వాక్యములు, తర్వాత రాజుల నిందా వాక్యములు, పిమ్మట నపవాద వాక్యములు, వానిని సమర్థించువాక్యములు కనఁ బడును. వానికుద్దేశము లేకున్నను, అపవాదారోపమున కనువుగా నాతీరు నడ చినది. రాముఁడునప్పుడు కూడ "జననీ గురు సోదరాదు లేకాంతమునందు నేమనుచు నాడెదరో" యనియు, తన్నుగూర్చియే గాక సీతనుగూర్చి యడుగు టయు గోచరించును. తప్పులేకున్నను, తప్పుగా శంకించువాఁ డడిగినట్లడుగు టయు, విధిలేక చెప్పినను, యధార్థమే చెప్పినను బలపఱచి చెప్పినట్లుగా చెప్పుటయు జరిగినది. పాపరాజుగారి రచన ఉద్దిష్టమైన యపవాదమునకు వ్యాఖ్యానప్రాయముగా నున్నట్లు కనఁబడును.

తిక్కనగారి రచనలో నట్టిస్ఫూర్తి కనఁబడదు. గూఢచారుల నడుగు టయుఁ జెప్పుటయు లోకసాధారణముగా నున్నను, వర్ణాశ్రమాచార వృత్తముల నడుగుట రాజుల కర్తవ్యమైనదిగా దోఁచును. ఎన్ని యడిగినను దన పరిపాలనను గూర్చియే గాని, తన్నుఁ గూర్చి గాదు. సీతనుగూర్చి మొదలే గాదు. ఆ సందే

హము రామునికి లేనే లేదని తెలియును. కాని రాముఁ డడుగుచు, "కీడు మాట సెప్పనగునో కాదో నాక, నను బాపము ముట్టకుండ" జెప్పుమనుటయు, ఆతఁడు తడఁబడుచుండఁగా ధైర్యము కలుగుటకై "లోకుల మాటలు చెప్పిన నాకెగ్గగునే, ప్రియం బొనర్చు హితుఁడవై నీకింత వెఱవ నేటికి నేకాంతంబయిన చోట నేనడుగంగన్" అని యూఁత యిచ్చి పలుకఁగా, భద్రుఁడు చెప్పుటయు జరిగినది. భద్రుని మాటలలోఁ గూడ- "కేళి వనంబులో నునిచిన, ఎగ్గుగొనక, అనుగలంబు చేసికొని" ఇత్యాదిపదములే గోచరించును. పాపరాజుగారి రచనలో- "తొడమీఁద నిడుకొని-ధర్మంబకాదె" యన్నంతవరకు నన్నియు అపవాదారోపణమునకు దోహదములుగా నున్నట్లు కనఁబడును. సామాన్య జిజ్ఞాసతో నడుగుచుండగా నవాంతరముగా నపవాద వృత్తాంతము బైటికి వచ్చినట్లు తిక్కనగారి రచన తెలుపుచున్నది. ఇందులో నిరువుర తారతమ్యము చదువరుల వివేచనకు వదలుచున్నాను.

మూలమునందు "మామాశ్రితాని కాన్యాహుః పౌరా జానపదా జనాః కించ సీతాం సమాశ్రిత్య భరతం కిన్ను లక్ష్మణం కిన్ను శత్రుఘ్న మాశ్రిత్య కైకేయాం కింను మాతరం వక్తవ్యతాంచరాజానో నవే రాజ్యే ప్రశాసతి" ఇత్యాదిగా నున్నది. దీనిని తిక్కనగారు తడవలేదు. పాపరాజుగారు తడవిరి గాని, "జననీ గురు సోదరాదు లేకాంతమునందు నేమనుచు నాడుదురో వినకుందువోటు'' అని వ్యాఖ్యానము చేసిరి. మూలమున 'భరతలక్ష్మణ శత్రుఘ్న కైకేయిలను గూర్చి లోకు లేమనుకొందు" రన్న దానిని మార్చి, ఆ భరతశత్రుఘ్నాదులే తమ్ముగూర్చి యేమనుకొందురని వింగడించిరి. మూలమున లేకున్నను "ఏ భూపాలుర మెచ్చిరీ జనులు వీరే పాటి పాటింపఁగన్" అని యొక యధికప్రసంగ పాఠము దయచేసిరి. దీనిని తిక్కనగారు చెప్పలేదు. మూలమునఁ జెప్పకున్నను తిక్కనగారు- "వివిధ వర్ణాశ్రమంబుల వృత్తమరసి యలవరించుచో"నని యొక క్రొత్త పాఠము చెప్పిరి ఇది ప్రభుత్వ బాధ్యత వహించువారడుగవలసిన మాటయే దీనిని పాపరాజుగారు ముట్టుకోలేదు. వీనిలో నౌచిత్యానౌచిత్యములు చర్చింపవలెనని పాఠకులకు మనవి.

తరువాత భరతాదులఁ బిల్వనంపి సంగతిచెప్పి, తన నిశ్చయము వివరించి, దీనికి బదులు చెప్పరాదని యాజ్ఞాపించి, రాముఁడు తమ్ములఁ బంపెనని కథ. "ఉస్సని నిగిడించు నూర్పులవేడి"తో చింతించు రామునిజేరి "ఏమిటి

కింత వంత వహియించినవాఁడో" అని చింతించుచు భరతాదులు నమస్కరించి రని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు- తారలులేని సుధారోచియును బోలె నొంటియేకాకా నృపుండున్నవాఁడు" అని తలంచుచు, "ఉత్తరములేని యడుగుట లొండొరువుల నడుగుచుఁ" బ్రణమిల్లిరని చెప్పిరి. రాముని దీన స్థితి నిర్వురు చెప్పినను "ఉత్తరములేని యడుగుట"ను భావించు తిక్కనగారి జిజ్ఞాస గొప్పదిగాఁ దోచును. రాముఁడు "కరంబులఁ గ్రుచ్చి కవుంగలించుచున్" "చేరెదేని కన్నులను గ్రమ్ము కన్నీరు కరతలమున నప్పళించుచు" గాద్గద్యమునఁ బల్కెనని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు- "వేడిపై నెగయు కరమ్ములన్ గొని మహీపతి యల్లన యెత్తి బాష్పవారి గడలుకొన్ననాగుచు, శరీరము నేలకు వ్రాలవచ్చినన్ మగుడఁగ నిల్పుచున్, వెగటు మాటలు కుత్తుకలోన మ్రింగుచున్" తమ్ములతో నిట్లనిరని చెప్పిరి. తమ్ములఁ గౌఁగిలించెనని గాని కన్నీరు చేతుల నప్పళించెనని గాని చెప్పలేదు. వేడిపై నెగయు కరమ్ములతో నెత్తుటయు, గన్నీ రాపుకొనుటయు, శరీరము నిలుపుకొనుటయు మొదలుగా శారీరక ధర్మముల నియమించుకొనుట యెంత సమయజ్ఞతయో వివరింపఁ బనిలేదు ఈ విధముగాఁ తిక్కనగారొక క్రొత్తచిత్తరువును నిర్మించిరి. ఈ నిర్మాణశక్తి యందఱికి నందునది కాదుగదా!

రాముఁడు తమ్ములతో సంగతియంతయుఁజెప్పి సీత నడవిలో విడిచి రమ్మనెను. క్లప్త గంభీర నిశ్చయాత్మకములైన యా మాటలలో "చెఱగొని పోయి యాత్మపురిఁ జేర్చి దశాననుఁ డాసరేగి కీడ్పఱచిన సీతఁ దెచ్చుకొని" యన్న మాటయొకటి పాపరాజు గారు చెప్పిరి తిక్కనగారు-"రావణు నింట నుండఁగ ధరాసుత నేమఱలంగఁ దెచ్చి, సంభావనసేత కష్టమని" చెప్పిరి. "కీడ్పఱచిన సీతఁదెచ్చి" అనుమాట ప్రజలు అనకున్నను అన్నట్లుగా రాముని నోట చెప్పించుట పాపరాజుగారి సాహసము. తిక్కనగారట్టి సాహసము చేయలేదు. "భరతా ద్యనుజులగృహములకు బనువ, నానతముఖులై" తమ్ములు పోయిరని పాపరాజుగారు చెప్పిరి తిక్కన గారు-"అని పలికి తనదు తెగువకు ననుజన్ములు తలలు వాంచు టనుమతిగా గైకొని" యని చెప్పిరి. తన నిశ్చయము తప్పక జరుగవలసినదే యైనను తమ్ముల యనుమతి యావశ్యకమని తిక్కనగారి భావము. పాపరాజు గారి కట్టి భావమున్నట్లు లేదు. 'ఆనతముఖులై' పోయిరని చెప్పిరి రచనా పరిణామ మిట్లుండునని తెలియవలయు గదా!

## 27. సీత నడవుల కంపుట

రామునాజ్ఞగొని, సుమంత్రుతోఁ దేరు సిద్ధము చేయించి "మాతా
తీర్థాశ్రమేక్షా సక్తిన్ నినునందుఁ దోడుకొని పొమ్మంచున్ విభుండం
వచ్చితి, రథంబు దెచ్చితి, విచ్చేయు"మని లక్ష్మణుఁడు సీతతోఁ జె
ఆమెయు సంబరముతో మునిపత్నులకని భూషణాంబరములు గైకొ
మెక్కెను. సుమంత్రుఁడు రథము తోలెనని పాపరాజుగారు చెప్పిరి.
తిక్కనగారీ విధముగాఁ జెప్పిరి. రథముతో సుమంత్రునితో లక్ష్మణుఁ
ముగా నుండగా, నింతలో రాముఁడక్కడికి వచ్చి "అడలడఁచి, నెమ్మ
వెడతెలి వొడఁగూర్చి, మాటవేర్పడకుండన్ జిడిముడిపడక, నయంబ
మడు వొక్కింతలేక" నిలఁబడుచు, సీతతో-"లక్ష్మణుఁడు నీ వెంట
గంగాతీరారణ్యములు చూచుటకై రథమెక్కు' మని చెప్పెను.
"విభుం డొక్క తలంపు వాఁడయి సముత్సుకతన్ ననుదవ్వ
నిక్కమ యియ్యకోలరయ నెయ్యము తియ్యము గాదె" యంచు "నిం
రాముఁ డెంద ముడుకెక్కగ, సీత రథంబునెక్కె" నఁట: అప్పుడు "
ఖేద మాననముఁ జెందిన మాన్పగలేక లక్ష్మణుం డుత్తల మందుచుం
జూచి, సీతకాతనిఁ జూపించి రాముఁడు "దూరమునాక ఘోరవన దుర్గత
గేశి సల్పఁగా గోరెడు భామలన్, ప్రియలఁ గోరినయట్టులఁ బుచ్చ
ధారుణి నెందుఁ గాన" మని యీ లక్ష్మణుఁడు అడ్డుపడెననియు, నేను
తమాడి యిట్లు నినుఁ బుచ్చుట కల్గినవాఁడు, చూచితే" యనియుఁ
లక్ష్మణుఁ డింతయు వినుచు నూరకుండెను. రాముఁడు మునిపత్నులక
భూషణాంబరాదుల నిచ్చి, తన మనస్సెఱుంగనీయక "పాలతోడ వి
పగిది" నామె నూరడించి సాగనంపి తాను హృదయ భారముతో వెనకక
నని తిక్కనగారు చెప్పిరి.

ఇదంతయుఁ దిక్కన గారు చేసిన కావ్య నిర్మాణము.
రేయంతయు నిద్దురమాని యాలోచించి కై కొన్న నిశ్చయము కనుక స
మేడదిగివచ్చి, నచ్చిన మాటలతో సీతకు మెచ్చులు కూర్చి, మొగమోడి
ఱుని మూఁగవానిఁజేసి, మునిపత్నులకని సొమ్ములు మూటగట్టి, పాల
మిడిన మాదిరి మంచికో మంత్రము గలిపి సీతను సాగనంపెన
హృదయ భారముతోఁ గ్రుంగి పోకున్నచో నీ రాముఁడు క్రొత్త

నట్లుగా (గార్యము తీర్చెను. పాపరాజుగారి కీపద్ధతి పట్టలేదు "ఆ కొంత చనిన రాతిరి కాకుత్స్థునకొక్క బ్రహ్మ కల్పంబయ్యె" నన్నట్లు అంతఃపురమున నట్లే నిలచిపోయినట్లు చెప్పిరి.

ఇచ్చట సీతా వివాసనము శ్రీరామునికి శాశ్వతమైనట్లుగా నిరువురి రచనలను దోఁచును. సీతవెంట లక్ష్మణుడు పోవుటతో నిది సిద్ధమైనట్లుగా నున్నది. ఇచ్చటఁ దిక్కనగారి హృదయము రాజ ధర్మపాలన నిష్ఠమైనట్లున్నది. కనుకనే మిక్కిలివిశ్వాసము కలుగుటకై తానేవచ్చి సీతను ప్రయాణముచేసి పంపించెను. పాపరాజుగారి హృదయముగూడ రాజధర్మపాలన నిష్ఠితమైనదగుటచేతనే - రాముఁడు సౌధమునం బడియుండఁగా లక్ష్మణుడు సీతను పిలిచికొని పోయెనందురు. దీనిని విమర్శించుట కిచ్చట స్థలము చాలదు. సీత యిట్లు చెప్పుచున్నది. "అక్కట! నాదు వేడ్క కుచితానుచితంబులు సూడకె విభుండొక్క మనంబు వాడయి, సముత్సుకతన్ నను దవ్వుపుచ్చఁగా, నిక్కమయియ్యెకోలరయ నెయ్యము తియ్యముగాదె' యని. పాపరాజుగారి సీతయు నిట్లన్నది. "పొచ్చెంబులేనితేవనసెలవిచ్చెనెపతి, యనమ పోదమే వనములకు" అని. పాపరాజుగారి సీతహృదయములో నున్నదంతయు మాటలలోఁ జెప్పినది. తిక్కనగారి సీతహృదయము మాటలలో స్పష్టముకాదు. అయినను రాముఁడు తానుగావచ్చి పైనము చేయుటచే విశ్వసించినది. అప్పుడుగూడ "సముత్సుకతన్ నను దూరమంపఁగా నిక్కమ యియ్యెకోలరయ నెయ్యము తియ్యమగాదె" అనియన్నది. రాముఁడు స్వయముగా రాకున్నచోఁ బైనముచేయకున్నచో నా విశ్వాస మెట్లుండునో, ఉత్తర రామాయణ గాధ యెట్లు సాగునో ఊహింపఁ జాలినది కాదు.

మూలమునందు- "లక్ష్మణుఁడు సీతతో- "శీఘ్రంగత్వాతు వైదేహీ శాసనాత్పార్థివస్యవై అరణ్యేముని భిర్జుష్టే అపనేయా భవిష్యసి" అని చెప్పినట్లున్నది. "రాముని శాసనమువలన మునులతోనిండిన అడవియందు విడిచిపెట్టవలసిన దానవు కాగల" వని యర్థము దీనికి పాపరాజు గారిట్లు తెలుగు వ్రాసిరి. "మాతా! గాంగతీరాశ్రమేషాసక్తిన్ నిను నందుఁ దోడుకొని పొమ్మంచున్ విభుఁడంపినన్ వచ్చితి"నని. ఆ మూలమున కీయను వాదమునకుఁ బోలికలెట్లున్నవో చూడఁదగును. ఇంతేగాక "అనిన, నేమి యెఱుఁగ దక్కట యీ ముగ్ధ యనదఁజేసి యొంటినడవిఁ ద్రోచి యెట్లు

వత్తు" నని లక్ష్మణుఁడు చింతిలినట్లుగా పాపరాజుగారు చెప్పిరి. తిక్క అత్తఱి నన్నదైర్యమున కచ్చెరువందుచు, జీవితేశు హృద్వృత్త మెఱుఁ మదిని దీనికి నమ్ముటకుమ్మలించుచున్ జిత్తము భేదమాననముఁజెందగ లేక లక్ష్మణుం డుత్తమందుచున్న" దని చెప్పిరి. ఆయుత్తల పాటున తలపాటున కెంతయంతరముగలదో దెలియవలసినవిపాఠకమహాశయులు

ఇంకొక్క విషయము. పాపరాజుగారు-లక్ష్మణుఁడు పిలువ పోయినట్లు చెప్పిరి. తిక్కనగారు రాముదేవచ్చి సీతను ప్రయాణ వంపించెనని చెప్పిరి. ఈ రెంటిలో నేదినిశ్చయము - ఏది యోగ్యమని బుద్ధిమంతులు తమకుఁ దోచినట్లు పెక్కువిధములు సమాధానము వచ్చును. రాముఁడువచ్చి ప్రయాణముచేసి సీతను పంపించెనని యోగ్యమని నాకుఁ దోచుచున్నది. పై కారణములెన్ని యున్నను, స్వయముగావచ్చి పంపకున్నచో సీత పోవునది కాదని ఆమె చరిత్ర గిన యందఱికిఁ దెలియును. మఱియు, మారీచునికథ జ్ఞప్తికివచ్చి జరుగఁ గూడదనియే ఇందు లక్ష్మణుని దోష మేమాత్రము లేదని తెలి రాముఁడు స్వయముగావచ్చెను. ఇంతేగాదు. "లక్ష్మణుం డుత్తలమం విభుఁడుగ్మలి కాతని జూపి" "తాము దీనికి నడ్డపెట్ట నేఁబో ఇట్లు నినుఁబుచ్చుట కల్గినవాఁడు సూచితే" యని నమ్మకము క మాట్లాడెను. ఇన్నివిధములుగా నొక్కులుదీఱ నదీప్రయాణము మూలము ''అపనేయాభవిష్యసి' యని కఠినముగాఁ జెప్పలేక, తిక్కనగారివ యానుకూలముగాఁ జెప్పఁపలేక, తనకుఁ గూడ కన్పడుచున్న ఉత్త సరుదుకొనలేక, మూటికిని దప్పిన ముగ్గుడుగా పాపరాజుగారు రచన చిరి. తిక్కనగారు రాముని క్షత్రియ ధర్మపాలకునిగా దీర్చిరి.

## 28. రామాజ్ఞ లక్ష్మణుఁడు సీత కెఱిఁగించుట

సీతాలక్ష్మణుల ప్రయాణము గంగాతీరము చేరినది. నడుమ నములగుటయు, వానికేవో యవ్యక్త సమాధానములు చెప్పుటయు, పద్యములతో సాగినది. గంగనుజేరి వినోదించు సీత లక్ష్మ చూడఁగా లక్ష్మణుఁడు "—ఈమెకా విసపుఁ బల్కొలాగికన్ జె అని కంట నీరు పెట్టుకొనుచున్నాఁడు. అట్టి లక్ష్మణునిజూచి సీత-

నేల నక్షత్రములు గ్రమ్మెడి'' ''కానుకలిచ్చి దీవెనలఁ గైకొని వత్తమురమ్మ'' ఇత్యాదిగాఁ బ్రశ్నించినది. కడకు మనసు నిలుపుకోలేక, "వనులేల- మరలి పోదమె" యని ప్రార్థించినది. లక్ష్మణుఁడు సంబాళించుకొని "నిన్నటి దుర్నిమిత్తములె నెవ్వగఁ గూర్చె"నని కలియఁ బలికినాఁడు. మఱియు, "అయోధ్యకేల? మీ రెన్నినలీల నవ్వలి కేగుద"మని బదులిచ్చినాఁడఁట. ఆమె సంశయము లెట్టివో! ఈతని సమాధానము లెట్టివో! తర్వాతఁ బయనమెట్టిదో చదువరులే యూహించుకోవలెను.

తిక్కనగారీ కథనింత విస్తరముగాఁ బెంచలేదు. "ఒప్పమి యేమి వాటిలుటకో! వెఱవయ్యెడు నాకు లక్ష్మణా!" అని సీత దుశ్శకునముల జూచి చెప్పఁగా లక్ష్మణుఁడు "-అమ్మాటలు గీటునబుచ్చుచు, - అనిమిషనదిఁ జేరనరిగె నత్యంత ధృతిన్" అని ఆయన ధైర్యము నట్లే నిలబెట్టి, అవ్యక్త సమాధానములు చెప్పుటకు విముఖుఁడుగాఁ జిత్రించెను. ప్రశ్న కుత్తరమిచ్చుటో, ఉత్తరమీయఁగల ప్రశ్న వేయుంచుటో, లేక, ఉత్తరములేని ప్రశ్నగా దాని నిలుపుటో తిక్కనగారి పద్ధతియని తోచును. కనుకనే సీత ప్రశ్న ప్రశ్నగానే నిలిచినది. పాపరాజుగా రవ్యక్త సమాధానము చెప్పించి, లక్ష్మణునితో నబద్ధము లాడించిరి.

పాపరాజుగారిట్లు చెప్పిరి- "అరదము డిగ్గి యచ్చతురుఁ డచ్చట సారథినుంచె, యోడపై ధరణిజ నెక్కఁబంచి, వెతదారొక్కనఁ దానునునెక్కి తత్సరిత్తరణ మొనర్చి, వేగఁ దటధారుణిఁజేరి" ఇత్యాదిగా హుటాహుటి నడిపించి యీరెలుంగుతో- ''జననిరో? పాయుదీ హృదయశల్యము, శోక దవాగ్నిఁ గ్రాగుకంటెను మరణంబు మేలు, జననిందితకార్యముఁ బూనివచ్చితిన్ నసుశపియింపు"మని పాదములచెంత వ్రాలెను. సీత నిర్విణ్ణయై "ఎదపడి పెదవులు తడుపుచు" మఱఁదికి పెక్కుప్రశ్నలు వేసెను. "అనుమానము లేక తెలుపుము'' "నినుమానెనా ననుమానెనా" యని యాతురముగాఁ పెక్కురీతుల నడిగెను. లక్ష్మణుఁడు తేఱికొని- ''ఇంతకు బూనివచ్చి వినిపింపక పోదునె విన్ముతల్లి" యని రామునాజ్ఞ వినిపించెను. తనమాటలుగాఁ గొన్ని జతచేసి, "ఎద్దియైననుంజేయఁగ నోదఁడీ కఠిన చిత్తుఁడటంచు నెఱింగి పంపెనో''యని తన్ను నిందించుకొని, ''మితిలేని యీ మిడిమేలంపు మెకములు నకియల బలఁగమే చానసీకు'' నని యాశ్వాసనములు పల్కి "జననీ!

నీవు మహా పతివ్రత'' విత్యాదిగా నామె సాధ్వీత్వము గొనిం
మనుచున్ సెల్విచ్చెదే" యని వేడుకొనెను. ఆ మాటలువిని
నఱుకనించుక వడిలోఁ ద్రెళ్ళిడి కదళికవలె 'హా! తల్లీ'' యః

ఇట్లి రచన కొంత విస్తారముగనే నడిచినది. ఈ విశే
యాకర్షణము గాంభీర్యము కనబడదు. సహృదయుం
పాత్రకుఁ దగిన యున్నత స్థితిలేదు. శోకవార్ధిలో మునుగుఁ
యంతరమందును లేనిపోని యావేశనకు గుఱియగుట యు క్త
ఇదియు 'మొత్తము మీద బాగున్న' దన్నచో నది చదువఁ
ఈ లక్ష్మణపాత్ర యిట్లు తీర్చబడినదని చెప్పుటే ప్రకృతమ

తిక్కనగారిట్లు చెప్పిరి. గంగాతరణము చేసినతరు
సీతపాదములపైఁబడి- ''నా కింకన్ మరణంబ కార్య;
ప్రవృత్తాత్ముడై కాకుత్స్థాన్వయ దీపకుండునను లోకత్యాః
దుఃఖించెనట: తన్ను లోకత్యాజ్యుఁ గావించినను, రాముఁడ
దీపకుండయినను, 'అన్యాయ ప్రవృత్తాత్ముఁడై' యని
ప్రశంసనీయము. శోకభారమగ్నాత్ముఁడైన లక్ష్మణుని నో
కించిన తిక్కనగారి గంటము మిగులఁబమను గలదిగాఁ
పదరుచుండగా సీత- ''కారణమేమి? నన్న దశకంఠకులా
నో ఎట్టి దుర్వారమనోవ్యథం బొరయువాఁడవుగ వు-విష
వని గారవముతో బుజ్జవముతో నడిగినది లక్ష్మణుఁడు వ
గాచరించుటకు నేనిదియేటికి నియ్యకొంటి, నియ్యుత్తముం
పగవచ్చునె" యని మథనపడుచుఁ, 'జెప్పకపోదని నిశ్చం
రామునాజ్ఞనెఱింగించి, వాల్మీకులయాశ్రమంబున సమీప
నిశ్చయం బాకమలాక్షికిన్ దెలుపు-మన్న, నృపాలకు నాజ్ఞ
మల్లదె: మునిచరణాశ్రయవు నిరస్తశోకవైయుండు, జగది
యును నాశ్రమవిరహితుడయింక "నని విన్నవించెనఁట: సీ
కొలఁదులఁ బోవని వాలాయపుదిగులు గుండెద్రవ్యయ్యఁ
జంత్రము క్రియనేల పయింబడియె''నని కథామాత్రము నిం
లక్ష్మణుని పాత్రను మిగుల జాగరూకతతో నిర్వహించిన

మొదట విచారాక్రాంతమైన మనస్సుతో రామునన్యాయప్రవృత్తాత్మ నిగాఁ బల్కెను. తన్ను లోకత్యాజ్యునిగాఁగూడఁ జెప్పుకొనెను. తర్వాత- "ఇట్లుచేయుటకు నేనేలపూనుకొంటి" నని మథనపడెను. ఈ మథనపాటు తన్ను ద్దేశించినదేయైనను సీత వినఁగూడనిదికాదు. వినవలయుననికూడ నుండును. మరలఁ జిత్తవిక్షేపము సమీకరించుకొని 'చెప్పకపోవ'దని నిశ్చయించుకొని రామునాజ్ఞనివేదించెను. ఆజ్ఞతెలుపుటకు ముందున్న భావఘర్షణమంతయు లక్ష్మ ణుని నిష్కృష్ట న్యాయపక్షపాతమునకు నిదర్శనములు. ఈ కథవ్రాయుటలోఁ గథాపాత్రలకంటె కవికే మిక్కిలి సంయమమున్నట్లుకనఁబడును. ప్రయాణమై నదిమొద లిక్కడి వరకు దారిలో నొకమాటయైన లక్ష్మణునిచే మాట్లాడించ లేదు. సీత పలుకరించినను మూఁగతనము వహించినట్లుచేసెను. గంగదాటిన తర్వాత-ఇది వాల్మీకాశ్రమ సమీపమనుకొని రామునాజ్ఞ విన్నవించెను. అందులో ఆజ్ఞామాత్రమేగాని తనమాటలులేవు. చివరఁదన మాటలుగా- "నీపతి యను ఆశ్రమ విరహితుడయింక" నని చెప్పలేక చెప్పెను. దానితో నతనికిఁ గూడ దుఃఖము కంఠదఘ్నమైనదేమో: ఇంతలో సీత మూర్ఛపోయినది. ఇది తిక్కనగారి రచన.

సీత మూర్ఛదేఱి విలపించుట యొకఘట్టము. దీనిని బహువిధములుగాఁ బాపరాజుగారు ప్రస్తావించిరి. కాని యా పరిదేవనమునకు ఒక పద్ధతిలేదుపూర్వా పరపరామర్శలేదు. క్రమవృద్ధి పరిణామములేదు. ఏపద్యమెచ్చటనున్నను క్రమ భంగములేదు. కాని పద్యబంధము కమ్మగానున్నది. 'హాతల్లీ' యని నేలపై నొరగి 'లక్ష్మణునితో నిట్లనియె' నన్నంతవరకు నొక పెద్దవచనము. 'లక్ష్మణా' యనుటలో సీతశోకమని తెలియునుగాని లేకున్న సర్వసాధారణమైన స్త్రీ పరి దేవనమేయగును. తిక్కనగారట్లుగాక మూడుకందములతో శోకపరీవాహము చెప్పిరి. పాపరాజుగారు- రెండుగడియలుండి కొంతొకదెలిసి' యనియుఁ,దిక్క నగారు 'కొండొకవడిందెలవొంది' యనియుఁజెప్పిరి. రెండు గడియలు మూర్ఛ పోయినచోఁ బ్రక్కనున్న లక్ష్మణుదేమి చేయుచుండవలెను ? తిక్కనగారట్ల గాక, సీత "సందియంబువడ, విచారంబునకుఁజూర మాఱువలుక, నొండ మాడ్కిసేయ వెరవుగాక పిడుగు వ్రేసినయట్లైన" ననిచెప్పిరి. అప్పటి యావె స్థితి యెంత దుర్భరమైనదో కనులఁగట్ట జేసిరి. పాపరాజుగారు-"హాహా కార ములు సేయుచు, హాలక్ష్మణా యనుచు" ఉన్నదనుట విపరీతముగా నగపడును.

‘అడలకుమన్న’ యనుట మొదలు “నన్ను మఱవకయుండుమీయన్న” వఱకు పదునేడు పద్యములతో పాపరాజుగారు వర్ణించిరి. క్రమ పరిణామములేని పద్య పరిదేవనమగుట నది సుగ్రహముగాలేదు. తిక్కనగారి ననుసరించి దానిని గ్రహించుట యుక్తమని తోఁచును. తిక్కనగా రిట్లు చెప్పిరి. సీత మాటలాడుటకుఁ బ్రారంభించి, “అగుఁగాక, యట్ల చేసెదఁ జగతీవరు పనుపు చేసి చనునీవును; నీతెగువ రఘుపతికినీకుం దగునఁట, యేననెడిదేమి తమ్ముఁడ! చెపుమా” అని యన్నదఁట. తరఁగలెత్తు శోకభారమడంచుకొని యామె యెట్లన్నదో కాని యవి ఋషివాక్యతుల్యములుగా నున్నవి. ‘అగుఁగాక యట్లచేసెద’ నన్నపు డామె యంగీకారమునో వ్యతిరేకమునో దేనిని బ్రదర్శించెనో కనుఁగొనుటకైనను మదివెనుకాడును. ‘‘జగతీపతి పనుపుచేసి చను నీవును” అన్నపుడు మాట సాధారణముగా నున్నను ఉక్తిస్ఫూర్తి భయావృతముగా నున్నది. “ఈ తెగువ రఘుపతికినీకుందగునఁట”యన్నపుడు రఘుపతిని లక్ష్మణుని కించపఱచుటో మెచ్చుకొనుటో తెలియరానియయోమయస్థితి యావరించినట్లుండును. “ఏననెడిదేమి తమ్ముఁడ! చెపుమా”యన్నపుడు మాత్రమొక యూఱట, యాశ్వాసనము కలిగినట్లగును. అదియుఁ ‘దమ్ముఁడ! చెపుమా’ యన్నప్రియ సంబోధనముతోఁ గలుగుచున్నది. ఈ పద్యమునుండి యిట్టి భావములు పలుకోణముల నుండి తీయవచ్చును. తీయవచ్చునుగాని పద్యమునిర్మించు టశక్యము. పాపరాజుగారు ‘అడలకుమన్న’ యిత్యాదిగాఁ జెప్పిన పద్యపరంపర దీనిని బోలవు-జాలవనిచెప్పుట యాతనిని తక్కువచేయుటయుఁ గానేరదు. “కళవళమంది పల్కితివా” యన్న భావముతో పాపరాజుగారు పద్యము చెప్పిరిగాని అట్టి భావములు లక్ష్మణుని విషయమై సీతకున్నవా యని సందేహము కలుగును.

తిక్కనగారు – “అఖిలధర్మస్థితి నపచారియందునే యౌవనంబునఁ దప మాపరించె’’ యనియుఁ – “ఆతఁడిది కార్యమని నిశ్చయంబుచేతఁ నాయ భాగ్యంబు” యనియుఁజెప్పిరి. పాపరాజుగారు–“ఇంత తెగువసేయ నిచ్చగించుట నాయభాగ్యమింతె’’యనిచెప్పిరి ఇరువురు సీత దౌర్భాగ్యమును సమానముగనే చెప్పినను, రాముని సమర్థించుచుఁ జెప్పిన తిక్కనగారి పద్యము మిన్నగా నున్నది. ఇట్లున్నను ‘బూర్వకృతములు తప్పిపోవునే’ యన్నభావముల నిరువురు సమానముగనే చెప్పిరి.

పాపరాజుగారు చెప్పుచు – “నాదుమేనున్నది–చెంత గంగమడుగున్నది. యైటులయ్యెడిన్ దుదిన్”అని సీత నిష్ఠురములాడినట్లు చెప్పిరి. తిక్కన

గారు-"నేమరణంబుగోరినన్ జెల్లదే;జాహ్నవీ నలిలనేచన నూర్ధ్వగతిప్రదంబు" యని సీత యన్నట్లు చెప్పుచు నావ ద్యమునందే-"సంపుల్ల యశోభిరాముఁడగు భూపతివంశము నిల్చునంతలో నొల్ల"ననికూడ స్పష్టముగాఁ జెప్పినట్లు చేసిరి-ఇట్లుపాపరాజుగారు చెప్పలేదు. తెగువచేయునపుడు కూడఁ గర్తవ్యాకర్తవ్యముల నిర్ణయించుటలో నిరువుర యెదనింత యంతరము గోచరించుచున్నది. ఇంకొక చోటఁ బాపరాజుగారు చెప్పుచు-"అన్నలక్ష్మణ! యింక నాలస్యమేటికి జను మయోధ్యాపురంబునకునీవు, మువ్వురత్తలకును మ్రొక్కితినని తెల్పు''మని సీత యన్నట్లు వ్రాసిరి. ఇది యౌపచారికమైన భక్తియేగాని వేఱుగాదు తిక్కనగారు చెప్పుచు-"అతులిత పుణ్యమూర్తులగునత్తలకెల్లను నేనుభక్తిమ్రొక్కితి నెఱిఁగింపు"మని చెప్పుచు, నంతటితోనాఁగక, "సూర్యకులసేతువు నావిలసిల్లు రాముసంతతి భరియించి యున్నయది, దానికి శోభనమందఁ గచ్చప స్థితి నయినన్ దలంపు దయసేయుఁడు మీరని యప్పగింపుమీ" యని వేడుకొన్న దట. అత్తగారిపై భక్తిప్రపత్తులు, సూర్యవంశకేతువైన రాముని సంతానము దానుధరించుటలు చెప్పుచు, దానికి శోభనమందుటకై గచ్ఛపస్థితి నయినన్ దలంపు దయసేయుఁడని యప్పగించుటలోఁ బెదవులు దడుపుచు డగ్గుత్తికతో మాటలాడుచున్న సీతను మనకన్నులకుఁ జూపుచున్నాఁడు తిక్కనగారు. ఇట్టి యీసీతకును-అట్టి పాపరాజుగారి సీతకును అంతరాంతరములు చదువరులు తెలియఁదగ్గవి.

ఇంకొకచోటఁ బాపరాజుగారువ్రాయుచు - "ఎఱుఁగని మూఢులాడుకొను నెగ్గులకున్ భయమంది, య్యప్పుడే కలకుమనంబుతో విభుఁడు కాననసీమకుఁ బంచెగాక, య తెఱఁగొకసారిన్ బిలిచితెల్పి మనోవ్యథ తీర్చినిన్ను నేమఱనని పంపఁడయ్యె; నభిమానము కూరిమి యెందుఁబోయెనో''యని వాపోయిన దని వ్రాసిరి. ఇది బాగున్నది. ప్రియుఁడు తనపైఁజూపు నభిమానమును గూర్చిని దలపోయుచు విచారించుట తగినట్లుగానున్నది. కాని యడవిలోనొంటరిగా నిలఁ బడినప్పుడు ఇట్టివి తోచునాయని సంశయము! తిక్కనగారి సందర్భన- "జన పతికి నింక నేనే మని చెప్పిననేమియగును? నదికడచనె''నని యన్నదనిరి. ఇది యిరువురి సీతలలోఁగల భేదముకాని, ఆ యభిమానము పూర్తిగా విడిచి పోలేదు కనుకనే "జనను నూనుపోక వెండియు ననియెదనొక్కమాట రఘు వరానుజ సీతో'' ననియన్నదఁట! ఇప్పుడా భేదము స్పష్టమైనది. అభిమానము

తోనే, కూర్మితోనే పాపరాజుగారి సీత యంగలార్చినది. తిక్కనగారి సీత కాయభిమానాదులు నిష్ఫలములని తెలిసియు, నూసుపోక కనుచున్నది. ఆ మాటలివి: "తనమది నొక్కయుమ్మలిక దక్కినమంచిది: దానిఁ బాపఁగాఁనని దలపోసి చేయుపని - కక్కట - యేనునులోనుగానె? నాకు నెఱుఁగఁజొప్పి పొమ్మనుటకుందగనే? మొగమోటలేక, మన్ననయెడనైన-రాజుల మనంబులు ద్రిప్పఁగ బల్మికల్గనే?" అని యన్నదఁట. ఈమాటలు వ్రాయునప్పుడు తిక్కనగారి గంటమెట్లు కదలాడినదో యనిపించును. "తనకువచ్చిన నింద నాదికాదా? దానుచేయఁదలఁచిన పనికి నేనులోఁబడనా? పొమ్మని చెప్పుటకైనఁ దగనా?" అనుచున్నపుడు క్రమక్రముగా నుడుకెత్తిన సీతగొంతు స్తంభించి-బల్మియున్నదే'' యనుమాటలు ఒక్కటొకటిగా వెడలినట్లున్నవి. అప్పటి యా మొగము కన్నులఁచూచిన వారికిఁ దెలియును. లక్ష్మణునకుఁ దెలియును. లక్ష్మణుఁడు తడఁబడుచున్నట్లు సీత తెలిసికొని, వెంటనే గొంతుమార్చి అనునయస్వరముతో-"కానిమ్ము! నాకుఁజెప్పినఁ గానియుకా, దధిపు పనుపు గడతేర్పఁగ నేఁ బూనినపనియిది; నీపును బూని యొనర్చుటదియెల్లఁ దొచ్చెమె చెపుమా" అని యూరడించినది. పతియెదైవంబు గావున నతనిపంపొనర్చుటయకాదె ధర్మంబు'' అని నమ్మఁబలికినది. తిక్కన పాపరాజుల సీత లిచ్చట నద్దములోవలెఁ గనఁబడుచున్నారు. ఇట్లు తలపోయుచునే-మనస్సు మారఁగా, "అట్లు జగంబువారలున్ మానములేక యాతులువమాటలు నాదెసనాడదుస్సహంబైనది: దీని మానుపు నుపాయము చొప్పడదు"-అనుచుండఁగనే, లక్ష్మణుఁడింకనీమె భరింపరాని' దనుకొని ప్రయాణమైనాఁడు. ఈ విధముగా, నిర్దోషతా సాధనముగాఁ, బతిదేవతాప్రతిష్ఠావహముగా సీతతో మాటలాడించిన తిక్కనగారికిని, "శ్రీరాముమోమీ కాలంబునఁ జూచుభాగ్యమిక లేదేమో సుమిత్రాత్మజా" యని కన్నీరు విడుచుచుఁ "జనుమయోధ్యాపురంబునకు" అని లక్ష్మణుని సాగనంపించు మాటలు పల్కించు పాపరాజుగారికిని అంతరమెంత గలదో పాఠకులే తెలియుదురు.

## 29. రామవినాకృతయైన సీత

లక్ష్మణుఁడు తిరిగిపోవ నుద్యుక్తుఁడై "ధేనువుఁబాయఁజాలని వత్సంబు విధంబున" జాలిపడుచు "జననీ! జననాథుని గొల్వఁజనుదునె"యని మ్రొక్కి—

లిడి "మా తల్లిని బాసిపోయెదను, దాపసకామినులారఁగూర్మి సంధిల్లఁగఁ బ్రోవరే "యని వాపోవుచు, నోడయెక్కి యవ్వలిదరింజేరి సుమంత్రునిఁజూచి, "సుమంత్ర! యెంతదీనతవచ్చెన్ శ్రీరామలీల మీఱెడి శ్రీరామవధూటి"కని పొక్కుచు, రథమెక్కిపోయెను. సీతయు 'లక్ష్మణుఁడు తిరిగివచ్చునేమో' యని చూచుచు, రథము, కేతనము, పరాగము-చివరకు బట్టబయలు-కాగా నిరాశయై, రామునిచేత లెంచి పలవించు చుండెనని పాపరాజుగారు చెప్పిరి.

తిక్కనగారిట్లుచెప్పిరి. సీత-"అట్లు జగంబు వారలున్ మానములేక యాతులువమాటలు నాదెసనాడ దుస్సహంబైనది" అనుచుండఁగనే లక్ష్మణుడు ప్రయాణమయ్యెను. సీతకు ప్రదక్షిణముచేసి నమస్కరించి "వడినంటఁదాకు బలితపుటడలున రూపఱిన మనమునం దోరిమి పాఁటెడలి, వెసఁబురికిఁబో దెగువదరిన వావిడిచి దిక్కులద్రుప నఱచుచున్" గంగానదిఁజేరి యోడయెక్కిపోవుచు, "మేదినిన్ బొరలుచు నోడదిక్కరయు భూతనయం బలుమాఱుచూచుచు" బోయెననిరి. సీతయుఁ దననిస్సహాయస్థితినిగూర్చి యాలోచించుచుండెననియుం జెప్పిరి. పైఁజెప్పిన వానిలో బాహ్యములైన భక్తివిశ్వాసములు పాపరాజుగారి యందును, ఆంతరికమైన శోకభారావేశములు తిక్కనగారియందునుగనుపట్టును. "ఒడిమీదనిడికొని యురముపైఁ జేర్చుట-చేరికకడి కడసారియేమొ"అని పాపరాజుగారిసీతయు, మున్నాతెఱంగున నున్నట్టి యేనిప్పు-డిమ్మెయి వనముల కెట్లుపోదు"నని తిక్కనగారిసీతయు విచారించిరఁట. పాపరాజుగారి పదబంధము బాగున్నది. కాని తిక్కనగారి కర్తవ్యతా చింతనము మెచ్చుకోదగినదిగా నున్నది.

మూలమునందిట్లున్నది. "ఏవం బ్రువంత్యాం సీతాయాం లక్ష్మణో దీనచేతనః శిరసాధరణీం గత్వా వ్యాహర్తుం నశశాకహ ప్రదక్షిణం కృత్వా తా ధన్నేవ మహాస్వనం ఆరురోహపునర్నావం నావికం చాభ్యబోదఁ ముహుర్ముహుః పరావృత్య దృష్ట్వా సీతామనాథవత్ వేష్టంతీం పరతీర లక్ష్మణః ప్రయయావథ" - ఇట్లు మూలమున కనువాదముగా నున్న తిక్కనగారును భావించి వ్రాసిరి. రాముఁడు సీతను విడిచిరమ్మన్నను, సీయెదుట మాట్లాడలేకున్నను, వాల్మీకి దర్శనమువరకు సీతనట్లే ఏకాగ్రముగా గమనించుచున్న లక్ష్మణుని ఆంతరికస్థితి ఊహించుటకుఁ గూడ నందరానిది. ఒకవేళ వాల్మీకియే రానిచో అప్పుడు లక్ష్మణుఁ డేమిచేయునో తెలియ

రానిది. దీనినట్టే భావించిన తిక్కనగారును అసామాన్యులు. పాపరాజుగారి కవేమియుఁ బట్టలేదు. రామాజ్ఞ నెరవేర్చిన తృప్తితో నట్లే పయనమైనాఁడు.

శిష్యులు చెప్పఁగా వాల్మీకి "గ్రక్కున నటులర్ఘ్యపాత్రగొని గొల్చుచు వెంబడి నేగుదేర" సీతాదేవికడకుఁ బోయెనని పాపరాజుగారు చెప్పిరి. తిక్కన గారు- "ఆ రఘువంశవరేణ్యు దేవిగా దన మహనీయబుద్ధిఁ గని ధర్మవిధిన్ మహితార్ఘ్యపాత్ర చేకొని రభసంబునన్ జనియె" నని చెప్పిరి. తిక్కనగార న్నట్లు, అర్ఘ్యపాత్ర తానే గైకొని రభసంబున బోవుటలోగల యాతురత, ఆత్మీయత పాపరాజు రచనలోఁ గనుపట్టదు. పాపరాజుగారు- సీత "చరణ సామీప్యంబునన్ వ్రాలినన్" యతిమూర్ధన్యుడు బుజ్జగించి "వగపేలా పుత్రి! నీ నదుణోన్నతి నీ భర్తయెఱింగియున్, బ్రజలనిందల్ తాల్మిగుందింపఁగా" నిత్యాదిగా నూరడించెనని చెప్పిరి. తిక్కనగారు- "వనితారత్నము భక్తి నమ్ముని పదాబ్జాతమ్మునందశ్రులన్ గొని పాద్యం బొనరించె"ననియు, నాతఁడు "గద్గదికా నిరుద్ధ వచనుండై" యామె నూరడించెననియు జెప్పిరి. ఇచ్చట సీత కన్నీటిచేఁ బాద్యమిచ్చుట యొక విశేషము. వాల్మీకి 'మనఃక్షోభంబు సంధిల్ల గద్గదికను రుద్ధవచనుఁ" డౌట యింకొక విశేషము. పాద్యమీయఁ దగిన కన్నీరువచ్చుట మూడవ విశేషము. ఈ విశేషములను బాపరాజుగారు చెప్పలేదు. పాద్యోపచారముగా సీత కన్నీటి నుపయోగించుట- ఆమె దుఃఖాతి రేకమునేగాక ఆమె సంప్రదాయజ్ఞతను వెల్లడించును. అట్లే మనఃక్షోభము సంధి ల్లుటయు, గద్గదికా నిరుద్ధ వచనుఁడగుటయు వాల్మీకి కరుణామయమూర్తిని ప్రస్ఫుటముగాఁ జెప్పును.

పాపరాజుగారు- "నీ నద్గుణోన్నతి నీ భర్త యెఱింగియున్ బ్రజల నిందల్ దాల్మి గుదింపఁగా ధృతి నీతెంపొనరించె" నని వాల్మీకి యన్నట్లుగాఁ జెప్పిరి. తిక్కనగారు-"నిర్మలత నొప్పు నీదు చరితమ్ము తెల్లంబుగాదె! రాము నేరమియచూవె యింతయు నిక్కమరయ'' అని చెప్పిరి. రామునేరమియౌనో కాదోగాని, యా మాట చెప్పుట శోకాపనోదన హేతువనుట నిజము. ఒక దృష్టితోఁ జూచినపుడు శోకాపనోదన మగుటయు నిజమే. పాపరాజుగారు- "అఱమరయేల-నే నిలచు నాశ్రమ దేశము నీది కాదె" యని చెప్పుటకును, తిక్కనగారు-"ఇది మన యాశ్రమం, బిచటనీవు వసింపు"మని చెప్పుటకును అంతరమెంతగలదో సీత యెఱుంగనిదిగాదు. పైఁగా, "నీ గృహంబునకుఁ

జేరితి గావున నీదు గర్భ మభ్యుదయము<బొందు, దుర్యశము వోవు"నని చెప్పు టలో నాత్మీయతా సంచితోపహారమై, "కైకొను మర్చన" యని వాల్మీకి యం దీయగా సీత గైకొన్నదట. ఉభయ కవుల రచనలలో నిట్టి యంతరములు పెక్కు కన<బడును.

పై యన్నిటికంటె-"మునినాథు<డింతి దోకొని తన యాశ్రమమునకు నేగు తడవంతయు< దానును నిలిచి యాసుమిత్రా తనయు<డు కనుగొనియె నశ్రుధారలు గురియన్"అని తిక్కనగారు చెప్పలేదు. సీతను వదలినప్పటినుండి, యశ్రుధారలు గురియుచు గంగదాటి రథమునెక్కి పోవుచున్న లక్ష్మణు<డు వాల్మీకి సీతను సత్కరించి కొనిపోవునంతవఱకు 'నిలిచి చూచుచుండె'నని చెప్పు టలో గావ్యచిత్రణమున కెట్టి యుదాత్త రేఖ వచ్చినదో వేఱుగా< జెప్పనక్కర లేదు. శ్రీరామభక్తి భరితమైన లక్ష్మణుని మూర్తిమత్త్వములో సీతా కుశలసంధా నమునకు< గూడ నట్లే 'ప్రాణప్రతిష్ఠ' జేసినా<డని చెప్పవలెను. మూలము నందు-"దృష్ట్వాతు మైథిలీం సీతా మాశ్రమం సంప్రవేశితాం సంతాప మగ మద్ఘోరం లక్ష్మణోదీనచేతనః" అనియున్నది. దీనికి తిక్కనగారి "అశ్రుధారలు గవియన్" అని చేర్చినచో ఆ మూలమునకు< గ్రొత్త వన్నె చేర్చి నట్లగును. తిక్కనగారిరచన యట్టిది. పాపరాజుగారిరచన కిట్టి యాశా కిరణములు చాల< దక్కువ.

## 30. సుమంత్రునితో లక్ష్మ<ణుడు రాముని<జేరుట

పాపరాజు గారిట్లు చెప్పిరి. లక్ష్మణు<డు రథమెక్కి పోవుచు సుమం త్రునితో-"నిర్నిమిత్తమ ధరాత్మజ కెట్టి యుపాధి వచ్చె" "జానకీ పతికి< గాపురముం గడతేరదాయె<గా" 'అర్కాన్వయస్వామి యట్టి వధూటింబెడ<బాసి నిల్వగ< గలండే తాల్మి' 'అవనిజ తాపంబుననగు పాపము జనులదో జన పాలు<నిదోవచింపు" మని యడిగినట్లు చెప్పిరి. తిక్కన గారు - "... చేటు చూచితె మనుకులసత్తము<డు తొర<గె మైథిలినిన్, భూ జ... మహాత్ముల యనఘ చరిత్రమున కంటె నధికంబగుటన్" "అగ్గలించిన ... ననుభవించు చున్నవా< డన్న యేమని యుగ్గడింతు నీ మనోగ్లాని తె... యేది సెపుమ" అనియడిగినట్లుసెప్పిరి. పాపరాజుగారు సీతాదేవి నుద్దేశించి... దిక్కనగారు రామునుద్దేశించియు నడిగినట్లు వారి వ్రాతవలన< దెలియును

సుమంత్రుఁడు చెప్పు నుత్తరమును బట్టి యిది పరిష్కారమగును. సుమంత్రుఁడు దశరథుని నాఁటి నుండి పుత్రుల శుభాశుభముల సమీక్షచేయుచు, "కతిపయ వర్షముల్ చనినఁగార్యములన్ని యుఁదీర్చి, రామభూపతి మిమ్మునున్నగాఁబనిచి బ్రహ్మపదంబునకేగు, సీతకై వెతపనిలే''దని పాపరాజు గారును, "అనియెం గావున, రాముఁడు జనకతనూజయు నసౌఖ్య చరితు''లని తిక్కనగారును చెప్పి నట్లున్నది. వీనినిఁబట్టి సుమంత్రుఁడు రాముని కథనేగాని ప్రత్యేకముగా సీతను గూర్చి చెప్పినట్లు లేదు. లేకున్నను సీతనుద్దేశించి యడుగుట యసహజముగా నుండును. ఇంకొక్క విశేషము గలదు. తాను జెప్పిన కథలలో బాపరాజుగారు "భూసురుల నడిగినట్లుగాని-చెప్పినట్లుగాని" వ్రాయలేదు. తిక్కనగారు-"అతని పుట్టిననాఁడవచ్చి తజ్జనకునితోఁడ భూమిసురసత్తములెల్ల 'ననేక దుఃఖభా జనుఁడగు, నల్పసౌఖ్యుఁడగు, శౌర్యము ధైర్యముదానశక్తియున్ వినయముఁ గల్గువాఁడగు" నని సూచించినట్లు గాఁజెప్పిరి. పాపరాజుగారా ప్రస్తావన చేయ లేదు. మూలమున "దృష్టమేత త్పురావిప్రైః పియస్తే లక్ష్మణాగ్రతః భవిష్యతి దృఢంరామో దుఃఖప్రాయోఽల్పభాగ్యవాన్" అని యున్నది. దీనినిగూడ బాప రాజుగారెత్తికొనలేదు. వారి చిత్తవృత్తి యట్టిది. తిక్కనగారు సూచనాప్రాయ ముగానైనను తత్కథఁజెప్పి, శాస్త్ర భూసుర ప్రామాణ్యమునకుఁ బ్రతిష్ఠ గలిగించిరి.

## 31. లక్ష్మణ రామ సమాగమము

లక్ష్మణుఁ డయోధ్యకుఁ బోయెను. "కీర్తిలేని బ్రతుకువలె" "వార్తలేని కవిత్వంబువలె" సీతలేనియయోధ్యను దర్శించెను. పలువిధములఁ బొరులాడు మాటలఁ జెవిఁబెట్టక "సొరిగి పలుమాఱు పాన్పుపైనొఱఁగి యొఱఁగి యలయు విభుఁజూచియార్తుఁడై'' "అశ్రుపూరము లేత్తెపాఱఁ"గా దుఃఖితుఁడైన రాము పాదములపైఁబడెను. రాముఁడుగూడఁ దమ్మునిశిరము నశ్రులతోముంచెను. లక్ష్మణుఁడు ధైర్యముఁబెంచి "దేవర యలంఘ్యతరాజ్ఞవహించి, సీతఁ గొం పోయి సురాపగాతట తపోవన భూములడించి వచ్చితిన్'' అని చెప్పుచు, ''ఆవెతలెన్నియైనఁగలవు'' "చిన్మయమూర్తివి నీవెఱుంగవే'' "సచ్చిదాత్మకం బవు పరమాత్మవీవు" "వివిధ చరాచరావళుల నీవయినిండ వెలుంగుచుండఁగా నవనిజయెందుఁ బోయినది'' ఇత్యాదిగా రాముని బోధించెను. రాముఁడు

ప్రసన్నుఁడై. ''సమ్మోదంబువాటిల్లె నీయనవద్యోక్తి" నని బదులుచెప్పెను. ఈ చెప్పుటకొక వుటకుఁబైగాఁ బెద్దవచనము- నెనిమిదినిండుపద్యములు పట్టినవి.

తిక్కనగారిరచనలో నయోధ్యాపుర వర్ణనము-పౌరసంభాషణాదులులేవు. "మోసలనల్లన తేరుడిగ్గి, నెవ్వగదలకొన్నవేఁగరతి వ్రాలుగతిందలవాంచి" లక్ష్మణుఁడు మెల్లగా నమీపించెను. పోవునప్పుడుకూడ - ''విగళద్బాష్పంబు లంతంత లోఁననయింకించుచు"నేపోయి ''తొట్రుపాటు చరణన్యాసంబులన్ జేర నీని నడంజేరి" వినమ్రుఁడయ్యెను. రాముఁడును 'కన్నీరాఁకకున్ మీఱంగా ''నేత్రములు తుడిచికొంచు, సుమిత్రాసుతుఁ బెఱకరమున మెల్లననెత్తెన్.'' అఁట ''విషాదామాత్రహృదయుడయ్యుయు" నమాహితుఁడయ్యెనఁటః లక్ష్మణుఁ డుపవిష్టుఁడై "దేవః దేవి నంచితిని భవన్నిరూపిత విశిష్టతపోవనభూమికిన్ దగన్ నతి మునియాజ్ఞనాశ్రమమునన్ వసియించె-జరత్తపస్వినీయుతనవపర్ణశాల, నఖిలోప నతార్ఘ్య సగౌరవంబుగన్" అని విన్నవించెనఁట. ఈ యాంగికాభినయము లన్నియు వ్రాయుట కొకింతకాలము పట్టినను, చేయునపు డన్నియు క్షణకాల వర్యాప్తములై యుండును ఇంతేగాక చెప్పునప్పుడుకూడ "దేవః దేవి నంచితిని భవన్నిరూపిత విశిష్టతపోవనభూమి, - నతి - మునియాజ్ఞ, జరత్తపస్వినీయుత, అఖిలోప నతార్ఘ్య నగౌరవంబుగన్'' అన్నమాటలు తూచితూచి వాడినట్లుగా, రాముని మనస్సున లక్ష్మణుని మనస్సున సీతాదేవికున్న స్థానగౌరవములకుఁ దగినట్లుగా నున్నవనిపించును. ఇట్లు సూటిగాఁజెప్పి లక్ష్మణుఁడు-''ఇట్టివి దైవ చేష్టితము-లెవ్వరికిం గడవంగరాదు'' ఇత్యాదిగా నుపశమన వాక్యములుపల్కి- "ధృతి కున్మేషంబుగావింపవే'' యని వేడుకొనెను. పాపరాజుగారు చెప్పిన "చిన్మయమూర్తివి నీవెఱుంగవే" "నచ్చిదాత్మకంబవు పరమాత్మనీవు" ఇత్యాది స్తుతి పర్యాయవాక్యముల కంటెఁ దిక్కనగారి వాక్యములు నము చితముగా నున్నవనిపించును. "పెరుగుట-స్రగ్గుట-పదార్థోత్కరములనైజము" అని పదార్థ పరిణామము చెప్పుట ఉచితతరముగా నున్నదనవలెను. ఇంకొక విశేషమేమనఁగా, "నృగుఁడనఁగ నిమియనంగా జగతీపతు లనవధాన జాడ్యంబున నిందగతింబొంది" రని తిక్కనగారు సూచనాప్రాయముగాఁ జెప్పిన దానిని, నృగునిమియయాతి చరిత్రములు విస్తరించి పాపరాజుగారు పెద్దదేసి గ్రంథముఁబెంచిరి. రాముని దేవత్వమునకుఁ బట్టము గట్టిరి.

ఇచట నింకొక్క విశేషము చెప్పవలసియున్నది. పాపరాజుగారు దీనిని

వ్రాయలేదు. తిక్కనగారు ప్రత్యేకముగా వ్రాయక విడువనులేదు. రాముఁడు సముచిత సంభాషణములఁ బ్రొద్దుగడపుచున్నను, అతని మనస్సు నితాంత చింతాదంతురమై, ఏకాంతము చిక్కినపుడెల్ల "నీకకా-యకట పినాకిబాణాసనం బద్భుతంబుగ సభనట్లుచేసి,......నిన్నిట్లుగానపాలుచేసి యాఁబడి బుచ్చితి" "చిచ్చుచొరంగఁబోక, మది చిక్కఁదనంబున కియ్యకొన్ననా కిచ్చట దెచ్చి నిన్విడుచు టెంతటిపెద్ద" "అవివేకులాడు పెన్మాటలకేల యీదురభిమానముఁ బూనితి, వారినేలనేఁ గీటునఁ బుచ్చనైతి" "కొందఱో హో కృపమాలిచేసెనిది యెప్పుడు పొమ్మని దుర్వినీతిగాఁ గైకొనిరేని, వారిమదికందువ కెయ్యదిగొందు" ఇత్యాదిగాఁ బలవించెను. విచారించెను. పశ్చాత్తాపపడెను, నిర్విణ్ణుఁడయ్యెను. ఇట్లగుటగూడ స్వభావము సీతా విషయమున నిదియత్యంత సహజము. కనుకనే తిక్కనగారు దిఙ్మాత్రముగనైన సూచించిరి. పాపరాజుగారిట్లు చేయక, లక్ష్మణుఁడు రాముని దర్శించునప్పటికే రాముడు "ఏకతంబునఁ దొల్లి యింతి పల్కిన కూర్మిపల్కులు వాక్రుచ్చి పనవి పనవి" ఇత్యాదిగా నొక సీస పద్యమువ్రాసి విడిచిరి. సమయసందర్భములు గుర్తించి ఔచిత్యపోషణము చేయుట కావ్యనిర్మాణమున ఒక ముఖ్యాంగము. దీనిని దిక్కనగారివలెఁ బాపరాజుగారు నేరువలేదెమో యనిపించును.

## 32. లవణ సంహారము

లవణ సంహారమున మూడు ఘట్టములు ముఖ్యమైనవి. సర్వ సన్నాహములతో శత్రుఘ్నునిఁ బంపుట యొకటి. వాల్మీక్యాశ్రమమున విడిది రెండవది, లవణ సంహారము మూడవది. మొదటి ఘట్టమున లవణుని క్రూర ప్రవర్తన మెల్ల నొక పద్యముతోఁజెప్పి, "వానిని సంహరించి మా తాపముఁ బాపగావలె" నని చ్యవనాదులు వేడుకొనిరి. రాముఁడు సమ్మతించి "గ్రమ్మననొక్కఁడియ్యకొనఁగా వలెయున్ మనలోన" నని తమ్ములతో జెప్పెను. భరత లక్ష్మణుల వారించి శత్రుఘ్నుఁడు- "వీరల కెదురుగఁ జాలెడు వారచ్చో నెవ్వ" రని పలుకుచు, 'నేఁబోదు'నని పల్కెను. రాముఁ డాతని ప్రయాణమునసనుమతించి, 'మధురాప్రభువు' గా నాతనికిఁ బట్టము గట్టి తాను సంపాదించిన "యమోఘాస్త్ర' మునిచ్చి, సైన్య సన్నాహమొడఁగూర్చి, మునులఁ జూపించి 'వీ రెట్ల చెప్పిరట్ల యెల్ల పనులు చేసి విజయలక్ష్మి చేకొనిర"మ్మని దీవించి యాజ్ఞ

పించెను. అతఁడట్లే పయనమై వాల్మీక్యాశ్రమ సమీపమున విడిసెను. ఈ కథ తొమ్మిది పద్యములతో దిక్కనగారు చెప్పిరి.

దీనినే పాపరాజుగారేఁబది పద్యములతో విస్తరించిరి. చ్యవనాదుల ప్రార్థనము, లవణు నాహారవిహారాదులు, శూలము చేతనున్నంత వరకాతఁడవధ్యుఁడగుట మున్నగునవి చెప్పఁగావిని రాముఁడు శత్రుఘ్నునిఁ బయనముచేసి, పట్టాభిషేకముచేసి, తన యస్త్రముతోఁబాటు సర్వసైన్యముల నమీకరించియిచ్చి, సైన్యరక్షణ క్రమము బోధించిపంపెనని చెప్పిరి. ఇట్లు చెప్పుటతో గ్రంథము గూడఁ జాలపెరిగినది - ఇంతేగాక లవణవధోపాయముగూడ శ్రీరాముఁడే చెప్పుటతోఁ గథాగమనమునకు భంగమేగాక శత్రుఘ్నుని యుదాత్తతా స్ఫూర్తికిఁ గూడ భంగము కలిగినట్లు తోచును. ఆ కథ తర్వాతఁ జెప్పఁబడును.

రెండవఘట్టము - వాల్మీక్యాశ్రమము. శత్రుఘ్నుఁడు వాల్మీక్యాశ్రమము చేరినరాత్రికే సీతాదేవి కవలపిల్లలను గనెను. శత్రుఘ్నుఁడు వాల్మీకివలన సౌదాసుని యజ్ఞవాటికల కథ విన్న తరువాత - "పుత్రోదయము ధరిత్రీ పుత్రీ క్షేమంబు నత్తపోనిధిదెలుపన్ శత్రుఘ్నుఁడువిని "యౌరా శ్రోత్రములు ఫలించె" నంచు సొంపువహించెన్" అని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు "అట్టి యవసరమున నమ్మునిపల్లెలోఁ బరఁగునుత్సవంబు పలుకులెల్ల మనముపల్లవింప వినుచు శత్రుఘ్నుఁ డంగములఁ బులకసమితి కరముదాల్చె"ననిచెప్పిరి. పుత్రోత్సవమువినుటతోనో, ఇతరోత్సవములతోనో స్పష్టముగాఁజెప్పలేదు మూలమునందు- "సంకీర్తనంతు రామస్య సీతాయాః ప్రసవౌశుభౌ అర్ధరాత్రేతు శత్రుఘ్నశ్శుశ్రావ సుమహత్ప్రియం పర్ణశాలాంతతోగత్వా మాతర్దిష్ట్యేతిచాబ్రవీత్" అని శత్రుఘ్నుడు వినుటయేగాక పర్ణశాలకుఁబోయి చూచెనని చెప్పఁబడినది. ఈ విధముగ శత్రుఘ్నుఁడు పుత్రోత్సముకో ఇతరోత్సవమునో గని పులకరించెనని తిక్కనగారును, పుత్రోత్సవమువిని సంతసించెనని పాపరాజుగారును, పుత్రోత్సవమును వినుటయేగాక సీతనుజూచి కృతజ్ఞుడయ్యెనని మూలకారుడును చెప్పినట్లు తెలియును.

పదుమూడేండ్ల తర్వాత, లవణసంహారానంతర మయోధ్యకు వచ్చుచు దారిలో వాల్మీక్యాశ్రమునకు వచ్చినపుడు, కుశలవులు రామాయణము పాడుచుండగా విని శత్రుఘ్నుఁడు-"పరవశుఁడగుఁ, దెలియున్ఁ గ్రమ్మఱవిని తల

దెసబోవన్జూచినన్" అని చెప్పిరి. తిక్కనగారన్నట్లు "నిల్వుము- ఆయుధ పాణినై నిన్నుజయింపగా వచ్చెదనని యూరిదెస పోవు ప్రయత్నము"పాపరాజు గారు చేయలేదు. అట్లే "నృపనందనుతోఁ జెప్పఁబలుకొండు గానక యప్పటి యని కియ్యకొనుట"యుం జెప్పలేదు. "నాదు నిశితశరములఁగూలిన నిన్ను భూమిసురులు గన్నారనిప్పుడు చూచువారు"అను శత్రుఘ్న ప్రతాపోక్తియు స్ఫురణకురాలేదు. మొఱుటుగా మార్కొనుటమాత్రముగోచరించును. పాపరాజు గారి రచన యిట్లున్నది.

యుద్ధము కొంచెముసేపు జరిగినది. ఇంతలోఁ లవణుఁడు- "ఒక్క కుజంబుఁదెచ్చి దుర్దాంతరయంబునన్ శిరముఁదాఁకఁగ వ్రేయ, నతండు నొచ్చి విశ్రాంతి వహించి మూర్ఛిలె''ననియు, "అది మృతిగాఁదలంచి రిపుఁడార్చుచు" "ఏటికి శూలమింక, నన్నెదిరినవైరిసచ్చె"నని యెల్లమృగంబుల భూరిమాంస ముల్ ముదమున మెక్కుచున్నయెడ''నింతలో శత్రుఘ్నుఁడు మూర్ఛఁదేఱెనని యుఁ బాపరాజుగారుచెప్పిరి. తిక్కనగారు "అమ్మహీరుహంబు నదరంటఁ దాఁకిననొచ్చి పంక్తిరథతనూభవుండు మూర్ఛవచ్చి యంగములు శిథిలంబులై మిడుక మిడుకపుడమి మీఁదఁబడియె" ననియు, అంత నున్మత్తుఁడై లవణుఁడు "శార్యోన్నతినార్చి భ్రమరిగాఁజన్నయెడన్" దెలిసెననియు జెప్పిరి. లవణుఁడు భ్రమరిగాఁ దిరుగులోపలనే శత్రుఘ్నుఁడు మూర్ఛదేఱెనని చెప్పుటచే లవణుఁ డూరికిఁబోయిఁశూలము తెచ్చికొను నవకాశము లేదనియు, నట్టి యాలోచన యతనికి కలుగలేదనియు స్పష్టముగాఁ జెప్పినట్లైనది. పాపరాజు రట్లుగాక శత్రుఘ్నుఁడు మూర్ఛపొందఁగా లవణుఁడు "ఏటికిశూలమింక, నన్నెదిరినవైరి సచ్చెనని యెల్లమృగంబుల భూరిమాంసముల్ ముదమునమెక్కుచుండ"నని చెప్పుటచే, ఆమూర్ఛను మరణముగాఁదలఁచుటయు, వైరిచచ్చెఁగావున శూల ముతోఁ బనిలేదనియు, ఆయుత్సాహముతో భూరిమృగమాంసములు మెక్కు చుండెననియుఁ జెప్పినట్లయినది. ఈరెండు రచనలలో శూలముదెచ్చికొనుట కవ కాశముండియు నట్లుచేయక మృగమాంసములు దినుచుండుటచే లవణుడు శత్రు ఘ్నునిచేఁ జంపఁబడెననుట స్పష్టముగ దెలియును. తిక్కనగారట్టి యవకాశము లేకుండగనే లవణుఁడు మరణించెనని తెల్పిరి. లవణుఁడుకూలుట నిరువురు చెప్పినను తారతమ్యము లిట్లున్నవని తెలియవలెను.

తరువాతఁ జ్యవనాదులువచ్చి శత్రుఘ్నునిఁ బ్రశంసించును,- "మీ తాత

మాంధాతన్ ద్రొల్లి వధించె, నాపగ తవద్వంశంబునం దెవ్వడున్ వేతీర్పంగఁ దలంపరైరి, త్రిజగద్విఖ్యాతిగా నిప్డు నీచేతన్ జచ్చెఁ, గుణంబు తేజము ప్రతిష్ఠింపంగఁ దానల్పమే" అని పొగడిరని తిక్కనగారు జెప్పిరి. పాపరాజుగారా ప్రస్తావనయే యెత్తి కొనలేదు. ముందీ కథ చెప్పినను ఇప్పుడీ మాట చెప్పుట యవసరము. మఱియు, లవణ సంహారమునకై ప్రోత్సహించి శత్రుఘ్నుని కింతవరకు బాసటగా నుండిన చ్యవనాదులనుగూడఁ బేర్కొనలేదు. ఇది మిక్కిలి యన్యాయము ఇచ్చటఁ బాపరాజుగారి కనవధానతా దోషము వట్టినది. తిక్కన గారు– అసురపాటుచూచి వసుమతీసుగ...

మారుఁ బొదివి" సంభ్రమ హర్షంబు...
ముగా నున్నది.

పాపరాజుగారు–"శత్రుసంహర ణమ...
దగువారిఁ బంచె" నని చెప్పిరి. ఇది యు...
గారణముగూడ నున్నది. "ఎవ్వడు లవణుః...
లేఖలననుపు మిచట'' కని రాముడు ముందు...
ఘ్నుఁడా పని చేసెను. తిక్కనగారట్లు వార్త పంపలేదు. ఇ...
దోచును. కాని, దీనికిట్లు సమాధానమూహింపవచ్చును. రాముఁడు ...
ప్రయాణముఁ జేసి పంపునపుడే మధురా పట్టణమునకుఁ బట్టముగట్టిఁ తన యస్త్ర మొకదానిమంత్రించి యిచ్చెను. దీని బట్టియీపని తప్పక నెరవేరునని యాతని నమ్మకము. అట్లు లేకున్న నపుడే పట్టముఁ గట్టి పంపఁడు. ఆ విషయమున శ్రీరామునికి సందేహము లేదు. సందేహము లేదు గావుననే 'నీ విజయ వార్త తెల్పు' మని యపుడు చెప్పలేదు. అట్లే శత్రుఘ్నుఁడు విజయ వార్త వంపలేదు ఇట్లు భావించినచో పాపరాజుగారి రాముని కంటెఁ దిక్కనగారి రాముఁడే యమోఘ సంకల్పుఁడని తెలియును .

"ధరా స్వర్గమో యన నింపారెడు నీ పురం" బనుచు వా (ఇంద్రాదులు) రంతర్థిఁ జెందంగ" "దినసప్రభశతప్రథిత భాప్రచయ దీప్ర కనక ప్రచుర వప్రగణము గలిగి" ప్రకాశించు మధురాపురంబు ప్రవేశించి శత్రుఘ్నుఁడు రాజ్యమేలెనని పాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు "నన్ను మధురాపురంబేల నన్న పనిచె రాష్ట్రమునకు వృద్ధియుఁ బ్రజారంజనంబు నినుత సర్వర్తనము ఘటి విప్రభక్తి" దయ చేయుఁడని యింద్రాదులఁ బ్రార్థింపఁగా,వారట్లే యొసఁగి

రని చెప్పిరి. ఇచ్చుటనేది చెప్పుట యుచితమో సహజమో అందరికిఁ దెలియును. "మిగుల సద్వర్తనము మతివిప్రభక్తి" దయ చేయుఁడని చెప్పుట మిగులఁ బ్రశంసావహము. పండ్రెండు వత్సరముల తర్వాత రామదర్శనార్థమై శత్రుఘ్నుఁ డయోధ్యకుఁ బోయెనని యిరువురు కవులును జెప్పిరి నడుమ వాల్మీక్యాశ్రమమున జరిగిన కథ ముందే చెప్పఁబడినది గదా!.

శత్రుఘ్నుఁడయోధ్యకు వచ్చి, తానుదెచ్చిన కానుకలనిచ్చి నమస్కరింపగా, రాముడు- "నగుచుఁ దమ్మునిజేరఁ దిగిచి కౌఁగిటఁ జేర్చి వసుధేశవసునేల వగవు వత్స"యని తమ్ముని మాట్లాడించినట్లుగాఁ బాపరాజుగారు చెప్పిరి. తిక్కనగారు శ్రీరాముఁడు తమ్ముని "తిగిచి కవుంగిలించి నరదేవకులోత్తము డక్కుమారునెమ్మొగము మొగమ్మునన్ గదియమోపుఁ, గరాంగుళులన్ గపోలమింపుగఁ బుడుకున్, బొరిఁబొరి సపూర్వ విలోకన మాచరించుఁ, గప్పగు మృదుమౌళి నుజ్వలనఖాంకుర రేఖ యొనర్చు నర్మిలిన్" అని చెప్పిరి. ఈ రెంటిలో నేది ఆత్మీయతా ప్రీత్యుత్కర్షములకు నెలవో చెప్ప వలయును. రెండవది : శత్రుఘ్నుఁడు తాను బోయి చేసికొని వచ్చి కార్యము సంతయుఁ జెప్పెను గాని, బ్రాహ్మణుల ప్రస్తావన చేయలేదు. తిక్కనగారు "విప్రుల కపూర్వ మహోత్సవ మాచరించి, వారని కృప వారు పంప మధురాపురి రాజ్యము చేయుచుంటిఁటిన్" అని చెప్పిరి. అట్టి కృతజ్ఞతావిష్కారము పాపరాజుగారెఱుఁగరా యనిపించును పాపరాజుగారు "మీ పదాబ్జములుఁగానఁగ వచ్చితిఁ, దాళ శక్యమే యాపుబాయులేఁగ వతె నచ్చట నొంటిగనిల్చి" యని చెప్పిరి తిక్కనగారు- మిముఁ గొలుచు సుఖమునకు రాజ్యము సౌఖ్యం బీడుగాయి నందునికికిఁ జిత్తము గొలువక నా వచ్చుట సముచిత మనుచితము నాకు దన నిండుదయన్" అని చెప్పిరి. వీనిలో నేది గాఢాభిరతిద్యోతకమో చెప్పవలెను. పై మూడంశములకుఁ జదువరులే యుత్తరము తేర్చుచుట మంచిది. కుశలవుల వృత్తాంతము నెఱిఁగియుఁ జెప్పక పాపరాజుగారును, ఎఱుఁగనట్లు చెప్పక తిక్కనగారును మూగనోము పట్టిరి

## 33. శంబూక వధ -

త్రేతాయుగములో రాజధర్మచరిత్ర చెప్పునది శంబూక వధ. జాతిమత వర్ణవర్గాదుల కొలతలు పూర్తిగా భిన్నములైన యీకాలములో నాకథ యంతగా

నరిపడదు. కాని, కథారచనతోఁ గవుల తారతమ్యములు పరిగణించుటకుఁ బనికివచ్చును. కావున దానినిప్పుడు పరిశీలింతము. బ్రాహ్మణ దంపతులు మృతబాలు నెత్తుకొనివచ్చి రాజద్వారముకడఁ బెట్టి దీనముగా విలపించిరి. పాపరాజుగారు-"సత్యము ధర్మమున్ దయయు క్ష్మాపతి దాల్చిన, నిట్లు బాలురన్ మృత్యువు సెందునే! యిఁక నదేటికి? బాలునకగ్నికృత్య మౌచిత్యమె మే మొనేయుట: త్యజించెద మీఁతదీఁ బ్రాణముల్ హత్యలు మూడునుం బొరసి యయ్య సుఖింపు" మని పలవించిరని చెప్పిరి. తిక్కనగారిట్లు చెప్పిరి-"ఎయ్యెడి యెట్లుపోయినను సీతనికిం బ్రియమెచ్చునట్లుగాఁ నియ్యెడ నగ్ని పెట్టుకొని యెల్లజనంబులు చూచుచుండఁగాఁ జయ్యనఁ బ్రమందిపోయెద; విచారములన్నియు నేల? యంతతో,దయ్యమునెత్తికోలు తుదిదాకెడు" నని బహుప్రకారముల విలపించెననిరి. ఈ విలాపములు రెండు సరిగానున్నను పాపరాజుగారి విలాపములో నాక్రోశ మెక్కుడుగాఁ గన్పట్టును. తిక్కనగారి విలాపములో "దయ్యము నెత్తికోలు తుదిదాకెడు" నని రాజును స్పృశింపక, దైవదుర్నివారత గనఁబడును. ఇది మృదుపద్ధతిగదా!

పాపరాజుగారిట్లు చెప్పిరి. రాముఁడు సభచేయించెను. ఆసభకు మంత్రి పురోహిత సామంతాదులేగాక, 'సంవర్త జలరాశి జానుదఘ్నంబుగా మనిన మార్కండేయ మునివరుండు'ఇత్యాదిగా మహామునులందరు గుంపులుగా వచ్చిరి. కాని వారిలో నొక్కరైనఁ బెదవివిప్పి మాటాడలేదు. నారదుఁడొక్కఁడు మాత్రము కృతత్రేతాయుగ ధర్మవ్యవస్థనుదెల్పి, దీనికి భిన్నముగా శూద్రుఁ డొకఁడు తపస్సుచేయుచుండవలెననిచెప్పి, వానిని వధియించి విప్రబాలుని బ్రదికింపవలెనని కోరుచుఁ "బాపాత్ముల దండింపని క్ష్మాపతి కాపాపఫలము షడ్భాగము సంప్రాప్తించు" ననియు, "ఈయెడ రాజనీతి వచియించితి నంతియ: ఒక్కసారి 'రామా' యని నిన్నుఁ బేర్కొనినయంత ననంతములైన పాపముల్ పాయు" ననియుఁ జెప్పిరి. ఇంతతెలిసినవాఁడాఁ శూద్రకుఁడు 'ఫలానా' చోట నున్నాఁడని యేల చెప్పలేదో తెలియదు ఒక్కసారి 'రామా' యనఁగానే అనంత పాపములు పటాపంచలగు నప్పు డచ్చటఁ జేరిన మహామును లందఱొక్క నిమిష మాపని యేల చేయలేదో తెలియదు. అంత మాహాత్మ్యముగల రాముఁడింత పెద్దసభ నేల కూర్చెనో తెలియదు. అది దేవరహస్యము కాఁబోలు!

తిక్కన గారిట్లు చెప్పిరి. సభకు వసిష్ఠాది మునులు వచ్చిరి. శూద్రముని

తపస్సే విప్రబాలుని మరణమునకుఁ గారణము కావలెనని యుగధర్మ నిర్ణయముతోఁ జెప్పి, దీనిని నీవే తీర్పవలెనని కోరిరి. రాముఁడు సమ్మతించి, విప్రునూరడించి, బాలుని మృత శరీరము తైల ద్రోణిలోఁ బెట్టి కాపాడుమని లక్ష్మణునితోఁ జెప్పి, పురరక్షణ బాధ్యత భరతున కప్పగించి తాను పుష్పక మెక్కెననిరి. ఇందులోఁ బాపరాజుగారు చెప్పిన యతిశయోక్తులేవియు లేవు. మృత బాలుని శరీరము రక్షించుటేగాక 'పుర రక్షణంబునకు భరతలక్ష్మణుల నియోగించి' యను ననంగతోక్తులు లేవు. ఒకటిన్నర పుట వచనములోఁ జెప్పిన రాముని వైభవము లేవియు నిందు చెప్పఁ బడలేదు.

రాముఁడన్ని దిక్కులు తిరిగి దక్షిణపు దిక్కున నొకకొండదండఁ గాసార మధ్య ప్రదేశంబున "దీవ్యత్తపస్యాన్వితు' నొక్కనిఁ జూచె నని యాతని వర్ణించుచు, "వీక్షించి నివ్వెఱఁగుపడి యాక్షితికిన్ డిగ్గి, వాని కపరోక్షగతిన్ సాక్షాత్కరించె సాక్షాదక్షరతత్త్వంబు శూద్రుఁ డల్పుఁడె తలఁవన్"అని తానాశ్చర్యపడుచు 'నీవఁడ' వని రాఘుండు ప్రశ్నించెనని చెప్పిరి. ఇచ్చటఁ గాసార మధ్యమున శూద్రుఁడెక్కడ నుండి తపస్సుఁ జేయు చుండెనో తెలియదు. "నిరాహారున్ శోణజటాచ్ఛటాధరు"నని చెప్పెనేగాని యా తపోవిధాన మెట్టిదో తెలియదు" సాక్షాత్కరించె సాక్షాదక్షరతత్త్వమని చెప్పెనేకాని, యక్షరతత్త్వ-మెవరి-కెట్లు సాక్షాత్కరించెనో యర్థముగాదు. ఇది పాపరాజుగారి రచన.

తిక్కనగారిట్లు చెప్పిరి "అందొక కొండ చేరువ సితాబ్జవనంబుల తీరభూమి మాకందము కొమ్మనన్ బిగియఁ గాళులు రెండు దగిల్చి వ్రేలుచున్ గ్రింద హుతాశనార్చుల నభేదముననన్ గబళించి మ్రింగుచున్ దెందము కాంతి వొంద మహనీయతపం బొకఁ డాచరింపఁగన్" "కని యల్లల్లన నచటికి జనుచు నిరూపించి యతని ఛందము తననెమ్మనమున కెరవయి తోచిన మనుజేంద్రుఁడు చేరనరిగి మధురోక్తి మెయిన్" యిట్లనె నచెప్పిరి, "మాకందము కొమ్మనన్" "ఆచరింపఁగన్" అన్నంత వరకు ఆతడు చేయు తపోవిధానముఁ గన్నులఁ జూచినట్లుగాఁ జిత్రించుట యొక విశేషము. 'సాక్షాత్కరించె సాక్షాదక్షర తత్త్వ"మని యధికముగాఁ జెప్పకపోవుట యింకొక విశేషము. రామునిఁ గూర్చి "మనుజేంద్రుఁడు చేరనరిగి" యని మానవ శ్రేష్ఠవాచకము నుపయోగించుట మూడవ విశేషము, మూలమున "శైలస్య చోత్తరేపార్శ్వే" (శైవలస్య అని యుండుట అచ్చుతప్పుగానుండవచ్చును) అని యున్న దానిని "అందొక

కొంద చేరువ" అని తిక్కనగారును, "ఒక కొంద దండ యని పాపరాజు గారును వ్రాయుటయు, మూలము చూచినామని చెప్పకపోవుటయు విశేషము లలో విశేషము. పాపరాజుగారు - "శ్రీరామక్షితినాయకాగ్రణి నిరీక్షించెన్-దీవ్యత్తపస్యాన్వితున్" అన్న పద్యములో "లంబమానమధోముఖం" అన్న దానిలో 'అధోముఖం'' అను దానిని చెప్పి 'లంబమానం' అనుదానిని విడుచుట విచిత్రమైన విశేషముగాఁ దోఁచును ఆ పదము లేకున్న ఆతపస్యావృత్తి యధా స్వరూపముగా నర్థము కాదుగదా. ఇది అర్థము కాకపోయినను, మూలములో లేని-తిక్కనగారు చెప్పని ఒకటిన్నర పుటవచనము దీర్ఘసమాసములతో జెప్పుట పాపరాజుగారి యభిమతముగాఁ దోఁచుఁను. మఱియు,శూద్రుఁడు తపస్యా న్వితుఁడు కాఁగాఁ: "జనుచు నిరూపించి యతనిచందము తన నెమ్మనమున కెరవయి తోచిన"నని వైరస్యము తోచినట్లు తిక్కనగారు చెప్పగా, దానినే "వీక్షించి నివ్వెఱఁగు పడి'' "శూద్రుఁడల్పుడెతలపన్" అని మెచ్చుకోలును పాపరాజుగారు చెప్పుట పైవానికి తలమానికముగాఁదోచును.

రాముఁడు తన పేరు చెప్పి యతని వృత్తాంతము తెలిసికొని ''వినయ వంతుని జనునే హింసింప, రాజ జన్మము నింద్యం బని రోసి, వెన్క భూసుర తనయు మృతిందలఁచి: కినుక దయఁబెడఁబాపన్" కలకల నవ్వె" నఁట ఖడ్గము 'జరన' దూసెనఁట!'' శూద్రు మస్తము కఱుక్కన ద్రుంచె' నఁట: ఈవిధముగా పాపరాజుగారు చెప్పిరి. కలకల నవ్వుట మొదలు కంఠము నఱికి నంతవరకు ఉద్ధత ప్రవృత్తియేగాని సుకుమార భావపరిణతి కనబడదు.

తిక్కనగారిట్లు చెప్పిరి. శూద్రముని చెప్పిన మాటలు విని "అచ్చెరు వంది గాఢసంభావనచేసి, శూద్రమునిపై సదయంబగు చూడ్కి నిల్పి, చిం తావివశత్వమొందె-నృప ధర్మము నీచముగాఁ దలంచుచున్" అని చెప్పిరి. శూద్రమునిపైఁ గరుణాతిరేకము గల్గుట స్పష్టముగా నిందు గోచరించును. మఱియు 'రాజధర్మము నింద్యం' బని తలచుట కంటె "నృప ధర్మము నీచముగాఁదలంచుట'లో నౌచిత్య స్ఫూర్తి కనఁబడును. తర్వాత, ''తనయ శవంబు మోచికొని తన్వియుఁ దానును వచ్చి యేడ్చు విప్రుని యెద లంత రంగమునఁ బోక పెనంగిన" దఁట! ఇట్లు పెనంగిన యీ కరుణారసమునే "వెన్క భూసుర తనయు మృతిందలచి కినుక దయఁబెడఁబాపన్" అని యొక మాటతో నవ్వులికి ద్రోయుట పాపరాజుగారు చేసిన పని. తిక్కనగారు-"ఖడ్గ

మున్ గనుంగొనుచు, మునీశ్వరానుమతిఁ గ్రూరతకైనను నోర్చువాఁడఁ బొమ్మని తలపోయుచుండెఁ గృపయందెడ సేయుచుఁ జిన్నవోవుచున్" ఉండె ననిరి. ఇంతటి భావ సంఘర్షణము కలుగుట పాపరాజుగారు చెప్పలేదు. పైగా వధోద్యుక్తుఁడైనట్లు గూడఁ జెప్పిరి. తిక్కనగారు "దోలాందోళిత మనస్కుఁడైనట్లు చెప్పిరి. ఈ దోలాందోళనమునే "కరుణాతిశయంబుఁ బ్రజా పరిపాలన రతియుఁ బెనగుపడి యుల్లములోఁ బిరిగొన నిశ్చయమునకున్ జొరఁ జాలక తలఁకు"నని స్పష్టముగాఁ జెప్పిరి. మఱియు, వెగడుపడి, యచటఁ బెద్దయు వడి నిలిచి, తలంచుకొని, యవశ్యంబును నిప్పుడితని దెగజూడక చొప్పుడునే యీ విప్ర శిశువు ప్రాణం" బని యొక నిశ్చయమునకు వచ్చెనఁట; నిశ్చయించి కూడ- "తల కంటగించుచుండఁగ బలిమిని నౌషధ రసంబు పానము సేయన్ దలకొనురోగార్తునిక్రియ నలమటతో బెరయు తెగువ నలుగుల పడుచున్"- కడకు నిశ్చయించి మనము దిటము చేసికొని "శరణార్థి స్ఫుటరక్షఁ గోరి తుని మెన్ సంరంభ శూన్యాత్ముఁడై కరవాలంబు మృదుక్రియన్ జొనిపి రేఖాహీన దీనస్థితిన్" అని చెప్పిరి. 'కరవాలము మృదుక్రియం జొనుపుట' శ్రీరాముని కంటె తిక్కనగారికే విశేషముగఁ దెలియునా యనిపించిరి. 'సంరంభ శూన్యాత్ముఁడై' రేఖాహీన దీనస్థితిన్" అన్న మాటలు దీనికి సాక్ష్యములుగా నగపడుచున్నవి. అప్పటియా విన్యాసము తిక్కనగారికే తెలియవలెను. ఇట్టి మహా కవితో నితరులఁ బోల్చుట కూడ నపరాధమేమో యనిపించును.

దేవతలు పుష్పవర్షము గురిసిరని యుభయకవులు చెప్పిరి. ఇచ్చట నొక విశేషమగపడును. "అమరేంద్రాగ్ని యమాదిదిక్పతులు" రాముని బ్రశంసించిరని పాపరాజుగారు చెప్పిరి. "హరిహరాది దివిజు లంతరిక్షంబున నిలిచి సంస్తుతించి" రని తిక్కనగారు చెప్పిరి. అచ్చట హరి ఇచ్చట శ్రీరాముడే కావున, ఆహరియు నాతనివెంట హరుడును స్తుతిపాత్రములౌట పొసఁగదని పాపరాజుగారు 'అమరేంద్రాది దిక్పతులు' స్తుతించిరని చెప్పిరి. తిక్కనగారికి శ్రీరాముఁడు మానవోత్తముడేఁ కావున 'హరిహరాది దివిజులు' పొగడిరని చెప్పిరి. రాముఁడు మానవుఁడా దేవుఁడాయనుట కిదియొక పరిష్కారము. కవి కులగురువగు కాళిదాసుగూడ "తపస్యనధికారిత్వాత్ ప్రజానాంత మఘావహం శీర్షచ్ఛేద్యం పరిచ్ఛిద్య నిహంతా శస్త్రమాదదే" యని చెప్పిరి. ఆ పద్ధతిచే మఱికొంత మెఱుగుపెట్టి తిక్కనగారు తీర్చిరని తెలియును. నృపధర్మ నిర్వహణ మెంతకష్టమైనదో దీనివలనఁ దెలియఁగలదు.

యజ్ఞము జరిగెను. తర్వాతఁ బిలువకపోయినను వాల్మీకిమహర్షి శిష్యప్రశిష్యులతోఁగలిసిరాఁగా, రాముఁడాతిథ్యమిచ్చి "మామకాధ్వరవిధి పూర్ణమౌదనుక వచ్చిన యమ్మునులట్ల మీరు నిందిరవుగ నిల్వుఁ" డని చెప్పి, తదర్హగృహాంతరంబునన్ విడియించెను. "ధరాసుతాకారసువర్ణపుత్రికను గ్రక్కున నధ్వరశాలఁజేర్పు"మనెను. చేర్పించెనేగాని, యా సువర్ణపుత్రిక నధర్వశాలలో నెక్కడ నెట్లు నిల్పెనో చెప్పలేదు ఆ సువర్ణపుత్రికపై నాలుగక్షతలుకూడ, జల్లినట్లు లేదు..చల్లలేదని యెట్లు తెలియుననఁగా "చేరిన వస్తువాహాస విశేషము లేమఱకుండు" మని చెప్పెనేగాని విశేషము చెప్పలేదు. ఏమైనను యజ్ఞము నడుచుచున్నదని పాపరాజుగారు చెప్పిరి.

తిక్కనగారుగూడఁ బైవిధముగా నంతయుజరుగుచున్నట్లు చెప్పిరిగాని, వాల్మీకిని బిలిపించినట్లుగాని, అయనకై ఆయనయే వచ్చినప్పు డాతిథ్యమిచ్చినట్లుగాని చెప్పలేదు. వాల్మీకియే "అమ్మఖంబునకు శిష్యయుతంబుగవచ్చి, దారచింతాతురుడైన రాముని యథార్థ విధానము – శాతకుంభసీతాతనుసంవిధాన చరితంబగుటెల్ల నెఱింగి హృష్టుఁ" డయ్యెనని చెప్పెను. అనఁగా, సీతను మఱువకుండఁ దత్ప్రతిబింబముగా సువర్ణపుత్రికను దనప్రక్కనుంచుకొని యజ్ఞదీక్షితుఁడయ్యెననియు, దానిని గ్రహించి వాల్మీకి హృష్టుఁడయ్యెననియు, అట్లుండుటను దెలిసికొనుటకే యాతఁడు వచ్చెననియుఁ దెలియుచున్నది. ఇచ్చట వాల్మీకిని పిలిపించుటగాని సత్కరించుటగాని జరుగలేదని స్పష్టమైనది.

విభిన్నశాస్త్ర మార్గముల సమాహారరూపమే యీ సీతాసువర్ణవిగ్రహకల్పనము. ధర్మపత్నీ ప్రతిబింబముగా రామునిప్రక్క నర్హముగానున్నపుడే యా విగ్రహమునకును రామునకును యజ్ఞమునకును సార్థకత యేర్పడును. కావున నట్టిస్థితిని గనుగొనియే వాల్మీకి హృష్టుఁడయ్యెనని తిక్కనగారు చెప్పిరి. మూలమునఁగూడ "కాంచనీం మమపత్నీంచ దీక్షార్హాం యజ్ఞకర్మణి అగ్రతో భరతః కృత్వాగచ్ఛత్వగ్రే మహాయశాః" అని యున్నది. ఇది యజ్ఞశాలకు బోవునప్పటి మాటేయైనను, "దీక్షార్హాం యజ్ఞకర్మణి" అని చెప్పుటతో నా సువర్ణసీతాప్రతిమ కాయర్హత ప్రతిపన్నమగుచున్నది. తిక్కనగారీవిషయము మనసున నుంచుకొనియే –"భూపతి పత్నీకృత్యములకుఁ బసిఁడిని సీతాప్రతిమ నొడఁగూర్చుకొని హృద్గతఖేదము లోననడచి" యని ముందే చెప్పెను. పావ

తరువాతఁ బాపరాజుగారిట్లు చెప్పిరి. రాముఁ డుత్సుకుఁడై కుశలవులఁ జూచి "అనఘ గుణాఢ్యులార! నిజమౌనది: యీకృతి యెవ్వరాచరించిన యది ఎవ్వరి వంక నేర్చినా" రని ప్రశ్నించెను. వారును, రామాయణమును దత్కర్తను గూర్చి ప్రశంసించుచు, "ఇమ్మఖ నిష్ఠలు దీర్చిన పిమ్మట నొక కొంత సేపు ప్రియమున నిక్కావ్యమ్మును వినవలయు" నని కోరిరి. రాముఁడు సమ్మతించెను "దిన దిన మిట్లు వచ్చి జగతీసతి మన్మలు పువ్వుఁదేనె వంచిన యటు" పాడు చుండిరని చెప్పిరి. ఇంతటితోఁ గథనాపక పాపరాజుగారిట్లు చెప్పిరి. శ్రీరాముఁడు కుశలవులఁ జూచి తన మనస్సులో– "జానకీరమణికైవడినున్నవి వారి రూపు, లంవ్వనజదళాక్షికిన్ మును కవల్ జనియించి రటంచు వింటిఁద త్తనయులె యీ శుభాకృతు" లిత్యాదిగాఁ దలపోసి, "అడవులలోన సీత అకటా! యిఁకఁ జూడక యెట్లు తాఁపదున్" అని తొందరపడి, "నాసుతులంచు వీరిఁ బ్రజ నమ్మనె" యని వితర్కించుకొని, శత్రుఘ్నాదులను వాల్మీకికడకు రాయబారమంపెననియు, వాల్మీకి యారాయబార మంగీకరించి "సీత శపథము చేయు" నని చెప్పెననియు, "శపథము చేయుచోనయిన జానకి సత్యమెఱుంగుఁడీ" యని సదస్సులోఁ బ్రకటించెననియు వివరించి, రెండున్నర పుటల పెద్దవచనముఁజెప్పి, సీతాసహితుఁడై వాల్మీకి సభాభవనమునకు వచ్చుటను జెప్పిరి.

రాయబారమును గూర్చి మూలమున నిట్లున్నది. "తస్యాః పరిషదోమధ్యే రామో వచన మబ్రవీత్ దూతాన్ శుద్ధ సమాచారాన్ ఆహూ యాత్మమ నీషయా మద్వచో బ్రూతగచ్ఛధ్వమితో భవవతోఽన్తికం...... విజ్ఞాయ సుమహాతేజా మునిర్వాక్య మథాబ్రవీత్ ఏవం భవతు భద్రంవో యథా వదతి రాఘవః తథా కరిష్యతే సీతా దైవతం హిపతి స్త్రియాః తథోక్తా మునినా సర్వే రామదూతా మహౌజసః ప్రత్యేత్య రాఘవం క్షిప్రం ముని వాక్యం బభాషిరే" ఇట్లు మూలమున జరిగిన రాయబారము జరుగలేదని యెట్లు చెప్పగలము? దూతలను బంపెనన్న మూలము నతిక్రమించి శత్రుఘ్నుని, హనుమంతుని, విభీషణునిఁ సుషేణునిఁ బంపినట్లు పాపరాజుగారు చెప్పు చున్నారు. ఈ విధముగా రాయబారము జరిగిన దనియే యొప్పుకోవలెను.

పాపరాజుగారు చెప్పినదానిలోఁ గొన్ని సంశయములు కనబడుచున్నవి. శిష్యులతోఁగూడివచ్చిన వాల్మీకిని రాముఁడుసత్కరించెను గదా–అప్పుడాశిష్యుల రాముఁడు చూడకపోవుటేమి? చూచినచో "జానకీ రమణి కైవడినున్నది వీని రూపు" లని వాల్మీకి నడుగకున్నను, మనస్సులోనైన ననుకొనకపోవుటేమి?

"సీత నకటా! యిఁకఁ జూడక యెట్లుతాళుదున్" అని తొందరపడుటేమి? తొందరపడినప్పుడు దానికుచితమైన విధానము నడుపక, తాను వాల్మీకిని బిలిపింపక-తానైన వాల్మీకికడకుఁబోక రాయబారము పంపుటేమి? సీతా హృదయమెట్టిదో కనుఁగొనక 'సీత శపథముచేయు' నని చెప్పుటేమి? వాల్మీకి యడిగినప్పుడు స్పష్టముగాఁ జెప్పక "పుడమి తేడడిగినపుడు జవదాటఁ గూడునే? మంచిది! తామసింపనేల? విజయం చేయుఁ" డని ప్రకటితాప్రకటితముగా సమాధానము చెప్పుటేమి? మహాకవియైన వాల్మీకి దాని యాంతర్యము గ్రహింపకపోవుటేమి? ఇట్టి సంశయ పరంపర లుత్పన్నములగును. మూలమునుబట్టిగాని పాపరాజుగారి రచననుబట్టిగాని రాయబారము జరుగలేదనుట పొసఁగదు. పొసఁగదాయన్న నది కవి యిష్టాధీనమైనది. ఇట్లాలోచింపఁగాఁ జివరకు రాయబారము ప్రకారము సీత శపథము చేయలేదుకాబట్టి యీరాయబారమంతయు ననాలోచితప్రసంగమే యగును. దీని నడుపుట పాపరాజుగారి మూలానుసరణప్రసక్తి గాకతప్పదు. ఐనను దీనినిగూడ నాలోచింపవలయును.

తిక్కనగారు మూలమునఁ జెప్పినరాయబారమును తడవలేదు. దానిలోఁ గనఁబడుసంశయములకుఁ దావీయలేదు. స్వతంత్రముగా రథమునడపెను. అందుకనియే ముందుగాఁగూడ వాల్మీకిని రాముఁడు పిలిపించినట్లు చెప్పలేదు. వాల్మీకియే స్వయముగా వచ్చి స్వర్ణపుత్రికా విధానమునుజూచి సంతుష్టుఁడయ్యెను. ఇది ప్రథమప్రయత్నము. రాముడు వినునట్లుగా రామాయణగానము చేయుఁడని కుశలవులఁ బంపుట రెండవ ప్రయత్నము. ఈరెండు ప్రయత్నములలో వాల్మీకి యొచ్చటనున్నాఁడో యేమిచేయుచున్నాఁడో తెలియకుండ నడుపుట మహాప్రయత్నము. కుశలవులు బాలగంధర్వులువోలె రామాయణ గానము చేసిరి. ఇఁక మూడవ ప్రయత్నము నీవిధముగా మొదలుపెట్టిరి.

రాముఁడు సభలోఁ

వఁగ నాకుశీలవులకుం దగ దర్శనమిచ్చె నని చెప్పుటలోని యర్థగాంభీర్యము తోడ కవి పదప్రయోగ చాతుర్యము వ్యక్తమగును. "రాముచరితంబు గేయాభిరామ మధుర పద విలాస మనోహర భావభంగి" గుశలవులు పాడుచుండిరి. "వీరల మునివేషంబుల కారణమునఁగాక, యొడలికట్టడయు ముఖ శ్రీరామణీయకంబు మహీరమణుని యట్లకాదె" యని యచ్చట జనులు గుసగుసలు వోవుచుండిరి. రాముఁడు -"కనకము నాభరణంబులు" వారికిఁ గానుకలీయఁబోఁగా,

వారు "మాకుఁ గాయలున్ గసరులు వేళ్లువెల్లకులు గాక" యివేటికని నిరాకరించిరి. "యసమ భవద్గుణ స్తుతిపథైకపరత్వ విభూతిచాలదే" యని సంపూర్ణ తృప్తిని వెల్లడించిరి. రాముఁడుత్సుకత్వములో "ఎవ్వరి వారల రీప్రబంధ మునికృత్" మని ప్రశ్నించెను. ఆ కుమారు లందే వసించియున్న యాదికవి మొగంబుచూచి, యందులో ననుమతిని గ్రహించి –"ఈ సందర్భము వీరులు చేసినయది, మేము వీరిశిష్యులము, రసోల్లాన మధురమగు దీని నుపాసింతుము– ప్రీతినేత దనుమతి నెందున్" అని వివరించి చెప్పిరి. రాముఁడు మొగమింత చేసికొని –"మీ కృపామహిమఁ గావ్యమయోజ్వలమూర్తిఁదాల్చి పావనముగఁ జేసె నాదు లఘువర్తనమున్......గణ్యుఁడనైతి త్రిలోక పూజితా" యని సంభావించెను. "ఈ వాత్సల్య మధిక సంభావనమై మీరలెఱుకపఱుపకునికి యేమో! వీరలెవ్వరో! వినఁగావలయున్ – గూఢపథముగా దగునేనిన్" అని వాల్మీకికి విన్నవించెను. ఈవిధముగా మూడవ ప్రయత్నములో వాల్మీకి రాముని తో స్వయముగ మాటలాడుట కవకాశము కల్పించుకొనెను. తిక్కనగారు స్వతంత్రముగాఁ గల్పించుకొన్నదారి యిది.

## 36. శపథ సన్నాహము –

పాపరాజుగారిట్లు చెప్పిరి. రాముఁడుదయముననే కాలకృత్యములఁ దీర్చుకొని యలంకృతుడై సభాభవనమునకు విచ్చేసెను. వసిష్ఠాది మహర్షిమండలము మహారాజవర్గము ప్రజానమూహము కొలువలంకరించెను. వాల్మీకియు రాముని వాక్యములు దెలిపి 'పతివ్రతలకున్ బతియనుమతిఁ బ్రవర్తించుట స్వభావ'మని సీతకు బోధించి యామెను ప్రయాణము కమ్మనెను. ఆమెయు విచారించి యెట్టకేలకు, "మంచిది, తామసింపనేల, విజయంచేయుఁ" దని ప్రయాణమయ్యెను. 'కమల సంభవు వెనుకొను కమలాదేవి చందంబున' వచ్చు సీతనుజూచి పలువురు పరివిధముల మాటలాడుకొనిరి. వాల్మీకి సభామధ్యంబుసొచ్చి రాము సమీపంబున నిల్చి యందఱువినఁగా నిట్లు వాకొనెను –"రామచంద్రా! నీవు పంపఁగా నరణ్యమునకేగిన యీసీతను శిష్యులవలనవిని నేను నాయాశ్రమము చేర్చితిని. అచ్చటనీయర్భకులఁగనెను. వీరలే కుశలవులు, నీకుమారులు. వీరలఁ బరిగ్రహింపుము. ప్రచేతసు పుత్రుఁడనై తపోగరిష్ఠుఁడనైన నేనబద్ధమాడను. "వియన్మరు దగ్నితోయముల్ సారసవైరి భాస్కరులు సాక్షిగ" నీమెయందు

దోషములేదు. నా సర్వతపోధనములతోనే నిందుకుఁ బూటపడుచున్నాను. మీరు కోరినచో సీమెయు శపధము చేయగలదు" అని గంభీరముగాఁ బలికెను. రాముఁడా మాటలాలించియు, నామెశీలమును గుర్తించియు, "అనఘ! మీరు పలుకునంతకంటెను సీతయాడు శపధమింతయైన, నిచటి ప్రజల కాపె పలుకు పలుకునంగాని ప్రత్యయము వుట్ట" దని మర్యాదాస్ఫోరకముగనే పల్కెను. ఈ సన్నివేశమంతయు మిగులవిస్తృతముగ గంభీరముగఁ బాపరాజుగారు ప్రస్తావించిరి.

తిక్కనగారీవిధముగఁ జెప్పిరి. రాముఁడు "వీరలెవ్వరోవినఁగావల యున్‌గూఢపధముగా దగునేనిన్" అని ప్రార్థించెను. రాముఁడా పదము నెట్లు విఱుచుకొన్నాఁడోకాని, వాల్మీకి యందఱు వినఁగ నిట్లనెను. "వినయము జెుపునేర్పు సువివేకమునుంగల నీవు మేదినీతనయఁ దొఱంగుపెట్టు లుచితం బని యెంచితి? "అనల విశుద్ధమైన నతి నక్కట! యెక్కడికేని పొమ్మనీవని వెడలంగఁద్రోచిన, దయాగుణకీర్తికి హానిపుట్టదే.'' "నాఁడగ్నిలోనఁ ద్రోచినఁ వాడవు నేఁడడవిఁద్రోచిఁ తెదకడువాఁడిగదేనీకు రాఘవకుల ప్రవరా!" "అంత నుండియు నీతోడ నలిఁగియున్న వార మే: మదియట్లుండే; వారిజాక్షి తెఱఁగు విను" మని పల్కెను. అప్పుడుఁగూడ - "వినీత జాతోత్సుకుండగు నృపతి మౌళి" గనఁగొనియే పలికెను.

అనాఁడు లక్ష్మణుఁడు సీతనడవిలో విడిచిరాఁగాఁ జూచి శిష్యులు నాతోఁ జెప్పిరి. నేనామె నా శమముఁజేర్చి సేదదీర్చితిని. మహీసురకార్య రక్షణార్థము పోవుచు శత్రుఘ్నుఁడు నాయాశ్రమమున విడిసిన రాత్రియే సీత కవలపిల్లలఁ గనెను. వారిని శత్రుఘ్నుఁడుకూడఁ గనుఁగొని సంతసించెను. బాలక్రీడా లోలురైనవారు విద్యావంతులై రామాయణాఖ్యమైన మత్ప్రణీత ప్రబంధమ్ము "మధురగేయ సహితముగ నభ్యసించి" రని చెప్పుచుండగాఁ, గుమారులను 'సంశయమతిఁ' జూచు రామునిఁ గన్గొని, "ఆచార విజిత సంయములగు" వీరే ఆ నీకుమారులని చెప్పి, "అప్రతర్క్య విఫలైకనిధి" యని హెచ్చరించెను. మధురాపురమునుండి వచ్చునపుడు శత్రుఘ్నుఁడీ కుమారులఁగనుటకూడ సుగ్గడించెను "ఎంత కాలము పోయిన నెరవకాదె యొరులసొమ్మని తలఁచి, యా గోత్సవమునకీయు కానుకగా వీరినిట్లుతెచ్చి నిన్నుఁజేర్చితి" నని చెప్పి "రఘుకుల నృప రేణ్య'' అని సంబోధించెను. ఈమాటలువినుటతో సంభ్రమాశ్చర్యం

ఖులు సమ్మర్దములై, ఆనందాశ్రు హర్షపులకలు క్రమ్ముకొనఁగా వానినఱఁచుకొని "యఁట్లేనిం గర్తవ్యము దగ నానతియిం" దని విన్నవించెను. వాల్మీకి సంప్రీతుఁడై "జనకతనూజఁ గైకొను-మిది మామతం" బని పలికెను. రాముఁడు వినీతుఁడై -"ముని నాథ! యవిచార ముఖ్యంబుగాన లోకంబు మెచ్చించుట కడిఁదిగాదె ముద్దియ మీచిత్తములకుఁ బోలిన భంగి నీయెడ శపథంబు చేయుఁగాక" యని విన్నవించెను. వాల్మీకి -"ఇదిపోలు" నని శాసించెను. తిక్కనగారి రచన యీవిధముగా నున్నది.

ఇచ్చటఁ దిక్కనగారిని బాపరాజుగారి నొకపరి పరిశీలించుట యుక్తము. పాపరాజుగారు రెండున్నర పుటలతో నొక పెద్ద వచనము వ్రాసి, ఉదాత్త వైభవోపేతముగా వర్ణనలు చేసి వాల్మీకి సీతను సభాభవనమునకు దెచ్చెను. వర్ణన భాగమంతయుఁ బోఁగా, సీత చెప్పిన మాటలలో నాంతర్యము వాల్మీకి గ్రహించలేదు. 'పుడమి ఱేడు చెప్పిన మాట జవదాటగూడునే' యన్న మాటనే నమ్మెను గాని, 'తామసింపఁగనేల' యన్న మాటలో హృదయము తడవలేదు. తనతపోబలము నంతయు నుంకువపెట్టి, తాను 'ప్రచేతసు పుత్రుఁ డౌట'ను వెల్లడించి, సూర్య చంద్రాదులను సాక్ష్యముగాఁ జూపి, ప్రతిజ్ఞా ప్రమాణము చేసెను. కాని యివన్నియు ఫలింపలేదు. "అనఘ! మీరు పలుకు నంతకంటెను ఆమె పలుకునంగాని ప్రత్యయము పుట్ట"దని రాముఁడు కచ్చితముగాఁ జెప్పెను. దీనితో వివర్ణుఁడై "ఈయమయున్ శపథంబు చేసెడిన్" అని నిలఁబడిపోయెను. ఇంత రాద్ధాంతము చేసినను కడకు-"ఈయమయున్ శపథంబు చేసెడిన్" అని తేలఁ బల్కెనేకాని "శపథంబు చేయు"మని చెప్పలేకపోయెను. అదుగో ఆయనయె వాల్మీకి మహర్షి-నిశ్చయాచరణము లేని వెఱ్ఱి వాఁడుగా నిలబడి యున్నాఁడు. ఆయనయే శ్రీరాముఁడు-సీత శపథము చేయునని గంభీరముగా సభ్యులవైపు చూచుచున్నాఁడు. ఆయమయే సీతా మహాసాధ్వి-తామసింప నేల యను వాక్యమునకుఁ దర్వాతి కర్తవ్యము నాలోచించుచున్నది. పాపరాజుగారిట్టి చిత్రము నిర్మించిరి.

తిక్కనగారివిధముగాఁ జిత్రముఁ దీసిరి. వాల్మీకి శ్రీరాముని నిర్దాక్షిణ్యగనే మాట్లాడెను. "మేదినీ తనయఁ దొఱంగు బెట్టు లుచితంబుగ నెంచితి" "దయా గుణకీర్తికి హానిపుట్టదే" "ఎద కడువాడిగదే నీకు" ఇత్యాది వాక్యములు శ్రీరాముని గుఱించి ఆయనయే వినునట్లుగా మాట్లాడుట వాల్మీకికే

చెల్లినదనిపించిరి. తన్ను గుశలవులను సంశయముతోఁ జూచు రాముని జూచి-"అప్రతర్క్య విభవైక నిధీ" యని హెచ్చరించి, "రాఘవ కులప్రవరా"యని సంబోధించి "ఆచారవిజితసంయములగు వీరేయాకుమారు"లని కుశలవులను జూపించినాఁడు. ఇదియు సాధారణమైన పనిగాదని తెలియును. "ఎంతకాల మున్నను 'పరుల సొమ్ము బరువుచేటు గదా' యని. యజ్ఞము చేయు నీకుఁ గానుకగా నీ కుమారులఁ దెచ్చితి'నని వారి నర్పించినాఁడు. వారు తనకుమారులే యని నమ్ముటకు సాక్ష్యముగా, లవణ సంహారమునకై వచ్చిపోవు శత్రుఘ్నునిఁ జూపి 'ఈతఁ డీసంగతి నంతయు నెఱుఁగు' నన్నట్లుగా యావత్కథయు తెలియఁ జెప్పినాఁడు. ఈ నిర్వహణ మనన్యసాధ్యమైనది. "ఎన్నాళ్లున్నను పరులసొమ్ము బరువుచేటుగదా" యన్నప్పటి యా వాల్మీకి నిలువు గూఢ సంకేతమైనదిగా ఁగనుపట్టును. ఇన్ని విధములుగా న ప్రతిహతోత్తరముగా బలికిన వాల్మీకి మాటలకు సభ్యులేగాదు. శ్రీరాముఁడు గూడ ఆనందాశ్రు హర్ష పులకితములతో నిండఁగా బదులాడలేక "అట్లేనిన్ గర్తవ్యము నిఁక నానతి యిందు" అని వినీతుఁడై ప్రార్థించినాఁడు. "జనకతనూజఁ గైకొను, మిది మామతం" బని నిష్కర్షగా వాల్మీకితోఁ జెప్పించినాఁడు.

ఇంతవరకుఁ దీర్చిన చిత్రణములో నొకజంకు లేదు కొంకులేదు. జల్లు లేదు పొల్లు లేదు. అంతయు రేఖా విన్యాస వినిమయ మధురముగాఁ దిక్కన గారు తీర్చి దిద్దిరి. తరువాత రాముఁడు వినీతుఁడై-"మునినాథ! యవిచార ముఖ్యంబుగాన లోకమ్ము మెచ్చించుట కడిఁది గాదె మద్దియ మీ చిత్తమునకుఁ బోలిన భంగి నీయెడశపథంబుచేయుఁగాక" యని పల్కెను. వినీతుఁ డయియే పల్కెను. "మీ చిత్తమునకుఁ బోలిన భంగి" అనియే పల్కెను. 'అవిచార ముఖ్యంబుగావున" నని హేతు పురస్సరముగానే పల్కెను. అప్పుడు వాల్మీకి "ఇదిపోలు" నని శాసించెనఁట: శాసనమందఱికి తృప్తికరముగా నుండదు గదా! తనకు, రామునికి సీతకు సభ్యులకందఱికి తృప్తిలేకపోయినను శాసనము శాసనమేగదా! ఆ శాసన కర్తయే వాల్మీకి, వాల్మీకి యా మాట యనకతప్పి నది కాదు. అది ఇతివృత్తము నెఱిఁగిన వారికి, భవిష్యము నెఱిఁగిన వారికి, సంగతి సందర్భముల నెఱిఁగి సరిచూచి చెప్పువారికి సంబంధించినది. అప్పుడుఁగూడ 'ఏకైకాక్షర విరామముతో' 'ఇ-ది-పో-లు'' నని య వచ్చును. ఏమైనను, ఈవిధముగ వాల్మీకి పాత్రను తిక్కనగారు తీర్చిదిద్దిరి

## 37. సీత భూగర్భమునఁ జొచ్చుట

పాపరాజుగారిట్లు చెప్పిరి. వాల్మీకి "ఈసభవారలెల్ల విన సీయమయున్ శపథంబు చేసెడిన్" అనిపల్కెను. రాముఁడున్ముఖుఁడై యుండెను. 'ఇక శపథము చేయకతప్ప'దని తెలిసికొని సీత ఉదఙ్ముఖియై తలవంచి. "ధాత్రిపైఁ నొప్పునిజావలోకనములుంచి, కరాంబుజముల్ మొగిడ్చి" సంసిద్ధమైనది 'ఏమి పల్కునో వినవలె'నని జనులాసక్తితో నామెవైపే చూచుచున్నారు. సీత "రాముందప్పని దాననౌటయు యథార్థంబేని" అనియన్నది. జనులలో నాతురత యెక్కువైనది. "నాతల్లి! యోభూమి! యీయెడఁద్రోవఁజూపిననుఁ గొంపోవమ్మ నీలోనికిన్" అనియన్నది. వెంటనే భూతలమ్ముప్రయ్యెగా భూదేవి ప్రత్యక్షమై సీతను రసాతలమునకుఁ గొనిపోయెను. ఈ పరిస్థితి శతానంద పురందరాదుల కానందంబును, నరవానర నిశాచరప్రముఖ నిఖిలజనంబులకు శోకంబును గలిగించెను. రాముఁడు మూర్ఛవోయి తెలిసి శోకాక్రాంతుఁడయ్యెను. ఇత్యాదిగా రెండున్నరపుటల గద్యపద్యములతోఁ బాపరాజుగారు వివరించిరి.

తిక్కనగారీసంరంభము నంతయుఁ జెప్పలేదు. అది రాజుగారి కథయే యైనను, ఆకథ వ్రాయువాఁడు తిక్కనగదా! వాల్మీకి-'ఇదిపోలు'నని శాసించెను. రాముఁ డున్ముఖుఁడయ్యెనో విముఖుఁడయ్యెనో తెలియలేదు. కాని, రామునకొక సమాధానముగను, సీతకొక యాజ్ఞావచనముగను వాల్మీకి పలుకున్నదనితోచును ఆపలుకు నుచ్చరించిన వైఖరినిబట్టి దానిని గ్రహింప వలయును. సీతారాములును వాల్మీకియు దాని స్వరూపము నెఱుఁగుదురు. సీతలేచి కృతాంజలియై భూదేవివైపు చూచుచు "రామనృపతి కేనుదప్పని దాననయేని నన్నుఁ జేర్చుకొను"మని పలికెను. భూదేవి తొడపైనుంచుకొని సీతను గొంపోయెను. ప్రజలంద ఱద్భుతాశ్చర్యముల మునిగిరి. భూదేవతపైఁ గోపించిన రామునకు యోగ్యవచనములతో వాల్మీకి శాంతము బోధించెను. ఇత్యాదిగా తిక్కనగారు చెప్పిరి. సంగ్రహముగనైనను యోగ్యముగాఁ జెప్పిరి.

ఇచ్చట సీతనించుక పరిశీలింతము. భూగర్భముఁ జొచ్చుటలో నిర్వురు సమముగనే చెప్పిరి. కాని పాపరాజుగారు పూర్వము చెప్పించిన మాటలు యుక్తములుగా నున్నట్లులేదు. వాల్మీకి సీత నడిగినప్పుడు ఆమె స్పష్టముగాఁ జెప్పక 'తామసింపనేల, విజయంచేయుఁ'డనెను. అప్పుడు వాల్మీకి 'తనమాట

లంగీకరించి'నట్లే యనుకొనెను. అంగీకరింపలేదని తెలిసినచో 'ఈయమయున్ శపథంబు చేసెడిన్' అని చెప్పియే యుండఁడు. అంగీకరించినదని యను కొన్నచోఁ దర్వాత జరుగవలసిన శపథకార్యము జరగలేదు. ప్రతికూలముగా జరిగినది. దీనినిఁబట్టి సీత వాల్మీకి యనుకొన్నట్లుగా శపథముచేయక అభి ప్రాయము మార్చుకొన్నదని తెలియును. ఈవిధముగ సమయముబట్టి మారి పోవు స్వభావముకలదిగా సీత కనఁబడును. ఇట్లు పాపరాజుగారు సీతనుతీర్చిరి.

తిక్కన గారిచ్చట జాగరూకముగా గంటము నడిపిరి. సీత శపథము చేయు ననిగాని శపథముచేయదనిగాని ప్రస్తావనయేలేదు. కథ యంతయు వాల్మీకి ముఖముగనే నడిచినది. రాముఁడు-"సీతశపథము చేసిన బాగు"అని చెప్పఁగనే వాల్మీకి యనంతర కథనంతయు నవగతము చేసికొన్నాఁడు. 'భూత భవిష్య ద్ధర్మముఁబోలిక' యంతయు నాతనికిఁ గరతలామలకమువలె భాసించినది. కనుకనే-"ఇదిపోలు"-నన్నాఁడు. ఆమాట రామున కూఅటయైనట్లే సీతను కర్తవ్యప్రవణగా చేసినది. తర్వాత భూదేవిని ప్రార్థించుటయు, నామె సీతను గొంపోవుటయు జరిగినది. ఇచ్చట సీతాదేవిని బరిశీలించుట కామె పలికిన మాటలుగాని చేసిన చేష్టలుగాని యేమియులేవు. వాల్మీకి మాటలున్నవి. అవి "జనకతనూజఁగైకొను-మిదిమామతం"బను వఱకే గట్టిగా మాట్లాడినట్లున్నవి. కాని, తర్వాత నేమియులేవు - 'ఇదిపోలు'ననుమాట తప్ప. ఈ విధముగా వాల్మీకిని సీతను రాముని తమతమ ధర్మానుసారముగా ఉజ్వలముగాఁ దీర్చి నాఁడు తిక్కన. ఇచ్చట నొక మహార్థము చెప్పవలసియున్నది కొన్నాళ్లు కాఁపురముచేసి ఐహికభోగములతోఁ దృప్తిపడి, ప్రయోజకులైన పుత్రుల గన్న దంపతులు దైవికముగా విడివడవలసినప్పుడు-ఆదంపతులకీయాఖ్యానము ఒక సూచన నియ్యగలదు. ఆసూచనయే యిందు నవ్యక్తముగా మనోహరముగ సృష్టింపఁబడినది. అట్టి సూచన యేదియుఁ గనఁబడకుండ నుద్ధతముగాఁ బాప రాజుగారు సృష్టించిరి.

ఇచ్చట మూలమునకుఁ బాపరాజుగారి రచనమునకుఁ గల భేద సాదృశ్య ములు గమనింపఁదగ్గవి. మూలమునందు దూతలు వాల్మీకి కడకుఁ బోయి రాముని వాక్యములు చెప్పఁగా, వాల్మీకి "ఏవంభవతు భద్రంవో యథావదతి రాఘవః తథాకరిష్యతే సీతా దైవతంహి పతి స్త్రియాః" అని చెప్పినట్లున్నది. పాపరాజుగారును-"పతిదేవతా శిరోమణి క్షితిసుత శపథంబుసేయు, సిద్ధము;

ర్సాక్షితిపతికిఁ దెల్పుడిది"యని వాల్మీకి చెప్పినట్లుగా వ్రాసిరి ఇవిరెండును సమముగా నున్నట్లున్నవి. తర్వాత శపథముచేయుటకై సభలోనికిఁ బోవునప్పుడు శపథము చేయువఱకుఁగూడ వాల్మీకి శపథవృత్తాంత మెత్తినట్లుగాని సీత బదులు చెప్పినట్లుగాని మూలమునలేదు. "తమృషించాగ్రతః కృత్వా సాన్వగచ్ఛ దవాఙ్ముఖీ కృతాఁజలిర్బాష్పగళా కృత్వారామం మనోగతం"అని సీతానుగమనము చెప్పఁబడినది. మూల మిట్లుండఁగా బాపరాజుగారు నడుమ నిట్లు వ్రాసిరి "వాల్మీకి మౌనీంద్రుండు తొలినాఁడునిజాశ్రమంబున నున్న జనకనందననున్ దాను విడిసిన గోమతీ తటాశ్రమంబునకుఁ బిలిపించినవాఁడు గావున నద్దేవినవలోకించి......యని తెలిపిన" యన్నంతవరకు, రాముఁడు శపథముసేయఁ గోరుటయు, పతివ్రతయైన సీత శపథము చేయునని తాను చెప్పుటయు జరిగినట్లుగాఁ జెప్పిరి. ఇదంతయు మూలమునలేదు. ఇట్లే "అప్పల్లవపాణి ప్రాణేశ్వర సందర్శనంబు నేఁటికయినన్ గలిగెఁగదా... యని తెగువ దోపంబలికి"యని వ్రాసిరి. ఇదియు మూలమునలేదు. మూలమున లేకున్నను నింతగాఁ బెంచి వ్రాయుటెందులకో తెలియదు. కథా నిర్వహణమున కిది కొంత యుపకరించునన్నట్లనుగాదు. తన రచనా ప్రదర్శనమునకై యీ వచనము పెంచినట్లు తోచును.

పోసీ-రచనా ప్రదర్శనమునకై యిట్లు వ్రాసెనాయన్న నట్లును గోచరింపదు. రాయబారము నంగీకరింపని తిక్కనగారి రచన నట్లుంతము. రాయబారము నడిపిన మూలమునఁ గూఢ-దూతలను రాఘుభార మంపెనని యుండగా, శత్రుఘ్న సుగ్రీవ హనుమద్విభీషణాదులఁ బంపినట్లు చెప్పనేల? వారు పోయి నిర్వహించిన విశేషము మాత్రమేమున్నది? దూతలు చెపిన మాటలనే వారును వాల్మీకితో చెప్పిరి. వాల్మీకియు సీతశపథము చేయునని చెప్పెను. ఈ మాత్రమున కంతటివారి నుపయోగింపనేల? సరియే! తర్వాత వాల్మీకి సభకు బోవునప్పుడు సీతను బిలిపించి శపథ వృత్తాంతము చెప్పెనుగదా! అప్పుడు సీత చెప్పిన సమాధానమేమి? సీత చెప్పిన సమాధానములో 'శపథము చేసెద" నన్నచో నట్లుచేయకపోవుటేమి! 'శపథము చేయ' నన్నచో వాల్మీకి 'ఈ సభ వార లెల్లవిన నీయమయున్ శపథంబు చేసెడిన్" అని చెప్పుట యేమి? ఇట్టి సందేహ పరంపరలు తలచూపుచున్నవి. ఈ సందేహ పరామర్శలో సీతకు శపథము చేయవలసిన సంగతి తెలియుననవలెను. తెలిసినప్పుడు ఒక నిర్ణయ

ప్రకారము నడుపక వాల్మీకిని మధ్యపెట్టనేల? సభకు బోనేల? ఏమియు మాట్లా డక "నా తల్లి! యో భూమీ! యీయెడఁ ద్రోవచూపిననుఁ గొంపోవమ్మ నీలోని కిన్" అని ప్రార్థింపనేల! సీత యెట్లు నడిచినను, ఆ విషయము వాల్మీకితోనైనఁ జెప్పి యుండవలసినది. కాని యది జరుగలేదు. అంతటి వాల్మీకిని-ఆమె కొఱకై తన తపస్సునుగూడఁ బూటపెట్టిన వాల్మీకిని-పదువదునాలుగేండ్లుగా తన్నుఁ దనబిడ్డలను గంటికి జెప్పవలెఁ గాపాడి ప్రయోజకులుగాఁజేసిన వాల్మీకిని పదుగురిలో వెట్టి వానినిగా నిలుచునట్లు చేయుట తగనిపనియనిపించును. కాని పాపరాజుగారి కదితోఁప లేదు. అంతేకాదు-ఈ సంరంభములోఁ "గనుఁ గొనలఁ బొటిల్లు కాటుక కన్నీరు జెప్పతుదలనప్పళించి" యని వ్రాసి, ఎంతో కాలముగా నేయలంకారము నిచ్చగింపక తపోవ్రతానుష్ఠానములు సలుపు సీత కంటికిఁ గూడఁ గాటుకకన్నీటిధార గట్టించి యుద్భ్రాంతుఁడైనాఁడు. పాపరాజు రచన యిట్టిది.

## శపథానంతరస్థితి

పాపరాజుగారిట్లు చెప్పిరి. రాముఁడు మూర్ఛఁ దేఱుకొని "అహీంద్ర కన్యకా చామరచంచలచ్చికురజాలకవై చనఁజూచి - వ్రస్సిపో దేమియు గాదు, బాతి వలెనే చెలువొందెడుఁ జూడు" మని హృదయావేదనను చేతఁబట్టి వాపోయెను. ఈశోకము పది పదునొకండు పద్యముల నిండుగ నున్నది. తర్వాత "భూమి వచ్చి విభవం బేపార నయ్యింతిఁ దోడ్కొని పాతాళబిలంబుఁ జొచ్చిన తెలంగున్ బుద్ధి నూహించి" యాగ్రహోదగ్రుఁ డయ్యెను. ఈ యాగ్రహావేశము నాలుగు పద్యములఁగాక యొకటిన్నర పేజీ నిండుగ నున్నది. "కంటిరె సభ్యులార" అని ప్రారంభించి -"ప్రత్యాలీఢపాదుండై కాకుత్థ్సుండు భూమండలంబు నేయంగడంగిన" యన్నంతవఱకున్నది. "మామక చాపముక్త నిష్ఠుర విశిఖ ప్రతానములఁ జూర్ణముచేసి యజాండమెల్ల నావరణ పయోధిలోఁ గలిపివై చెద"నని ప్రళయకాళరుద్రుఁడైనట్లు గర్జిల్లెను. అప్పుడు "పంకజాసనుం డఖిల దేవర్షి బ్రహ్మర్షిగణ సమేతుండై" వచ్చి, "జయజయ సాధురక్షణ విచక్షణ" యని పొగడిరి. ఈ స్తోత్రమంతయుఁ జాలవఱకు రామునిదేవత్వ ప్రతిపాదకము. చివరకు బ్రహ్మ ప్రార్థింపఁగా, "కోపముపసంహరించి కాకుత్థ్సమౌళి యనుజుచేతికి శరశరాసనము లొసఁగ నలరి, యవ్విభు వీడ్కొని యజుఁడు సురలు మునులుగొలువంగఁ దనలోకమునకుఁ బోయె" నని ముగిం

చెను. ఇంత గ్రంధము జరిగినను, రాముని దివ్యాతిదివ్య మహిమ వెల్లడించినను, రాముని కోపోపశాంతివఱకే కార్యము జరిగినది. కర్తవ్యము బోధపడలేదు. ఇంతలోఁ "గాంస్యము గీసినగతి'' భూసతికడనుండి యొక యెలుఁగు వినఁబడినదని చెప్పిరి. సీతను గొనిపోవునపుడు ప్రత్యక్షముగా వచ్చిన భూదేవి యిపుడశరీరవాక్కుగా వినిపించుట యేలనో తెలియదు. ఆ పలుకుతో "సీత లక్ష్మిదేవియై వైకుంఠమున నీ కొఱకు వేచియున్న"దనియు, ''ఆతతమైన నీ కరుణయంతయు నిక్కవలందు నిల్పు"మనియు, నీ ఉత్తరకాండకథ యంతయుఁ "బ్రీతిఁదలిర్ప వీరు వినిపింపరహిన్ విను"మనియు నున్నది. ''ఆపలుకు లాలింపబడిన యంత నొకించుక ధైర్యమాని "శ్రీరాముఁడట్లేచేసెనని ఫలితాంశము పాపరాజుగారు చెప్పిరి. అన్నిటికంటెశపథముచేయుట కుద్యుక్తయైనపుడును, శపథమ చేయునపుడును, శపధానంతరముగూడ నాయాపరిస్థితిని వర్ణింపుచుఁ బాపరాజుగారు ఒక్కొక్క వచనము రెండు - రెండున్నరపుటల నిడివితో మూడు వచనములఁ జెప్పుట యాతని వర్ణనా ప్రౌఢిమ కుదాహరణముగా నున్నది. ఈ విధముగా శపధానంతరస్థితి చెప్పఁబడినది.

తిక్కనగా రింతవిస్తారముగా జెప్పలేదు. సీతాదేవి భూగర్భమునుజొచ్చిన తరువాత "ధాత్రికల్గు నృపులొల్యంబున్ మునీంద్రుండు యోగ్యవచోయుక్తులఁబాపి, పుత్రయుగ యోగానంద మగ్గించుచున్" "ఇహపరసౌఖ్య విధానము మహితాపత్యంబు" యని యూఱట యొదవించి' "మనుజేంద్రమనో విహరణము పుత్రలాభ ప్రహర్షవిషయంబు చేసె'' నని వాల్మీకియే సర్వము నిర్వహించినట్లుగాఁ డిక్కనగారు చెప్పిరి. ఇంతేకాక ''అక్కుమారులు రామపాదాంబుజముల కెఱఁగి భూదేవి తప్పుసైరించుదేవ" అని కుశలవులు ప్రార్థించినట్లుగా వార్మికి చేసెనని చెప్పిరి. ''ముద్దుపుట్టునట్లుగాఁగ నత్తఱి వాల్మీకి గఱపుటయును" అనికూడఁ దిక్కనగారే చెప్పిరి. మందార కుసుమవర్షము కురిసెననియు, తోరన దివి దేవదుందుభులు గర్జిల్లెనవనియుఁ జెప్పిరి. రాముని క్రోధాటోపము నెక్కువచేసి, బ్రహ్మాదుల ప్రార్థనతోఁగాని మరలింపరానిదిగాఁ జెప్పుటకంటె, మానవోత్తమ సహజసంక్రాంతముగా వర్ణించి, ప్రసాదప్రసరణమంతకంటె నతిశయముగా సుకుమారముగా నిర్వహించిన తీరు యోగ్యతమమైనదిగా నున్నది. ఇచ్చట -''విపరీత ప్రతిభాభషమిటికి నుర్వీనాథ! యీపుత్రగాత్ర పరిష్వంగసుఖంబు చేకొను'' మని నన్నయగారు చెప్పిన సూక్తికంటె

మనోహరముగా ప్రతికల్పనచేసి చెప్పెను. ఈ వాక్యము అత్యంతామోద సంధాయకములనవచ్చును. అందులో నిదంతయు వాల్మీకియే చేసి కుమారులతోఁ జెప్పించెననుట మధురతర విన్యాసము. దీనినిఁ బాపరాజుగారందు కొనలేదు. ఆయనకు రాముఁడు దేవదేవుఁడు గావున ఆ రాముని కోపముదీఱుటకు బ్రహ్మదులు రావలసివచ్చినది. తిక్కనగారి రాముఁడు కావ్యాదర్శమూర్తియైన మానవోత్తముఁడు గావున ఆయన కోపము కుమారయుగళాంగాలింగనముతోఁ జల్లారినది. ఈవిధముగాఁ దిక్కనగారు తీర్చిరి.

## 38. కౌతుకోత్సవము

కావ్యము ముగియుట కింకను గొంత భాగము మిగిలియున్నది. సీతాదేవి భూగర్భము ప్రవేశించిన తరువాత రాముఁ డేమిచేసెను? కుశలవులేమైరి? వాల్మీకి యెట్లుపోయెను? ఇత్యాది ప్రశ్నలకు సమాధానము రావలసియున్నది. అందుకు పాపరాజు గారిట్లు చెప్పిరి. రాముఁడు కొంత ధైర్యము వహించి వాల్మీకితో మీ గ్రంధము నీ ప్రజలు వినఁగోరు చున్నారు. కావున "రేపటి నుండియున్ బ్రియము నివ్వడిలన్ జదివింపుఁ"నని చెప్పెను. "నందనులను దోడ్కొని మఖశాలకున్ జనియె"నని చెప్పెను. యజ్ఞశాలలోఁ "గతిపయ దినంబు లుత్తర కాండ కధలు వారు తుదముట్టఁ జదివి రధ్వరము నయ్యె" నని తెల్పిరి. యజ్ఞము ముగిసిన తరువాత ఋత్విగ్దక్షిణ లిచ్చుటయుఁ దక్కిన వారిని యధోచిత రీతి సమ్మానించుటయు, నయోధ్య కేగుటయుఁ జెప్పి-"నయ మార్గంబున రాజ్యమేలెవననీనాధుం"డని రామ రాజ్యవైభవమును గొనియాడిరి. రాముని కార్యములు యథాక్రమముగాఁ జెప్పుట బాగున్నది. రెండు మూడు పర్యాయములుగా "సీత లేకున్న కతన నన్నియు గొఱంతలై తోఁచె నవని పతికి" నని చెప్పుటయు సముచితముగనే యున్నది. అన్నిటి కంటె "క్షోణిజఁ బోలిన పైఁడి బొమ్మ నిశ్చలమతిఁ జెంత నుంచుకొని క్ష్మాపతి చేసె ననేక యాగముల్" అని వివరించుట చాల బాగున్నది. కాని వయసు వచ్చిన కుమారుల నేమి చేసెననిగాని, తపోబలము నంతయు నుంకువపెట్టి ప్రతిజ్ఞచేసి గ్రంధము నింతవరకు నడిపిన వాల్మీకి మహర్షి నెట్లు సత్కరించి సాగనంపెనని కాని చెప్పుట యెందును గనఁబడదు. అట్లు సాయపడిన మహర్షి నిట్లు విడుచుట న్యాయమాయని తోపకమానదు.

తిక్కనగారిట్లు చెప్పిరి- "అర్మిలిన్ బ్రియసుతయుగ్మమున్ దిగిచి పెద్దయుఁ బ్రొద్దాగిఁ గౌఁగిలించి, మోదయుత మనస్కుఁడై నృపతి తమ్ముల సమ్ముద మందఁ జేసి, య న్వయపరివృద్ధి తల్లుల మనంబలరన్" బ్రకటించెను. యాగకార్యములు పూర్తిచేసెను. నగరమలంకరించెను. కుమారులకు రాజోచితాలంకారము లలవరించెను. రాజులు మొదలు కొని సర్వజనులను యథార్హముగా సమ్మానించి పంపెనని చెప్పిరి. పై చెప్పిన వానిలో 'రాజులు మొదలుకొని సర్వులను సమ్మానించుట, యాగకార్యములుఁ బూర్తి చేయుట' వంటి రెండు మూడు దప్ప తక్కిన వానిని వేనిని బాపరాజుగారు చెప్పలేదు. తరువాత, "వినయమొప్పంగ వాల్మికి మునికి నర్ఘ్య లిచ్చి" "మీ కృప పెంపున నెల్లవగలుఁ బాసె నాహ్లాద మొనగూడె భవదనుగ్రహంబ మాకేడుగడ" యని రాముఁడు వాల్మికినిఁ బ్రార్థించెనని చెప్పిరి. ఇట్టి ప్రార్థనము పాపరాజుగారు చేయింపలేదు. "రేపటి నుండియున్ బ్రియము నివ్వటిలన్ జనివింపుఁ" డని వాల్మికి కొకభారము మోపెను. కుమారులను యజ్ఞశాలకుఁ గొంపోయెనేకాని రాజోచితాలంకారములు చెప్పలేదు. అందఱు సాగనంపు నపుడు వాల్మికిని గూడఁ దాంబూలమిచ్చి సాగనంపెనని యైన జెప్పలేదు. పాపరాజు చెప్పిన పద్ధతి యిది.

తిక్కనగారి పద్ధతి యిది. వాల్మికి ప్రయాణము కాఁగా నతనిని బాల దవ్వనుసరించుచు, "మీ కృప పెంపున నెల్ల వగలుఁబాసె, నాహ్లాద మొనఁగూడె భవదనుగ్రహంబ మాకేడుగడ" యని యుపచరించును; భక్తి నడుగులఁ బడి "అమ్మని సత్తము దీవనలన్ బ్రీతాత్ముఁడయ్యె" నని చెప్పిరి. పంపలేక పంపుచున్న రామునిఁ- బోలేక పోవుచున్న వాల్మికిని మనకు దర్శనమిప్పించిరి. ఇచ్చట వ్రాయవలసినవయ్యు వ్రాయలేని పెక్కుభావములు తరంగితములై కంటి నీటిలోఁ గదలాడుచుండును. "రాముని యథార్హ విధానము శాతకుంభసీతాతను సంవిధానచరితంబగు పెల్ల నెటింగి హృష్టుఁడై' యన్నది మొదలు-"ఇది పోలు" నని శాసించు వఱకుఁ, గవల బిడ్డల కాన్పుకై పడినపాట్లు, ఆ కుమారులఁ బెంచి పెద్దసేయు తీరు లోకమైపు, "మీ కృపా మహిమఁ గావ్యమయోజ్వల మూర్తిఁ దాల్చి పావనముగఁ జేసె నాదు లఘువర్తనము" ఈ వాత్సల్య మధిక సంభావనమై మీర లెఱుక పనుపకునికి యేమో" యన్నపుడు భక్తిరసార్ద్రములైన విన్నాణము లోకమైపు, "మేది నీ

తనయఁ ద్రొఅంగుబెట్టు లుచితఁబుగ నెంచితి'' "ఎద కదు వాడిగదే నీకు" "అంతనుండియు సీతోడ నలిఁగి యున్న వారమేము'' ఇత్యాదిగా బలుకు నంతర్భహిరూష్మములైన భంగ్యంతరము లొకవైపు, వినీతుఁడై రాముఁడు "కర్తవ్య మెఱిఁగింపుఁ'' డన "జనక తనూజఁ గైకొను, మిదిమామతం'' బను నిశ్చాయక వాక్యము లొకవైపు,-తందరలాడుచుండగా, మెల్లఁగా 'ఈమె శపథంబు చేయుఁగాక' యని రాముఁడనుటతో నాదృశ్యమంతయు స్తంభించినట్లైనది. అప్పటి వాల్మికిని జూచుటయే యశక్యమనిపించినది. అంతలోనే పూర్వము నాకళించుకొని భవిష్యము నిర్ణయించు తపోమయ మూర్తియై "ఇది పోలుఁగాక'' యనుటతో నాకాకిరణములు ప్రజ్వరిల్లగా, 'శాసించుటతో' సీత భూమాత యొడిలోఁజేరినది. ఈ భావతరంగము లన్నియుఁ దొణికిసలాడి కదలుచుండగా, దోయిలిఁ బట్టి విధేయుఁడై "భవదనుగ్రహంబ మాకేడుగడ''యని తలవంచిన శ్రీరామచంద్రుఁడును ఆయన నాశీర్వదించుచున్న వాల్మికి మహర్షియు అరుగో, ఆ వృక్షచ్ఛాయలోఁ గనబడుచున్నారు. తన కవితా ఘంటముతో నిట్టి దివ్య సాక్షాత్కారము చేయించినవాఁడు తిక్కన మహాకవి. పాపరాజుగారి కట్టి మహోన్నతి యెక్కడి నుండి వచ్చును? తరువాత శ్రీరాముఁడు తన కన్న ప్రజయగాఁ గైకొని భూప్రజనెల్ల నొక్క కొఱఁతయు లేకుండ నడిపి పాలించుచు నమ్మనుజేంద్రుడు పూజ్యరాజ్య మహిమాన్వితుఁడై'' వెలుగొందెనని తిక్కనగారు చెప్పిరి.

## 39. అవవాదపరామర్శము

అపవాదమనఁగా 'దూఱు-నింద'-పరామర్శమనఁగా ఆవచ్చిన నిందను గూర్చి ఆలోచించుట. శ్రీరాముని నిందను గూర్చి బాగోగులు తేల్చుట యిందు జరుగును. భద్రుఁడు పౌ[illegible] సీయపవాద ప్రస్తావనలేదు. భద్రుఁడు

వించి పౌరులాడుకొను మాటలు చెప్పుచుఁ జెపరి నా యీానుయు [illegible] నొక పలుకైనఁ జెప్పఁగడఁగితిరేనిన్''యని యాజ్ఞాపించుటతో సీయపవాదము రూఢమై పరిష్కారమార్గము నందుకొన్నది. "కొనిచని వాల్మికి తపోవన పరిసర భూమిఁ ద్రోఁచివచ్చెడి, దయ్యంగనకును నాకు నిదేవిధి''యని చెప్పటతోఁ బరిష్కారము నిశ్చితమై, యుదయముననే ప్రయాణము సిద్ధము చేయఁబడినది. ఇంతవరకు నుభయకవులుఁగూడఁ జివర కేకాభిప్రాయమునే వెల్లడించిరి.

ఇది సరియేగాని ఇచ్చట జనులాడుకొను మాటలున్నవి. పౌరులలో నెవరో కొందరు మారుమూలగా ననుకొను మాటలకింత విలువనిచ్చుటయేల? అట్లుగాక యామాటలాడు పౌరులనే పిలిపించి వారలనడిగి నిశ్చయము తేల్చ వచ్చుఁగదా! లేక సీతనుగూడ నిశ్చయమునకు రప్పించుటలోఁ దప్పేమున్నది? ఆయర్హతయు నధికారము రామునకులేదా? ఏదోయొక నెపమువెట్టి సీతనడవికిఁ ద్రోయుటగాక యిదియేమగును? ఇట్లు తలఁపవచ్చును. ఇట్లు ప్రజలనుకొనఁ గల్గినను రాముఁడు గమనించక తన నిశ్చయమునే అమలు జరిపింపఁగోరెను. అప్పటి రాజధర్మప్రకార మామార్గమే సరియైనదగుచో నట్లేయగుగాక! దాని ప్రకారమే నిర్ణయించి లక్ష్మణుఁ నాజ్ఞాపించి తానేకాంతవాసమున నుండెను. ఈ విషయమునే "వారినింట్లకును బోఁబనిచి యచటువాసిధరణీపాలుం డరిగెన్" "ధాత్రీపతికనుజులకును నేత్రంబుల బాష్పవారి నిద్రసుడుప నా రాత్రియొక భంగిఁజనియె"నని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారును-"అధిపుడు విన్న నగుచు సదనముఁజేరెన్" "ఆకొంతచనిన రాతిరి కాకుత్థ్సున కొక్క బ్రహ్మకల్పంబయ్యెన్" అని చెప్పిరి.

మరుసటి యుదయమున లక్ష్మణుఁడు వచ్చి సీతతోఁ చెప్పి, ఆమె ప్రయాణమైరాఁగా వనములకేగెనని పాపరాజుగారు చెప్పిరి. ఇచ్చట లక్ష్మణుని హృదయములో నపరాధ వృత్తాంతము మెదలుచున్నది కాని, బయటకొక్క మాటయుఁ జెప్పలేదు అది శ్రీరామునియాజ్ఞ కాఁబోలు!

తిక్కనగారట్లు గాక, రాముఁ డుదయముననే వచ్చి, తానే ప్రయాణము చేయించి, విముఖుఁడుగానున్న లక్ష్మణునిగూడ మాటలాడకుండఁగాఁ జేసి సీతాలక్ష్మణుల రథమెక్కించి, తాపసస్త్రీలకని అంబరాభరణాదుల మూటఁగట్టి తానే యిచ్చి ప్రయాణముచేయించెనని చెప్పిరి. సీత తనకు దూరమైపోవుచున్నదని తెలిసియుఁ, దానే దూరముచేయుచున్నానని తెలిసియు, దానిని బయలు పొంగనీక, లక్ష్మణునిగూడ మాటలాడనీక నిలువెల్ల కన్నులుగా నడుచుకొని సీతను ప్రయాణముచేసిన రాముని ధీరోదాత్తత వ్రాయుటకుగూడశక్యముగాదనిపించును. "అడలడఁచి, నెమ్మొగంబున వెడతెలివొడఁగూర్చి, మాటతేర్పడకుండన్ జిడిముడిపడక, నయంబున నెడమడు వొక్కింతలేక" తన భార్యను దనకు శాశ్వతముగా దూరముగాఁబంపు రాముని కర్తవ్య నిశ్చయమును బొగడుటతోఁబాటు ప్రజానురక్తి సంపాదనమున నాతని దృఢమనస్కతను వెల్లడి

చేయుటయుక్తము. "తనతలంపించుకంత యైన జానకియెఱుఁగనియట్లుగాఁగఁ బాలలోఁద విసంబిడుపగిడి" ననిచి పుచ్చుటలో నాతని ధర్మనైష్ఠికత వెల్లడి యగుచున్నది. "రాసుతుఁ డుల్లంబునొచ్చిమరలె" ననుట యాతని అనుకూల నాయకత్వమును జాటుచున్నది; ఇంతగాఁ దిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారీఘట్టమున నించుకంతయు వ్రాయలేదు - "ఆకాంతచనిన రాతిరి కాకుత్థ్సున కొక్కబ్రహ్మ కల్పంబయ్యెన్" అని చెప్పుటలో, ప్రజానురక్తి కొరకై కావచ్చు పత్నీవియోగము కొరకై కావచ్చు రాత్రి నిద్దురలేకవేఁగెనని తెలియును. అది యుచితమే కావచ్చునుగానిఁ తిక్కనగారు చెప్పినదానిలోఁ బత్నీవిరహము పాలు తక్కువయై, ప్రజానురక్తిపాలు గాఢముగా నాటుకొన్నట్లు తెలియును. కనుకనే "పాలలోన విసంబిడుపగిడి" తియ్యని మాటలుచెప్పి సాగనంపెను. ఈ చెప్పుటలో "ప్రజానురక్తి-పత్నీప్రేమ" సమభాగములుగా రామునిలోనున్నట్లు పాపరాజుగారును, పత్నీప్రేమను తగ్గించి ప్రజానురక్తిని బెంచినట్లు తిక్కనగారును చెప్పినట్లు తెలియుచున్నది. ఈవిధముగా రాముని అపవాదమునకు దూరమైన వానిగా మనకుఁ దెలిపిరి.

రెండవఘట్టమున లక్ష్మణుఁడు సీతతోఁ జెప్పునవుడీయపవాద వృత్తాంతము వచ్చును. లక్ష్మణుఁడిట్లు చెప్పెను. "ఏనింకేమని తెల్పుదున్' 'రఘుకులాధీశున్ జగంబెల్ల నీకై నిందింపఁగఁ జాలనొచ్చి, యది మిథ్యావాదమైనన్ సమాధానం బేర్పడఁజేయకున్న, నిజవృత్తం బెంతయున్ దూషితంబై నీచత్వము రాక తక్కదని యూహాపోహ సంవేదియై" "జీవన్మరణంబగుచున్న భవద్విరహం బున కియ్యకొనియె" నని చెప్పుచు, 'ఇచ్చటనుండు' మని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు -"విన్మ-తల్లీ! దుశ్చింతులు దైత్యుచేఁబడిన సీతను గ్రమ్మఱ నేలుచున్న వాఁడెంత విమోహి రాముఁడని యెగ్గులు పల్కిన నాలకించి, భూకాంతుఁడు నిందఁజెంది నినుఁ గానలలోపల డించిరమ్మనెన్" అని చెప్పిరి. సీతను విడుచుట నిర్వ్యర... సమానముగఁ జెప్పినను తిక్కనగారి లక్ష్మణుడు శ్రీరాముని నిర్ణయము సమర్థించుచునె 'నీవిరహమున కయ్యెత న ... చెప్పనాడు. పాపరాజుగారి లక్ష్మణుఁడు "భూకాంతుఁడు నిందఁజెంది నినుఁ గానల లోపల డించిరమ్మనెన్" అని చెప్పెను. 'భూకాంతుఁడు నిందఁజెంది' యని రాముఁడు నిందగా ననుకొన్నట్లు చెప్పెనేకాని తాను దానిని సమర్థించినట్లు చెప్ప లేదు. తర్వాతఁ గొన్నిమాటలు చెప్పినను నవి దతనుసృతములైనవే యగును.

ఈ విధముగా నపవాద నిర్ధారణమును, దానిని బాయుటకై రాముఁడు తీసికొన్న నిశ్చయమును సమర్థింపఁబడినది.

సీత లక్ష్మణునితోఁ బెక్కుమాటలన్నది. వానిలో నపవాదమునుగూర్చి పల్కినవి "తనమది నొక్కయుమ్మలిక దక్కిన మంచిది; దానిఁ బాపఁగానని తలపోసి చేయుపని-కక్కట! యేనును లోనుగానె? నాకు నెఱుఁగఁజెప్పి పొమ్మనుటకుం దగనే?" యని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారు సీతతోఁ బలికించినమాటలు పెక్కులున్నవి. వానిలో "ఎఱుఁగని మూఢులాడుకొను నెగ్గులకుం భయమంది యప్పుడే కఱకు మనంబుతో విభుఁడు కాననసీమకుఁ బంచెఁగాక, యత్తెఱఁగొకసారి నన్ బిలిచి తెల్పి మనోవ్యథతీర్చి నిన్ను నేమఱ నని పల్కఁడయ్యె" ననున దొకటి. ఇందులో "రాముఁడు నన్నుఁ బంపినఁ బంపుగాక, ఆమాటయైన చెప్పి 'నిన్ను నేమఱ' నని చెప్పఁడాయె ననియున్నది. ఇచ్చట 'రాముని ప్రేమనుగుఱించి' యేగని అపవాదమునుగూర్చి కనబడదు. తిక్కనగారి మాటలలో అపవాదమునుగూర్చియే నొక్కిచెప్పినట్లు కనఁబడును. "అతఁడా యపవాద ప్రస్తావన యెత్తినచో నప్పుడు తెలిపోవునుగదా, అదికూడ లేకుండఁజేయుట తగవా" యన్నట్లున్నది. ఏమైనను ప్రతివాదమున కవకాశము లేనట్లుగా అపవాదము నిర్ధరింపఁబడినది.

వాల్మీకి సీత నూఱడించునప్పుడుగూడ నీయపవాద ప్రస్తావన వచ్చినది. పాపరాజుగారిట్లు చెప్పిరి. "వగవేలా పుత్రి! నీసద్గుణోన్నతి నీభర్తయెఱింగి యున్, ప్రజల నిందల్ దాల్మిగుందింపగా ధృతి నీతెంపొనరించె నింతయు మనోదృష్టిన్ విచారించి వచ్చితి" నని వాల్మీకి యనెను. "నీవు యోగ్యురాల వని తెలిసియు జననిందలు భరింపలేక రాముడీయడవులకంపె" నన్నటున్నది. రాముడిట్లు నిర్ణయించుట తప్పనలేక ప్రజలపై నింద పడవేసినట్లగును. "మనో దృష్టిన్ విచారించి వచ్చితి" నని నమ్మకముగాఁ జెప్పెను. కాని తిక్కనగారిట్లు చెప్పలేదు. "నిర్మలతనొప్పు నీదు చరితంబు తెల్లంబుగాదె: రామునేరమియ చూవె యింతయు నిక్కమరయ"" అని సీతతో ననెను. "నాకు తెలియకుండ లోకములో నేదియు జరుగ" దనెను. ఈతని మాటలలో సీత తప్పులేదను టయేగాక "రాముడు తెలియక యిట్లుచేసె" ననికూడ తెలియుచున్నది. ఇచ్చట బాపరాజుగారికంటె దిక్కనగారే రామునిపై దోషారోపణ చేసినట్లు స్పష్టము. కాని, యిది రామునియెదుట జెప్పినపుడుగాని దీని సత్యార్థము గోచరింపదు.

లక్ష్మణుడు సుమంత్రునివలన పూర్వచరిత్రమంతయు విని "అలర రఘువంశమునకుం దల మాటించుకయులేమి తథ్యము" అని తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారేవేవో చెప్పిరిగాని పైపద్యభావము కనుపట్టదు. లక్ష్మణుఁడు రామునిఁజూచి, "జనవాదంబునకున్ బ్రియం దొఱఁగ నుత్సాహంబు సేయంగవచ్చునె యిట్లెవ్వరి? కివ్విధంబు దలపన్ జోద్యంబుగాదే? క్రమంబున నిష్కల్మష వృత్తముల్ తెలియనోపున్ లోకమెళ్ళంగి" అని యన్నట్లు తిక్కనగారు చెప్పిరి. పాపరాజుగారీసమాచారము నెత్తికోలేదు. ఆయన రాముని దేవత్వముఁ గీర్తించుటతోఁ గృతార్థుఁడయ్యెను. కాని యపవాదమును గురించి యీవిధముగా లక్ష్మణునితో మాట్లాడింపలేదు.

ఇచ్చట నొక్కవిషయము జ్ఞప్తియందుంచుకోవలెను. సీతగర్భమైన సంగతి తెలసినతరువాతనే యీ సంగతి జరిగెను. అప్పటికామెకు మూడునెలల గర్భమైన నయియుండును. ఆమెను వాల్మీక్యాశ్రమ సమీపమున విడిచి లక్ష్మణుఁడు ఆ సంగతి చెప్పి యూరడించినప్పటికిఁ గనీసమైదునెలలైనఁ గావచ్చును. శత్రుఘ్నుఁడు లవణసంహారమునకు బోవుచు వాల్మీక్యాశ్రమమున విడిసిన రాత్రియే సీత కవలపిల్లలఁ గనెను. కావున సీత వాల్మీక్యాశ్రమముచేరిన తరువాత నైదునెలలకు ప్రసవించెననుట స్పష్టము. ఆ పిల్లలను శత్రుఘ్నుఁడు చూచెననియు స్పష్టమగుచున్నది. లవణ సంహారమైనతరువాతఁ బండ్రెండు వత్సరములు దాటినతరువాత శత్రుఘ్నుఁడయోధ్యకుఁ బోవుచు మార్గమధ్యమున వాల్మీక్యాశ్రమములో విడిదిజేసి, రామాయణగానము చేయుచున్న కుశలవులను జూచెననుటతో నిప్పటికి పండ్రెండు పదమూడు వత్సరముల బాలురు కవలపిల్లలని తెలియును. శత్రుఘ్నుడీబాలురసంగతి శ్రీరామునితోఁ జెప్పలేదనఁగా, నది నిజమేయనుకొన్నచో ఇంతకాలము సీతను మఱచిన రాముని యుదాత్తత ప్రశంసాపాత్రము కాకతప్పదు.

ఈనడుమ జరిగిన కథను దాదాపాఱువందల యేఁబది పద్యములతోఁ బాపరాజును, నూటయేఁబది పద్యములతోఁ దిక్కనగారును జెప్పిరి. నడుమ నెవ్వరు నీసంగతి చెప్పలేదు. చెప్పియున్నచో నా కథ వేఱుగా నుండును అందఱు మౌనము వహించియుండిరి. అశ్వమేధయాగములో సీత్రవస క్తివచ్చిన తరువాత, రాముఁడు స్వయమ్ముగా వినిన తరువాత - "జానకీరమణికై పతి నున్నవి పీరిరూపు; లవ్వనజదళాక్షికిన్ మునుకవల్ జనియించి రటంచు వింటి,

నత్తనయుతె యీశుభాకృతులు: తక్కిన నీచెలువంబులుండునే" యని రాము డనుకొన్నట్లు పాపరాజుగారు చెప్పిరి ఎవ్వరివలన నెట్లు వినెరో చెప్పలేదు. "అడవులలోన-సీత-యకటా! యిఁకఁ జూతుక యెట్లు తాళుదున్"అని రాముఁ డనుకొనె ననిరి. ఇంతకాల మోర్చిన శ్రీరాముఁ డీ యాగకాలములో నింతగా నాతురపడుటేమో తెలియదు. తరువాత శత్రుఘ్నాదుల రాయబార మంపు టయు "సీత శపథముచేయు"నని వాల్మీకి చెప్పి పంపుటయు. రాముఁ డుత్సాహముతో "శపథముచేయుచోనయిన జానకి సత్యమెఱుంగుఁడీ" యని సభ్యులతోఁజెప్పి తాను సంసిద్ధుఁ డగుటయు, వాల్మీకి తాను సత్యప్రమాణము లెన్నియోచేస, చివరకు-"జనంబు విశ్వాసమునొందఁ జేయుటకు స్వాంతము గల్గిన, మీరుకోరినట్లే సభవారలెల్ల విన నీయమయున్ శపథంబు పల్కెడున్" అని చెప్పుటయు జరిగినది. రాయబారము మొద లింతవరకు జరిగినదంతయు, ననావశ్యకము, ననుచితము, నప్రసక్తము ననిపించును. కాని పాపరాజుగా రీకథ యంతయు వ్రాసిరి.

తిక్కనగారి కీరాయబారము నచ్చలేదు. దాని ప్రసక్తిగూడ ననవసర మని తోచినది. రాముఁ డీ యపవాదమునకు దూరమైనట్లు నిశ్చయించినది మొదలుగానాయనయట్లే ప్రజాపాలనలో జాగరూకుఁడైనట్లు కథ నడిపెను. అశ్వ మేధము చేయునపుడుగూడ మునులందఱఁ బిలిపించెనే కాని వాల్మీకి మాట ప్రత్యేకముగా నెత్తలేదు, కనుకనే వాల్మీకియు వచ్చినట్లు చెప్పలేదు. సీతను-గవలను తాను పెంచుచున్నాడు కాబట్టి, వారిని రామున కందఁజేయుట ధర్మము కాఁబట్టి, అశ్వమేధము రాముడు చేయుచున్నాఁడు కాఁబట్టి-ఇది సమయముగా దలఁచెను. పిలిపింపకపోయినను దానే పోవుటయుచితముగాదని, సీతను కవలను నీవారని యర్పించుట గౌరవముగాదని, రామాయణ ప్రసంగముతో సుముఖు డైన యాతని దర్శించుట ప్రయోజనకారియని దానికిఁ దగిన సన్నాహము చేసెను. అందుకుఁ దగినట్లుగా ముందుగా "శాతకుంభసీతాతనుసంవిధా నము"ను జూచి హర్షించెను. తర్వాతఁ కుశలవులతో రామునెదుట రామాయణ గానము చేయించెను. రాముఁడు తృప్తిపడి "మీరెవ్వరు? ఈ కావ్య మెవ్వరు రచించిర''దని వారి నడిగెను. కుశలవులు వాల్మీకి కనుసైగతో వారి యాజ్ఞను తెలిసికొని "మేము వారి శిష్యులము - ఈ కావ్యము వారు వ్రాసినది" అని వాల్మీకినిఁ జూపిరి. రాముఁడు మహానందముతో-"మీ కృపామహిమఁ గావ్య

రని యొప్పుకొన్నట్లుగాని మాటాడలేదు. తన యంగీకారములేదు. శపధానంతరమే అవన్నియు జరగవచ్చును. అపవాద పునర్విమర్శనము వచ్చినదిగానఁ బరిష్కారము కొరకై యీమాట యన్నట్లున్నది. ఇది రాముని స్థితి-వాల్మీకికిప్పుడు కర్తవ్యముపైఁబడినది. శపధముచేయుట సీతకేగాదు తనకుఁగూడ నిష్టములేదు. ఒకభార్య తనభర్త యొద్దనుండుటకై శపధముచేయుట సామాన్యమానవధర్మమునకే కళంకము. అట్లని శపధము చేయవద్దనుట తనవంటివాఁడు చేయవలసిన పనిగాదు. ఇట్టి భీషణమైన సమస్యను భవిష్యదధీనముచేసి 'యిదిపోలు'నని శాసించెను. ఆశాసనములోసనే ఆతని హృదయావిష్కారమున్నది. దానిని గ్రహించియే సీత భూమాతను వేడుకొన్నది.

ఈ యపవాద పరామర్శలో నిఁతవఱకు దేలిన సారమిది, రాముఁడు దీనిని ముందేభావించి యొకనిశ్చయమునకు వచ్చినాడు. రాత్రియంతయు దీర్ఘముగా నాలోచించి తేల్చుకొన్న విషయమిది. "ఐనను మీకు నొక్క తెఱఁగస్ఖలితంబుగ నేను జెప్పెదన్.........నా యానసుఁడీ నాకర్థముగా నొకపలుకైనఁ జెప్పగడఁగితిరేనిన్" అని చెప్పిన యైదుపద్యములలో అపవాదమునకు దూరముగానుండుటకుఁ దగిన యంశమంతయుఁ బొందుపఱుపఁబడినది. దృఢమనస్కుఁడైన రాముఁడు దానినట్లే నడిపినాఁడు. వాల్మీకి దాని దార్ఢ్యమును బరీక్షించుటకై యొక యూహపన్నెను. దానిలోఁగూడ రాముఁడే కృతకృత్యుఁడైనాఁడు. ఈ విధముగా నపరాధము నిరస్తమై రాముడు కుమారులతోఁగలిసి రాజ్యముచేయుచుండెనని తెలియును తిక్కనగారీవిధముగాఁ గధానిర్వహణము చేసిరి. పాపరాజుగారట్లు చేసిరని ఫలితాంశము.

సీత రసాతలమలంకరించిన తరువాత నాశ్వాసితుఁడై శ్రీరాముఁడు యాగము ముగించి, కుమారులతో నయోధ్యఁ బ్రవేశించి జనరంజకముగా రాజ్యమేలెనని పాపరాజుగారు చెప్పిరి. తర్వాతఁ జెప్పుటకుగూడ సిద్ధపడిరి. అది వారి భావము. తిక్కనగారికాభావము లేదు. గ్రంధరచనా ప్రారంభమునందే యా భావములు వేఱైనవని తోచును. తాననుకొన్నట్లుగా మంగళాంతముగా కధముగించుట వారి యుద్దేశము. నాయకుఁడు-సాచినమగ్గము నేసినట్లుగా తన కావ్యము ముగించి బాధ్యతతీఱినట్లుగా స్నానందముతోఁ గాలముబుచ్చుట వారి యభిమతము. అట్లుచేయుటకిఁక రెండుమూడు మాటలు చెప్పవలెను.

శ్రీరాముఁ డయ్యాది కవీంద్రు నత్యంతముగా సత్కరించి సాగనంపెఁ-

కుశలవుల చెంతఁజేర్చుకొని వారికి నాగరిక విద్యలన్నియు బోధింపఁజేసెను. తద్గుణ బిలిపించి "భరత వాత్స్యాయన ప్రభృతి నాగరకళా శాస్త్రంబులను" "హయగజస్యంద నాద్యారోహములను" కోదండకరవాల కుంత ముఖ్యాయుధ శ్రమలను'' "వేణువీణాప్రౌఢ వివిధ కళాభ్యాసములను" నేర్పించి, ప్రవీణులఁ జేయించి, యాయోజ్జులకుఁ దగినట్లు పసదనంబు లిప్పించెను. అవసరములందుఁ దాను స్వయముగా శస్త్రాస్త్ర ప్రయోగోపసంహారాదుల శిక్షించి దక్షులఁగాఁ జేసెను. భరత లక్ష్మణ శత్రుఘ్నులు సర్వకార్యములరసి నెఱవేర్చుచుండగా, "ధరణియెల్లఁ బొగడుతోడి యాజ్ఞనెగడి ప్రవర్తిల్లఁ" గా రాముని రాజ్యమేలుచు "సుతులఁ గొనియాడు, విద్వత్ప్రతతి నుపాసించు, భూమి ప్రజనరయు, మహాక్రతువులొనరించు, గురుదైవత పూజలుసేయు, సాధువర్గముఁ బ్రోచున్" అని చెప్పిరి. "ధరణినెందున గాలవర్షము దైవయోగసమగ్రమై కురియు" నిత్యాదిగా ఫలశ్రుతిఁజెప్పి తన కావ్యములకు మంగళమహాశ్రీఁబాడి ముగించిరి. పాపరాజుగారు "ఏకతంబున నున్నచో నినకులుండు భామినీమణి నూహించి పరితపించుఁ గొలువులోనున్నయప్పుడు కొడుకులఁగని సీతరూపంబు భావించి చింతనొందు" నని చెప్పిరి. ఈ విధముగ -నిర్వచనోత్తరరామాయణ- ఉత్తర రామాయణ కావ్యముల విమర్శ సంపూర్ణమైనది.

## 40. ఉపసంహారము

ఈరచన తిక్కన పాపరాజుల కావ్య నిర్మాణ పరిశీలనకై యుద్దేశింపఁ బడినది. రెండు కావ్యములు యథామతిఁ బరిశీలింపఁబడినవి. పాపరాజుగారి రచనలో మూలముననునరించుటకుఁ దగిన యాకరములు గొన్ని గలవు: కాని, వాని కంటె నెక్కువగా, మూలమున కంటె భిన్నములుగాఁ గూడఁ గొన్ని మార్పులు చేర్పులు కనబడును. వారి దృష్టిలో నీ గ్రంథము క్రొత్తగా వ్రాయఁ బడినట్లే కనఁబడుచున్నది. రాముఁడు కథ నడుపవలసి వచ్చినప్పుడు మాన వుఁడుగను తక్కిన యెడల దేవుఁడుగను గనుపట్టును. ఇందుకుఁ గావలసిన యుదాహరణములు గ్రంథములోనే పెక్కుచోట్ల నున్నవి. వర్ణనాధికములు సమ యము వచ్చినపుడు-తీసికొనియైన జేసినవి పెక్కులు గనపడును. శృంగార రసము అచ్చటచ్చట జానపదోచితముగా నగపడును. ఉచితములైన చక్కని వర్ణన లక్కడక్కడ లేకపోలేదు. కాని యవి విచేయతారకలు. సమకాలీనము లైన- రాచకొలువుల ప్రకృతి వర్ణనల సంకలనము కొట్ట వచ్చినట్లుగా నున్నది.

కావి ఆ వర్ణనలు రెండు మూడు పుటల నిడివి వచనములతో నుండుట యస్వాభావికముగా నుండును. అర్థాలంకారముల కంటె శబ్దాలంకారములు పదముల నిడుపులు-ద్వ్యక్షర త్ర్యక్షరప్రాసలు మిక్కుటముగా నున్నవి. సహజములో సంపాద్యములో అయిన విశేషములు గూడ లేకపోలేదు. ఈ యన్నింటికి బదునెన్మిదవ శతాబ్దినాఁటి సాహిత్య పరిణామము కారణము కావచ్చును. దీనికి 'నన్నలు దమ్ము' లైన కావ్యములు కొన్ని పుట్టి యుండవచ్చును. కాని యుత్తర రామాయణము వానిలో విశిష్ట మైనదిగా నెన్నికకు వచ్చినది. సంప్రదాయ నమీకృతములైన కావ్యములు గూడ వలుచగా నైనఁ గొన్నియుండకపోవు. కాని, వానికిఁ బ్రభుత్వాదరము పండితాదరము ప్రజాదరము పట్టవలెఁ గదా! ఇట్టి పరిస్థితులలో నీవిధముగాఁ బైటికి వచ్చి తలనిక్కఁ బెట్టి నిలిచిన దీయుత్తర రామాయణము కంకంటి పాపరాజుగారికి చిరయశః పతాకగా జయజయ నినాదము లందుకొన్నది.

తిక్కనగారి కాలమునఁ (పదుమూడవ శతాబ్ది) కీ పరిస్థితులన్నియు నింతగా ముందునకు రాలేదు. ఆయన స్వయముగాఁ బరిణతుఁడు. ప్రాచీనులలోఁ బేరెక్కిన వాఁడు. ప్రభుత్వ మర్యాదల నెఱుఁగుటే కాక ప్రభుత్వముల నుద్ధరింప నేర్చినవాఁడు. తన కాలమునకు గతానుగతికము లైన పురాణేతిహాసముల యాంధ్రీకరణము కంటెఁ గ్రొత్తగా నూత్నముగా నొక కృతి నిర్మింపఁ దలచెను. కృతి నిర్మాణమునకు వలసిన శబ్దప్రపంచము తనచేత నున్నది. ప్రతిభావ్యుత్పత్తు లున్నవి. కల్పనా చతురిమయున్నది. రఘువంశము వంటి స్వర్ణప్రబంధ మొకదానిని నిర్మింపఁ దలచుకొన్నాడు కావ్యమనఁగా నిట్లుండవలెనని తొలుతనే నిర్ణయము జరిగినది. ఉత్తర రామాయణ కథ యితివృత్తముగా దొరకినది. అది యాధారముగాఁ దిక్కనగారు చేయఁదలచిన తీర్పు లిట్లుండును. కథా నాయకుఁడు మానవోత్తముడుగనే యుండవలెను. దేవోత్తముఁడుగా నుండినఁ జివరకది మానవుల కనుకార్యముగా నుండదు. వాల్మీకి యనుసరించిన మార్గము గణ్యమైనది. అవసరమైనప్పుడు 'అగస్త్యుఁడిట్లు చెప్పె' నని తప్పించుకొనుటకు గూడ నవకాశమున్నది. ఇట్లు భావించి తిక్కనగారు నిర్ణయించినవానిలో రాముని మానవోత్తమునిఁగా రూపొందించుట ప్రధానమైనది. తక్కినవి రచనకు సంబంధించినవి.

తిక్కనగారు కవితా నిర్ణయములఁ గూడ ముందుగనే పేర్కొనెను. అది "దళంబులన్ సౌరభ మిచ్చు గంధ వహుచందమునన్ బ్రకటంబుచేసి" "పలు

కుల పొందులమర్చి" "అర్థమునకుం దగుమాటలు గూర్చి" ఇత్యాదిగాఁ జెప్పఁ బడినవి. అధిక పాఠములను బూర్తిగా వెలివేయుట మంచిది. దీర్ఘేతివృత్తాంశ ముల గూడ నొకటి రెండు మాటలతో సంగ్రహింపవచ్చును. వర్ణనచేయఁ గూడ దను బిగువుండఁ గూడదుగాని వర్ణన కొఱకే రచన సాగించుట పనికి రాదు. చంద్రికా వర్ణనము వంటి ఘట్టములలో నా వర్ణన కథానుబంధియే గాక, తన ముద్ర గూడ దాని కంటి రావలెను. రాచకొల్వులు మొదలైనవి ప్రజాభిరుచి కనుగతములుగా నుండవలెను. ఈ విధముగా భావించి నిర్మించుటలో నేది చెప్పినను సందర్భ శుద్ధముగాఁ, బ్రకృతోపయోగముగాఁ, బాత్రోచితముగా, లోకానుగతముగా నుండునట్లు చేసెను. ఆయన రచనలలో నెచ్చటను జెప్పిన జెప్పిన దానికంటె నూహించుకోవలసిన దెక్కువగా నుండును. వాచ్యమున కంటె వ్యంగ్యమునకుఁ బ్రాధాన్య మిచ్చు పద్ధతి యిదియే గదా! అలంకారములు శరీర మాత్ర సౌందర్యాపాదకములని గుర్తించి రచన చేయుటలో, గ్రంథము పరిమితమై, గుణము శతాధికముగా విస్తరిల్లినది. 'సర్గనియమము' 'నిర్వచన నియమము'-ఇత్యాదులతో నప్రసక్తములు ననుద్దిష్టములు నైన వాని జోలికిఁ బోకుండుట గన్పడును. కావుననే యొక కందములో నొక గీతములో నెంతటి కథనైనను కుదించి లాగఁగలడు. ఇట్లు అల్పాక్షరములతో ననల్ప భావముల మూట గట్టి నిర్వచనోత్తర రామాయణమును సంగ్రహ రమణీయముగా గుత్త ముగా నిర్మించెను.

ఇట్లు సంతరించిన రామాయణములలో 'నేది రమణీయమైన' దనునది- యొక ప్రశ్న. దేని రమణీయత దాని దని సమాధానము. 'దేనిని జదువు చున్నా' రనునది ప్రశ్న-ఎవ్వరి 'కేది దొరకిన-దానిని జదువు చున్నా'రని సమా ధానము. ఇవి ప్రొద్దుపోకకై చదువు పుస్తకముల గురించి సాధారణముగా వచ్చు సమాధానములు. 'సాహిత్యాభిరుచి సహృదయ హృదయాహ్లాదకారిగా' దేనిలో నున్నదను ప్రశ్నకు సమాధాన మాలోచించి చెప్పవలెను సాహిత్యాభి రుచి యనఁగా, 'మానవ జీవితావసరముల నన్నిటిని-గావ్య ప్రతిపాదితములైన వానిని ఆత్మనీనముగా మలచుకొని, తన్ముఖముగాఁ దమ ప్రవృత్తులను సంపన్నములు చేసికొను నక్షర విన్యాసాభివాంఛ. దీనివలనఁ బుస్తకములఁ జదువుటయేగాక, వాని యర్థముల నెఱుఁగుటయే గాక, అందలి భావములు తమ జిజ్ఞాసను బ్రోత్సహించునవిగా నుండవలయునని తెలియును. తిక్కన

నాఁడి కక్షర జ్ఞానము కలవారు నూటికి పదునైదు శాతమున కంటె నెక్కువగా నుండరు. వారిలోఁ బండితులైన వారి శాతము మఱియుఁ దక్కువగా నుండును. వారు 'రమణీయ మని' గ్రహించి యితరులకుఁ జెప్పునదే గ్రంథము. ఈ పరిస్థితి యించుమించు రాయల కాలమునాఁటి వరకు సాగుచున్నది.

జనసామాన్యములో నక్షరజ్ఞానము పెంపొందించి విజ్ఞాన వివేచన కలిగించిన వారిలోఁ గృష్ణదేవరాయలొకఁడనుట యతిశయోక్తి గాదు. తరువాతఁ దదనుయాయులు పెక్కురు. ప్రజలలో నక్షరజ్ఞానము పెరిగినది. విజ్ఞానము పెరిగినది కాని సాహిత్యము తగ్గినట్లుగా తగినంతగాఁ బెరుగలేదు. పదసార్థకతకంటె బంధబాంధవమును, భావనిరూపణకంటె శబ్దచమత్కారమును మన్నించుట యెక్కువైనది. ఈ యలవాటు పాపరాజుకాలమునాఁటికి మఱింత ప్రబలమై శబ్దప్రాధాన్యము రాజ్యముచేసినదనవచ్చును. తత్కారణముగా భావభావనాలోలుపత-వ్యంగ్య వైభవము ఉన్నచోటనే యుండిపోయినవి. పలుచనైన శృంగార భావతరంగములు, నిస్తేజములైన యధ్యాత్మ బోధక కందార్థములవంటివి ప్రజాజీవితమునకుఁ బరమార్థమైపోయినవి. ఇట్టికాలములో నుద్భవించిన దీయుత్తరరామాయణము. ఈ వాసనల పొలఁకువలేవియు బయల్వెడలని కాలమున నావిర్భవించిన దీనిర్వచనోత్తర రామాయణము. ఇది యొక కారణము తిక్కనగారు లోకోత్తరమైన మహాభారతాంధ్రీకరణమునకుఁ బూనుకొనుటతో నీనిర్వచనోత్తర రామాయణముపై నాసక్తిఁ జూపకపోవుట యొక కారణము. మహాకవుల గ్రంథములవలె నిదియు లక్ష్యజ్ఞానమున కుపయోగించునదై యంతమాత్రమున నిలిచిపోవుట యొక కారణము. పాఠప్రవచనములకుద్దేశించుటలో నప్పటికింకను అచ్చుపడి వ్యవహారములోనికి రాకపోవుట యొక కారణము. ఇంకను నజ్ఞాతకారణములు కొన్నితోడై ఆంధ్రజనులకు నిర్వచనోత్తర రామాయణ మొకఁడున్నదా యను సందేహము మొన్నమొన్నటివరకుఁ గలుగుచుండినది. రెండువందలయేండ్లకు లోపలనేపుట్టి, ఇప్పటి యభిరుచులకు నిదానమై, బంధప్రౌఢిమతో భాషాబోధకుల యాశీర్వాదమంది - నిర్వచనోత్తర రామాయణ ప్రసక్తి దాదాపు లేనిదిగనే తోచినది. ఇట్లే రెండు గ్రంథముల వ్యాప్తివిన్యాసములు జరిగినవని అందఱికిని దెల్లమైన విషయమేగదా!

కావ్యవిస్తృతి యెంతమంచిదో గుణ విస్తృతి, ఔచిత్య విస్తృతి పెరుగుటగూడ నంతమంచిది. పాపరాజుగారి రచనలోఁ గావ్యము పెరిగినది కాని

గుణౌచిత్యములు పెరుగలేదు. తిక్కనగారి రచనలో గుణౌచిత్యములు పెరిగినవి కాని కావ్యము పెరుగలేదు. పాపరాజుగారిలో గంభీరధారా విలసిత పద బంధము వెలసినదిగాని తిక్కనగారిలోవలె నుచితభావస్ఫోరక పద సంవిధానము విచ్చుకొనలేదు. ఒక భావము వేఱువేఱు విన్యాసములతో బాపరాజుగారు చెప్పుదురుగాని తిక్కనగారివలె వివిధ భావముల విచిత్ర వినిమయములతోఁ గూర్పలేరు. శృంగార వీరకరుణాదులే రసములైనను సందర్భము వచ్చినపుడు క్రుచ్చిక్రుచ్చి కొసరికొసరి పర్యాయప్రకారాంతరముల నుగ్గడించి, యొకటి రెండుపుటల గద్య పద్యముల నిడివితో బెంచినఁగాని పాపరాజుగారు తృప్తిపడరు. తిక్కనగారట్టి సందర్భములఁ జమత్కారముగా సరసోక్తిగా వ్యంగ్యమధురముగా సంగ్రహరమణీయముగాఁ జెప్పి, ఇంకను జెప్పవలెనన్నంతలోఁ బ్రకరణము మార్చివేయుదురు. ఈ చెప్పినవానికిఁ-జెప్పవలసిన వానికిఁగూడ నుదాహరణము లిరువుర కావ్యములలోఁ గావలసినన్ని దొరకును. ఇంకొక్కమాట చెప్పవలెను. పాపరాజుగారికి శృంగారముపైనున్నంత హెచ్చుగా-నంగాంగ స్పర్శముగానున్న బాహ్యశృంగార ప్రసంగము తిక్కన గారిలోలేదు. తిక్కనగారిలోనున్న శృంగార రసాభివ్యక్తి-చతురముగా సహృదయాహ్లాదిగా వ్యంగ్య మధురముగా నున్నట్లుగాఁ బాపరాజుగారిలోఁ గనుపింపదు. మూలమునుపెంచి, యధిక పాత్రముల ననువదించి, యవసరము లను కొన్నవాని నధికముగాఁ జొప్పించి గ్రంథము వ్రాయుటలోఁ బాపరాజుగారి రచన యపరితమై యనుకొన్నంతకంటె నెక్కువగాఁ బెరిగినది. తిక్కనగారి రచన కుఱుమట్టముగా సొగసులు సంతరించుకొన్నది. కాని, చివరి యెన్మిది, తొమ్మిది, పది వర్గలలో గ్రంథము మరికొంత పెంచిన రమ్యముగా నుండునని పించినది. మఱియు దశమసర్గలో ఈ లోపము కొట్టివచ్చినట్లు కన్పడును ఇట్లున్నను నుభయుల కావ్యములఁ జదివి యామోదము వెల్లడించువారు గొందఱు గలరు.

ఇప్పుడిరువదియవ శతాబ్దము నడివయసుదాటి యుజ్జ్వలముగా నుః సాహిత్యమున విభిన్న దృక్పథములు విస్తృతములై విశాలపురోభాగమున కానుచున్నవి. ఇట్టికాలములో సాహిత్యసమ్యగ్భారము నిగ్గుదేఱి యొరవడిః కొనుట స్వాభావికము. క్రొత్తక్రొత్త సాహిత్యప్రక్రియలు గుంపులుగుంపుల వచ్చినను, కలుపుమొక్కలఁ దీసివేసి పైరుపచ్చలకుఁ బోదియొనర్చుఁ

సాహిత్య వ్యావసాయకుల పని. వారి నిత్యకృత్యములలో బలముచేకూర్చుకొను వానిలో నీనిర్వచనోత్తర రామాయణముగూడ నొకటి కాఁగలదు. దీనిపై నిప్పటికే కొన్ని విమర్శలు బయలుదేఱినవి. అట్టు రానున్నవాని కీపుస్తకము చేఁదోడు వాదోడుగా నుండగలదని నా నమ్మకము. ఈ గ్రంథములోనున్న వానినిఁ మఱుగున బెట్టలేదు. లేని వానినిఁ బైకిఁదీయలేదు. పాక్షికముగా విమర్శింపను లేదు. ప్రకరణమునుబట్టి కొంత యధికవిమర్శము దోఁపవచ్చును. అదియుఁ గావ్యగుణ వ్యక్తీకరణమునకేయని తలంచున్నాను. ఇట్టి సువిమర్శ గ్రంథము లింకనురావలెనని ఆసించుచున్నాను. సాహిత్యవేత్తలు దీనికి సుస్వాగతము నిత్తురని నా భావము. రెండు గ్రంథములు మీయెదుటనున్నవి. ఈ విమర్శముగూడఁ దోడుచేసుకొని చదివి యుత్తమసంస్కారమునకుఁ బునాదులు వేయుదురని పెద్దల కంజలించుచున్నాను —

"కవిః కరోతి కావ్యాని లాలయత్యుత్తమోజనః
తరుః ప్రసూతే పుష్పాణి వాయుర్వహతి సౌరభం ॥

ఇతిశమ్.